# తాళ్ళపాక కవుల దశావతార సంకీర్తనలు



రచయిత్రి

**డా॥ డి. యువశ్రీ**, ఎం.ఎ., బి.ఇడి., పిహెచ్.డి.

తెలుగు ఉపన్యాసకురాలు

# తాళ్ళపాక కవుల దశావతార సంకీర్తనలు




రచయిత్రి

**డా॥ డి. యువశ్రీ,** ఎం.ఏ., బి.ఇడి., పిహెచ్.డి.

తెలుగు ఉపన్యాసకురాలు



2013

# తాళ్ళపాక కవుల దశావతార సంకీర్తనలు

## రచయిత్రి, డా॥ డి. యువశ్రీ

సర్వహక్కులు : రచయిత్రివి

ప్రథమ ముద్రణ : 16-9-2013


ప్రతులు : 500

వెల : రూ. 200/-

ప్రతులకు : శ్రీకృష్ణ పబ్లికేషన్స్
డోర్ నెం. 8-9, ప్లాట్ నెం. 25
ఎస్.వి.యు నాన్‌టీచింగ్ సొసైటీ కాలని
విద్యానగర్ కాలని ఎదురుగా
తిరుపతి-517 502.
సెల్ : 9885940011

ముద్రణ : సి.ఎన్. ప్రింటర్స్
ప్రకాశంరోడ్, తిరుపతి.
సెల్ : 98482 64047

# అమ్మకు అంకితం



## కీర్తిశేషురాలు ధనలక్ష్మి

తననే నన్నుగా పైకితీసి
తననే ఇచ్చి పెంచిన దయామూర్తి
మమతామయి అమృతహృదయి

మా తల్లికి
కల్పవల్లికి
వాడని యెదద మల్లికి
మాఇంటి మహాలక్ష్మికి
మా అమ్మ ధనలక్ష్మికి
ఈ చిరు పుస్తకాన్ని ఇస్తున్నా అంకితంగా...

మీ కుమార్తె

# ప్రాతిపదిక

శిష్ట, జానపద సాహిత్యాలకు మధ్యేమార్గంగా పదసాహిత్యం ఆవిర్భవించింది. మొదట జానపదుల గుండెల నుంచి పెల్లుబికిన పదం వచనంగా, తత్త్వంగా, కీర్తనగా రూపుదిద్దుకుంది. కీర్తనా రూపాన్ని స్థిరీకరించినవారు తాళ్ళపాక వారు. తాళ్ళపాక కుటుంబం వారు ఆంధ్రసాహిత్యానికి ఎనలేని సేవచేశారు. పదాలే గాక ఇతర సాహితీ ప్రక్రియల్లో కూడా రచనలు సాగించి వేంకటేశ్వర భక్తిని ప్రచారం చేశారు. అనేక కైంకర్యాలతో స్వామిని ఆరాధించారు. నూతన ఉత్సవాలకు ఏర్పాటు చేశారు.

తాళ్ళపాక కవులుగా పరిగణింపబడినవారు తాళ్ళపాక అన్నమాచార్యుడు, తాళ్ళపాక తిమ్మక్క, పెదతిరుమలాచార్యుడు, చినతిరుమలాచార్యుడు, చిన్నన్న, రేవణూరి వేంకటార్యుడు మొదలైనవారు. ఇతరులు కూడా కవులై వుండవచ్చేమోగానీ వీరు మాత్రమే ప్రసిద్ధులు. వీరిలో సంకీర్తనలు రచించి పదకవులుగా ప్రసిద్ధులైన వారు ముగ్గురే. వారు తాళ్ళపాక అన్నమాచార్యుడు, పెదతిరుమలాచార్యుడు, చినతిరుమలాచార్యుడు.

తాళ్ళపాక పదకవులు ముగ్గురూ అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు రచించారు. అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించినప్పటికీ ప్రస్తుతం లభించే సంకీర్తనలు 13,716 మాత్రమే. వాటిలో అధ్యాత్మ సంకీర్తనలు 2,216, శృంగార సంకీర్తనలు 11,500, పెదతిరుమలయ్య రచించిన సంకీర్తనలు మొత్తం 1007. వాటిలో అధ్యాత్మ సంకీర్తనలు 463, శృంగార సంకీర్తనలు 544. చిన తిరుమలయ్య సంకీర్తనలు మొత్తం 179. వాటిలో అధ్యాత్మ సంకీర్తనలు 60, శృంగార సంకీర్తనలు 119. వీటన్నింటిని తిరుమల తిరుపతి దేవస్థానము వారు సంపుటాలుగా ముద్రించి వ్యాప్తిలోకి తెచ్చారు.

తాళ్ళపాకవారి సంకీర్తనల్లో అనేక విషయాలు చోటుచేసుకున్నాయి. భక్తి, మధురభక్తి, వైరాగ్యం, గ్రామీణ జీవితం, సమకాలీన పరిస్థితులు, ఆలయాల

విశేషాలు, ఉత్సవాల విశేషాలు, వైష్ణవ వైశిష్ట్యం, నీతిప్రబోధం, ధర్మ ప్రతిపాదన, జానపద పోకడలు, క్రీడావిశేషాలు ఇలా ఎన్నో అంశాలు ఆ సంకీర్తనల్లో చోటు చేసుకున్నాయి. వేంకటేశ్వరుని ఘనత గురించి, విష్ణుదేవుని వివిధ మహిమల గురించి తాళ్ళపాక వారి కీర్తనలు ఆంధ్రావనికి మనోహరంగా తెలియజేశాయి. ఇలా తెలియజేయబడ్డ వాటిలో తాళ్ళపాకవారి దశావతార సంకీర్తనలు పేర్కోదగ్గవి.

ఎం.ఏ పూర్తికాగానే తాళ్ళపాకవారి దశావతార కీర్తనల మీద పరిశోధన చేసే అవకాశం నాకు లభించింది. మా శాఖలోని ఆచార్యులతో పాటు, మా పర్యవేక్షకులు కూడా "తాళ్ళపాకవారి దశావతార సంకీర్తనల" మీద పరిశోధన చేసేందుకు నన్ను ప్రోత్సహించారు. నాకూ ఆ విషయంమీద పరిశోధన చేయడంలో మక్కువ ఎక్కువ కావడం మూలంగా పరిశోధకురాలిగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో నమోదు చేసుకున్నాను. పంచసహస్రావధాని డా॥ మేడసాని మోహన్‌గారి తోడ్పాటుతో తిరుమల తిరుపతి దేవస్థానం వారి అన్నమాచార్య ఉపకారవేతనం నాకు మంజూరయ్యింది. ఇదికూడా నా పరిశోధనా కృషిని సులభతరం చేసింది.

తాళ్ళపాక అన్నమాచార్యుడు, పెదతిరుమలాచార్యుడు, చినతిరుమలా చార్యుడు రచించిన అధ్యాత్మ, శృంగార సంకీర్తనల్లో దశావతారాలను గురించి, దశావతారాలకు చెందిన వివిధావతారాలను గురించి రచింపబడిన కీర్తనలను సేకరించి వర్గీకరించుకోవడం జరిగింది. అవగాహన కోసం భాగవతాది గ్రంథాల నుంచి దశావతారాలకు సంబంధించిన విషయాల్ని సేకరించడం జరిగింది. సేకరించిన విషయ సామగ్రినంతా వింగడించుకొని సిద్ధాంత వ్యాసానికి రూపకల్పన చేయడం జరిగింది.

ఈ పుస్తకంలో అయిదు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయం –తెలుగు సంకీర్తన ఆవిర్భావ వికాసాలను గురించి, తాళ్ళపాక పదకవుల పదరచనలను గురించి, అనంతర పదకర్తల రచనల మీద వాటి ప్రభావం గురించి, తెలుగు పదకవులలో తాళ్ళపాక పదకవుల స్థానం గురించి తెలియజేస్తుంది. రెండవ అధ్యాయం – విష్ణుదేవుని వివిధ అవతారాల విశేషాలను విశ్లేషణాత్మకంగా

వివరిస్తుంది. అన్నమయ్య సంకీర్తనల్లో రూపుదిద్దుకున్న దశావతార సౌందర్యాన్ని గురించి మూడవ అధ్యాయం ముచ్చటిస్తుంది. పెదతిరుమలయ్య కీర్తనలు కీర్తించిన విష్ణుదశావతార విశిష్టతను నాల్గవ అధ్యాయం ఆవిష్కరిస్తుంది. ఐదవ అధ్యాయం- చినతిరుమలయ్య కీర్తనల్లో కనిపించే దశావతార తత్త్వాన్ని బోధపరుస్తుంది. చివరగా ఉపసంహారం, ఉపయుక్త రచనల పట్టిక చోటుచేసుకున్నాయి.

యధాశక్తి, యధాజ్ఞానతః రూపొందింపబడిన ఈ సిద్ధాంత గ్రంథం పాఠకుల హృదయ వ్యాసాన్ని ఏమాత్రం పెంచగలిగినా నాయీ చిన్న ప్రయత్నం సఫలమయినట్టేనని భావిస్తాను.

**డా॥ డి. యువశ్రీ**

అపూర్వ పంచసహస్రావధాన సార్వభౌమ
**డా॥ మేడసాని మోహన్**
ప్రత్యేకాధికారి, శ్రీనివాస వాఙ్మయ అధ్యయన సంస్థ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సత్యసుందరం

డి. యువశ్రీగారు రచించిన "తాళ్ళపాక కవుల దశావతార సంకీర్తనలు" అనే శీర్షికతో ఉన్న ఈ సిద్ధాంత గ్రంథం సాంతం చదివాను. పదకవితా పితామహుడు, పరమ భాగవతోత్తముడైన తాళ్ళపాక అన్నమాచార్యులు, వారి కుమారులు, మనుమలునైన పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులు రచించిన కీర్తనల నుండి తన పరిశోధనాంశానికి తగిన చక్కని సంకీర్తనలను ఎంపిక చేసుకొని సముచితంగా విశ్లేషిస్తూ డి.యువశ్రీ వెలవరించిన పరిశోధనలు సత్యసుందరంగా భాసిస్తున్నాయి. ప్రాథమికంగా, ప్రాథమ్యంగా తాను సేకరించుకున్న పరిశోధనా సామగ్రి, అధ్యయనం చేయబడిన ఇతఃపూర్వ పరిశోధనాగ్రంథాలు ఇవన్నీ చూస్తుంటే ఈమె ఎంత లోతులకు తన పరిశోధనా దృక్పథాన్ని సారించారో అర్థమవుతుంది.

తాళ్ళపాక కవుల వాఙ్మయాన్ని పూజ్యులు శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారు 'సారస్వతక్షీరసాగరంగా' అభివర్ణించారు. ఆ సారస్వత క్షీరసాగరంలో దశావతార సంకీర్తనలనే రత్నాలను ఎంపికచేసుకోవడం, ఆ కీర్తనలపై క్షుణ్ణమైన అధ్యయనం చేయడం ప్రశంసించదగిన అంశాలు. ఈ సిద్ధాంత గ్రంథంగా అధ్యాయాలుగా వింగడించుకున్న తీరు తెన్నులే ఈమె సునిశిత దృక్పథాన్ని సూచిస్తున్నాయి. ప్రథమాధ్యాయంలో తెలుగులోని పదకవితల యొక్క పూర్వాపరాలను, చారిత్రకనేపథ్యాన్ని వివిధకవుల యొక్క రచనలలో పేర్కొనబడిన అంశాలను సోదాహరణంగా విశదీకరించారు.

తరువాతి అధ్యాయాలలో అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య లకు సంబంధించిన దశావతార సంకీర్తనలను చక్కగా విశ్లేషించారు. ప్రత్యేకించి

ఆయా సంకీర్తనలలోని భక్తివిశేషాలు, తాత్త్వికాంశాలు, జానపద ధోరణులు, నాయికా నాయక విశేషాలు ఇత్యాది వివిధాంశాలతో సాగిన ఆమె పరిశోధన జిజ్ఞాసువులకు ఎంతో ఉత్తేజాన్ని కలిగిస్తుంది.

విష్ణుదేవుని యొక్క అవతారాలను అభివర్ణించిన శ్రీమద్భాగవతం వంటి అనేక పురాణాలనుంచి కూడా తగిన అంశాలు ఈమె సేకరించారు. ఆయా అధ్యయనాల చివర పేర్కొనబడిన ఉపయుక్త గ్రంథసూచి పరిశీలిస్తే ఈమె పరిశోధనలో ఎంత తీవ్ర కృషితో కూడిన పరిశ్రమ చేశారో అవగతమవుతుంది.

తాళ్ళపాక కవులు దశావతారాలను పూర్తిగా ఒకే సంకీర్తనలో పేర్కొన సందర్భాలు, కొన్ని అవతారాలను ప్రత్యేక కీర్తనలలో వర్ణించిన సందర్భాలు కూడా ఉన్నాయి. డి.యువశ్రీ అటువంటి సందర్భాలను కూడా సముచితమైన వింగడింపుతో ఉదాహరణలతో విశదీకరించారు.

తాళ్ళపాక కవుల సంకీర్తనలలో ఆవిష్కరింపబడిన భారతీయ సనాతన ధార్మికవైభవం, సకల జగన్నియామకుడైన భగవంతుని తత్త్వమహత్త్వాలు, దేవాలయ సంస్కృతి సదాచారంతో కూడిన ఆలోచనానిష్ఠ - ఇలా ఎన్నో విశేషాలను కూడ ఈ పరిశోధనా గ్రంథంలో ఈమె సముచితంగా ప్రస్తావించారు. తాళ్ళపాక కవుల రసాలంకార సంభరితమైన వర్ణనావైభవం, దశావతార సంకీర్తనలలో ఎలా అభివ్యక్తమవుతున్నదో, అటువంటి గణనీయమైన అంశాలు కూడా ఈ పరిశోధనా గ్రంథంలో పొందుపరచి వుండడం ప్రశంసార్హం.

తాళ్ళపాక కవుల భక్తితత్త్వాన్ని గ్రామీణ ప్రాంతాలలో కూడా జానపదుల దృక్పథానికి అనుగుణంగా ఏవిధంగా ప్రచారంచేశారో కూడా ఈ దశావతార సంకీర్తనలు విశదీకరిస్తున్నాయి. ఇటువంటి మహత్తరమైన అంశాన్ని పరిశోధనకు ఎన్నుకొన్న డి.యువశ్రీ గారిని త్రికరణశుద్ధిగా అభినందిస్తున్నాను. ఇటువంటి పరిశోధనలు మరెన్నో ఈమె కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాను.

తిరుపతి,
04-8-2013.

# హృదయావిష్కృతి

**– ఆచార్య జక్కంపూడి మునిరత్నం**

ఆంధ్రసాహిత్య చరిత్రలో తాళ్ళపాకవారిది సువర్ణాధ్యాయం. అంతకు ముందు పదసాహిత్యం వచనాల రూపంలోనూ, పదాల రూపంలోనూ వెలువడినప్పటికీ సలక్షణ సంకీర్తనా సాహిత్యానికి శ్రీకారం చుట్టినవారు తాళ్ళపాక వారే. పదాలే గాక ద్విపదలు, శతకాలు, వచనాలు, గద్య రచనలు వెలువరించి తాళ్ళపాకవారు తమ కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటుచేసుకున్నారు.

తాళ్ళపాక వారిలో ప్రథముడు, ప్రధానుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. ఆయన అధ్యాత్మ, శృంగార సంకీర్తనలను రచించి తన సంతతి వారికి మార్గ దర్శకుడయ్యాడు. అన్నమయ్య కుమారుడైన పెదతిరుమలాచార్యుడు, మనుమడైన చినతిరుమలాచార్యుడు అన్నమయ్యను అనుసరించి పదాలు రచించి ఉన్నత పదాన్నందుకున్నారు. తాళ్ళపాక కవులలో వీరు ముగ్గరే పదకర్తలు.

వ్యాప్తిలో వున్న 'తాళ్ళపాకవారిది కొంత, తమది కొంత' అనే నానుడి ప్రకారం తాళ్ళపాకవారి పదాలలోని వస్తువు వివిధ రంగాలకు విస్తరించిందని చెప్పవచ్చు. తాళ్ళపాకవారి కీర్తనలు వేంకటేశ్వరుని చుట్టూ పరిభ్రమిస్తాయి. విష్ణువే సర్వస్వంగా వినుతిస్తాయి. విష్ణులీలలను కొనియాడుతాయి. విష్ణుమహిమ లను వెల్లడిచేస్తాయి. విష్ణువును ఆశ్రయించవలసిందిగా ఉద్బోధిస్తాయి. అలాంటి కీర్తనల్లో దశావతార సంకీర్తనలకు కూడా సముచిత స్థానం వుంది.

తాళ్ళపాక పదకర్తలు ముగ్గురూ దశావతారాలమీద సంకీర్తనలు రచించారు. అన్నమయ్య అధికంగానూ, పెదతిరుమలయ్య అంతకంటే కొంత తక్కువగానూ, చినతిరుమలయ్య ఇంకా తక్కువగానూ సంకీర్తనలు రచించారు. కొన్ని సంకీర్తనలు పది అవతారాలను కొనియాడితే, మరికొన్ని ఒకటి, రెండు అవతారాలను ప్రస్తావించాయి. ఇంత విస్తృతమైన, వైవిధ్య భరితమైన విషయం మీద పరిశోధన చేసేందుకు డా॥ డి.యువశ్రీ పూనుకుంది.

యువశ్రీ శ్రద్ధాళువు. వినయ వివేక సంపన్నురాలు. విషయ సేకరణలోనూ, వింగడింపులోనూ విశేషశ్రద్ధ కనబరచి ఈ సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించింది. ఇందలి విషయమేగాక, భావాలు, భాష కమనీయంగా రమణీయంగా రూపొంది పాఠకులను ఆకట్టుకొంటున్నాయి. పాఠకులను చక్కగా చదివించే ఈ పుస్తకాన్ని చదివి, ఇందలి వివిధ విషయాలను గ్రహించి పాఠకులు వినూతనోత్తేజితులు కాగలరని విశ్వసిస్తున్నాను. చదువు కుంటున్నప్పుడే కవితలు రాయడానికి అలావటుపడిన చిరంజీవి యువశ్రీ కలం నుంచి మరెన్నో కవితలు, వ్యాసాలు, పుస్తకాపు వెలువడాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ చిరంజీవికి సకల సౌభాగ్యాలను సమకూర్చవలసిందిగా సర్వేశ్వరుణ్ణి సన్నుతిస్తున్నాను.

తిరుపతి

15-8-2013

( జక్కంపూడి మునిరత్నం )

# హితులకు - సన్నిహితులకు

మీ చేతుల్లో వున్న ఈ గ్రంథాన్ని సమగ్రంగా చదివి చక్కని అభిప్రాయాలు రాసి పంపిన పూజ్యపాదులు అపూర్వ పంచసహస్రావధాన సార్వభౌమ డా॥ మేడసాని మోహన్ గారికి, నేను ఎం.ఏ లో చేరినప్పటి నుంచి అడుగడుగునా నన్ను ప్రోత్సహిస్తూ విద్యావ్యాసంగంలోనే గాక, పరిశోధనలో కూడా ప్రోత్సహిస్తూ గురువుగా, పర్యవేక్షకుడుగా, శ్రేయోభిలాషిగా పలుపాత్రలు నిర్వహిస్తూ అనవరతమూ నా అభ్యున్నతినే ఆకాంక్షించే ఆత్మీయ గురువర్యులు ఆచార్య జక్కంపూడి మునిరత్నం గారికి, పుస్తక ప్రచురణలో నాకు ఎంతగానో తోడ్పడిన మా గురువుగారి ధర్మపత్ని శ్రీమతి కల్పన గారికి ప్రప్రథమంగా ప్రత్యేక కృతజ్ఞతాభివందన చందనాలను దెందమార సమర్పించుకుంటున్నాను.

పరిశోధనలో నన్ను ప్రోత్సహించడమేగాక నా పుస్తక ముద్రణలో కూడా ఎంతగానో తోడ్పడిన నా శ్రేయోభిలాషులు గురువుగారు ఆచార్య చిట్రాజు గోవిందరాజుగారికి, నాకు తగుసమయాన్ని కేటాయించడం ద్వారా ఈ పుస్తకం వెలుగుచూడడానికి పరోక్షంగా తోడ్పడిన గాయత్రీ కళాశాల సంచాలకులు శ్రీ రవివెంకటేష్ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

మమకారాన్ని, మంచి సంస్కారాన్ని రంగరించి పొయ్యడమే గాక చదువుపట్ల శ్రద్ధాసక్తులు కలిగించి నామీద చెరగని ముద్రవేసిన కమ్మని అమ్మకు సంస్కార ధనలక్ష్మి ధనలక్ష్మికి, కష్టాలను, నష్టాలను ఇష్టాలుగా స్వీకరించి శ్రేష్ఠపథంలో నడిపించి నన్ను పెంచి పెద్దచేసిన నాలక్ష్య నిర్దేశకుడు నాన్న శ్రీ దొమ్మరాజు జయదేవరాజు గారికి, మా కుటుంబ బాధ్యతను పూర్తిగా వహించి పరిశోధనకు వ్యవధి కల్పించడమే గాక, వాత్సల్యంతో ప్రోత్సహించిన నా శ్రేయోభిలాషిణి, మమతామయి, దయామయి మా అమ్మమ్మ శ్రీమతి కీర్తిపాటి ఇందిరమ్మ గారికి, మేనమామ గానే గాక పెద్దదిక్కుగా, స్నేహ స్వభావుడుగా, ఎప్పటికప్పుడు ప్రేమాభిమానాలతో, వాత్సల్యంతో ఆదరించి ఆదుకున్న మామ శ్రీ కీర్తిపాటి

ఉపేంద్రరాజు గారికి, జీవితంలోనే గాక నాకష్ట సుఖాలల్లోనూ, ఆలోచనల్లోనూ, అభిరుచుల్లోనూ పాలుపంచుకుని నాకార్యకలాపాలన్నింటిలోనూ వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నా ఈ పరిశోధన విజయవంతం అయ్యేందుకు అహర్నిశలూ సాయశక్తులా తోడ్పడిన నాజీవిత భాగస్వామి శ్రీవారు శ్రీసంగరాజు మురళీ కృష్ణరాజు గారికి, ఎప్పటికప్పుడు నన్ను ప్రోత్సహిస్తూ ముందుకు వెళ్ళేందుకు ఉత్తేజపరిచే పితృపాదులు శ్రీ రుద్రరాజు సుబ్రమణ్యం రాజు గారికి **(USA)**, మాతృస్థానీయురాలు శ్రీమతి రుద్రరాజు రాజేశ్వరమ్మ గారికి **(USA)**, సోదరుడు శ్రీ రుద్రరాజు భాస్కరరాజు గారికి, సోదరి శ్రీమతి దొమ్మరాజు రాధ గారికి **(USA)** నా ప్రత్యేక కృతజ్ఞతాభివందనాలు. నా పరిశోధనలో తమవంతుగా చిరుతోడ్పాటు ఒసగిన చెల్లెలు వాసవికి, దేదీప్యకు, తమ్ముడు శ్రీనివాసవర్మకు, మా చిరంజీవులు జ్ఞానశ్రీకి, శ్రీకృష్ణకు ఆశీఃపూర్వక అభినందనలు.

పుస్తక ముద్రణలో డి.టి.పి. చేసి తోడ్పడిన చంద్రగారికి, ఈ పుస్తకాన్ని అందంగా రూపకల్పన చేసిన సి.ఎన్. ప్రింటర్స్ వారికి, నా పరిశోధనలో తోడ్పడి స్మృతిపథంలో నిలబడలేకపోయిన మరెందరో మహానుభావులకు నా మనఃపూర్వక ధన్యవాదాలు.

**- డి. యువశ్రీ**

# విషయ సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | తెలుగు సంకీర్తన - తాళ్ళపాక పదకవులు | 1-43 |
| 2. | విష్ణుదేవుని వివిధావతారాలు - విశ్లేషణ | 44-143 |
| 3. | అన్నమయ్య దశావతార సంకీర్తనలు | 144-214 |
| 4. | పెదతిరుమలయ్య దశావతార సంకీర్తనలు | 215-251 |
| 5. | చినతిరుమలయ్య దశావతార సంకీర్తనలు | 252-268 |
| | మున్నుడి | 269-271 |
| | ఆధార గ్రంథాలు | 272-276 |
| | ఉపయుక్త గ్రంథాలు | 277-282 |

# 1. తెలుగు సంకీర్తన - తాళ్ళపాక పదకవులు

**1.0** వైదిక మతంగానూ, హిందూమతంగానూ ప్రసిద్ధి వహించిన సనాతన ధర్మంలో అనేక విభాగాలున్నాయి. మొదటి విభాగం త్రిమతాలు. అవి అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం. రెండవ విభాగం క్రింద షడ్దర్శనాలను పేర్కొనవచ్చు. వీటిని షణ్మతాలని కూడా వ్యవహరిస్తారు. అవి శైవం, వైష్ణవం, శాక్తం, గాణాపత్యం, కౌమారం, సౌరం. వీటిలో శైవ, వైష్ణవ, శాక్తాలకు మిక్కిలి ప్రాధాన్యం ఉంది. ఈ మూడింటిలోనూ శైవ, వైష్ణవాలకు బహుళ వ్యాప్తి ఉంది. వైష్ణవంలో విష్ణుదేవుని దశావతారాలకు అత్యంత ప్రాధాన్యం వుంది. ఆరాధ్యత వుంది. కాబట్టే దశావతారాలను గురించి అనేకులు కీర్తించారు. పలువురు రచించారు. ఈ రచనల్లో పద్యము, గద్యము, పదము చోటు చేసుకున్నాయి.

అష్టాదశ మహాపురాణాల్లోనూ, హరివంశ, భాగవతాల్లోనూ దశావతార ప్రసక్తి ఉంది. కావ్యవాఙ్మయంలో కూడా దశావతారాలకు సముచిత స్థానం లభించింది. దశావతారాలను గురించి మాత్రమే కొన్ని గ్రంథాలు వెలువడ్డాయి. ధరణీదేవుల రామయమంత్రి రచించిన "దశావతార చరిత్ర" ఈ కోవకే చెందుతుంది. గద్యరచనల్లోనూ దశావతార కథనం కనిపిస్తుంది.

ఇవన్నీ ఒక ఎత్తైతే వాగ్గేయకారులు వెలయించిన పదసాహిత్యంలో చోటు చేసుకున్న దశావతారాలు ఇంకొక ఎత్తు. కొందరు వాగ్గేయకారులు కేవల దశావతార స్థవప్రాయంగా కొన్నిగేయాలు రచిస్తే, మరికొందరు దశావతారాల్లోని అవతారాలను కొనియాడుతూ కీర్తనలు రచించారు. తాళ్ళపాక వారు విష్ణుదేవుని వివిధావతారాలను విడివిడిగా వినుతించడంతో పాటు, దశావతారాలన్నీ ఒకే కీర్తనలో చోటుచేసుకునే విధంగా కూడా రచనలు చేశారు. తాళ్ళపాక వారు

కీర్తనావాఙ్మయానికి లేదా పదవాఙ్మయానికి ప్రాతః సదృశులు, కేంద్రప్రాయులు అంటే అతిశయోక్తి కాదు.

తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య కాగా పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య అన్ని విధాలా అతన్ని అనుకరించిన వారే. కాబట్టి వీరి వాఙ్మయాన్ని ఒకే కోవకు చెందిందిగా పరిగణించవచ్చు.

తాళ్ళపాక వారికి ముందు, తరువాత వెలసిన పదకవితతో పాటు, తాళ్ళపాక వారి పదవాఙ్మయాన్ని కూడా పరిశీలించినట్లైతే తెలుగు సంకీర్తనా వాఙ్మయంలో తాళ్ళపాక వారి స్థానం బోధపడగలదు. తెలుగు పదకవిత ఆవిర్భావ వికాసాలను, పదసాహిత్యంలో తాళ్ళపాక వారి స్థానాన్ని తెలియజేసేందుకే ఈ అధ్యాయం ఉద్దేశించబడింది.

పదకవిత అనే పదబంధంలో పదము, కవిత అనే రెండు వ్యస్త పదాలున్నాయి. పాడుకునేది పదమయితే, కప్పిచెప్పేది కవిత్వం. సూటిగా కాక కాస్త డొంకతిరుగుడుగా, ఆలోచనలు రేకెత్తించే విధంగా, ఆలోచించే కొద్దీ అర్థం స్ఫురించి ఆనందం కలిగించే విధంగా చెప్పడం కవిత్వం అనిపించుకుంటుంది. ఆకుచాటు పిందెలాగా స్ఫురించీ స్ఫురించని విధంగా రూపొందేదే కవిత్వం. పదకవితలో పాడుకునేందుకు వీలూవుంటుంది, కవిత్వమూ వుంటుంది, మార్మికతా వుంటుంది. ఈ పదకవిత హఠాత్తుగా పరిణతరూపాన్ని సంతరించుకోవడం సాధ్యపడదు. ఇది క్రమపరిణామం వల్లనే సాధ్యం. పదకవిత ప్రారంభదశ నుంచి పరిశీలిస్తే తప్ప దాని క్రమపరిణామం గోచరించే అవకాశం ఉండదు.

## 1.1 పదకవిత ఆవిర్భావం :

ఏ భాషలోనైనా పదం, పద్యం, గద్యం అనే విభాగాలు లేదా ప్రక్రియలు కన్పిస్తాయి. వీటిలో పదం, పద్యం, గద్యం క్రమంగా ఆవిర్భవించి వుంటాయని విజ్ఞుల విశ్వాసం. తెలుగులో కూడా పదమే ముందు పుట్టివుంటుందని, పద్యము, గద్యము ఆ తర్వాతనే ఆవిర్భవించి వుంటాయని పండితుల అభిప్రాయం.

పాటల పుట్టుక గురించి ఆరుద్రగారు వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని ఇక్కడ గుర్తుచేసుకోవడం సముచితం. "ఆదిమ సమాజాలలో పాటలు ముందు పుట్టాక వచనం తరువాత పుట్టటం నైజం".[1]

శ్రీపాద గోపాలకృష్ణమూర్తి గారు కూడా పద్యాలకంటే పాటలే ముందు పుట్టి వుంటాయని భావించారు. "ఏ వాఙ్మయంలోనైనా పాటలే ముందూ, పద్యాలు తరువాతనూ. కనుక తెలుగులో నన్నయ గారికి ముందు పాటలు పుట్టి ఉండాలి".[2]

ఆచార్య ఎస్.గంగప్ప గారు నన్నయ్యకు పూర్వమే తెలుగులో పదం పరిమళించినట్టు విస్పష్టం చేశారు. "ఏ సాహిత్యంలోనైనా పద పద్యకవితలలో పదమే మొదట ప్రారంభమైనదన్న సిద్ధాంతం సర్వజనామోదాన్ని పొందిందని వ్యక్తమైంది. అదే రీతిని తెలుగు సాహిత్యంలో పదమే ప్రథమంగా పుట్టింది. క్రీ.శ. 11వ శతాబ్దంలో నన్నయ భారతంలో తెలుగు కవిత్వం ప్రారంభమైనప్పటికీ, నన్నయ ఆదికవియైననూ ఇంతకంటె భిన్నమయిన అసలుసిసలయిన తెలుగు కవిత ఒకటి ఉండాలనీ, అదే పదకవిత అనీ, దాన్ని దేశి అని అంటారనీ మనం మరవకూడదు".[3]

ఆచార్య జి.నాగయ్య గారు కవితా పరిణామ ప్రాథమికదశ గేయమేనని స్పష్టం చేశారు. "ఏభాషయందయినను కవితా పరిణామమున గేయమే ప్రథమ దశయనియు, ప్రాథమిక గేయము నందే కవిత్వ బీజము లుండుననియు తలంపబడుటచే తెలుగులో కూడ ప్రాచీనకాలము నందే గేయకవిత సామాన్య జనుల నోళ్లలో వెలసియేయుండునని ఊహింపవచ్చును."[4]

పదకవితకు ఆధారం పదం. ఇది ఎప్పుడు పుట్టిందో? ఎలాపుట్టిందో? ఎవరి నోటినుండి మొదట వెలువడిందో? తెలుసుకునేందుకు ఆధారాలు లేవు. ఆదిమ జానపదుడు తనకు వచ్చిన కష్టానికో, సుఖానికో, సంతోషానికో, బాధకో, తీవ్రంగా స్పందించినప్పుడు పదాలు తమంతట తామే లయబద్ధంగా అతని నోటినుంచి వెలువడి వుంటాయి. అదే తొలిపదం. ఈ విధంగానే తెలుగుపదం తేజరిల్లి వుంటుంది.

ఆదిమ సమాజంలో పాటలు వుండేవనేందుకు చాలా ఆధారాలు కన్పిస్తున్నాయి. వీటిని గురించి ఆరుద్రగారు తమ సమగ్రాంధ్ర సాహిత్యంలో స్థాలీపులాకంగా ప్రస్తావించారు. ఆదిమ సవర సమాజంలో స్త్రీ పురుషులందరికీ పాడడం తెలుసు. వారు నలుగురూ కలిసి పాడుతూ ఆడుతూ వినోదించేవారు. ఈ పాటలు సంతోషభరితంగానూ, శృంగార భరితంగానూ వుండేవని ఊహించుకోవచ్చు.

## 1.2 శాసన గేయకవిత :

ఆనాటి సమాజంలో ఆధిక్యత నెరపిన గేయవాసనలు శాసనాల్లోకి కూడా పాకాయి. పొట్లదుర్తి గ్రామానికి, మాలెపాడు గ్రామానికి మధ్యప్రదేశంలో పుణ్యకుమారుడు ఒక శాసనం వేయించాడు. దీన్ని పొట్లదుర్తి-మాలెపాడు శాసనమని వ్యవహరిస్తారు. ఇది ఒక దానశాసనం. ఒక సంగీత సామ్రాట్టుకు చోళమహారాజు ఇచ్చిన దానాన్ని ఎవరైనా చెరిపితే వారికి పంచమహాపాతకాలు చుట్టుకుంటాయని శాసన సారం. ఇదిపైకి వచనంగా కనిపించినా దీనిలో "ద్విరదగతి రగడ" వుందని దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి తెలియజేశారు. ఈ శాసనమంతా గేయపద్ధతిలోనే రచించబడిందని టేకుమళ్ళ కామేశ్వరరావు గారి అభిప్రాయం. ఈ శాసనంలో గేయవాసన గోచరించడం వల్లనూ "ఇశతేనికిన్" (సంగీత సామ్రాట్టుకు) అనే ప్రయోగం కనిపించడం వల్లనూ ఆనాటి గేయస్థితి చెప్పుకోదగ్గ మంచిస్థితిలోనే ఉండేదని తెలియవస్తుంది. పొట్లదుర్తి-మాలెపాడు శాసనపాఠమిది "...... అణపోతులు రేవణకాలు పుద్దణకాలు ఇచ్చిన పన్నస పెన్పాటి ఇశెరేనికిన్....".[5]

వెంకయ్యచోడుని దొంగలసాని శాసనము గద్యరూపములోవున్నప్పటికీ గాన యోగ్యమైన 'మహాక్కర' దానిలో వున్నట్టు ముట్లూరు వెంకటరామయ్య తెలియజేశారు.

ప్రాఙ్నన్నయ యుగానికి చెందిన గద్యశాసనాల్లో ఛందస్సుతో కూడినవి మరికొన్ని వున్నాయని తెలుస్తూవుంది. ఈ కోవకు చెందిన పదమూడు శాసనాలను ఆచార్య దివాకర్ల వేంకటావధాని గుర్తించారు. వీటన్నిటినీ దృష్టిలో వుంచుకొని

ఆలోచిస్తే క్రీ.శ. 6, 7 శతాబ్దాల్లో వేయబడిన శాసనాల్లో గేయానికి స్థానం కల్పించినట్టు తెలుస్తూవుంది. ఆచార్య జి. నాగయ్య గారు తమ "తెలుగు సాహిత్య సమీక్ష"లో ఈ విషయాన్ని ధృవీకరించారు. "గేయచ్ఛందో వాసనలున్న ఈ గద్యమయ శాసనములను బట్టి క్రీ.శ.6వ శతాబ్దమున గేయములలోనే శాసనములను రచించుచుండెడివారని ఊహింపవచ్చును."[6]

గుణగవిజయాదిత్యుని సేనాని పండరంగడు ప్రకాశం జిల్లా అద్దంకిలో ఒక శాసనాన్ని (848) వేయించాడు. ఇది అతని దానాన్ని తెలిపే శాసనం. దీనిలో పాడుకునేందుకు అనువైన ఒక 'తరువోజ' చోటుచేసుకుంది.

> *"పట్టంబు గట్టిన ప్రథమంబునేణ్డు బలగర్వమొప్పంగబైలేచ సేన*
> ..........................................................................
> ..........................................................................
> .........................................................................."[7]

తరువాత పేర్కోదగింది యుద్ధమల్లుని బెజవాడ శాసనం. గుణగ విజయాదిత్యుని తమ్ముడు మొదటి యుద్ధమల్లుడు. అతని మనుమడు రెండవ యుద్ధమల్లుడు ఈ శాసనాన్ని వేయించినట్టు తెలుస్తూవుంది. విజయవాడలోని మల్లేశ్వరస్వామి గుడిలో ఈ శాసనం వుంది. మొదటి యుద్ధమల్లుడు విజయవాడలో కుమారస్వామికి ఒక ఆలయం నిర్మించాడు. ఈ విషయం ఈ శాసనంలో తెలియజేయబడింది. దీనిలో అయిదు 'మధ్యాక్కర' లున్నాయి. పాడుకునేందుకు అనువుగా మధ్యాక్కరల ఛందస్సు రూపొందింపబడింది. ఉదాహరణకు ఒక పద్యం-4

> *"పరగంగ బెజవాడ గొమరుసామికి భక్తుడై గుడియు*
> *నిరుపమ మతి నృపధాముడెత్తించె నెగిదీర్చి మఠము*
> *గొరగల్గాకొరు మిందు విడిసి బృందంబు గొనియుండువారు*
> *పరిగాన యవ్వారణాసి వచ్చిన పాపంబు గొంద్రు."*[8]

## 1.3 ప్రస్తావనా మాత్ర గేయాలు :

శాసనాల్లో కనిపించే ఛందోబద్ధ గేయరూపాలు పండితుల మేధస్సు నుంచి పల్లవించినవి. అవి విద్యాగంధం విలసిల్లే వారికోసం రచించబడినవి. వీటికి సమాంతరంగానే జానపదుల హృదయాల నుంచి గేయాలు వెలువడ్డాయి. ఇవి పామరులను ఆకట్టుకునేందుకు రూపొందించబడ్డాయి. నన్నయ్యకు ముందే వీటికి కూడా అస్తిత్వమేర్పడింది. నన్నయ్యకు ముందే పాటలు ఉండేవని ఆచార్య జి. నాగయ్య గారు తమ 'తెలుగు సాహిత్య సమీక్ష' లో తెలియజేయడం ఇక్కడ జ్ఞాపకం చేసుకోదగి వుంది.

"శాసనకవుల వలె పండితులు కాక సామాన్య జనులకు మాత్రము ప్రీతి కలిగించు పాండిత్య నిరపేక్షములైన పాటలు, పదములు, ఏలలు మున్నగునవి రచించిన వారు కూడ నన్నయ్యకు పూర్వము కొందరుండిరనుటకు కొన్ని ఆధారములున్నవి".[9]

ఆ కాలములో ఎన్ని రకాల గేయాలుండేవో?వాటిని ఎలా గానం చేసేవారో? ఎప్పుడెప్పుడు పాడుకుని పరవశించేవారో? ఊహకందడం లేదు. అయితే పండుగ పాటలు, స్త్రీల పాటలు, ఊయల పాటలు, శృంగార గేయాలు ప్రాఙ్నన్నయ యుగంలోనే ప్రజాబాహుళ్యం నోళ్ళలో నానుతూ ఉండేవని విమర్శకులు భావించారు. ఇక్కడ ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవలసివుంది. – "పండుగపాటలు, స్త్రీలపాటలు, మంగళ గీతములు, శృంగార గీతములు, ఉయ్యల పాటలు పదములే. ఇవియెల్ల ప్రాఙ్నన్నయ యుగములోని పదకవిత్వమునకు చిహ్నపతాకలు."[10]

కొన్ని గేయవిశేషాలను గురించి కవులు తమ గ్రంథాల్లో ప్రస్తావించారు. వారు కూడా వాటిని నామమాత్రంగా ప్రస్తావించారే తప్ప వాటి తీరుతెన్నులను సమగ్రంగా వివరించలేదు.

ఆదికవిగా అభినుతికెక్కిన నన్నయ తన భారతంలో పాటలు పాడుకోవడం గురించి ప్రస్తావించాడు. ఆదిపర్వంలో అర్జునుని తీర్థయాత్రల సందర్భంగా ఈ

పాటల ప్రస్తావన కనిపిస్తుంది. ఉలూచి అర్జునుడి గుణాలను 'నాగీ గీతాల' ద్వారా విన్నట్టు అతనికి తెలియజేసింది.

*"నీ గుణములు దొల్లియ నా*
*గీ గీతములందు విని తగిలి యిపుడు మనో*
*రాగమునఁ జూడ ఁగంటిని*
*భాగీరథి యందు నిన్నుఁబరహిత చరితా." ॥*

నాగీ గీతాలంటే నాగస్త్రీలు పాడుకునే పాటలు. వీటిని గురించి నన్నయ్యకు తెలిసే అవకాశం లేదు. రాజమహేంద్రవర ప్రాంతంలో స్త్రీలు పాడుకునే పాటల్నే నాగీగీతాలుగా నన్నయ పేర్కొనియుండవచ్చు. దీన్ని బట్టి పాటలు పాడుకోవడం అప్పటికే బాగా వ్యాప్తిలో వున్నట్టు తెలుస్తుంది.

యాదవులు రైవతకాద్రికి పూజలు చేసేందుకు వెళ్ళారు. స్త్రీలు తాళం వేసుకుంటూ పాడారు, ఆడారు. మృదంగం, వేణువు, కాహళము మొదలైన పక్క వాద్యాలను కూడా గాన సందర్భంలో ఉపయోగించారు. సంస్కృత భారతంలో ఈ వర్ణన లేదు. ఇది కేవలం నన్నయ కల్పితమే. దీన్ని బట్టి నన్నయ కాలానికే సంగీతం మంచి స్థితిలో ఉండేదని బోధపడుతుంది. పాటలకు ఆదరణ బాగా లభించేదని తెలుస్తుంది.

నన్నయ తర్వాత పేర్కోదగ్గ మహాకవి నన్నెచోడుడు. ఈయన తన కుమారసంభవంలో పలు గేయ విశేషాలను ప్రస్తావించాడు. పార్వతీదేవి శివభక్తి ద్వారానే విద్యలు నేర్చిందని నన్నెచోడుడు తెలియజేశాడు. ఈశ్వరుణ్ణి ఉద్దేశించి <u>అంకమాలికలు</u> గానం చేస్తూ గేయాల రకాలను గుర్తించి అభ్యసించిందని అభిప్రాయపడ్డాడు.

*"................*
*లీలనీశ్వరు <u>నంకమాలిక</u>ల్వాడుచో*
*........గీతభేదంబులరీతు లెఱిఁగె*
*....................................*
*...................................."[12]*

అంకమాలికలంటే దీర్ఘంగా సాగే గేయాలని ఊహించవచ్చు. అయితే వీటి స్వరూపం దురూహ్యం.

నన్నెచోడుడు వసంతఋతు వర్ణన చేస్తూ కామినీకాముకుల తలపులకు, కదలికలకు అనుగుణంగా ప్రకృతిలో మార్పులు ప్రస్ఫుటమయ్యాయని పేర్కొన్నాడు. ఈ సందర్భంగానే స్త్రీలు పాడే ఊయలపాటలకు అనుగుణంగా తుమ్మెదలు వసంత ఋతువులో పాడసాగాయని ఆయన తెలియజేశాడు.

*"..........................................*
*..........................................*
*ఉవిద లింపు మిగుల నూయలపాటలు*
*పాడ మధుమదమునఁబాడె నలులు."* [13]

యువతులు వనాల్లో ఊయలలూగుతూ కూడా పాటలు పాడేవారని దీన్నిబట్టి తెలుస్తుంది.

వనపాల బాలికలు తీగల ఊయలలలో ఊగుతూ, రాగాలాపన చేస్తూ పాడేవారని కూడా నన్నెచోడుడు రాశాడు. ఇలాంటి రాగాలాపన గేయాలను ఆనాడు ఆలతులని వ్యవహరించేవారని బోధపడుతుంది.

*॥కం॥ "సోలుచు సమ్మదరసమునఁ*
*గ్రాలుచు వనపాల బాలికలు నవలతికాం*
*దోలముల వేడ్క నలుపుచు*
*నాలతులొగిఁ జేసి పాడి రభినవలీలన్."* [14]

నన్నెచోడుడు స్త్రీలు కల్లుత్రాగి సారా అమ్ముకునే వారి పాటలను పాడేవారని తెలియజేశాడు. ఈ పాటలనే గౌడుగీతాలని అతడు పేర్కొన్నాడు. అయినా వాటి రూపాన్ని ఊహించేందుకు ఆస్కారం లేదు.

*॥ఉ॥ "జీఱిక కల్లుద్రావి మదసింధుర గామినులన్ని కేఱియల్*
*వాఱుచు గౌఁడు గీతములు పాడుచుఁ బొల్పుగఁగ్రాలియాడుచున్*
*.........................................................."* [15]

శబరకామిని వెదురుబియ్యం దంచుతూ అనేక రాగాలతో పాటలు పాడినట్టు నన్నెచోడుడు తేటపరిచాడు. వీటినే రోకటిపాటలుగా పేర్కోవచ్చు.

॥చ॥ "పటికపుఱోల ముల్వెదురుఁ(బ్రాలొగిఁబోయుచు గౌరు కొమ్మరోఁ
కటఁగొనిదంచుచున్ శబరకామిని పెక్కులు రాగముల్ మదో
త్కటముగఁ బాడెఁ............................................
.............................................................." 16

ఈ విధంగా నన్నెచోడుని కుమారసంభవంలో అంకమాలికలు, ఊయలపాటలు, ఆలతులు, గౌదుగీతాలు, దంపుదు పాటలు చోటుచేసుకున్నాయి.

ఇవి అతని కాలంలో వ్యాప్తిలో ఉన్న పాటలు కావచ్చు. వాటి స్వరూప స్వభావాలను ఊహించుకునేందుకు ఎటువంటి ఆధారాలు లభించడం లేదు.

బహుగ్రంథ కర్తగా ప్రసిద్ధుడైన పాల్కురికి సోమన పలురకాల గేయాలను ప్రస్తావించడమే గాక తన బసవపురాణ రచనకు ఆధారం ఆనాడు వ్యాప్తిలో వున్న బసవేశ్వరుని భక్తుల పాటలే అని తెలియజేశాదు.

"ఆతత సకల పురాతన భక్తగీతార్థ సమితియే మాతృకగాఁగఁ ..........
..............................................." 17

దీన్ని బట్టి రెండు విషయాలు తెలుస్తాయి. మొదటిది – పాల్కురికి సోమ నాథుని కాలానికే భక్తులు పాటలు రచించి పాడుకునేవారు. రెండవది – భక్తుల కథలను గేయరూపంలో పాడుకునేవారు. సోమన తన కాలంలోనో, అంతకు ముందో వ్యాప్తిలో వున్న పదాల జాబితాను తన రచనల్లో పొందుపరచాడు.

"మదినుబ్బు సంసార మాయాస్తవంబు
పదములు, పర్వత పదము, లానంద
పదములు, శంకర పదముల్, నివాళి
పదములు, వాలేశు పదములు, గొబ్బి
పదములు, వెన్నెల పదములు, సెజ్జ
వర్ణన మణిగణవర్ణన పదము

*లర్ణవ ఘోషణ ఘూర్ణిల్లుచుండ*
*బాడుచు నాడుచు బరమ హర్షమున*
*గూడి సద్భక్త సంకుల మేఁగుదేర"* [18]

పైన పేర్కొన్న "సంసార మాయాస్తవ పదాలు" - వైరాగ్య పదాలు కావచ్చు. 'తుమ్మెద, నివాళి, వాలేశ, గొబ్బి, వెన్నెల' అనే పదాలు పాదాంతంలో రావడం వల్ల ఇవి ఆయాపేర్లతో వ్యవహరించబడి ఉండవచ్చు. 'మేలుకొలుపు' లనే ప్రభాతపదాలని వ్యవహరించేవారేమో. శ్రీశైలం తదితర పర్వత క్షేత్రాలను ప్రశంసిస్తూ భక్తులు పాడుకునే పాటలను "పర్వత పదాల"ని పేర్కొనేవారేమో. 'సెజ్జవర్ణన' పదాలు, 'మణిగణ వర్ణన' పదాలు ఏ రూపంలో ఉండేవో ఆధారాలు లేవు. మహాపండితులకు కూడా వీటి స్వరూపం అంతుపట్టడం లేదు. ఇందుకు ఆచార్య బిరుదు రాజు రామరాజు గారి మాటలే సాక్ష్యం. "సెజ్జవర్ణన మణిగణ వర్ణన పదములు మాయమైపోయినవో లేక మారువేషమున నజ్ఞాతవాసము గడుపుచున్నవో తెలియదు?" [19]

నాచన సోమనాథుడు రచించిన 'వసంత విలాసం'లో జాజరపాట ప్రస్తావన కనిపిస్తుంది. కాని దాని స్వరూపం గురించి తెలుసుకోవడానికి ఆధారం లేదు.

"వీణాగానము వెన్నెల తేట - రాణ మీరగా రమణుల పాట
పేరు చెప్పిన పినబ్రాహ్మణువీట - జాణలు మెత్తురు జాజరపాట"[20]

దీన్నిబట్టి వెన్నెల రాత్రులలో వీణాది వాద్యాల సహకారంతో ఆడవాళ్ళు బ్రాహ్మణుల ఇళ్ళ లోగిళ్ళలో ఈ పాటలు పాడుకునేవారని బోధపడుతోంది.

హృద్యమైన పద్యాలను వెలయించిన కవిసార్వభౌముడు గేయ ప్రస్తావన కూడా చేశాడు. ద్రాక్షారామంలో అప్సర స్త్రీలు భీమేశ్వరుడి మీద జాజర పాటలు పాడినట్టు ఆయన వ్రాశాడు.

*"జాదుర జాదురంచు మృదు చర్చరీగీతులు వారుణీ రసా*
*స్వాద మదాతిరేకముల జంద్రిక గాయక దక్షవాటికా*
*వేదుల మీదటన్ గనక వీణలు మీటుచు బాడిరచ్చరల్*
*మోదమెలర్పగా భువన మోహన విగ్రహు భీమనాథునిన్".* [21]

దీన్ని బట్టి శ్రీనాథుని కాలంలో జాజరపాటలు 'చర్చరీ' గీతాల పేరుతో వ్యాప్తిలో ఉన్నట్టు తెలుస్తోంది.

## 1.4 తాళ్ళపాక కవుల పూర్వ పదకవిత :

ప్రాచీన జానపదుల గేయాలు సజీవంగా నిలబడివుంటే వాటి స్వరూప స్వభావాలను తెలుసుకునే అవకాశం మనకు కలిగివుండేది. అవి పండితాదరణకు నోచుకోక పోవడం వల్లను, పరంపరాగతాలు కాక పోవడం వల్లను మనదాకా రాలేక కాలగర్భంలో కలిసిపోయాయి. పదవ శతాబ్దం తరువాత వెలువడిన గేయరూపాలు తాటి ఆకుల్లో, రాగి రేకుల్లో విద్యాగంధం వున్నవారి నాలుకల్లో స్థానం సంపాదించాయి. అందువల్లనే అవి ఈనాడు కూడా మనకు అందుబాటులో వున్నాయి. వీటి స్వరూపాన్ని, స్వభావాన్ని, ఇవి వ్యక్తం చేసే సమకాలీన పరిస్థితులను తెలుసుకోవచ్చు.

### 1.4.1 కృష్ణమాచార్యుల పదకవిత :

మనకు లభించే తొలి పదరచనలు కృష్ణమాచార్యులవి. ఈయన 12వ శతాబ్దానికి చెందిన వైష్ణవ భక్తుడు. కృష్ణమాచార్యులు 4 లక్షల వచనాలు రచించినట్టు ప్రతీతి. వీటిని 'చూర్ణాలని' తాళ్ళపాక చినతిరుమలయ్య తన "సంకీర్తన లక్షణం" గ్రంథంలో పేర్కొన్నాడు. అయితే కృష్ణమాచార్యులు మాత్రం తన వచనాలను సంకీర్తనలుగానే భావించాడు.

> *"........... ఈ సంకీర్తన ఫలంబెవరు వ్రాసిరి, యెవరు చదివిరి"*[22]
>
> "............ ఇది కృష్ణమాచార్యులు చెప్పిన సంకీర్తన ఫలంబు" [23]

కృష్ణమాచార్యుని వచనానికి 'పల్లవి, చరణం' రెండు అంగాలు. ఇవి తాళబంధ ఛందో విరహిత గేయగంధులు. ఆ గేయగంధం కూడా ఆధునిక యుగానికి అందలేదు. కృష్ణమాచార్యుని లభ్యరచనలు తులసీ మాహాత్మ్యము, నృసింహ నామాలు, రామనామ కీర్తనము వస్తువును బట్టి కృష్ణమాచార్యుల రచనలను నాలుగు విధాలుగా విభజించవచ్చు. అవి వైష్ణవమత సిద్ధాంత ప్రతిపాదకాలు, పురాణ సంబంధమైనవి, వేదాంతపరమైనవి, నీతి బోధకమైనవి.

**1.4.2 యాగంటి వారి పదకవిత :**

కృష్ణమాచార్యుల తర్వాత పేర్కోదగ్గవారు యాగంటివారు. యాగంటి కవులు ఎందరనే విషయంలో కూడా పండితులలో అభిప్రాయభేదాలున్నాయి. వీరి కాలానికి సంబంధించి కూడా చర్చ వుంది. యాగంటి వారు పాల్కురికి సోమనాథుడికి, అన్నమయ్యకు నడుమకాలం వారని ఆచార్య ఎస్. గంగప్పగారు భావిస్తే, 14వ శతాబ్దానికి చెందిన వారని రాయలసీమ పదకవుల మీద పరిశోధన చేసిన డా॥ కె. జనార్దనం గారు అభిప్రాయపడ్డారు.

యాగంటి వారి రచనలను పదాలనీ, వచనాలనీ వ్యవహరిస్తారు. వీరి పదాల్లో పల్లవి, అనుపల్లవి, చరణాలు చోటుచేసుకున్నాయి. పల్లవి నాలుగు పాదాలతోనూ అనుపల్లవి రెండు పాదాలతోనూ చరణాలు నాలుగు పాదాలతోనూ సాగుతాయి. అనుపల్లవి లోని తొలిపదం పునరావృతమవుతుంది. చివరి చరణంలో ముద్ర వుంటుంది. యాగంటి పదాలలో పది రకాలైన ముద్రలున్నట్లు డా॥ కె. జనార్దనం గుర్తించారు. అవి –

1. యాగంటి గురుడు
2. యాగంటి శివుడు
3. యాగంటి లింగడు
4. యాగంటి హరుడు
5. యాగంటి పతి
6. యాగంటి ప్రభువు
7. యాగంటి వరదా
8. యాగంటి శంభుడు
9. యాగంటి నంజేశుడు
10. యాగంటి సిద్దయ్య [23]

వైరాగ్యాన్ని ప్రబోధించే యాగంటి వారి పదమొకదాన్ని గమనిస్తే యాగంటి పదాల స్వరూప స్వభావాలు బోధపడతాయి.

॥కీర్తన॥ కలిమి బలిమి వయసురా - కాముని భాగ్యమురా
కలువ కాడవంటి దేహముకలలో నమ్మకురా ॥పల్లవి॥

మాయా నాటకమురా - మతి దప్పి తిరుగకురా
చేయగల ధర్మములన్నియు చేసి సత్యము నిల్పరా ॥మాయా॥

సంతె నెలవు గదరా - సంసారము నిత్యము గాదురా
సత్యమని తెలుసుకోరా - సమసిపోయె దేహమురా ॥మాయా॥

భోగములు యెన్నిరా - రోగములు అన్నిరా
భోగరోగముల చేత పోయేటి దేహమురా ॥మాయా॥

పట్టులేని పంతమురా, వట్టి దానంతమురా
పుట్టి పెరిగి యంతలోనే - పోయేటి దేహమురా ॥మాయా॥

ఆరుమూడు వదలరా - ఐదు పదిలపరచరా
చేరి యేగంటీశు మీద చిత్తము మరువకురా ॥మాయా॥[25]

యాగంటి వారి గేయాలు తత్త్వ ప్రధానాలు. తత్త్వ ప్రతిపాదకాలు. వీటిని నాలుగు రకాలుగా విభజించవచ్చు. అవి భక్తి తత్త్వాలు, నీతి తత్త్వాలు, యోగ తత్త్వాలు, వైరాగ్య తత్త్వాలు.

## 1.5 తాళ్ళపాక కవుల పదకవిత :

తాళ్ళపాక కవుల కాలాన్ని తెలుగు పదకవితా వసంతకాలంగా పరిగణించ వచ్చు. కృష్ణమాచార్యుల కాలంలోనూ, యాగంటి వారి కాలంలోనూ వచన ప్రాయంగా సాగిన పదకవిత తాళ్ళపాక కవుల కాలంలో సమగ్ర సంకీర్తనా స్వరూపం సంతరించుకుంది. తాళ్ళపాక అన్నమాచార్యుడు, పెదతిరుమలా చార్యుడు, చినతిరుమలాచార్యుడు, చిన్నన్నగా ప్రసిద్ధి వహించిన చినతిరువేంగళ నాథుడు తాళ్ళపాక కవులుగా ప్రసిద్ధులు. చిన్నన్న నాలుగు ద్విపద కావ్యాలు వెలయించాడు. ఈయన పదాలు రచించలేదు. తక్కిన ముగ్గురు పదరచన చేసారు.

### 1.5.1 అన్నమయ్య పదకవిత :

తాళ్ళపాక కవులలో ఆద్యుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. సంకీర్తనా రచనకు కూడా ఈయనే ఆద్యుడని చెబుతారు. కాబట్టే అన్నమయ్యను తొలి తెలుగు వాగ్గేయకారుడని, పదకవితా పితామహుడని, సంకీర్తనాచార్యుడని సన్నుతిస్తారు. అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించినట్టు ప్రతీతి. వీటిని అధ్యాత్మ సంకీర్తనలని, శృంగార సంకీర్తనలని వర్గీకరించవచ్చు. అన్నమయ్య సంకీర్తనలన్నిటినీ అతని కుమారుడు పెదతిరుమలాచార్యుడు రాగిరేకుల మీద చెక్కించాడు. వీటిని తిరుమల శ్రీవారి ఆలయంలోని సంకీర్తన భండారంలో భద్రపరచారు. తర్వాతి వారెవరో రేకులను కరిగించి రాగి అమ్మివేయడం వల్ల దాదాపు 20 వేల కీర్తనలు ఇప్పుడు మనకు లభించడం లేదు.

అన్నమయ్య కీర్తనలో రెండు ఖండాల పల్లవి ఉంటుంది. అనుపల్లవి ఉండదు. నాల్గేసి పాదాలతో మూడు గానీ అంతకంటే ఎక్కువగానీ చరణా లుంటాయి. చివరి చరణంలో మాత్రమే అంకిత ముద్ర ఉంటుంది. చరణంలోని పాదాలలో ప్రాస గోచరిస్తుంది. అన్నమయ్య గ్రామ ప్రాంతంలో నివసించడం వల్ల గ్రామీణుల అభిరుచులను, ఆలోచనలను, భాషను బాగా తెలుసుకున్నాడు. తన రచన జానపదుల్లోకి వెళ్ళాలంటే జానపదుల ఆత్మీయత ఉట్టిపడేలా పదం రూపొందించాలని భావించాడు. పామర భాషను కూడా తన పదములో వాడుకున్నాడు. రకరకాల జానపద గేయ ధోరణులను ఆధారంగా చేసుకుని కీర్తనలు రచించాడు. అలాంటి జానపద బాణీలలో కొన్ని – గొబ్బి, కోలాటం, దంపుళ్ళు, చందమామ, తుమ్మెద, లాలి, సువ్వి, ఉయ్యాల, జోల, శోభన, మంగళ, మేల్కొలుపులు, నలుగులు, కొట్నాలు, కూగూలు, అల్లోనేరేళ్ళు, ఛాంగుభళాలు, తందనాలు, వెన్నెల పదాలు.

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో భక్తి, జ్ఞాన, వైరాగ్య ప్రబోధం, విష్ణునామ మహిమ, విష్ణుదేవుని ఘనత, విష్ణుదాసుల ఘనత, నీతి ప్రబోధం వివిధ వైష్ణవ క్షేత్రాలకు సంబంధించిన కీర్తనలు మొదలైనవి ఎన్నో చోటుచేసుకున్నాయి.

వైరాగ్యాన్ని ప్రబోధించే అన్నమయ్య సంకీర్తనలకు ఉదాహరణగా ఈ క్రింది కీర్తనను పరిశీలించవచ్చు. మానవుడెలా మసలుకోవాలో, ఎలా మసలుకో కూడదో ఈ కీర్తన తెలియజేస్తుంది. చలము, కోపము, పరనింద, ఆశ, విషయ భోగాలు ఎంత ప్రమాదకరమైనవో ఈ కీర్తన తేటపరుస్తుంది. వేంకటేశ్వర ఘనత, ఆయనను సేవించవలసిన ఆవశ్యకత ఈ పాటలో ఉద్ఘాటింపబడ్డాయి.

*॥కీర్తన॥ ఎంత విభవము గలిగె నంతయును నాపదని*
*చింతించినది గదా చెడని జీవనము ॥పల్లవి॥*

*చలము గోపంబుఁదనుఁజంపేటి పగతులని*
*తెలిసినది యదికదా తెలివి*
*తలకొన్న పరనింద తనపాలి మృత్యువని*
*తొలగినది అది కదా దుతగన్న మహిమ ॥ఎంత॥*

*మెరయు విషయములె తన మెడనున్న ఉరులుగ*
*ఎఱిగినది అదికదా యెఱుక*
*పరివోని ఆశతన పట్టుకొను భూతమని*
*వెఱచినది అదికదా విజ్ఞాన మహిమ ॥ఎంత॥*

*ఎనలేని తిరువేంకటేశుడే దైవమని*
*వినగలగినది కదా వినికి*
*అనయమ్ము నతని సేవానంద పరులై*
*మనగలిగినది కదా మనుజులకు మదికి ॥ఎంత॥*[26]

దేనిని విడిచిపెట్టాలో, దేనిని పట్టుకోవాలో ఈ గేయం విశదం చేస్తుంది.

అన్నమయ్య శృంగార సంకీర్తనలు మధురభక్తి భరితాలు, దేవుడే నాయకుడుగా, జీవుడే నాయికగా, నాయికా-నాయక ప్రణయం ప్రాతిపదికగా శృంగార సంకీర్తనలు రచించబడ్డాయి. నాయికా-నాయకుల వలపు, మోహం, విరహం, దౌత్యం, కానుకలు పంపుకోవడం, సమాగమం, ప్రణయ కోపం, అష్టవిధ నాయికలు మొదలైన అంశాలు ఈ పాటలకు బాటలు వేశాయి. మొత్తం

మీద అయోగ, సంయోగ, వియోగ శృంగారం అన్నమయ్య శృంగార సంకీర్తనలను పరిపుష్టం చేసింది.

అన్నమయ్య మధురభావాలు ఆయన శృంగార సంకీర్తనలకు ఎనలేని అందాన్ని తెచ్చిపెట్టాయి. హృదయాన్ని ఉర్రూతలూగించే ఊహాచిత్రాలు, వాటిని అందంగా డెందాలకు అతికించే మాటల పొందిక, అర్థ సౌందర్యానికి, శబ్ద సౌందర్యానికి అన్నమయ్య ఇచ్చే ప్రాధాన్యతను అవగతం చేస్తాయి. అన్నమయ్య శృంగార సంకీర్తనలకు ఉదాహరణగా ఈ గేయాన్ని పరిశీలించవచ్చు. దీనిలో చుంబన, దర్శన, నఖక్షతాదులు, రత్యానంతరావస్థ రమణీయంగా చిత్రించబడ్డాయి. విశ్వసాహిత్యంలోనే ఇంతటి భావుకత్వం లేదని విజ్ఞుల విశ్వాసం. అన్నమయ్య సంకీర్తనల్లో ఎంతో సుప్రసిద్ధమైన ఈ కీర్తన గమనించదగి వుంది.

*॥కీర్తన॥ ఏమొకొ చిగురుటధరమున యెడనెడఁ గస్తురి నిండెను*
*భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు గదా ॥పల్లవి॥*

*కలికి చకోరాక్షికిఁ గడ కన్నులు గెంపై తోఁచిన*
*చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు*
*నలువునఁ బ్రాణేశ్వరుపై నాఁటిన యాకొన చూపులు*
*నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు గాదుగదా ॥ఏమొ॥*

*పడఁతికి చనుఁగవ మెఱుఁగులు పైపైఁ బయ్యెద వెలుపల*
*కదు మించిన విధమేమో కనుఁగొనరే చెలులు*
*ఉడుగని వేడుకతోఁ బ్రియుఁడొత్తిన నఖ శశిరేఖలు*
*వెడలఁగ వేసవి కాలపు వెన్నెల గాదుగదా ॥ఏమొ॥*

*ముద్దియ చెక్కుల కెలఁకుల ముత్యపు జల్లుల చేర్పుల*
*వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు*
*గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున*
*అద్దిన సురతపుఁ జెమటల అందము గాదుగదా ॥ఏమొ॥[27]*

అన్నమాచార్యుడు తెలుగులోనే గాక సంస్కృతంలో కూడా సంకీర్తనలు వెలయించాడు. వీటిలోనూ అధ్యాత్మ, శృంగార సంకీర్తనలున్నాయి. ఆళ్వారుల శ్రీవైష్ణవ సంప్రదాయమే గాక ఆలంకారికుల లక్షణశాస్త్ర సంప్రదాయం కూడా అన్నమయ్య కృతులలో ఆవిష్కృతం కావడం విశేషం.

అన్నమయ్య సంస్కృత అధ్యాత్మ సంకీర్తనల్లో మనసును ఆకట్టుకునే వైరాగ్య ప్రబోధం వుంది. శ్రీహరినామ సంకీర్తన, శ్రీహరి సేవ, వేంకటేశ్వర ప్రశంస అన్ని దురితాలను అంతం చేయగల్గేవి. వాటికంటే మించినవి లేవు. వాటికంటే విభిన్నమైనవీ లేవు. ఈ అంశాలను ప్రతిపాదించే అన్నమయ్య కీర్తన ఆలోచనలను రేకెత్తిస్తుంది.

*॥కీర్తన॥* ఏవం శ్రుతిమత మిదమేవత-
ద్భావయితు మఃపరం నాస్తి *॥పల్లవి॥*

అతుల జన్మభోగా సక్తానాం
హితవైభవ సుఖ మిదమేవ

సతతం శ్రీహరి సంకీర్తనం త-
ద్వ్యతి రిక్త సుఖం వక్తుం నాస్తి *॥ఏవం॥*

బహుళ మరణపరిభవ చిత్తానా-
మిహపర సాధన మిదమేవ
అహిశయన మనోహర సేవాత-
ద్విహరణం వినా విధిరపి నాస్తి *॥ఏవం॥*

సంసార దురిత జాడ్య పరాణాం
హింసా విరహిత మిదమేవ

కంసాంతక వేంకటగిరి పతేః ప్ర-
శం సైవాం పశ్చా దిహనాస్తి *॥ఏవం॥*[28]

అన్నమయ్య సంస్కృత శృంగార సంకీర్తనలు కూడా భాషతో, భావంతో పాఠకుల జీవాన్ని స్పృశించే విధంగా రూపుదిద్దుకున్నాయి. ఒక నాయిక నాయకుని

ఇతర వధూ వ్యామోహాన్ని ఎత్తిచూపి ఎద్దేవా చేసింది. నాయకునిలో మార్పు దుస్సాధ్యమని ధ్వనింపజేసింది. నాయిక నిష్ఠురోక్తులతో నిండిన ఈ గేయం నాయకుని హృదయాన్ని గాయంచేసి కారం చల్లేవిధంగా రూపొందింది.

॥కీర్తన॥ ప్రలపనవచనైః ఫలమిహాకిం
చలచల కుడ్యక్షాళనయాకిం ॥పల్లవి॥

ఇతర వధూమోహితం త్వాంప్రతి
హితవచనైరీహితు మిహకిం
సతతం తవానుసరణ మిదంమమ
గతజల సేతూకరణ మిదానీం ॥ప్రలప॥

వికల వినయ దుర్విటం త్వాం ప్రతి
సుకుమారార్ద్ర స్తుత్యా కిం
ప్రకట బహల కోపనం మమతే
సకల చర్విత చర్వణమేవ ॥ప్రలప॥

శిరసా నతసుస్థిరం త్వాం ప్రతి
విరసాలాపన విధినా కిం
తిరువేంకటగిరి దేవ త్వదీయ-
విరహవిలపనం వృథా చరణం ॥ప్రలప॥[29]

### 1.5.2 పెదతిరుమలాచార్యుని పదకవిత :

పెదతిరుమలాచార్యుడు తాళ్ళపాక అన్నమాచార్యునికి, అతని రెండవ భార్య అక్కలమ్మకు జన్మించాడు. ఈయన తండ్రిలాగే మధురమైన ఎన్నో పదాలు రచించి సన్నుతికెక్కాడు.

"పన్నుగ పెదతిరుమలయ్య పదమునకెఱుగున్" అనే చాటుపద్య పాదాన్ని బట్టి పదరచనలో అతడెంత సిద్ధహస్తుడో అవగతమవుతుంది. అన్నమయ్య ఆదేశానుసారం అన్నమయ్య నిర్యాణానంతరం పదరచన ప్రారంభించిన పెద తిరుమలయ్య తండ్రిలాగే శృంగార పదాలు, అధ్యాత్మ పదాలు రచించాడు.

544 శృంగార పదాలు, 463 అధ్యాత్మ పదాలు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించి రెండు సంపుటాలుగా వెలువరించారు. దీనితో పెదతిరుమలయ్య పదాలు 1007 వెలుగుచూచినట్లైంది.

పెదతిరుమలయ్య శృంగార పదాల్లో నాయికా మోహం, నాయికా విరహం, నాయక విరహం, సఖీదౌత్యం, ప్రణయకోపం, అష్టవిధనాయికలకు సంబంధించిన కొన్ని అంశాలు కనిపిస్తాయి. పెదతిరుమలయ్య శృంగార సంకీర్తనల్లో మచ్చుకు నాయికా మోహాన్ని ఆవిష్కరించే కీర్తన పరిశీలించదగి వుంది.

నాయకుడుని ఉద్దేశించి నాయిక చెప్పినట్టుగా ఈ గేయం సాగింది. నాయిక మోహం దీనిలో ఆవిష్కరింపబడింది. నాయికా నాయక సమాగమ సమయంలో నాయిక చేయవలసిన చేష్టలను ఈ కీర్తన సున్నితంగా తెలియజేయడం గమనార్హం.

*॥కీర్తన॥ ఏమి సేతు నా భాగ్యము యెఱిఁగీ నెఱుఁగ నీదు*
*నా మోహమే మిక్కుటమై నన్నుఁదడఁబరచెను ॥పల్లవి॥*

*భావించి నినుఁజూచితే పరవశమౌదుఁగాని*
*ఆవేళ నీతో సరసమాడ మఱతు*
*చేవమీఱఁ దలఁచితే చిత్తము గరఁగుఁగాని*
*వోవరిలో గుబ్బల నిన్నొత్తి పట్టు మఱతు ॥ఏమి॥*

*గక్కన నీ వెదురైతే కదు సిగ్గురేగు గాని*
*పెక్కు వుపచారాల మెప్పించ మఱతు*
*తక్కక నీవంటితేను తమకమే నిండుఁగాని*
*చొక్కించి నా చేతలు చూపగ మఱతు ॥ఏమి॥*

*జట్టిగా నినుఁగూడితే సంతోసమే నిండుఁగాని*
*గుట్టున నీమోవి చవిగొన మఱతు*
*యిట్టె శ్రీవేంకటేశ యేనలమేల్మంగను*
*నెట్టన నీ గుణాలు వర్ణించ మఱతు ॥ఏమి॥[30]*

పెదతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో మేలుకొలుపు, ప్రబోధం, దైవేతర విముఖత, భగవన్నామ మహిమ, భక్తితత్త్వం, భక్తజన సంస్మరణ, మార్మిక తత్త్వాలు మొదలైన అనేక అంశాలు చోటుచేసుకున్నాయి. పెదతిరుమ లయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో వైరాగ్యాన్ని ప్రబోధించే అతని గేయం పరిశీలింపదగి వుంది. పంచేంద్రియ సుఖం, మదన సుఖం, దానఫల సుఖం, సంపద సుఖం, దేహభోగ సుఖం, సంసార సుఖం వంటి ప్రాపంచిక సుఖాలన్నీ భ్రమతో కూడు కున్నవే గాని శాశ్వతం కావు. బ్రహ్మానంద సుఖం ఒక్కటే నిత్యసుఖం. సాటిలేని మేటి సుఖం అని ఈ గేయం తెలియజేస్తుంది.

*॥కీర్తన॥ ఎట్టుగడించె దైవము యిందరికిని సుఖము*
*పట్టిన భ్రమవంటిది పంచేంద్రియ సుఖము ॥పల్లవి॥*

*పచ్చివలెనే తోచు పండ్లు ముక్కలు వోవు*
*మచ్చికఁగాంతలతోడి మదన సుఖము*
*పచ్చినట్ట నేవుండు పండ పండనట్లౌను*
*తచ్చితాతొల్లి చేసిన దానఫల సుఖము ॥ఎట్టు॥*

*మోవని యట్లేవుండు ములిగేపాటి భారము*
*భావించి యెత్తుకొన్న సంపద సుఖము*
*కైవసమైనట్లుండు కడదాఁకా వళకులే*
*తేవల ననుభవించే దేహభోగసుఖము ॥ఎట్టు॥*

*మిక్కిలి తీపై వుండు మీసాల మీఁదట తేనె*
*చక్కటి నానాఁటి సంసార సుఖము*
*తక్కక శ్రీ వేంకటేశదాసులకు చిక్కివుండు*
*అక్కడ నిక్కడను బ్రహ్మానంద సుఖము ॥ఎట్టు॥*[31]

పెదతిరుమలయ్య తన తండ్రిలాగా సంకీర్తనలు రచించడమే గాక వచన మాలికా గీతాలను కూడా రచించాడు. వీటిని వేంకటేశ్వర వచనములని, వైరాగ్య వచనమాలికా గీతములని వ్యవహరిస్తారు. ఇవి తాళబద్ధంగా, రాగయుక్తంగా

పాడుకునేందుకు అనువుగా వుంటాయి. అందువల్ల వీటిని వచన సంకీర్తనలని కూడా వ్యవహరించేందుకు వీలుంది. డా॥ ఓరుగంటి సీతారామమ్మ మాటలు ఇక్కడ గుర్తుచేసుకోవడం సమంజసం – "ఈ వచనములు రాగతాళములతో గీతములుగా పాడదగినవగుటచే నివి వచన సంకీర్తనములుగ కూడ పిలువబడు చున్నవి".[32]

ఈ వచనాలు భక్తి ప్రధానంగా, శాంత రసోచితంగా సాగాయి. ఇవి 166. పెదతిరుమలాచార్యుడు తిరుమలేశునికి అర్చనాప్రాయంగా ఆత్మ సమర్పణా భావంతో రచించిన ఈ వచనం పెదతిరుమలయ్య వచన రచనా నైపుణ్యానికి చక్కని ఉదాహరణ.

**గుజ్జరి (ఏకతాళి) :**

*శ్రీ వేంకటగిరి దేవా నా దేహంబు నీవుండెడి నిత్యనివాసంబు ।*
*నా జ్ఞాన విజ్ఞానంబులు నీయుభయ పార్శ్వంబుల దీపంబులు ।*
*నాముకుఁజెఱమలయూర్పుఁలు నీయిరుదెసలం బట్టెడి యాలవట్టంబులు ।*
*నామనోరాగంబు నీకుం జంద్రకావి వలువ ।*
*నీకు మ్రొక్క నెత్తిన చేతులు రెండును మకరతోరణంబులు ।*
*నా భక్తి యేనీకు సింహాసనంబు ।*
*నామేనం బొడమిన పులకలు నీకు గుదులుగ్రుచ్చి యర్పించినపూదండలు।*
*నేమిమ్మునుతించిన నుతుల యక్షర రవంబుల భేరీభాంకార ఘంటిని నాదంబులు।*
*నా పుణ్య పరిపాక ఫలంబులు నీకు నైవేద్య తాంబూలాదులు ।*
*మదీయ నిత్య సేవాసమయ నిరీక్షణంబులునీ సర్వాంగంబుల నలందిన తట్టు పునుంగు।*
*నా సాత్విక గుణంబు నీకు ధూప పరిమళంబు నీవు దేవదేవుఁడు నేనర్చకుండను।*
*ఈ రీతి నిత్యోత్సవంబు నాయందు నవధరింప శ్రీవేంకటేశ్వర, రామణీయును।*[33]

## 1.5.3 చిన్నతిరుమలాచార్యుని పదకవిత :

చిన్నతిరుమలాచార్యుడు అన్నమాచార్యుని పౌత్రుడు. పెదతిరుమలాచార్యుని పుత్రుడు. అష్టభాషా కవి చక్రవర్తిగా అభినుతికెక్కినవాడు. తాత విరచించిన సంకీర్తన లక్షణాన్ని ఆంధ్రీకరించిన మేధావి. ఈయన కూడా తాత తండ్రులలాగే

కీర్తనలు రచించి కీర్తికి బాటలు వేసుకున్నాడు. చిన్నతిరుమలాచార్యుడు రచించిన అధ్యాత్మ సంకీర్తనలు 60, శృంగార సంకీర్తనలు 119. అధ్యాత్మ, శృంగార సంకీర్తన లన్నిటినీ సంపుటీకరించి తిరుమల తిరుపతి దేవస్థానం వారు వెలువరించారు. చిన్నతిరుమలయ్య రచించిన 179 సంకీర్తనలు అందుబాటులో ఉండడం విశేషం.

చిన్నతిరుమలయ్య శృంగార పదాల్లో నాయికా మోహం, నాయికా విరహం, నాయక విరహం, సఖీదౌత్యం, ప్రణయకోపం, అష్టవిధనాయికలకు సంబంధించిన కొన్ని అంశాలు కనిపిస్తాయి.

చిన్నతిరుమలయ్య శృంగార పదాల్లో సఖీదౌత్యాన్ని తెలియజేసే పదం గమనించదగి వుంది. నాయిక పంపిన దూతిక నాయకుడితో చెప్పినట్టు ఈ పదం రచింపబడింది. దీనిలో నాయిక విరహాధిక్యత, నాయకుడి నిర్లక్ష్యం పరోక్షంగా ధ్వనిస్తాయి. నాయిక నాయకుడికి పంపిన కానుకల జాబితా కూడా దీనిలో చోటుచేసుకుంది.

*॥కీర్తన॥ ఆపె యెరుగును నీ వన్నియూ నెరుఁగుదువు*
*రేపుమాపు నేనెచ్చరించేనా విభుఁడ ॥పల్లవి॥*

*చిలుకచే మాఁటలు చెప్పెంప్పి మరు*
*చిలుకల పాలుగఁ జేయనేల*
*కలగని లేచి లేకలు వ్రాసి కాఁ*
*కలఁబొరలుచునె నీకడ కంపెఁజెలియా ॥ఆపె॥*

*కదువేగ ముదుర వుంగరమె యంపి మరు*
*కడివోని బాణాలఁగాచ నేల*
*బడిబడి విరహానఁ బడలేక మా*
*పడతి నీకుఁ జిత్తరుపట మంపె నిదివో ॥ఆపె॥*

*విందువలెఁ గప్పురపు విడెమిచ్చి గో*
*విందుఁడ వయిన శ్రీవేంకటనాథ*
*కందులేని వేడుక నాకందుకొని నీ*
*కందువ లంటికూడెఁ గొంతయు నిన్నిపుడూ ॥ఆపె॥[34]*

చిన్నతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనలు కూడా తాత, తండ్రుల రచనలను తలపించే విధంగా ఉన్నాయి. వీటిలోనూ మేలుకొలుపు, ప్రబోధం, వేంకటేశ్వరేతర విముఖత, విష్ణునామ మహిమ, భక్తితత్త్వం, భక్తజన సంస్మరణ, శరణాగతి, హరిదాసుల ఘనత మొదలైన అనేక అంశాలు చోటుచేసుకున్నాయి.

అశాశ్వతమైన లౌకిక పదార్థాల మీది వ్యామోహంతో దైవాన్ని విస్మరించేవారి హృదయాన్ని తట్టిలేపుతూ వుంది ఈ చినతిరుమలయ్య గేయం. ప్రపంచంలో ఇతర జనులవల్ల, ఇతర పదార్థాల వల్ల లభించే సుఖాలను దేవుడు కూడా ఇవ్వ గలడని విశ్వవ్యామోహాన్ని విడిచి విశ్వాత్మకుడైన విశ్వేశ్వరుణ్ణి వినుతించి తరించడం విజ్ఞత అని ఈ చినతిరుమలయ్య కీర్తన స్పష్టం చేస్తూవుంది.

॥కీర్తన॥ మాయలో మునుగనేల మమతలేల
చేయరా దేవుడీపాటి సేయనోపడా ॥పల్లవి॥

అట్టె దేహసమ్మంధ మాసపడే జీవులాల
పట్టి హరిసమ్మంధాన బ్రదుకరాదా
నెట్టన సర్వాంతరాత్మై నిలుచున్న దేవుఁడిట్టె
చుట్టాల పక్కాలపాటి శుభమియ్య నోపఁడా ॥మాయ॥

మోసపోక ధనధాన్యములు గూర్చే దేహులాల
వేసరక విష్ణుభక్తి వెదకరాదా
రాసికెక్క యిందరిని రక్షించే దేవుఁడె
కాసు వీసముల పాటి కావనోపఁడా ॥మాయ॥

వెలయ రాజులను దీవించే ప్రాణులాల
కల శ్రీవేంకటనాథుఁగానఁగ రాదా
వలెనని యిందరికి వరాలిచ్చే దేవుఁడేమి
కొలువు నిలువుపాటి గుణమియ్య నోపఁడా ॥మాయ॥[35]

## 1.6 తరువాతి పదకవిత మీద తాళ్ళపాక పదకవుల ప్రభావం :

తాళ్ళపాక అన్నమాచార్యుడు తెలుగు పదకవిత బహుముఖ స్వరూపాన్ని ఆంధ్రజాతికి చూపించి ఆనందింపజేశాడు. అతని కుమారుడు పెదతిరుమలయ్య,

మనుమడు చినతిరుమలయ్య కూడా అన్నమయ్యను అనుసరించే కీర్తనలు వెలయించి కీర్తిని ప్రకాశింప చేసుకున్నారు. వీరి తర్వాతి తెలుగు పదకర్తలెందరో అన్నమయ్య పథాన్నే అనుసరించి పదాలు రచించారు. పదసాహిత్య చరిత్రలో తమ పదాన్ని సుస్థిరం చేసుకున్నారు. అలాంటి తెలుగు పదకవులలో మొదట పేర్కొనదగిన వాడు క్షేత్రయ్య.

**1.6.1 క్షేత్రయ్య పదకవిత :**

నేటి ఆంధ్ర, తమిళ దేశాల్లో పర్యటించి శృంగార పదాన్ని వ్యాప్తి చేసిన శేముషీ దురంధరుడు మహాకవి క్షేత్రయ్య. శృంగార పద స్వరూపాన్ని కల్పించి రూఢికెక్కేట్టు చేసిన మహానుభావుడు కూడా ఈతడే. క్షేత్రయ్య క్రీ.శ.1600 ప్రాంతంలో జన్మించి క్రీ.శ. 1680 వరకు జీవించినట్టు ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర రచించిన శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు భావించారు. కృష్ణాజిల్లా మువ్వలో జన్మించి, అక్కడి మువ్వగోపాలుణ్ణి ఆశ్రయించి పదాన్ని పండించుకున్న పరమప్రాజ్ఞుడీ మహాకవి. మొదట రాజాశ్రయాన్ని పొంది రాజుల మీద పదకవితలు వెలయించి నప్పటికీ తరువాత వివిధ దేవతామూర్తులను తన మధుర పదకవితా కుసుమాలతో సమర్చించి సన్నుతికెక్కాడు. ఈయన పదాల్లో పల్లవి, అనుపల్లవి, మూడు చరణాలుంటాయి. అంకిత ముద్ర పల్లవిలోనో, అనుపల్లవిలోనో ఉంటుంది. క్షేత్రయ్య ఏ దేవతామూర్తిని సందర్శించినా ఆ స్వామి ఉపముద్రతో గేయాలు రచించేవాడు. అంకిత ప్రధాన ముద్ర మాత్రం మువ్వ వేణుగోపాలుడిదే. క్షేత్రయ్య పదాల్లో మాతు ధాతువులకు సమప్రాధాన్యం ఉంటుంది. పాడడానికే గాక అభినయానికి కూడా అనుకూలంగా ఈ పదాలు రచింపబడడం గమనార్హం. తెలుగు పదసాహిత్య చరిత్రలో క్షేత్రయ్య కాలం చెప్పుకోదగ్గ మలుపు అంటే అతిశయోక్తి కాదు.

క్షేత్రయ్య పదాల్లో నాయికామోహం, నాయికా విరహం, నాయక విరహం, సఖీదౌత్యం, కానుకలు పంపుకోవడం, ప్రణయకోపం వంటి శృంగార పరమైన అంశాలు చోటుచేసుకున్నాయి. అష్టవిధనాయికల్లో స్వాధీనపతిక, వాసక సజ్జిక, విప్రలబ్ధ, ఖండిత, కలహాంతరిత ఈయన పదాల్లో కనిపిస్తారు.

నాయిక అలమేలుమంగ. నాయకుడు శ్రీవేంకటేశ్వరుడు. నాయకుడు తన ఇంటికి వచ్చినప్పుడు నాయిక పరవశించింది. ఆమె ఏమేమి చేస్తున్నదో అప్పటికి ఆమెకే అంతుపట్టలేదు. తరువాత తన చేతలు గుర్తు తెచ్చుకుని సిగ్గుపడింది. తల్లడిల్లింది. నాయకుడేమంటాడోయని భీతిల్లింది. ఉండబట్టలేక చెలికత్తెకు చెప్పిపంపింది. ఆమె కూడా స్వామిని సమీపించి అన్నువ తనకు విన్నవించిన అన్నివిషయాలనూ ఆయనకు నివేదించింది. ఆమె పడుతున్న ఆవేదనను అతని దృష్టికి తెచ్చింది. ఆమె అంతరంగాన్ని అతని ఎదకందించి పొంగిపోయేట్టు చేసింది. చివరికి నాయిక నాయకుని ఎదమీదనే వున్నట్టు తెలియజేసింది.

॥పదం॥ ఇందుకు నీవాపెను యెట్టు లాలించేవో కాని
పొందులు నెరపి సతి బొదుగగవలెను. ॥పల్లవి॥

మగువ నిన్నుదూరి మనసు నొచ్చెనోయని
పొగులుచునటు చిన్నబోయి వున్నది
నిగిడినిన్ను జంకించి నీకు లాఘవమోయని
వగల బొరలి తలవంచుకొని వున్నది ॥ఇందుకు॥

భామిని నీతో జెనగి పాదముదాకెనోయని
ఆముకొని అసురసురయి వున్నది
చేముంచి వెంగెములాడి సిగ్గువడితివోయని
యేమిసేతునని మదినిట్టే చింతనున్నది. ॥ఇందుకు॥

పదతి రతిగెలిచి నీ పంతము దప్పెనోయని
అదరి తనలో పెరగంది వున్నది
యదయక శ్రీవేంకటేశుడ నీవురమెక్కి
చిడిముడి వినయాన చేత మొక్కుచున్నది. ॥ఇందుకు॥[36]

క్షేత్రయ్య అధ్యాత్మ పదాలు రచించలేదు. కారణం వైరాగ్యం ఆయనకు రుచించలేదు. అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య రచించిన శృంగార పదాలు క్షేత్రయ్య దాకా వచ్చాయో లేదో గానీ, తాళ్ళపాక వారి

శృంగార పదాలకు క్షేత్రయ్య వెలయించిన శృంగారాత్మక పదాలకు చాలా పోలికలు కన్పిస్తాయి. కాబట్టి తాళ్ళపాక వారి పదాల ప్రభావం క్షేత్రయ్య పదాల మీద గోచరిస్తుందనే నిర్ణయానికి రావలసి వుంటుంది.

**1.6.2 రామదాసు పదకవిత** :

క్షేత్రయ్య తరువాత పేర్కోదగిన వాగ్గేయకారుడు రామదాసుగా ప్రసిద్ధి వహించిన కంచెర్లగోపన్న. ఈయన క్రీ.శ. 1620లో జన్మించి క్రీ.శ. 1680లో పరమపదించినట్టు శ్రీబాలాంత్రపు రజనీకాంతరావు, ఆచార్య యస్. గంగప్ప అభిప్రాయపడ్డారు. రామదాసు తెలంగాణాలోని నేలకొండ పల్లెలో జన్మించాడు. తల్లి కామాంబ, తండ్రి లింగన మంత్రి. వీరిది అత్రేయ గోత్రం. ఋగ్వేద శాఖ. గోపన్న చిన్నప్పటి నుంచే రామభక్తుడు. రఘునాథ భట్టాచార్యులు, కబీరు ఈయనకు గురువులు. తానీషాకొలువులో ప్రవేశించి భద్రాచల తహశీల్దారుగా ఈయన పనిచేశాడు. భద్రాచలంలో వున్నప్పుడే సర్కారు ధనంతో రామాలయాన్ని బాగు చేయించాడు. పర్యవసానంగా నవాబు ఆగ్రహానికి గురయ్యాడు, చెరసాల పాలయ్యాడు. ఎన్నో కష్టాలనుభవించాడు. ఆ కష్టాలే ఆయనను ఇష్టదైవానికి దగ్గర చేశాయి. బాధలు పాటలకు బాటలు వేశాయి. అనేక కీర్తనలు ఆయన నోటినుండి వెలువడి ఆయనకు కీర్తి కిరీటాన్ని తెచ్చిపెట్టాయి. రామదాసు కీర్తనలిప్పుడు 140 దాకా దొరుకుతున్నట్టు మంచాళ జగన్నాథరావు తెలియజేశాడు. అవన్నీ పారమార్థిక కీర్తనలే. శృంగారం వీటిలో కనిపించదు. రామదాసు కీర్తనకు పల్లవి, అనుపల్లవి, చరణాలుంటాయి. ఈయన కీర్తనల్లో స్వనామాంకిత ముద్రేగాక, దైవనామాంకిత ముద్రకూడా వుంటుంది.

మానసిక ప్రబోధం, నీతిప్రబోధం, వైరాగ్య ప్రబోధం, అన్యదేవతా విముఖత, రాజాశ్రయ విముఖత, ఆత్మవిమర్శ,కాలస్పృహ, నామమహిమ, భక్తజన సంస్మరణ, హరిదాసుల ఘనత, శరణాగతి మొదలైనవి రామదాసు కీర్తనల్లో కన్పిస్తాయి. ఇవేగాక భక్తిరకాలుగా పరిగణింపబడే శ్రవణభక్తి, కీర్తనాభక్తి, స్మరణభక్తి, పాదసేవనాభక్తి, అర్చనాభక్తి, వందనాభక్తి, దాస్యభక్తి గోచరిస్తాయి.

రామదాసు రామనామ ఘనతను రమ్యంగా ఆవిష్కరించాడు. ఈశ్వరుడు కూడా అనుదినము రామనామాన్ని పఠించడం వల్ల అది ఎంత విశిష్టమైనదో బోధపడుతుందని తెలియజేశాడు. మహనీయులెందరో దానివల్ల తరించారని తెలియజేశాడు. ప్రపంచంలోని కొన్ని తీపి పదార్థాలను పేర్కొని వాటికన్నా రామనామమెంతో మధురమైనదని తెలియజేశాడు. తద్వారా రామనామాన్ని జపించవలసిన ఆవశ్యకతను ఉద్ఘాటించాడు.

*॥కీర్తన॥ శ్రీరామ నీనామమేమిరుచిరా ఓరామ నీనామమెంతరుచిరా*
*కరిరాజ ప్రహ్లాద ధరణి విభీషణుల గాచిన నీనామమేమిరుచిరా*
*॥పల్లవి॥*

*కదళీ ఖర్జూరాది ఫలముల కధికము పావన నీనామమేమిరుచిరా*
*నవరసములకన్న నవనీతముల కంటె నధికమౌ నీనామమేమిరుచిరా*
*పనసజంబూద్రాక్ష ఫలరసముల కంటె నధికమౌ నీనామమేమిరుచిరా*
*అంజనాతనయ హృత్కమలమునందు రంజిల్లు నీనామమేమిరుచిరా*
*॥శ్రీ॥*

*సదాశివుందును సదాభజించెడి సదానంద నీనామమేమిరుచిరా*
*సారములేని సంసారమునకు సంతారకమగు నీనామమేమిరుచిరా*
*శరణన్నజగముల సరగున రక్షించు బిరుదుగల్గు నీనామమేమిరుచిరా*
*తుంబురనారదుల్ డంబు మిరగగానంబు జేసెడి నీనామమేమిరుచిరా*
*॥శ్రీ॥*[37]

## 1.6.3 సారంగపాణి పదకవిత :

క్షేత్రయ్య పదాలను తలపించే పదాలను రచించి రాయలసీమ వాగ్గేయ కారుడుగా రాణకెక్కిన రమణీయ పదకర్త సారంగపాణి. చెన్నపురి సమీపంలోని పొన్నేరిలో జన్మించి, చిత్తూరు జిల్లాలోని కార్వేటినగర సంస్థానంలో స్థిరపడిన విద్వత్కవి ఈ మహనీయుడు. ఈయన క్రీ.శ. 1680లో జన్మించి క్రీ.శ. 1750 వరకు జీవించినట్టు ఆచార్య ఎస్. గంగప్ప అభిప్రాయపడ్డారు. నగర సంస్థానంలో వైణికుడుగా, నాట్యవిద్యాచార్యుడుగా, విద్యాధికారిగా వివిధ హోదాల్లో ఈయన

పనిచేశాడు. రాజుల మనసులు రంజిల్లజేయడమే గాక ప్రజాభిమానానికి కూడా ఈయన పాత్రుడయ్యాడు. స్థానిక దైవం వేణుగోపాలస్వామి మీద అనేక పదాలు రచించి ఈ స్వామి పట్ల తనకు గల భక్తి ప్రపత్తులను ప్రకటించుకున్నాడు. పరిసర దేవతల మీదనే గాక ఆశ్రయమిచ్చిన రాజుల మీద కూడా ఈయన పదాలు రచించడం విశేషం. సారంగపాణి పదాలను ఇటీవల సేకరించి వెలువరించడమే గాక ఆ పదాలకు మంచి పీఠిక రచించిన ఆచార్య గల్లా చలపతిగారు సారంగపాణి పదాలు లభిస్తున్నట్టు చెప్పారు. సారంగపాణి పదాల్లో ఒక పాదమే గల పల్లవి, నాలుగు పాదాలతో కూడిన అనుపల్లవి, రెండు లేక మూడు పాదాలు కల్గిన చరణాలు ఉంటాయి. చరణ సంఖ్యా నియమం ఉండదు. కొన్ని పదాల్లో అనుపల్లవిలో కూడా అంకితముద్ర కనిపిస్తుంది.

సారంగపాణి రచించిన పదాలను శృంగార పదాలనీ, దేశీయపదాలనీ, జాతీయ పదాలనీ, కీర్తనలనీ నాలుగు రకాలుగా విమర్శకులు విభజించారు. వీటిలో ప్రధానంగా పరిగణింపదగినవి శృంగార పదాలు, అధ్యాత్మ కీర్తనలు. సారంగపాణి కూడా శృంగార, అధ్యాత్మ పదాలు రచించడంలో తాళ్ళపాక వారినే అనుకరించినట్టు తోస్తుంది. సారంగపాణి తన పదాల్లో శృంగార జీవితావస్థలైన నాయికామోహం, నాయికా విరహం, నాయక విరహం, సఖీదౌత్యం, కానుకలివ్వడం, ప్రణయకోపం చిత్రించాడు. అష్టవిధ నాయికల్లో విప్రలబ్ధ ఒక్కతెకు మాత్రమే స్థానం కల్పించాడు.

అస్పృణ సరోవరతీరంలో వెలసిన ప్రసన్న వేంకట శౌరిమీది విరహంతో సారంగపాణి నాయిక ఈ గేయాన్ని ఆలపించింది. విరహం మోతాదు ఎక్కువ కావడంతో తట్టుకోలేని తన్వి తన దుర్భర వేదనను బయటపెట్టింది. అదే పాటగా పల్లవించింది.

*॥కీర్తన॥ తటుకు తటుకుమని యదరీనె గుండె దిటువులేదె నీ సాక్షిగా ॥పల్లవి॥*

*కుటిల కుంతలి యస్పృణ సరోవరమటప్రసన్న వేంకటశౌరి మొన్న ॥అనుపల్లవి॥*

*చిటికిలొ వలపించి పోయెనే నెటుల సైత దెలుపవెనారొమ్మున ॥తటుకు॥*

నిలువనీయదు నిలిచినచోట నిమిషమొక్క యుగమాయెనే
పలుకనీదు ప్రాణ సఖులమీది బాళియెపుడు మరుపాయెనే
తలచి తలచి వేదనచే గుందితి తలవాకిట నిలచియెదురు చూచితి
లలన యీతనిపై రోసితి చెలువరాయని బాసినమొదలుగ ॥తటుకు॥

అన్నమేమో నాజిహ్వాకు సుంతహాయనేది లేదాయనే
కన్నెరో విరహాగ్ని చేత కరిగి మేను సగమాయెనే
అన్ని దైవముల వేడుకొంటి అతనికైన వారిని శరణంటి
యెన్ని శకునములో జూడమంటి యెమ్మెకాదిటకు రానందుకు ॥తటుకు॥

రతులు దేలించిన నాసామి రాక సమయమిటు జేసెనే
అతివరో సరివారు నవ్వగ ఆగడు నాతల వ్రాసెనే
పతిని విడచి నేనేవగ సైతు పణతియీ తొడవులెచటలైతు
మితము మించి చిలుక తేజిరౌతు మేలువాడు వేంచేసేటంతలో ॥తటుకు॥[38]

అధ్యాత్మ తత్త్వాన్ని ఆవిష్కరించే సారంగపాణి పదాల్లో మానసిక ప్రబోధం, నీతిప్రబోధం, వైరాగ్య ప్రబోధం, అన్యదేవతా విముఖత, రాజాశ్రయ విముఖత, మనసు స్వభావం, ఆత్మవిమర్శ, నామమహిమ, భక్తజన సంస్మరణ, హరిదాసుల ఘనత, శరణాగతి, శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, వందనాభక్తి, దాస్యభక్తి, మార్మికతత్త్వాలు ఉన్నాయి.

సారంగపాణి హరిభక్తుడు. హరినామస్మరణ ఆవశ్యకతను గుర్తించినవాడు. హరినామస్మరణ ఆలస్యమయ్యే కొద్దీ జీవనభ్రాంతి తప్పుదారి పట్టిస్తూనే వుంటుందని ఆయన ఆలోచన. ఈ కీర్తనలో వృద్ధాప్య క్రమపరిణామాన్ని హృదయానికి హత్తుకునేలా తెలియజేశాడు. అది ఎంత భయంకరంగా వుంటుందో పరోక్షంగా బోధపరచి జాగ్రత్త వహించవలసిందిగా హెచ్చరించాడు.

॥కీర్తన॥ హరినామస్మరణే సేయకుంటే అవతల గతియేమి ఈ
వెరవుదెలసి సత్సంగతి వదలక వేణుగోపాలుడైన శ్రీనర ॥పల్లవి॥

అన్నదమ్ములెడబాయక మునుపే యాలు నిష్ఠురోక్తులనక మునుపే
కన్నకొడుకు దండించక మునుపే కాయము వ్యాధుల చివుకక మునుపే
॥హరి॥

వృద్ధాప్యము ప్రాపించక మునుపే వుత్సాహము బలముడుగక మునుపే
నిర్ధనుడై దిగులు బడక మునుపే నేత్రాలు పొరగప్పక మునుపే ॥హరి॥

కట్లనూనుకొని దిరుగక మునుపే కంఠధ్వని తగ్గిపోక మునుపే
అట్టు ముందరికి వంగకమునుపే అంగము తలవణుకెత్తకమునుపే
॥హరి॥

దవడలు లోనికి బోవకమునుపే దంతపటుత్వము తప్పక మునుపే
చెవులకు మందము దట్టక మునుపే చెల్లబోనడవ జేరక మునుపే
॥హరి॥

అప్పుల కాపులు కదియక మునుపే అన్నమొకరు దినిపించక మునుపే
దొప్పలోన చైకడగక మునుపే ధోవతి బరువైతోచక మునుపే ॥హరి॥[39]

**1.6.4 త్యాగరాజు పదకవిత :**

క్షేత్రయ్య కాలంలో మాతుధాతు సమప్రధానంగా సాగిన పదకవిత గిరిరాజకవి కాలం నుంచే ధాతువువైపుకు మొగ్గు చూపడం మొదలైంది. త్యాగరాజ స్వామి కాలంలో మాతు ప్రాధాన్యం తగ్గిపోయి ధాతు ప్రాధాన్యం హెచ్చింది. కీర్తనగా, పదంగా పెంపుగాంచిన పదకవిత త్యాగరాజు కాలంలో కృతిగా వ్యవహరింపబడింది. త్యాగయ్యగా, త్యాగరాజుగా ప్రసిద్ధికెక్కిన రామభక్తుడు క్రీ.శ.1767 నుంచి 1847 దాకా జీవించాడు. తిరువారూర్‌లో జన్మించిన ఈయన తిరువయ్యూరులో పరమపదించాడు. తాత, తండ్రి, తల్లి సంగీతాభిమానం ఉన్నవారు. సంగీత విద్యలో ప్రవేశం కలవారు. మాతామహుడు కూడా వైణికుడే. సంగీత పరిజ్ఞాన కుటుంబ నేపథ్యం కూడా త్యాగరాజ స్వామిని సంగీతంలో నిష్ణాతుడయ్యేట్టు చేసింది. ఈయన అనేక సంగీత శాస్త్ర గ్రంథాలు అధ్యయనం చెయ్యడమే గాక నారదుణ్ణి ఉపాసించి తనకు ఏర్పడిన సంశయాలను తీర్చుకున్నట్టు ప్రతీతి.

త్యాగరాజు 'ప్రహ్లాద భక్తి విజయము', 'నౌకాచరిత్రము', 'సీతారామ విజయము' అనే మూడు సంగీత రూపకాలు రచించాడు. ఈయన దాదాపు రెండువేల (2,000) కీర్తనలు రచించినట్టు ప్రతీతి. వీటిలో 660 మాత్రమే స్వరపరచబడి నేడు లభిస్తున్నాయి. త్యాగరాజు కృతికి పల్లవి, అనుపల్లవి, చరణాలనే మూడంగాలు ఉన్నాయి. ఈ చరణాలు ఒకటి గాని లేక అంతకంటే ఎక్కువగా గానీ ఉంటాయి. ఇందులో ముద్ర కూడా నియతంగా ఉంటుంది. ఈయన కృతుల్లో దాదాపు సగం రామాయణ కథాత్మకమైనవి. త్యాగరాజు 72 మేళకర్త రాగాలలోను కృతులు రచించాడు. ఇతని ఘనరాగ పంచరత్న కీర్తనలు బాగా ప్రసిద్ధికెక్కాయి.

త్యాగరాజు రచించిన నౌకాచరిత్రలో మధురభక్తి పరిమళిస్తున్నప్పటికీ ఆయన రచించిన ముక్తకగేయాలలో అది అంతగా కనిపించడం లేదు. నాయికా మోహం పూర్తిగా, నాయికా విరహం రేఖామాత్రంగా ఆయన కృతుల్లో కనిపిస్తున్నాయి. నాయికామోహాన్ని ఆవిష్కరించే ఈ కృతి పాఠకులను పరవశింప జేసే మంచి స్మృతి.

॥కీర్తన॥ రామాభిరామ రమణీయ నామ
సామజరిపు భీమా సాకేతధామ । ॥పల్లవి॥

వనజలోచన నీవు వలసియలసితి నీ
మనసున దయలేదు మాల్లాడి ఫలమేమి । ॥రామా॥

మనసున చెలినీకే మరులు గొన్నది గాని
చనవున చెయిబట్టి సంరక్షించవు । ॥రామా॥

కమనీయమగు పొన్నును గావించితి నందు
రమియింపక నన్ను రచ్చజేసేవు । ॥రామా॥

కోరికోరి నిన్ను కొలువగ నీకు
దాటి వేరేయని ధాత వ్రాతేమో । ॥రామా॥

దిక్కునీవేయని నేను దినదినమును నమ్మ
ఎక్కువ తక్కువలందు ఎనసే గుణమేమో । ॥రామా॥

నీకే దయబుట్టి నీవు బ్రోవవలె గాక
రాకేందు ముఖి త్యాగరాజ రక్షక శ్రీ। ॥రామా॥[40]

అన్నమయ్య మధురభక్తి క్షేత్రయ్యలోనూ, ఆయన అధ్యాత్మ తత్త్వం త్యాగయ్యలోనూ ప్రతిఫలించినట్టు ప్రాజ్ఞ ప్రశంస. త్యాగయ్య ఆధ్యాత్మిక కృతులలో మేలుకొలుపులు, మానసిక ప్రబోధం, నీతిప్రబోధం, వైరాగ్యప్రబోధం, అన్యదేవతా విముఖత, రాజాశ్రయ విముఖత, ఆత్మవిమర్శ, కాలస్పృహ, నామమహిమ, భక్తజన సంస్మరణ, హరిదాసుల ఘనత, శరణాగతి, శ్రవణభక్తి, కీర్తనాభక్తి, స్మరణభక్తి, పాదసేవనాభక్తి, అర్చనాభక్తి, వందనాభక్తి, దాస్యభక్తి, ఆత్మనివేదనాభక్తి కనిపిస్తాయి.

రాముణ్ణి మేల్కొలుపుతూ త్యాగరాజు రచించిన కృతి ఎంతో హృద్యంగా, సులభవేద్యంగా ఉంది.

॥కీర్తన॥ మేలకోవయ్య రామ మమ్మేలుకో రామ।
మేలైన సీతాసమేత నా భాగ్యమ ॥పల్లవి॥

నారదాదులు నిన్నుగోరి నీ మహిమలన
వారిగా పాడుచున్నారిపుడు తెల్ల
వారగా వచ్చినది శ్రీరామ నవనీత
క్షీరములు బాగుగా నారగింపను వేగ ॥మేలు॥

ఫణిశయన యనిమిషరమణు లూడిగము సేయ
అణకువగ నిండారు ప్రణుతి జేసెదరను
మణిమయాభరణులౌ యాణిమాదులిడు దీప
మణులు తెలుపాయెను తరణివంశ వరతిలక ॥మేలు॥

రాజరాజేశ్వర భరాజ ముఖసాకేత
రాజ సద్గుణ త్యాగరాజనుత చరణ
రాజన్య విబుధ గణరాజాదులెల్ల నిను
పూజింప గాచి నారీ జగము పాలింప ॥మేలు॥[41]

త్యాగరాజు తర్వాత తెలుగు పదసాహిత్య చరిత్రలో చోటు సంపాదించుకున్న పదకర్తలు శ్యామాశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు, పట్నం సుబ్రహ్మణ్యఅయ్యర్ మొదలైనవారు. సంగీత ప్రధానంగా శ్యామాశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు రచనలు సాగించారు. వీరి కృతులు సంస్కృతంలో వినూత్న పంథాలో సాగాయి. పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ 'జావళీలు, తిల్లానాలు, వర్ణాలు' రచించాడు. ఈ రచనలకు అన్నమాచార్యాదులు రచనలకు పోలికలున్నట్లు కనిపించదు. అందువల్ల వీరి కృతులను గురించి ప్రస్తావించే ఆవశ్యకత ఇక్కడ రాలేదు.

అన్నమయ్య, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య రచించిన కీర్తనలు దాదాపు ఒకే విధంగానే కనిపిస్తాయి. వీరి మధురభక్తి రచనల ప్రభావం క్షేత్రయ్య మీద, సారంగపాణి మీద, కొంతమేరకు త్యాగరాజు మీద కనిపిస్తుంది. తాళ్ళపాక వారి ఆధ్యాత్మిక రచనల ప్రభావం రామదాసు మీద, సారంగపాణి మీద, త్యాగరాజు మీద బాగా ఉన్నట్లు స్పష్టమవుతుంది. మొత్తానికి తాళ్ళపాక కవుల ప్రభావం తర్వాతి వాగ్గేయకారుల మీద స్పష్టంగా గోచరిస్తుంది.

### 1.7 తెలుగు పదకవులలో తాళ్ళపాక పదకవుల స్థానం :

ఆంధ్రపదసాహిత్య చరిత్రలో ప్రథమస్థానం, ప్రధాన స్థానం కూడా తాళ్ళపాక వారిదే. తాళ్ళపాక కవులకు ముందు వెలసిన కృష్ణమాచార్యులు గానీ, యాగంటి వారు గానీ తాళ్ళపాక అ్నమాచార్యుని లాగా సర్వాంగ సుందర సంకీర్తన రచించలేదు. కృష్ణమాచార్యుల రచనలు వచనాలు కాగా, యాగంటి వారివి పదాలు. కృష్ణమాచార్యుల కంటే యాగంటి వారివి కొంత భిన్నంగా, మెరుగ్గా కనిపిస్తాయి. అయినప్పటికీ తాళ్ళపాక అన్నమాచార్యుని దగ్గర నుంచే తెలుగు సంకీర్తన తేజరిల్లిందని చెప్పుకోవచ్చు. ఎన్నో నూతనాంశాలు ఈ సంకీర్తనలో చేరి సమధిక శోభను సంతరించి పెట్టాయి. ఈ కారణం చేతనే తాళ్ళపాక అన్నమాచార్యుడు తొలి తెలుగు వాగ్గేయకారుడుగా వినుతికెక్కాడు.

తాళ్ళపాక వారి సంకీర్తనకు ప్రత్యేకత ఉంది. పల్లవి చెప్పిన విషయాన్ని చరణాలు సమర్థించడం కనిపిస్తుంది. వీరి కీర్తనల్లో శబ్ద సౌందర్యంతో పాటు అర్థసౌందర్యం కూడా అడుగడుగునా గోచరిస్తుంది. కవితా సౌందర్యం ఆలోచింపజేసి

ఔరా! అనిపిస్తుంది. ప్రాసలు, అంత్యానుప్రాసలు వినేవారికే గాక పాడేవారికి కూడా పారవశ్యం కల్గిస్తాయి.

తాళ్ళపాక పదకవులు తదితర తెలుగు పదకవుల కంటే కొంత ప్రత్యేకంగా కనిపిస్తారు. గేయస్వరూపంలోనూ, అనుసరించిన జానపదుల ధోరణులలోనూ, ప్రయోగింపబడిన భాషలోనూ, ప్రతిపాద్య విషయంలోనూ, మార్మికతలోనూ, ఇతర క్షేత్ర దేవతా ప్రస్తావనలోనూ, అదనపు ప్రక్రియల్లోనూ, మార్గదర్శకత్వంలోనూ వారి ప్రత్యేకత గోచరిస్తుంది.

### 1.7.1 గేయస్వరూపం :

తెలుగు పదకవిత ప్రారంభదశ నుంచి చివరి దశ వరకు ఒకే విధంగా లేదు. పదకర్తలు, వాగ్గేయకారులు తమ అభిరుచికి తగిన విధంగా తమతమ గేయాలను రూపొందించారు. అందువల్ల పదకవుల పదాలను సూక్ష్మంగా పరిశీలిస్తే స్వరూప వైవిధ్యం గోచరిస్తుంది.

కృష్ణమాచార్యుల రచనకు పల్లవి, చరణము రెండే అంగాలు. ఇవి కూడా తాళఛందో విరహిత గేయ గంధ సమన్వితాలు.

యాగంటి వారి పదాలు పల్లవి, అనుపల్లవి, చరణాలు కలిగివుంటాయి. పల్లవి నాలుగు పాదాలు, అనుపల్లవి రెండు పాదాలు కలిగి ఉంటాయి. దాదాపు పదిరకాల ముద్రలు యాగంటి వారి పదాల్లో కనిపిస్తాయి.

క్షేత్రయ్య పదాల్లో పల్లవి, అనుపల్లవి, చరణాలు ఉంటాయి. అంకిత ముద్ర పల్లవిలోనో, అనుపల్లవిలోనో ఉంటుంది.

రామదాసు కీర్తనల్లో కూడా అనుపల్లవి ఉంటుంది. స్వనామాంకిత ముద్రతో పాటు దైవనామాంకిత ముద్రకూడా ఉండటం విశేషం.

సారంగపాణి పదం ఒకే పాదంగల పల్లవితో, నాలుగు పాదాలు గల అనుపల్లవితో రెండు లేక మూడు పాదాలు గల చరణాలతో రూపుదిద్దుకుంది. అంకితముద్ర అనుపల్లవిలో కూడా కొన్ని పాదాల్లో కనిపిస్తుంది.

త్యాగరాజ కృతిలో పల్లవి, అనుపల్లవి, చరణాలుంటాయి. చరణసంఖ్యా నియమం లేదు.

అన్నమయ్య రచించిన కీర్తనలలో పల్లవి మాత్రమే ఉంటుంది. అనుపల్లవి ఉండదు. పల్లవిలో రెండు ఖండాలు కనిపిస్తాయి. నాలుగు పాదాలతో కూడిన చరణాలుంటాయి. చరణపాదాలలో ప్రాస ఉంటుంది. చివరి చరణంలో మాత్రమే అంకిత ముద్ర ఉంటుంది. కొన్ని కీర్తనల్లో ముద్రతోపాటు ఉపముద్రలు కూడా ఉంటాయి. పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య అన్నమయ్యననుసరించే రచన చేయడం వల్ల గేయ స్వరూపానికి సంబంధించి వీరి రచనల్లో ప్రత్యేకత కనిపించదు. జాగ్రత్తగా పరిశీలిస్తే తాళ్ళపాక వారి పదకవితలు తక్కిన పదకవుల రచనల కంటే స్వరూపానికి సంబంధించి కొంత భిన్నంగానే కనిపిస్తాయి.

### 1.7.2 జానపదుల ధోరణులు :

పదకవులు, వాగ్గేయకారులు చాలామంది గ్రామీణ ప్రాంతంలో నివసించిన వారే. జానపదుల సంస్కృతితో పాటు వారి గుండె చప్పుళ్ళను కూడా ఎప్పటికప్పుడు ఆకళింపుజేసుకున్నవారే. సామాన్యజనుల మధ్య సంచరించిన పదకవులు తాము చెప్పదలచుకున్న విషయాలను సామాన్య ప్రజలకు చెప్పాలనుకున్నారు. అందువల్ల వారికి ఇష్టమైన గేయరూపాలను స్వీకరించి వారికి అందుబాటులో ఉండేవిధంగా చెప్పేందుకు ప్రయత్నించారు. ఆంధ్ర వాగ్గేయకారులు కొందరి రచనల్లో జానపదధోరణులు అక్కడక్కడా కనిపించినప్పటికీ అన్నమయ్య రచనల్లో అవి విరివిగా గోచరిస్తాయి.

అన్నమయ్య నివసించిన తాళ్ళపాక ఒక పల్లెటూరు. ఆ ఊళ్ళోను, పరిసర ప్రాంతాల్లోనూ నివసించిన వారు జానపదులే. వారి సంస్కృతిని, గేయరూపాలను, వారు వ్యవహరించిన భాషను అన్నమయ్య చాలా దగ్గరగా గమనించాడు. వారికి అందుబాటులో వున్న జానపద బాణీలను అనుసరించి గేయాలు రచించాడు. తద్వారా తాను చెప్పదలచుకున్న విషయాలను వారి హృదయాల దగ్గరకు తీసుకెళ్ళాడు. ఆత్మీయతానుభూతి కలిగించాడు. అన్నమయ్య కీర్తనల్లో చాలా జానపద గేయరూపాలు కనిపిస్తాయి. వాటిలో కొన్ని - దంపుళ్ళు, గొబ్బి,

చందమామ, కోలాటం, లాలి, సువ్వి, తుమ్మెద, ఉయ్యాల, శోభన, జోల, మేల్కొలుపులు, మంగళ, కొట్నాలు, నలుగులు, అల్లోనేరేళ్ళు, కూగూలు, తందనాలు, వెన్నెలపదాలు, ఛాంగుభళాలు. ఇవేగాక పొడుపుకథల ధోరణిలో కూడా కొన్ని గేయాలు సాగాయి.

**1.7.3 భాష :**

సభాగౌరవం సంతరించుకున్న కావ్యభాష కన్నా వాగ్గేయకారుల భాష కొంత భిన్నంగా గోచరిస్తుంది. వీరు సామాన్య మానవులను దృష్టిలో పెట్టుకుని గేయాలు రచించారు. తమ హృదయంలో రూపుదిద్దుకున్న భావాలను జానపదుల చేత పలికించేందుకు ప్రయత్నించారు. కొందరయితే జానపదుల మాండలిక భాషను కూడా తమ గేయరచనకు వాడుకున్నారు.

కృష్ణమాచార్యులు పండిత భాషలోనే వచనాలు వెలయించి వాసిగాంచాడు.

యాగంటి వారి పదాల్లో అక్కడక్కడా జానపదుల భాషాచ్ఛాయలు గోచరిస్తాయి.

క్షేత్రయ్య పదాల్లో సరళ గ్రాంథికం స్థానం సంపాదించింది.

రామదాసు కీర్తనల్లో సామాన్యుల కందుబాటులో వుండే భాష వాడబడింది.

సారంగపాణి కార్వేటినగర ప్రాంతపు మాండలికాన్ని వాడాడు. ఆనాటి సామాన్య జనులు మాట్లాడుకునే భాషను కూడా తన గేయరచనకు వాడుకున్నాడు. మరోవైపు పండితభాషలో కూడా రచన సాగింది, పలువురి మెప్పులూ పొందాడు.

త్యాగరాజస్వామి పండితభాషలో రచన సాగించాడు.

తాళ్ళపాక అన్నమాచార్యుని భాషలో వాగ్గేయకారుల ధోరణులన్నీ కనిపిస్తాయి. మృదుమధుర శబ్దసమన్విత సంస్కృత భాషలోనూ అన్నమయ్య కీర్తనలు రచించాడు. పండిత భాషలోనూ అన్నమయ్య కీర్తనలెన్నో వున్నాయి. శబ్ద ప్రకృతులకు వికృతులెన్నో రూపొందించి అన్నమయ్య తన భాషలో కొత్తదనం ప్రవేశపెట్టాడు. పామరుల పాటల బాణీలను వాడుకున్నట్టే వారి భాషను కూడా విరివిగా వాడాడు. రాజంపేట మాండలికం అన్నమయ్య పాటల్లో విరివిగా

కనిపిస్తుంది. ఈ నాటికీ మహాపండితులకు కూడా అంతుపట్టని ఎన్నో పదాలు, పదబంధాలు అన్నమయ్య భాషలో వున్నాయంటే అతిశయోక్తి కాదు.

పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య అన్నమయ్యననుసరించి సంకీర్తనలు రచించినా అన్నమయ్య భాషలో కనిపించినంత వైవిధ్యం వీరి భాషలో ఉందనిపించదు.

**1.7.4 ప్రతిపాద్య విషయం :**

వాగ్గేయకారులెవరిలోనైనా వైరాగ్యదీప్తి ప్రకాశిస్తుంది. భక్తి పరిమళిస్తుంది. తాత్త్విక చింతన గోచరిస్తుంది. నీతి ప్రబోధం, లోకప్రబోధం నెలకొంటాయి. ఇష్టదేవతాస్తుతి వారి గేయాల జీవనాడి.

వైష్ణవ భక్తుడైన కృష్ణమాచార్యులు సింహాచలంలో వెలసిన వరాహనరసింహ స్వామిని వినుతించాడు. తులసిని, రాముణ్ణి కొనియాడాడు. కృష్ణమాచార్యుల రచనలన్నీ విష్ణుభక్తితోనూ, విష్ణు సంబంధిత విశేషాలతోనూ విరాజిల్లుతున్నాయి.

యాగంటి వారి పదాల్లో శివభక్తి కనిపిస్తుంది. భక్తి, నీతి, యోగ, వైరాగ్యాలకు సంబంధించిన విషయాలున్నాయి.

క్షేత్రయ్య వివిధ రాజుల మీద పదాలు రచించాడు. మువ్వలో వెలసిన గోపాలుణ్ణి ఉద్దేశించి ఎక్కువపదాలు రచించాడు. మధురభక్తి భరితాలైన పదాలే క్షేత్రయ్య నోట పల్లవించాయి. నాయికా నాయక శృంగారానికి సంబంధించిన వివిధ దశలు వీటిలో గోచరిస్తాయి.

రామదాసు రాముడి మీదనే మనస్సు నిలిపి రచనలు చేశాడు. ఈయన దృష్టిలో రాముడు శ్రీమన్నారాయణుడే. కాబట్టి విష్ణువుకు సంబంధించిన వివిధ అంశాలు ఈయన కీర్తనల్లో సముచితంగా చోటుచేసుకున్నాయి. వివిధ భక్తి మార్గాలు నీతి, వైరాగ్యాలకు సంబంధించిన అనేక అంశాలు వీటిలో కనిపిస్తాయి.

సారంగపాణి కార్వేటినగరంలో వెలసిన వేణుగోపాలస్వామి భక్తుడు. ఆ స్వామినుద్దేశించి అనేక శృంగార, అధ్యాత్మ పదాలు రచించాడు. ఈయన దేవతల మీదే గాక రాజులనుద్దేశించి కూడా గేయాలు రచించడం గమనార్హం.

త్యాగరాజ స్వామి రామభక్తుడు. ఆయన దృష్టిలో అంతా రామమయమే. త్యాగరాజ కృతుల్లో నామమహిమ, వివిధ రకాల భక్తి, వైరాగ్య ప్రబోధము, నీతి ప్రబోధము కనిపిస్తాయి. ఎందరు ఎన్ని విధాలుగా ప్రాధేయపడినప్పటికీ ఈ వాగ్గేయకార రాజు రాజుల ఆస్థానాలకు వెళ్ళలేదు. వారిని కీర్తిస్తూ రచనలు చెయ్యలేదు.

32 వేల సంకీర్తనలు రచించిన అన్నమయ్య చాలా విషయాలనే స్పృశించాడు. ఆయన కీర్తనల్లో వేంకటేశ్వర భక్తే కేంద్ర బిందువు. విష్ణువుకు సంబంధించిన వివిధ అంశాలు, వివిధ భక్తి రకాలు, వైరాగ్యం, నీతి, మధురభక్తి, తాత్త్విక విషయాలు ఈయన కీర్తనల్లో కనిపిస్తాయి. నాయికా నాయకుల దివ్యప్రణయదీప్తి అనేక కోణాలలో దర్శనమిచ్చి పాఠకులను అలరిస్తుంది.

పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య వస్తు విషయంలో కూడా అన్నమయ్యనే అనుకరించడం గమనార్హం.

### 1.7.5 మార్మికత :

వాగ్గేయకారులు తాము చెప్పదలచుకున్న అనేక విషయాలను సూటిగా చెప్పకుండా అన్యాపదేశంగా చెప్పడం అక్కడక్కడా కనిపిస్తుంది. ఇది అందరికీ అర్థం కాదు. జ్ఞానానుభూతి కలవారికి, జ్ఞానులతో సాంగత్యం కలవారికి, పెద్దల వల్ల తెలుసుకున్న వారికి మాత్రమే ఇది బోధపడుతుంది. దీన్నే మార్మికత అని వ్యవహరించవచ్చు. ఈ గేయాలను తాత్త్విక గేయాలనడం కూడా వాడుక.

యాగంటి వారి రచనల్లో ఈ తాత్త్విక గేయాలు విరివిగా చోటుచేసుకున్నాయి.

కాలజ్ఞాన పదకర్తలుగా పరిగణింపబడే బ్రహ్మంగారు, సిద్ధయ్యల గేయాల్లో అడుగడుగునా మార్మికత కనిపిస్తుంది.

సారంగపాణి పదాల్లో ఛాయామాత్రంగానే మార్మికతకు స్థానం లభించింది.

తాళ్ళపాక అన్నమాచార్యుని కీర్తనల్లో మార్మికత ఎక్కువగా కనిపిస్తుంది.

అన్నమయ్యను అనుసరించిన పెదతిరుమలయ్య పదాల్లోనూ మార్మికత వుంది. కానీ అది కూడా ఛాయామాత్రంగానే వుంది. ఈ మార్మిక తత్త్వాల్లోనూ అన్నమయ్య ప్రత్యేకత కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది.

**1.7.6 ఇతర క్షేత్ర దేవతా ప్రస్తావన** :

ఆంధ్రవాగ్గేయకారుల్లో కొందరు ఒకే క్షేత్రంలో నివసించి ఆ క్షేత్రాధీశ్వరుణ్ణే ఆరాధించారు. ఆ స్వామినే వినుతిస్తూ గేయాలు రచించి గానం చేశారు. మరికొందరు అనేక క్షేత్రాలను సందర్శించి ఆయా క్షేత్ర దేవతల పేరు మీదగా గేయాలు రచించారు.

క్షేత్రయ్య దాదాపు 18 క్షేత్రాలను దర్శించి ఆ క్షేత్ర దేవతల మీద పదాలు రచించాడు. ప్రధాన ముద్ర మువ్వగోపాలునిది కాగా తక్కిన దేవతల పేర్లతో ఉపముద్రలు క్షేత్రయ్య పదాల్లో చోటు చేసుకున్నాయి.

సారంగపాణి కార్వేటినగర పరిసర ప్రాంతంలో నెలకొన్న కొందరు దేవతల మీద పదాలు వెలయించడం గమనార్హం.

అన్నమయ్య స్వయంగా వెళ్ళి అనేక వైష్ణవ క్షేత్రాలు దర్శించాడు. ఆయా అర్చామూర్తుల ఉపముద్రలతో తిరుమల తిరుమలేశుల ప్రధానముద్రలతో వేలకొలది కీర్తనలను రచించాడు.

అన్నమయ్య కుమారుడు పెదతిరుమలయ్య పలు వైష్ణవ క్షేత్రాలను దర్శించాడు. వాటిలో శ్రీరంగం, కడప, అహోబిలం, హంపి, పండరీపురం పేర్కొదగ్గవి.

చినతిరుమలయ్య కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లోని అనేక క్షేత్రాలను దర్శించినట్టు ప్రతీతి. అందువల్ల తాళ్ళపాక వారి రచనల్లో ఇతర క్షేత్ర దేవతల ప్రస్తావన తక్కిన వారి రచనల్లో కంటే ఎక్కువగానే కనిపిస్తుంది.

### 1.7.7 ఇతర ప్రక్రియలు :

ఆంధ్రవాగ్గేయకారులు పదాలు రచించి, పాడి, పాడించి ప్రసిద్ధులైనప్పటికీ కొందరు ఇతర ప్రక్రియల్లోనూ రచనలు చేయడం గమనార్హం. ఇది వారి బుద్ధి వైభవాన్ని ఆవిష్కరించే అంశం.

రామదాసుగా ప్రసిద్ధుడైన కంచెర్ల గోపన్న 'దాశరథీ శతకం' రచించాడు.

సారంగపాణి 'వేణుగోపాల శతకము', 'ఆంధ్రగీత గోవిందము' రచించినట్టు కొందరు చెబుతారు గానీ ఇవేవీ ఆయన రచనలు కావని విమర్శకులు భావిస్తున్నారు. పైగా ఇవన్నీ అలభ్యం.

త్యాగరాజు అనేక కృతులతో పాటు వివిధ ప్రక్రియల్లోనూ రచనలు చేశాడు. ముఖ్యంగా ఆయన రచించిన సంగీత రూపకాలు పేర్కోదగ్గవి. అభినయానికి అనుకూలంగా ఉండటం వల్ల వీటిని నృత్యరూపకాలని కూడా వ్యవహరిస్తారు. అవి "ప్రహ్లాద భక్తి విజయము", "నౌకా చరిత్రము", "సీతారామ విజయము".

తాళ్ళపాక అన్నమాచార్యుడు 32 వేల సంకీర్తనలతో పాటు 'వేంకటేశ్వర శతకాన్ని', 'శృంగార మంజరిని' రచించాడు.

తాళ్ళపాక వారిలోనే గాక ఆంధ్రవాగ్గేయకారులందరిలోనూ పెద తిరుమలయ్య రచించినంత ప్రక్రియా వైవిధ్యంతో మరెవరూ రచించలేదంటే అతిశయోక్తి కాదు. ఈయన 'శతకం, దండకం, ద్విపద, రగడ, వచనం, అనువాదం' వంటి అనేక ప్రక్రియల్లో రచనలు చేశాడు.

చినతిరుమలయ్య రచించిన 'అష్టభాషా దండకం' అతని బహుముఖ వైదుష్యానికి నిదర్శనం. ఈయన తెలుగులో రచించిన 'సంకీర్తన లక్షణం' పలు ఛందస్సుల పద్యాలతో చెవులకు ఇంపుగొలుపుతుంది.

తక్కిన వాగ్గేయకారులకంటే తాళ్ళపాకవారే ఎక్కువగా ఇతర ప్రక్రియలను చేపట్టి రచనలు సాగించారు.

### 1.7.8 మార్గదర్శకత్వం :

పూర్వులు తమ ప్రవర్తన ద్వారా, బోధనల ద్వారా తర్వాతి వారికి ఉత్తమ మార్గాన్ని చూపించడం లోకసహజం. పూర్వులను గురించి వినడం ద్వారానో, వారి రచనలను చదవడం ద్వారానో తర్వాతి వారు పూర్వుల మార్గాన్ని అనుసరించి పురోగమించడం కనిపిస్తుంది. దాదాపు అన్ని రంగాల్లోనూ ఈ పద్ధతి కొనసాగుతూ వుంది. వాగ్గేయకారులకు కూడా ఇది మినహాయింపు కాదు. ఇతర వాగ్గేయకారుల కన్నా తాళ్ళపాక వారు చాలా విషయాల్లో తదనంతర వాగ్గేయకారులకు మార్గదర్శకులుగా వ్యవహరించారు.

అన్నమయ్య భక్తిలో, కైంకర్యానురక్తిలో, బోధనాదీప్తిలో, మధురభక్తి ప్రదర్శనలో, క్షేత్రపర్యటనలో, దైవస్తుతిలో, ఇతర ప్రక్రియా రచనలో తర్వాతి వారికి పరోక్షంగా మార్గదర్శకత్వం వహించాడు. పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్య కూడా అన్నమయ్యను అనుసరించి ఇతరులకు మార్గదర్శకులయ్యారు. తాళ్ళపాకవారు తదితర ఆంధ్రవాగ్గేయకారులతో సమానంగా రచనలు సాగించినప్పటికీ కొన్ని విషయాల్లో ప్రత్యేక మార్గాన్ననుసరించి ఆంధ్రవాగ్గేయ కారుల్లో అగ్రస్థానాన్ని అలంకరించారంటే అతిశయోక్తికాదు.

అన్ని ప్రక్రియల్లాగే పదకవిత కూడా క్రమంగా వికసించింది. అజ్ఞాత కర్తృకంగా జానపదుల హృదయాల్లో పల్లవించిన గేయం శాసనాల్లోనూ స్థానం పొందింది. వచనంగా, పదంగా, కీర్తనగా, కృతిగా అనేక నామరూపాలతో అలరారింది. తెలుగులో పదకవులనేకులు వెలసినప్పటికీ వారిలో తాళ్ళపాక కవులు ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారు. తాళ్ళపాక వారి కీర్తన ఎన్నో అంశాలను స్పృశించింది. వాటిలో విష్ణుదేవుని దశావతారాలు కూడా పేర్కోదగ్గవి. దశావతార విశేషాల గురించి తర్వాతి అధ్యాయంలో తెలుసుకోవచ్చు.

# పాద సూచికలు

1. ఆరుద్ర - సమగ్రాంధ్రసాహిత్యం - మొదటి సంపుటం - పుట:18
2. ఆచార్య ఎస్. గంగప్ప - తెలుగులో పదకవిత - పుట:29
3. ఆచార్య ఎస్. గంగప్ప - తెలుగులో పదకవిత - పుటలు:27, 28
4. ఆచార్య జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష - మొదటి సంపుటం - పుటలు:34, 35
5. ఆచార్య జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష - మొదటి భాగం - పుట:26
6. ఆచార్య జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష - మొదటి భాగం - పుట:26
7. ఆరుద్ర - సమగ్రాంధ్రసాహిత్యం - మొదటి సంపుటం - పుట:49
8. ఆచార్య జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష - మొదటి భాగం - పుట:29
9. ఆచార్య జి. నాగయ్య - తెలుగు సాహిత్య సమీక్ష - మొదటి భాగం - పుట:35
10. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి - తెలుగు సాహిత్య చరిత్ర - ప్రథమ భాగం - పుట:37
11. నన్నయ - శ్రీమదాంధ్రమహాభారతము - ఆదిపర్వం - 8వ ఆశ్వాసం - పద్యం:131
12. నన్నెచోడుడు - కుమారసంభవము - తృతీయాశ్వాసము - పద్యం:38
13. నన్నెచోడుడు - కుమారసంభవము - తృతీయాశ్వాసము - పద్యం:89
14. నన్నెచోడుడు - కుమారసంభవము - చతుర్థాశ్వాసము - పద్యం:112
15. నన్నెచోడుడు - కుమారసంభవము - షష్ఠాశ్వాసము - పద్యం:45
16. నన్నెచోడుడు - కుమారసంభవము - షష్ఠాశ్వాసము - పద్యం:47
17. పాల్కురికి సోమనాథుడు - బసవపురాణము (ద్విపద) - ప్రథమాశ్వాసము - పుట:9
18. పాల్కురికి సోమనాథుడు - పండితారాధ్యచరిత్ర - పద్యం:513
19. ఆచార్య బిరుదురాజు రామరాజు - తెలుగు జానపదగేయ సాహిత్యము- పుట:50
20. ఆచార్య ఎస్. గంగప్ప - తెలుగులో పదకవిత - పుట:30

21. శ్రీనాథుడు - భీమఖండం - 5వ ఆశ్వాసం - పద్యం:103
22. కృష్ణమాచార్యులు - సింహగిరి వచనములు - సంకీర్తన:1
23. కృష్ణమాచార్యులు - సింహగిరి వచనములు - సంకీర్తన:2
24. డా॥ కె. జనార్దనం - రాయలసీమ పదకవులు - పుట:43
25. డా॥ కె. జనార్దనం - రాయలసీమ పదకవులు - పుట:90,91
26. తాళ్ళపాక అన్నమాచార్యులు - అధ్యాత్మ సంకీర్తనలు- సంపుటం -1, కీర్తన:181
27. తాళ్ళపాక అన్నమాచార్యులు-శృంగార సంకీర్తనలు- సంపుటం-5 , కీర్తన:82
28. తాళ్ళపాక అన్నమాచార్యులు- అధ్యాత్మ సంకీర్తనలు-సంపుటం-1, కీర్తన:4
29. తాళ్ళపాక అన్నమాచార్యులు-శృంగార సంకీర్తనలు - సంపుటం-5, కీర్తన:39
30. తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు - శృంగార సంకీర్తనలు - సంపుటం -17, కీర్తన:245
31. తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు-అధ్యాత్మ సంకీర్తనలు - సంపుటం-15, కీర్తన:47
32. ఓ. సీతారామమ్మ - తాళ్ళపాక పెదతిరుమలయ్య కృతులు - సవిమర్శక పరిశీలన
33. పెదతిరుమలాచార్యులు - వైరాగ్య వచనమాలికా గీతాలు, 1
34. తాళ్ళపాక చినతిరుమలాచార్యులు - శృంగార సంకీర్తనలు-సంపుటం - 10, కీర్తన:47
35. తాళ్ళపాక చినతిరుమలాచార్యులు - అధ్యాత్మ సంకీర్తనలు - సంపుటం - 10, కీర్తన:42
36. క్షేత్రయ్య - క్షేత్రయ్య పదములు - పదం :118
37. రామదాసు - రామదాసు కీర్తనలు - కీర్తన :110
38. సారంగపాణి - సారంగపాణి పదములు - పదం :73, పుట:150 (పరిష్కర్త - డా॥ గల్లా చలపతి)
39. సారంగపాణి-సారంగపాణి పదములు-పురిపండా అప్పలస్వామి - పదం: 167
40. త్యాగరాజు - త్యాగరాజు కీర్తనలు - సంపుటం : 3 - కీర్తన:27
41. త్యాగరాజు - త్యాగరాజు కీర్తనలు - సంపుటం : 1- కీర్తన:133

# ౨. విష్ణుదేవుని వివిధావతారాలు - విశ్లేషణ

**2.0** ప్రతి భారతీయ భాషకు సంబంధించిన సాహిత్యంలోనూ అవతారాలకు ప్రాముఖ్యం వుంది. శ్రవ్య సాహిత్యానికి చెందిన పద్యగద్యాల్లోనే కాక, రూపక సాహిత్యంలోనూ వీటికి సముచిత స్థానం లభించింది. దశావతారాలను ఆవిష్కరించే రచనలు కొన్నైతే ఏదో ఒక అవతారాన్ని తీసుకుని విస్తృతంగా తెలియజేసే రచనలు మరికొన్ని. ఒక మాటలో చెప్పాలంటే అనువాదరూపంలో వెలువడిన పౌరాణిక సాహిత్యం అంతటిలోనూ అవతారాలకు సంబంధించిన అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి.

భక్తులు చేసే దైవస్తుతులలో దేవుని అవతారాలకు ఎంతో ప్రాధాన్యం వుంది. వారు ఆయా అవతారాల్లో భగవంతుడు నిర్వహించిన లీలలను కొనియాడుతారు. వాగ్గేయకారులు కూడా తమ కీర్తనల్లో విష్ణు దేవుని అవతారాల్ని విస్తృతంగా కీర్తించి వున్నారు. ఈ రచనలను చదివినప్పుడు భక్తులు తాము ప్రస్తావించే అవతారాలను ఏ దృష్టితో స్వీకరిస్తారో బోధపడుతుంది. హిందూ దేవతలలో విష్ణుదేవుడే ఎక్కువ అవతారాలను ధరించి లోకాలనుద్ధరించినట్లు పౌరాణిక ఐతిహాసిక వాఙ్మయం స్పష్టం చేస్తుంది. తాళ్ళపాక వారి దశావతార సంకీర్తనలను పరిశీలించే ముందు విష్ణుదేవుని వివిధావతారాల గురించి, అందునా దశావతారాల గురించి విశ్లేషణాత్మకంగా తెలుసుకోవడం సముచితం. అప్పుడే అవతారాల పట్ల సమగ్ర అవగాహన కాకపోయినా కొంతమేరకైనా సరైన అవగాహన ఏర్పడే అవకాశం వుంది. అందువల్ల విష్ణుదేవుని దశావతారాలను విశ్లేషించడమే ఈ అధ్యాయ పరమావధి.

## 2.1 అవతారం - అవగాహన :

మహిమాన్వితులైన మహనీయుల పుట్టుకను గురించి ప్రస్తావించేటప్పుడు వారు అవతరించారని చెప్పడం వాడుక. పేర్కొనబడేవారు సామాన్యులు కారనీ

వారివల్ల ప్రపంచానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందనీ అవతార శబ్ద ప్రయోగాన్ని బట్టి బోధపడుతుంది. ఇక్కడ అవతార శబ్దం విస్తృతార్థంలో వాడబడింది. ఎవరినైనా ఎద్దేవా చేసేటప్పుడు కూడా వీడు సరైన అవతారం అనడం పరిపాటి. ఆ పేర్కొనబడే వ్యక్తి తక్కిన జన సామాన్యం నుంచి వేరుపడి భిన్నంగా ప్రవర్తిస్తాడని అభిప్రాయం. అసలు అవతారం అంటే ఏమిటో తెలుసుకోవడం ఆసక్తికరంగా వుంటుంది.

అవతార శబ్దానికి ఈ విధంగా వ్యుత్పత్తి చెప్పుకోవచ్చు. "అవతారః" – 'అవ' అనేది 'ఉపసర్గ', 'తౄ' అనేది 'ధాతువు', 'అ' అనేది 'కృత్ప్రత్యయం'. ధాతువుకు ఋకారాది వృద్ధి వల్ల 'ఆర్' ఆదేశమయి అవతార శబ్దమేర్పడుతుంది. దాటడం, దాటించడం అని అవతార శబ్దానికి అర్థం. భగవంతుడు కష్టాల్లో ఉన్నవాళ్ల మధ్యకు వచ్చి వాళ్లను ఉద్ధరించడానికి ప్రయత్నించడం, తనకు తానే ఆరోపించుకున్న ఆ కష్టాలను దాటడమే గాక వాటిలో కూరుకుపోయిన ఇతరులను కూడా దాటించడం అవతారమనిపించుకుంటుంది.

### 2.1.1 అవతార నిర్వచనాలు

అవతారాన్ని పలువురు పలు రకాలుగా నిర్వచించారు. "విజ్ఞానసర్వస్వం" అవతారాన్ని గురించి విశదంగా వివరించింది.

"భారతీయుల అవతార సిద్ధాంతము చాలా విలక్షణమైనది. వివిధ కాలములందు వివిధ రూపముల ఈశ్వరుడు తన్ను తానీభూతలముపై ఆవిష్కరించుకొనునని ఈ సిద్ధాంత హృదయము. అవతారమనగా అవతరణము. క్రిందికి దిగుటయని అర్థము. ఈశ్వరుడు తన దివ్యధామము నుండి భూతలమునకు దిగి, వివిధ రూపములనెత్తి మనుజ నయన గోచరుడగుటయే అవతార కార్యము".[1]

ST. George Stock అవతార శబ్దాన్ని ఈ విధంగా నిర్వచించాడు. "The term 'incarnation' usually implies God becoming man."[2]

త్రిదండి. శ్రీ భక్తి సుధీర్‌దామోదర మహరాజ్ గారు అవతారాన్ని గురించి తమ అభిప్రాయాన్ని ఈ విధంగా వెలిబుచ్చారు.

"కళ్యాణగుణ పరిపూర్ణుడగు భగవంతుడు లోకకళ్యాణము కొఱకు అప్పుడప్పుడు అవతరించుచుండును. భగవదవతారమునకు అనేక కారణము లున్నప్పటికి దుష్ట శిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపనము ముఖ్యములు. భగవంతుడు సర్వశక్తిమంతుడు గావున తన సంకల్ప మాత్రము చేతనే దుర్జనులను సంహరింపగలడు. కావున సాధుపరిత్రాణము ముఖ్యము. దుర్జన సంహారము గౌణము. గోలోకము నందు, వైకుంఠము నందు భగవంతుడు తన పార్షదులతో నిత్యము ఏయే లీలలు చేయుచుండునో ఆ లీలలనే భక్తవత్సలుడై ఈ భూలోకమున నవతరించి జీవులను ఉద్ధరించుటకై ప్రకాశింపజేయును."[3]

డా॥ వేదవ్యాస గారి అభిప్రాయానుసారం-

"అవతారమంటే మానవుడిలోకి భగవంతుడు దిగిరావడం (అవతార మూర్తి)".[4]

నమ్మాళ్వార్ పాశురానికి తెలుగులో తాత్పర్యాన్ని సమకూరుస్తూ డా॥ సముద్రాల వేంకట రంగరామానుజాచార్యుల వారు అవతారతత్త్వాన్ని గురించి ఈవిధంగా తెలియజేశారు.

"భగవానుడు తాను అవతరించినపుడు తన అప్రాకృత దివ్య మంగళ విగ్రహమును, తన అసాధారణమైన కల్యాణగుణమును, ఆ దివ్య మంగళ విగ్రహమందలి స్వభావమును ఎంత మాత్రము విడచివేయక అవతరించుననియు, దుఃఖసాగరములో మునిగియున్న మానవులకు సజాతీయములగు జన్మలతో ఆవిర్భవించి, వారి నేత్రములకు గోచరించుచు, తనయందు ప్రీతి గల్గిన స్వాశ్రితులను తన లీలలతో అలరించుచు, వ్యామోహమును గల్గించుచు, తన ప్రతికూలతను నశింపజేసియు, తన పదత్వమును లోకమున సుస్థిరము గావించుకొనును."[5]

రెంటాల గోపాలకృష్ణ గారి అభిప్రాయంలో అవతారమంటే

"భగవంతుడు దుష్టులను శిక్షించి, సజ్జనులను రక్షించటానికీ, ధర్మాన్ని స్థాపించడానికీ భూమి మీద అవతరిస్తాడు. ఇవే భగవంతుడి అవతారాలు"[6]

ఆచార్య జక్కంపూడి మునిరత్నంగారు తమ సిద్ధాంత వ్యాసంలో అవతారాన్ని ఈ విధంగా నిర్వచించారు.

"అవతార" మంటే దిగడం. పై నుండి క్రిందికి రావడం. దేవుడు మనుష్యాది రూపములను ధరించడం అవతారమనబడుతుంది"[7]

ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు గారు తన "దశావతార తత్త్వ విశ్లేషణ" లో అవతారం గురించి ఈ విధంగా తెలియజేశారు.

"అవతరించడం అంటే ఆవిర్భవించడం. పరమపదవాసి పరమాత్మ నిత్య విభూతి నుంచి, అంటే, తన లోకం నుంచి లీలావిభూతి, అంటే, ఈ లోకానికి దిగడం అవతారం అని భావం"[8]

**2.1.2 అవతార లక్షణాలు :**

ఇంతవరకు చెప్పుకున్న అవతార నిర్వచనాలను దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తే అవతార లక్షణాలను ఈ విధంగా చెప్పుకోవచ్చు.

1. అవతారాన్ని ధరించే వ్యక్తి మానవాతీత శక్తే కానీ సామాన్య మానవుడు కాదు.
2. ఈశ్వరుడు ఏదో ఒక లక్ష్యం కోసం తనకు తానుగానే అవతారాన్ని ధరిస్తాడు.
3. దుష్ట శిక్షణ, శిష్టరక్షణ అవతార ప్రయోజనాలు.
4. భగవంతుడు ప్రజలలో భక్తిని, ధర్మానురక్తిని తన చేతల ద్వారా పెంపొందిస్తాడు.
5. సర్వేశ్వరుడు అవతారాన్ని ధరించేటప్పుడు ఆశించిన ప్రయోజనానికి అనుగుణంగా ఏరూపాన్నైనా ధరించవచ్చు.
6. భగవంతుడు తాను ధరించిన శరీరానికి అనుగుణంగా ప్రవర్తిస్తూ మానవాతీత లీలలను ప్రదర్శిస్తాడు.
7. అవతార ప్రయోజనం నెరవేరగానే దేవుడు తన అవతార రూపాన్ని ఉపసంహరించుకొని స్వస్వరూప స్థితికి చేరుకుంటాడు.

8. ఇతర దేవతల కంటే విష్ణువే ఎక్కువ అవతరాలను ధరించాడు.

9. అవతార పురుషుడు తన అవతారం ముగిశాక కూడా ప్రజల చేత ఆరాధింపబడుతూనే వుంటాడు.

10. అవతార పురుషుడు తమ ఎదుట లేకున్నా ఆయన తమను అనుగ్రహించ గలడని ప్రజలు దృఢంగా విశ్వసిస్తారు.

### 2.1.3 అవతారం రకాలు :

అవతారాలను పలురకాలుగా వర్గీకరించుకోవచ్చు. "VETTAM MANI" గారు అవతారాలను మూడురకాలుగా వర్గీకరించి వాటి స్వభావాన్ని తెలియజేశారు.

"God takes three kinds of incarnations such as avatara, avesa and amsa. That which has full power is avatāra ; that which has power only for the time being is āvesa and partial incarnation amsavatāra." [9]

భగవంతుడు మూడు రకాల అవతారాలు ధరిస్తాడు. అవి అవతారం, ఆవేశం, అంశం. అవతారంలో భగవంతుని పూర్ణశక్తి అభివ్యక్తమౌతుంది. ఆవేశంలో తాత్కాలికంగానే భగవంతుని శక్తి గోచరిస్తుంది. అంశావతారములో భగవంతుని శక్తి కొంతమాత్రమే వ్యక్తమౌతుంది.

రామకృష్ణాద్యవతారాల్ని పూర్ణావతారానికి, తాత్కాలికంగా దేవుడు ఆవేశించి మాట్లాడుతున్నాడని చెప్పబడే స్థితిని ఆవేశావతారానికి, ఆంజనేయ దూర్వాసాదు లను అంశావతారానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

త్రిదండి శ్రీ భక్తి సుధీర్ దామోదర మహరాజ్ గారు అవతారాలను ఆరు విధాలుగా వర్గీకరించి వివరించారు. వీటిలో అంతర్విభాగాలు కూడా ఉన్నాయి. ఉదాహరణలు కూడా చోటుచేసుకున్నాయి. వారు చేసిన స్థూల వర్గీకరణను మాత్రం ఇక్కడ పొందుపరచడం జరిగింది.

"భగవదవతారములు ఆరు విధములుగ విభజించిరి. అవి

(1) పురుషావతారము (2) లీలావతారము

(3) గుణావతారము (4) మన్వంతరావతారము

(5) యుగావతారము (6) శక్త్యావేశావతారము"[10]

### 2.1.4 వివిధమతాల్లో అవతారాలు :

హిందూ మతంలోనే గాక ఇతర మతాల్లోనూ అవతారాలున్నాయని కొందరు, లేవని కొందరు ఊహిస్తున్నారు. డా॥ జె. మునిరత్నం గారు తమ సిద్ధాంత గ్రంథంలో వివిధ మతాల్లోని అవతారాలను గురించి ప్రస్తావించారు.

"ఈ అవతార సిద్ధాంతం వైష్ణవులలోనే గాక ఇతర మతస్థులలో కూడా సమాదరణీయ స్థానం పొందింది. వివిధ దేవతోపాసన విచ్ఛినకర పోకడలకు దారితీసి, విశ్వశాంతికి భంగం వాటిల్లినప్పుడు పరలోకంలోని పరమపిత ప్రేరణ వల్ల జ్ఞానమే ఏసుక్రీస్తుగా అవతరించిందని క్రైస్తవులు భావిస్తారు. దేవతారాధనా విధానాన్ని సంస్కరించేందుకు, నూతన మత ధర్మాన్ని ప్రవేశపెట్టేందుకు అల్లా ప్రతినిధిగా మహమ్మద్ ప్రవక్త ఆవిర్భవించినట్లు ఇస్లాం మతావలంబకులు చెపుతారు. బ్రాహ్మణాధిక్యం పెరగడం, హింసాకాండకు దారితియ్యడం వంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తడం వల్ల గౌతమ బుద్ధుడు ప్రభవించినట్లు ప్రాజ్ఞుల విశ్వాసం."[11]

ఈ అభిప్రాయానికి భిన్నంగా డా॥ వేదవ్యాస్ గారు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. "అవతార సిద్ధాంతం ఒక్క హిందూ మతంలోనే కనిపించే ప్రత్యేకత! ఇతర మతాల్లో ఒక ప్రత్యేక సిద్ధాంతం గాని, విశిష్టత గాని, దాన్ని గురించిన వివరణ గాని, కనిపించదు! బైబిల్‌లో, ఖురాన్‌లో భగవంతుడు అవతారంగా వస్తాడన్న సిద్ధాంతాన్ని అంగీకరించరు!"[12]

ఈ రెండు భిన్నాభిప్రాయాలను దృష్టిలో ఉంచుకొని ఆలోచిస్తే ఇతర మతాల్లో అవతార సిద్ధాంతం లేదని హిందూమతంలోని అవతార సిద్ధాంత ప్రభావం వల్ల ఇతర మతాల ప్రవక్తలు, మహాపురుషులు అవతార పురుషులుగా భావింపబడేవారని అవగతమవుతుంది.

హిందూమతంలో ఆరు శాఖలున్నాయి. అవి శైవం, వైష్ణవం, శాక్తం, కౌమారం, గాణాపత్యం, శౌరం. శైవంలో బసవేశ్వరుణ్ణి అవతారపురుషుడుగానే శైవులు భావిస్తారు. శాక్తంలో ఆదిశక్తి అనేక రూపాలను ధరించి దుష్టశిక్షణ చేసిందని ప్రతీతి. కుమారస్వామి, గణపతి కూడా భక్త రక్షణలో బహురూపాలను

ధరిస్తారని చెబుతారు. వైష్ణవంలో అవతార ప్రాధాన్యం అధికంగా కనిపిస్తుంది. విష్ణుదేవుడు పలు అవతారాలను ధరించినట్టు విశ్వాసం.

## 2.2 స్థితి పంచకం :

విష్ణువు అయిదు స్థితుల్లో వుంటాడని వైష్ణవుల విశ్వాసం. ఈ అయిదు స్థితులనే స్థితిపంచకం అని వ్యవహరిస్తారు. అవి పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చ. విష్ణువు వైకుంఠంలో వుండే స్థితిని 'పర' అని, పాలసముద్రంలో శయనించే స్థితిని 'వ్యూహ' అని, అవతార ధారణను 'విభవ' అని, యోగిజన హృదయవాసాన్ని 'అంతర్యామి' అని, ఆలయాల్లో అర్చనలందుకొనే స్థితిని 'అర్చ' అని వైష్ణవులు వ్యవహరిస్తారు.

### 2.2.1 విభవ :

విష్ణుదేవుని అవతార విభవాన్ని ఆవిష్కరించేదే విభవ భగవంతుని భవాలను తెలియజేసేదే విభవ అని కూడా చెప్పుకోవచ్చు. సారాంశమేమిటంటే విభవ స్థితి విష్ణుదేవుని అవతారాలకు సంబంధించింది.

విష్ణువు లోక సంరక్షణార్థం వివిధావతారాలను ధరిస్తాడు. జన్మాదులు లేనప్పటికీ విష్ణువు తన మాయచేత తనకిష్టం వచ్చిన జన్మను ధరిస్తాడు. ఈ విషయాన్నే భగవద్గీతలో శ్రీకృష్ణుడు తెలియజేశాడు.

*॥శ్లో॥ "అజోఽపిసన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపి సన్ ।*
*ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥"* [13]

నేను చావు పుట్టువులు లేనివాడనయ్యు, పిపీలికాది బ్రహ్మ పర్యంతము గల సమస్త భూతములకును నియామకుడనయ్యు నా సంబంధమైనదియును, త్రిగుణాత్మక మైనదియునైన మాయనవలంబించి నాయిష్టమును బట్టి పుట్టుతున్నాను.

తానెప్పుడెప్పుడు అవతారాన్ని ధరిస్తాడో కృష్ణుడే స్వయంగా సెలవిచ్చాడు.

*॥శ్లో॥ "యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।*
*అభ్యుత్థానమధర్మస్య తదాఽత్మానం సృజామ్యహమ్" ॥* [14]

భరతకులోద్భవుడవగు ఓ అర్జునా! అట్లు నేనవతరించుచుండుట యెందుకనగా, ఎప్పుడు ధర్మము క్షీణిస్తుందో, అధర్మమభివృద్ధి అవుతుందో, అప్పుడు అధర్మాన్ని అణచడానికి, ధర్మాన్ని ఉద్ధరించడానికి నన్ను నేనే సృజించుకొంటాను. అంటే నేను స్వయముగా అవతరిస్తాను.

తానేఉద్దేశంతో అవతారాన్ని ధరిస్తాడో కృష్ణుడే భగవద్గీతలో తెలియ జేశాడు.

*॥శ్లో॥ "పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్ ।*
*ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" ॥* [15]

నేను సన్మార్గనిష్ఠ గలవారిని రక్షించేందుకు, సాధుసజ్జనులను బాధించేవారిని పరిమార్చడానికి, ధర్మాన్ని చక్కగా స్థాపించడానికి ప్రతి యుగంలోనూ జన్మిస్తాను. అంటే ధర్మము నశించి అధర్మము పెరిగేటప్పుడల్లా భగవంతుడు లేద భగవదాజ్ఞ పొందినవాళ్ళు అవతరిస్తారు.

**2.2.2 విష్ణుదేవుని అవతారాల సంఖ్య :**

విష్ణుదేవుడు అనంత శక్తి సంపన్నుడు. సర్వవ్యాపకుడు. జీవకోటి సముద్ధరణార్థమతడు ధరించే రూపాలు లెక్కకు లోబడేవి కావు.

*శ్లో॥ "హన్తతే కథయిష్యామి దివ్యాహ్యాత్మ విభూతయః ।*
*ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ ! నాస్త్యన్తో విస్తరస్యమే ॥"* [16]

"కురుశ్రేష్ఠా! ఓయర్జునా! నా మహత్యానికి లేక విభూతులకు అంతము లేదు. అయిన వాటిలో ముఖ్యమయినవాటిని, దివ్యమయిన వాటిని నీకు చెబుతాను." అని తెలియజేస్తూ స్థావర జంగమాదుల్లో తన అంశ ఏరూపంలో ఎక్కువగా వుందో భగవద్గీత పదవ అధ్యాయంలో కృష్ణుడే స్వయంగా తెలియ జేశాడు. దీన్ని బట్టి అతడు ధరించే రూపాలు అసంఖ్యాకాలని తేలుతూవుంది.

భాగవతం విష్ణుదేవుని అవతారాలు ఇరవయిమూడు అని స్థూలంగా పేర్కొంది. అవి.

"(1) యజ్ఞవరాహ అవతారం (2) సుయజ్ఞావతారం
(3) కపిలమహర్షి అవతారం (4) దత్తాత్రేయావతారం

(5) సనకాద్యవతారం (6) నరనారాయణావతారం

(7) ధ్రువావతారం (8) పృథుని అవతారం

(9) వృషభావతారం (10) హయగ్రీవావతారం

(11) మత్స్యావతారం (12) కూర్మావతారం

(13) నృసింహావతారం (14) ఆదిమూలావతారం

(15) వామనావతారం (16) హంసావతారం

(17) ధన్వంతరి అవతారం (18) పరశురామావతారం

(19) రామావతారం (20) కృష్ణావతారం

(21) వ్యాసావతారం (22) బుద్ధావతారం

(23) కల్క్యవతారం"

**2.2.3 దశావతార నిర్ణయం :**

విష్ణుదేవుని అసంఖ్యాకావతారాల్లో దశావతారాలు మిక్కిలి ప్రసిద్ధి వహించాయి. భక్తులు, భాగవతులు వీటినే వినుతించారు. కవులు, గాయకులు వీటినే గానం చేశారు. విష్ణుదేవుని అవతారాలంటే పదే అన్నంతగా అవి రూఢికెక్కాయి.

"ధారుణి బుద్ధ కలికి దశవిధ అవతార" [17] అని అన్నమయ్య విష్ణుదేవుని దశావతారాలను ప్రస్తావించాడు.

విష్ణుదేవుని దశావతారాలను భక్తులు, కవులు అందరూ అంగీకరించారేకానీ అవి ఏవి అనే విషయంలో మాత్రం కొంత విభేదించినట్టు గోచరిస్తుంది. దశావతారాలను పేర్కొనే ఒక శ్లోకం మూడు స్వల్ప పాఠభేదాలతో వ్యాప్తిలో ఉండడమే దీనికి ఉదాహరణ.

"మత్స్యః కూర్మో వరాహశ్చ
నారసింహశ్చ వామనః
రామోరామశ్చ రామశ్చ
బుద్ధః కల్కి రేవచ" [18]

ఈ శ్లోకంలో కృష్ణావతారానికి బదులు బలరామావతారం చోటుచేసుకుంది. తక్కిన అవతారాలన్నీ యథాతథంగానే వున్నాయి. పాఠభేదంతో కూడిన మరోశ్లోకం ఈ విధంగా వుంది.

"మత్స్యః కూర్మో వరాహశ్చ
నారసింహశ్చ వామనః
రామోరామశ్చ రామశ్చ
కృష్ణః కల్కి రేవచ" [19]

ఈ శ్లోకంలో బలరామ అవతారం, కృష్ణావతారం వున్నాయి. కానీ బుద్ధావతారం లేదు. తక్కిన అవతారాలు సక్రమంగానే చోటుచేసుకున్నాయి. మరోపాఠభేదం కూడా ఇక్కడ పరిశీలనకు తీసుకోదగి వుంది.

"మత్స్యః కూర్మో వరాహశ్చ
నారసింహశ్చ వామనః
రామోరామశ్చ కృష్ణశ్చ
బుద్ధః కల్కి రేవచ" [20]

ఈ శ్లోకంలో బలరామావతార ప్రసక్తి కనిపించదు. తక్కిన పది అవతారాలు క్రమంగా చోటుచేసుకున్నాయి. మత్స్యావతారం నుంచి రామావతారం దాకా అన్నీ అవతారాలు సమానంగానే కన్పిస్తున్నాయి. బలరామ, కృష్ణ, బుద్ధావతారాల విషయంలో మాత్రమే కొంత అభిప్రాయ భేదం గోచరిస్తుంది. కృష్ణుడు, బుద్ధుడు విష్ణుదేవుని అవతారాలు కాగా బలరామావతారం వైష్ణవాంశగా కాక శేషాంశగా పేర్కొనబడింది. బ్రహ్మదేవుడు దేవతలనుద్దేశించి మాట్లాడుతూ ఆదిశేషుడు హరికి అగ్రజుడుగా అంటే బలరాముడుగా అవతరిస్తాడని తెలియజేశాడు.

*".......హరికగ్రజుఁడై శేషుడు-హరికళతోఁబుట్టుదత్ప్రియారంభుండై"* [21]

దేవకీ దేవి ఏడవ గర్భంలో వున్న శేషాంశను తీసుకువెళ్ళి రోహిణి గర్భంలో ప్రవేశపెట్టుమని విష్ణువు యోగమాయను ఆదేశించాడు.

*"........నందగోకులమందు నున్నది; గుణగణాఢ్య!*
*దేవకి కడుపున దీపించు శేషాఖ్యమైన నాతేజ, మీవమరఁబుచ్చి,*
*నేర్పు మెఱసి, రోహిణీ దేవి కడుపున జొనుపు........"* [22]

భాగవతం తెలియజేసిన ఈ అంశాలను బట్టి బలరామావతారం విష్ణుదేవుని అవతారం కాదని తేలుతుంది. విష్ణుతేజంతో కూడిన శేషాంశ అని స్పష్టమవుతుంది. దీన్ని మినహాయిస్తే దశావతారాలను ఈ విధంగా చెప్పుకోవచ్చు.

| | |
|---|---|
| (1) మత్స్యావతారం | (2) కూర్మావతారం |
| (3) వరాహావతారం | (4) నరసింహావతారం |
| (5) వామనావతారం | (6) పరశురామావతారం |
| (7) రామావతారం | (8) కృష్ణావతారం |
| (9) బుద్ధావతారం | (10) కల్క్యవతారం |

**2.3 మత్స్యావతారం :**

విష్ణుదేవుని దశావతారాల్లో మొదటిది "మత్స్యావతారం". "భక్త రక్షణ-దుష్ట శిక్షణ" కర్తవ్యంగా పెట్టుకున్న భగవంతుడు తన ధర్మాన్ని నిర్వహించేందుకు ఏరూపాన్నైనా ధరిస్తాడని మత్స్యావతారాన్ని బట్టి తెలుస్తుంది. నష్టమైపోబోతున్న లేదా నశించబోతున్న వేద విజ్ఞానాన్ని రక్షించి అందుబాటులోకి తెచ్చిన ఘనత ఆయనదే. వేద రాశిని కాపాడడం ద్వారా సృష్టి కార్యక్రమానికి భంగం వాటిల్లకుండా విష్ణువు చూడగలిగాడు. అందువల్ల ఈ అవతారాన్ని ఆది అవతారంగానేగాక విశిష్టావతారంగా కూడా పరిగణించవచ్చు. మత్స్యావతార కథలో మత్స్యం వృత్తాంతమే గాక, సత్యవ్రతుని వృత్తాంతం కూడా వుంది.

**2.3.1 సత్యవ్రతుని వృత్తాంతం :**

పూర్వం ద్రవిళ దేశాన్ని సత్యవ్రతుడనే రాజు పాలించాడు. అతడు విష్ణుభక్తుడు. కొంత కాలానికి తన రాజ్యభారాన్ని పరిత్యజించాడు. నీరే ఆహారంగా విష్ణువునుద్దేశించి కృతమాలికా నదీ తీరంలో తపస్సు చేయసాగాడు.

ఒకనాడు సత్యవ్రతుడు నదిలో నిలబడి హరిసమర్పణంగా అర్ఘ్యమిచ్చేందుకు దోసిటితో నీరు తీసుకున్నాడు. ఒక చేపపిల్ల అతని దోసిట్లోకి వచ్చింది. రాజు దానిని నీటిలో వదిలివేశాడు. 'ఇతర పెద్దచేపల వల్లను, జాలరుల వల్లను కలిగిన భయంతో నేను నిన్ను ఆశ్రయించాను. నిర్దాక్షిణ్యంగా నన్ను నట్టేట వదలడం న్యాయం కాదు' అని చేపపిల్ల రాజును ప్రాధేయపడింది.

సత్యవ్రతుడు జాలిపడి దాన్ని కమండలంలో వుంచుకుని తన నివాసానికి తీసుకువెళ్లాడు. ఆ రాత్రికే చేప పెద్దదై కమండలము నిండిపోయింది. 'ఉండటానికి చోటుచాలకుండావుంది, మరోచోటుకు తీసుకువెళ్ళి వదులు' అని చేప రాజును కోరింది. అతడు దాన్ని ఒక కుండలో వదిలాడు. ఆ కుండ నిండిపోయింది. చేప ముహూర్త కాలంలోనే మూడు చేతుల పొడవై మరొకచోట విడువమని ప్రాధేయపడింది. రాజు దాన్ని చిన్న మడుగులో వదిలాడు. అది పెద్దదై మడుగంతా వ్యాపించింది. సత్యవ్రతుడు చేప కోరిక మేరకు దాన్నొక పెద్దమడుగులో వదిలాడు. తాను పెరగడానికి ఆ మడుగు చాలదని చేప తెలియజేయగానే సత్యవ్రతుడు ఆ మహామత్స్యాన్ని మహా సముద్రంలో వదిలిపెట్టాడు.

'పెద్ద మొసళ్ళు మ్రింగివేస్తాయి. ఇంతకాలం కాపాడి ఇప్పుడిలా సముద్రంలో వదులుతావెందుకు ఏ విధంగానైనా కాపాడు' అని మత్స్యం మహారాజుకు మనవి చేసింది. 'నువ్వు సామాన్య మత్స్యానివి కావు, చేపలకిలాంటి శరీరం వుండదు. నువ్వు ఒకరోజులో నూరు యోజనాలైనా పెరగగలవు. నువ్వు లోకాలనుద్ధ రించేందుకు వచ్చిన హరివే అని నాకనిపిస్తూవుంది. ఎందుకిలా చేస్తున్నావో చెప్పు' అని రాజు ప్రశ్నించాడు. విష్ణువంతటి వాడు ఎందుకీ రూపం ధరించాడా అనే ఆశ్చర్యం రాజు మాటల్లో వ్యక్తమైంది.

*॥కం॥ "శ్రీలలనా కుచవేదికఁ*
*గేళీ పరతంత్ర బుద్ధిఁ గ్రీడించు సుఖా*
*లోలుఁడవు; దామసాకృతి*
*నేలా మత్స్యంబవైతి; వెఱిఁగింపు హరీ!"* [23]

భూవల్లభునికి మత్స్యవల్లభుడిలా తెలియజేశాడు. 'ఈ రోజుకు ఏడవ రోజున బ్రహ్మదేవునకొక పగలు పూర్తవుతుంది. లోకాలు సముద్రంలో మునిగిపోతాయి. నా ఆజ్ఞచేత ఒక నావ వస్తుంది. ఓషధులను, విత్తనాలను అందులో వుంచి సప్తర్షులతో కలిసి నీవానావలో విహరిస్తావు. ముందేముందో కనిపించనంతగా దట్టమైన చీకటి వ్యాపిస్తుంది. నేనానావ వెనకాముందు సంచరిస్తూ దుష్టజలచరాల బారి నుంచి మిమ్మల్ని కాపాడుతాను. పడవ తల్లక్రిందులు కాకుండా నా ఆజ్ఞచేత కనిపించే పాముతో దానిని నాకొమ్ముకు

కట్టివేయండి. ఆ రాత్రి గడిచి వేకువ వచ్చేదాకా నేనీవిధంగానే సంచరిస్తాను. ఈ అవతారానికి మరోప్రయోజనం కూడా వుంది' అని హరి అంతర్హితుడయ్యాడు.

రాజుకు భవిష్యత్తును, భవిష్యత్ కార్యాచరణాన్ని తెలియజేసేందుకు విష్ణువు ఆయన దగ్గరికి వచ్చాడు. మహిమాన్వితాలైనా తన చేష్టలతో సత్యవ్రతుణ్ణి ఆకర్షించాడు. భవిష్యత్ మనువుకు కావలసిన గౌరవాన్ని ఆతనికి అపాదించేందుకు, అర్హతలను సమకూర్చేందుకు విష్ణువీవిధంగా చేసినట్టు ఊహించవచ్చు.

**2.3.2 ప్రళయరాత్రి :**

కల్పాంతం వచ్చింది. ప్రళయ వర్షాలు కురిశాయి. సముద్రాలు చెలియలి కట్టదాటి లోకాలను ముంచివేశాయి. సృష్టితో అలసిన బ్రహ్మదేవుడు కూడా నిదురించాడు. అతని ముఖాల నుంచి వేదాలు వెలువడ్డాయి. హయగ్రీవుడనే రాక్షసుడావేదాలను దొంగిలించి సముద్రగర్భంలో దాగాడు. అతనిని హతమార్చి వేదాలనుద్ధరించేందుకు, విత్తనాలు, తీగలు నీటిలో నాని చెడిపోకుండా కాపాడేందుకు విష్ణువు మత్స్యావతారం ధరించాడు.

విశ్వమంతా జలరాశితో నిండినప్పుడు జలచరంగా మాత్రమే చరించడానికి వీలుంటుంది. కాబట్టే జలధి గర్భంలో దాగిన రాక్షసుణ్ణి సంహరించేందుకు విష్ణువు మత్స్యరూపాన్ని ధరించవలసి వచ్చింది. ఇతర ప్రాణులను హింసించ గల మొసలి వంటి క్రూర జలచరాల రూపం ధరించకుండా మత్స్యం వంటి సాధు రూపాన్ని ధరించడం వల్ల విష్ణువు క్రౌర్యానికి వ్యతిరేకి అనీ, సాధు స్వభావుడనీ లోకానికి తెలియజేసినట్లయ్యింది.

కల్పాంతమయ్యేసరికి సత్యవ్రతుడు విష్ణువును సంస్మరించాడు. విష్ణు ప్రేరణతో ఒక నావ వచ్చింది. ఋషులతో కలిసి సత్యవ్రతుడానావనెక్కాడు. ఓషధులు, విత్తనాలు దానిలో వుంచబడ్డాయి. పాము త్రాటితో నావను విష్ణువు అనుగ్రహం చేత తమకు కనిపించిన చేప కొమ్ముకు కట్టివేశాడు. విష్ణువును వినుతించాడు.

మత్స్యరూపుడైన విష్ణువు ప్రసన్నుడయ్యాడు. సాంఖ్యయోగ క్రియాసహితంగా పురాణసంహితను అతనికి బోధించాడు. సత్యవ్రతుడు బ్రహ్మతత్త్వాన్ని విని బ్రహ్మానందపరవశుడయ్యాడు. అతడే హరి కరుణ చేత వివస్వంతుడనే పేరుతో

విరాజిల్లే సూర్యునికి శ్రాద్ధదేవుడనే పేరుతో కుమారుడుగా జన్మించాడు. వైవస్వతుడనే పేరుతో ఏడవ మనువయ్యాడు.

బ్రహ్మరాత్రి ముగిసి వేకువ కావచ్చింది. వేదాల ఆర్తనాదం విని మత్స్యరూపంలో వున్న విష్ణువు సరాసరి అక్కడికి వెళ్ళాడు. ఆ రాక్షసుడ్ని వధించి వేదాలను కాపాడాడు.

తెల్లవారింది. బ్రహ్మ నిద్రలేచాడు. విష్ణువు వేదాలను తీసుకువెళ్ళి ఆయనకు అందజేశాడు. బ్రహ్మ సృష్టికి ఉపక్రమించాడు.

**మత్స్యావతారానికి అయిదు ప్రయోజనాలు కన్పిస్తాయి.**

(1) తనను నిరంతరమూ నిరంతరాయంగా ఆరాధించే భక్తుణ్ణి ఆపద నుంచి కాపాడి మహోన్నత పదవి అనుగ్రహించడం.

(2) వేదరాశిని కాపాడి సృష్టి నిరంతరాయంగా సాగేందుకు దోహదం చెయ్యడం.

(3) అజేయుడు, లోకకంటకుడు అయిన రాక్షసుణ్ణి హతమార్చి అతని వల్ల లోకానికి ఉపద్రవం లేకుండా చెయ్యడం.

(4) పురాణ సంహితను బోధించి ఉత్తమ జ్ఞానాన్ని లోకానికి అందివ్వడం.

(5) తామస జన్మమెత్తినా విజ్ఞానంతో విరాజిల్లవచ్చునని విశ్వానికి విశదపరచడం. రామాది తరువాతి అవతారాలతో పోలిస్తే మత్స్యావతారం చిన్నది. కానీ కీలకమైనది అనడంలో అతిశయోక్తి లేదు.

మత్స్యావతారాన్ని దృష్టిలో పెట్టుకుని మత్స్యపురాణం వెలసింది. అష్టాదశ మహాపురాణాల్లో మత్స్యపురాణం కూడా స్థానం సంపాదించింది. మత్స్యావతారమెంత మాననీయమో దీన్ని బట్టి గ్రహించవచ్చు.

**2.4 కూర్మావతారం :**

సంఖ్యాపరంగా ఆలోచిస్తే దశావతారాల్లో కూర్మావతారం ద్వితీయం. సామర్థ్య పరంగా ఆలోచిస్తే అది అద్వితీయం. విష్ణుదేవుని సామర్థ్యమిక్కడ పలు

విధాలుగా అభివ్యక్తం కావడం వల్ల కూర్మావతారాన్ని సామార్థ్యావతారం అని కూడా వ్యవహరించవచ్చు. విష్ణువీయవతారంలో దేవదానవులిద్దరికీ సమాదరణీయుడు కావడం విశేషం. మత్స్యావతారానికి విశ్వపరిరక్షణే లక్ష్యం కాగా కూర్మావతారానికి దేవ సంరక్షణే లక్ష్యం. రెండు అవతారాలకూ కార్యక్షేత్రం సముద్రమే కావడం గమనార్హం.

కూర్మావతార ప్రస్తావన వేదాల్లో చోటుచేసుకోవడం దాని ప్రాచీనతకు నిదర్శనం. ఈ అవతారం పేరు మీదుగా కూర్మపురాణం అనే పేరుతో అష్టాదశ మహాపురాణాల్లో ఒక పురాణం రూపొందడం విశేషం. ఇది కూర్మావతార విశిష్టతను బోధపరుస్తుంది.

## 2.4.1 పుష్పహారం :

పూర్వమొకప్పుడు ఒక విద్యాధరాంగన వైకుంఠానికి వెళ్ళింది. లక్ష్మీదేవిని దర్శించి వినుతించింది. ఆమె ప్రసన్నురాలైంది. ఆనందించింది. ఆ విద్యాధరాంగనకు ఒక పుష్పహారాన్ని బహూకరించింది.

విద్యాధరాంగన ఆపుష్పహారాన్ని తీసుకొని స్వస్థలానికి బయలుదేరింది. మార్గమధ్యంలో మహర్షి దూర్వాసుడు తారసిల్లాడు. ఆమె అతనికి నమస్కరించింది. లక్ష్మీదేవి తనకిచ్చిన పూలహారాన్ని సవినయంగా, సభక్తికంగా సమర్పించింది. దూర్వాసుడాహారాన్ని పుచ్చుకొని దేవలోకానికెళ్ళాడు.

మహనీయుల మనస్సుకు ఉల్లాసం కలిగిస్తే వారి నుంచి అమూల్య ప్రతిఫలం లభించే అవకాశముందని ఈ సంఘటన బోధపరుస్తుంది.

పెద్దలను సందర్శించేటప్పుడు ఏదైనా సమర్పించి వారి మనసును రంజింపజేయడం మంచి సంస్కారం. ఇది విద్యాధరాంగనలో గోచరిస్తుంది.

## 2.4.2 మహర్షి శాపం :

దూర్వాస మహర్షి వెళ్ళినప్పుడు దేవేంద్రుడు ఐరావతాన్ని అధిరోహించి ఊరేగుతున్నాడు. మహర్షి అతన్ని సమీపించాడు. తన చేతిలో వున్న సుమమాలను ఇంద్రునికి కానుకగా ఇచ్చాడు. దేవేంద్రుడు మావటి వానిద్వారా దానినందుకొన్నాడు. ఐరావతం కుంభస్థలం మీద ఉంచాడు. ఆ ఏనుగుకు మదమెక్కింది.

తొండంతో మాలను తీసి నేల మీద వేసింది. కాలితో త్రొక్కి చిన్నాభిన్నం చేసింది. రుద్రాంశతో జన్మించిన దూర్వాసుడు ఆక్షణంలో రుద్రుడే అయ్యాడు. అతని కోపం శాపంగా వెలువడింది. సంపదల గర్వంతో దేవేంద్రుడు తనను పరాభవించాడని అతనిని అధిక్షేపించాడు. దేవతల సంపదలన్నీ సముద్రంపాలు కాగలవన్నాడు. దేవతలు శత్రుపీడకు గురికాగలరని శపించాడు.

మదం వస్తే బుద్ధిమాంద్యం వస్తుంది. నిర్లక్ష్యం కల్గుతుంది. పర్యవసానంగా నికృష్ట స్థితే మిగులుతుంది. మహనీయులను సంతోషపెడితే మంచి, వారికి సంతాపం కలిగిస్తే చెడు సంప్రాప్తిస్థాయి. దూర్వాస, దేవేంద్రుల ఉదంతం ద్వారా ఈ అంశాలు బోధపడుతాయి.

### 2.4.3 దేవతల కడగండ్లు :

ముని శాపఫలితంగా అనిమిషులు తమ సంపదలన్నిటినీ పోగొట్టుకున్నారు. నిర్వీర్యులయ్యారు. నిస్తేజులయ్యారు. రాక్షసులు వారిని సునాయాసంగా జయించి స్వర్గాన్ని ఆక్రమించారు. దేవతలను అనేక కష్టాలకు గురిచేశారు.

ప్రయాణంలో మిట్టలు, పల్లాలు వస్తున్నట్టే జీవితంలో కష్టాలు, సుఖాలు మారిమారి వస్తుంటాయి. కాలం వికటించినపుడు కష్టపరంపరే వచ్చి కలతలు రేపుతుందని దేవతల వృత్తాంతం తెలియజేస్తుంది.

### 2.4.4 ప్రయత్నం-ప్రతిఫలం :

దేవతలకు దిక్కుతోచలేదు. వారంతా వెళ్ళి బ్రహ్మనాశ్రయించారు. బ్రహ్మకు ఏంచేయాలో పాల్పోలేదు. సర్వసమర్థుడైన విష్ణువును వినుతించాడు. విష్ణువు ప్రసన్నుడయ్యాడు, ప్రత్యక్షమయ్యాడు. దేవతలను ఓదార్చాడు. దానవులతో వైరానికిది సమయం కాదన్నాడు. కాలం కలసివచ్చేదాకా ఒదిగి ఉండడం ఉచిత మన్నాడు.

॥క॥ *ఎప్పుడు దనకును సత్త్వము,*
*సొప్పుదు నందాఁక రిపులఁజూచియుఁదనమైఁ*
*గప్పికొని యుండవలయును*
*నొప్పుగ నహి మూషకమున కొదిగిన భంగిన్.*[24]

వారితో స్నేహంగా వుండవలసిన అవశ్యకతను విష్ణువు విస్పష్టం చేశాడు. దనుజ సహకారంతో క్షీరసాగర మథనం చెయ్యాలన్నాడు. తృణౌషధాలను పాలకడలిలో వేసి మందర పర్వతాన్ని కవ్వంగా, వాసుకిని త్రాడుగా ఉపయోగించి చిలికితే అమృతం లభిస్తుందన్నాడు. వస్తు సంచయం కూడా వస్తుందన్నాడు. క్షీర సముద్ర మథనం వల్ల దేవతలకు మేలు, రాక్షసులకు కీడు సంభవిస్తాయన్నాడు. దానవుల తోడ్పాటుతో పాలసముద్రాన్ని చిలికే పనికి పూనుకొమ్మని దేవతలను పురమాయించి విష్ణువు అదృశ్యమయ్యాడు.

కష్టాలు వచ్చినప్పుడు కలతచెంది మనసు జారవిడుచుకోకూడదు. వాటిని తొలగించుకొనే ఉపాయాన్ని అన్వేషించాలి. ఏదో ఒక పథకాన్ని రూపొందించుకొని బయటపడాలి. అమరుల యత్నం ఈ అంశాన్నే ఆవిష్కరిస్తుంది.

### 2.4.5 కపట స్నేహం :

దేవతలు తమ స్థానాలకువచ్చారు. బలిచక్రవర్తి నాయకత్వాన్ని అంగీకరించారు. అతనికి లోబడి వుండాలని నిశ్చయించుకున్నట్టు తెలియజేశారు. అక్కాచెల్లెండ్ర బిడ్డలమధ్య వైరం తగదన్నారు. దాని వల్ల ఇంతకుముందే ఎన్నో ఇబ్బందులపాలైయ్యామన్నారు. దేవదానవ కులాలకు బలిచక్రవర్తే తిరుగులేని రాజన్నారు. రెండు కులాలు కలిసి సుఖంగా జీవించేందుకు అమృత సంపాదనమే సులభోపాయమని దేవేంద్రుడు సూచించాడు. సురాసురులు కలిసి పాలసముద్రాన్ని మధించి అమృతాన్ని పొందాలని ప్రతిపాదించాడు. అతని ప్రతిపాదనను దానవులు కూడా అంగీకరించారు.

శత్రువులు దుస్సాధ్యులైనప్పుడు కపటోపాయంతో వారిని జయించడం రాజనీతిలో ఒక భాగం. అన్యదా శరణంలేని అమరులు కూడా ఈ విధానాన్ని ఆశ్రయించడం గమనార్హం.

### 2.4.6 పర్వత భారం :

దేవ దానవ వర్గాలు రెండూ కలిసి మందర పర్వతం చేరుకున్నారు. దాన్ని పెకలించి పైకెత్తుకునేందుకు ప్రయత్నించారు. దాని బరువును సహించలేక పోయారు. ఆ పర్వతం క్రిందబడి కొందరు మరణించారు. అందరినీ భయం ఆవహించింది. సర్వసమర్థుడైన విష్ణువు సహాయానికి రాలేదేమని విచారించారు.

విష్ణువు గరుడారూఢుడై వారిని సమీపించాడు. సురాసురులు మోయలేకమోస్తున్న మందర పర్వతాన్ని సునాయాసంగా బంతిలాగా అందుకొన్నాడు. గరుడుని వీపుమీద పెట్టాడు. అందరూ పాలకడలి చేరుకున్నారు.

ఎంతటివారి శక్తికైనా పరిమితి వుంటుందని, గర్వమెవరికీ తగదని ఈ సంఘటన సూచిస్తుంది.

**2.4.7 సముద్ర మథనం:**

దేవదానవులక్కడికి వాసుకిని రప్పించారు. అనేక విధాలుగా అతన్ని ప్రశంసించారు. అమృతంలో భాగమిస్తామని ఆశచూపారు. వాసుకిని అంగీకరింప జేసి కవ్వపు త్రాడుగా మందర పర్వతానికి చుట్టారు. పాల సముద్రాన్ని కుండగా చేసుకొని చిలకడం మొదలు పెట్టారు. మొదట అమరులు వాసుకి తలలను పట్టుకున్నారు. అసురులు తోకపట్టుకున్నారు. క్షీరసాగరాన్ని మథించడం ప్రారంభించారు. విష్ణువు మాయచేత తరువాత తమతమ స్థానాలు మార్చుకున్నారు. పాలసముద్రం చిలకడం సాగించారు. పర్వతం నీటిలో మునిగిపోయింది. సురాసురులు భయంతో నిశ్చేష్ఠులయ్యారు.

సురాసురుల శక్తిసామర్థ్యాలు మందర పర్వతాన్ని పైకి తీయడానికి ఉపయోగపడలేదు. అందరూ కింకర్తవ్యతామూఢులయ్యారు. దేవతల దుఃఖానికి మేరలేకపోయింది.

విష్ణువు వారి దుస్థితిని గమనించాడు. సముద్రంలోకి దిగాడు. కూర్మరూపం ధరించాడు. మందర పర్వతాన్ని వీపుమీద పెట్టుకుని ఉపరితలానికి తీసుకుని వచ్చాడు. దేవదానవులు అమృతాన్ని చిలకడం మళ్ళీ కొనసాగించారు.

అన్ని విధాలా ఆదుకోగల సమర్థుడ్ని ఆశ్రయిస్తే వచ్చిన చిక్కులన్నీ తొలగిపోతాయనీ, శుభాలు కలుగుతాయనీ ఈ ఉదంతం తెలియజేస్తుంది.

**2.4.8 ఈశ్వర కృప :**

పాలసముద్రం నుంచి మొదట హాలాహలం పుట్టింది. అందరూ భయపడ్డారు. శివుణ్ణి ఆశ్రయించారు. ఈశ్వరుడు దాన్ని పట్టుకొని కబళంగా చేసి మ్రింగివేశాడు.

కడుపులోకి పోనీయకుండా కంఠంలో నిలుపుకున్నాడు. లోకాలు సంతోషించాయి. క్షీరసాగర మథనం మళ్ళీ ప్రారంభమైంది.

ఈశ్వర శక్తిని లెక్కించే కొలబద్దలేదు. ఈశ్వరుడు తలచుకుంటే ఎటువంటి ఆపదనైనా ఇట్టే పోగొట్టగలడు. అభవున్ని ఆశ్రయిండం అందరికీ శ్రేయస్కరం. ఈ విషయాన్నే హాలాహల సంగ్రహణోదంతం తెలియజేస్తుంది.

**2.4.9 సాగర జన్యాలు :**

కామధేనువు, ఉచ్చైశ్రవం, ఐరావతం, కల్పవృక్షం, అప్సరస్త్రీలు, చంద్రుడు, లక్ష్మి, ధారుణి వరుసగా పుట్టారు. తరువాత అమృత కలశాన్ని పట్టుకొని ధన్వంతరి బయటకు వచ్చాడు. రాక్షసులు దేవతలను పక్కకునెట్టి బలాత్కారంగా అమృతకలశాన్ని ధన్వంతరి నుంచి లాక్కున్నారు. రాక్షసుల సంతోషానికి, దేవతల దుఃఖానికి మితిలేకుండాపోయింది.

కేవల స్వార్థపరులకు న్యాయాన్యాయ వివేచన వుండదు. ఎంత దౌర్జన్యంతోనైనా తమ పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తారు. రాక్షసుల దౌర్జన్యం ఈ అంశాన్నే బోధపరుస్తుంది.

**2.4.10 మోహిని :**

దేవతలు విష్ణువును ప్రార్థించారు. విష్ణువు మోహిని రూపం ధరించాడు. తన హావభావ విలాసాలతో రాక్షసులను వశపరచుకున్నాడు. వారు అమృతకలశాన్ని మోహినికిచ్చి అందరికీ సమానంగా పంచమన్నారు. సురాసురులు బారులుతీరి కూర్చున్నారు. మోహిని రూపంలో వున్న విష్ణువు మొదట దేవతలకు అమృతం పోశాడు. దాన్ని గమనించిన రాహువు దేవ రూపాన్ని ధరించి దేవతల వరుసలో కూర్చున్నాడు. విష్ణువతన్ని గమనించలేదు. అమృతాన్ని అతనిక్కూడా పోశాడు. సూర్యచంద్రులు అది గమనించి సైగ చేశారు. విష్ణువు తన చక్రంతో అతడి శిరస్సును ఖండించాడు. బ్రహ్మదేవుడు ఆశిరస్సును ఆకాశంలో రాహుగ్రహంగా నిలిపాడు.

దుర్మార్గులు మంచి చెబితే వినరు, మంచిగా చెబితే వినరు. అందువల్ల కపటోపాయంతోనే మంచివారికి మేలుచేయవలసి వుంటుంది. మోహిని రూపం ధరించిన విష్ణువు చర్యే దీనికి ఉదాహరణ.

కూర్మావతారం జలచరానికి సంబంధించిన విషయమైనప్పటికీ ఇది విష్ణుదేవుని బుద్ధినైశిత్యానికి, శక్తిసామర్థ్యాలకు సంబంధించిన విషయం. సర్వమూతానేయై కార్యాన్ని చక్కబెట్టిన విష్ణుమహిమను చాటే భాగవత పద్యమిక్కడ గమనించదగి వుంది.

*॥కం॥ "తరిగాంద్రలోన నొకcడcట*
*తరి కదవకుcగుదురు నాcకత్రాడcట చేరుల్;*
*దరి గవ్వంబును దానcట*
*హరి హరి! హరి చిత్రలీల హరియే యెఋcగున్"*[25]

మత్స్యావతారం లోకాలన్నిటికీ సంబంధించిన ఉపద్రవాన్ని పోగొడితే, కూర్మావతారం దేవతల ఉపద్రవాన్ని పోగొట్టేందుకు మాత్రమే పరిమితమైంది. దుష్టశిక్షణ–శిష్టరక్షణే కూర్మావతార ధ్యేయం. ఇది నెరవేరిందనే చెప్పాలి. మహాపురాణాల్లో చోటు సంపాదించిన కూర్మపురాణం కూర్మావతార విశిష్టతను కొనియాడడం గమనార్హం.

## 2.5 వరాహావతారం :

విష్ణుదేవుని దశావతారాల్లో తృతీయావతారం వరాహావతారం. మత్స్య, కూర్మావతారాలు రెండూ జలచరాలు. అవి సాగించిన కార్యకలాపాలు కూడా జలాంతర్భాగంలోనే. వరాహం భూచరమైనా జలంలోకి కూడా చొచ్చుకుపోగలదు. ఈ అవతార కార్యక్షేత్రం రసాతలం. వరాహావతారాన్ని "యజ్ఞవరాహం" అని "ఆదివరాహం" అని కూడా వ్యవహరిస్తారు.

వరాహావతార వృత్తాంతాన్ని కృష్ణుడు తన అవసానదశలో మైత్రేయమహర్షికి చెప్పాడు. తనకు అత్యంత ఇష్టుడైన విదురుడికి చెప్పమని ఆదేశించాడు. పర్యవసానంగా మైత్రేయమహర్షి విదురునికీ వృత్తాంతం చెప్పాడు. ఈ అంశాలన్నీ వరాహవృత్తాంత ప్రామాణికతను ప్రస్ఫుటం చేస్తున్నాయి.

### 2.5.1 యజ్ఞవరాహావిర్భావం :

మనువు బ్రహ్మ కుమారుడు. స్వయంభువుడైన బ్రహ్మ వల్ల ఆవిర్భవించడం చేత ఈయనను స్వాయంభువ మనువు అని వ్యవహరిస్తారు. స్వాయంభువు తన

భార్య శతరూపతో కలిసి బ్రహ్మకు నమస్కరించాడు. తన కర్తవ్యమేమిటో సెలవిమ్మన్నాడు. యజ్ఞాలు చేస్తూ ప్రజలను పాలించుమని బ్రహ్మ ప్రత్యుత్తర మిచ్చాడు. భూమి నీటిలో మునిగిపోయి రసాతలంలో వుంది. నాకు, నా కుమారులకు నివసించేందుకు స్థలం లేదు. అందువల్ల భూమిని పైకి తీసుకువచ్చే ఉపాయాన్ని ఆలోచించు అని మనువు బ్రహ్మను కోరాడు.

కుమారుడు తండ్రినడిగి తన కర్తవ్యాన్ని గురించి తెలుసుకోవడం మంచి సంప్రదాయం. తన ఇబ్బందులను తల్లిదండ్రులకు తెలియజేసి వారినుంచి సూచనలను, నివారణను పొందడం కూడా మంచి సంస్కారమే. మనువు ప్రవర్తన ఈ అంశాలనే బోధపరుస్తూవుంది. బ్రహ్మ మొరకు విష్ణువు వెంటనే స్పందించడం అతని ఆర్తత్రాణపరాయణత్వాన్ని ఆవిష్కరిస్తుంది. విష్ణు విజృంభణ అతని సత్యాధిక్యతను తెలియజేస్తుంది.

బ్రహ్మకేమి చేయాలో పాలుపోలేదు. అన్నిటికీ ఆధారమైన విష్ణువే భూమిని ఉద్ధరించేందుకు కూడా సమర్థుడనీ అతడు భావించాడు. విష్ణువును ధ్యానించాడు. విష్ణువు అంగుష్ఠమాత్ర శ్వేత వరాహ దేహంతో బ్రహ్మ ముక్కు రంధ్రం నుంచి వెలుపలికి వచ్చాడు. అంగుష్ఠమాత్ర వరాహం అంతకంతకు అధికమై ఏనుగంత ఎత్తు పెరిగింది. చూస్తున్నవారంతా ఆశ్చర్యచకితులయ్యారు. తనను ఇబ్బంది నుండి గట్టెక్కించే ఉద్దేశంతో విష్ణువే ఇలా అవతరించి విచ్చేశాడని బ్రహ్మగ్రహించాడు. ఈ విషయాన్ని అతడే ఇలా తెలియజేశాడు.

*॥కం॥ నామనమునఁగల దుఃఖ వి*
*రామముఁగావించు కొఱకు రాజీవాక్షుం*
*డీమేర "యజ్ఞపోత్రి*
*శ్రీమూర్తి" వహించె నిది విచిత్రము దలఁపన్.*[26]

ఈ ఘట్టాన్ని బట్టి విష్ణువుకు సాధ్యంకానిది ఏదీ వుండదని బోధపడుతూ వుంది. అతని అనంత సత్వం, అనితరసాధ్య క్రీడాశక్తి, ఆసక్తి అభివ్యక్తమౌతాయి. అతని పరోపకారదీక్ష, భక్త రక్షణా స్వభావం గోచరిస్తాయి.

యజ్ఞవరాహరూపంలో వున్న విష్ణువు వివిధ విధాలుగా క్రీడించాడు. బ్రహ్మాదులు చూస్తుండగానే నీటిలో ప్రవేశించాడు. అధిక సత్వంతో అనితరసాధ్యంగా

ఆదివరాహస్వామి క్రీడ అలరారింది. శ్వేత వరాహుదు సాగించిన క్రీడను పోతన కళ్ళకు కట్టేట్టు వర్ణించాడు.

॥సీ॥ తివిరి చతుర్దశ భువనంబులను దొంతు
లొరగఁగొమ్ములఁజిమ్ము నొక్కమాటు
పుత్తడికొండ మూఁపురమను నొరగంట
నొరకు రా రాపాదు నొక్కమాటు
ఖురముల సప్తసాగరముల రొంపిగా
నుక్కించి మట్టాదు నొక్కమాటు
నాభీలవాల వాతాహతిచే మింటి
నొరసి బ్రద్దలు సేయు నొక్కమాటు

॥తే॥ కన్నుఁగొనలను విస్ఫులింగములు సెదర
నురు భయంకరగతిఁదోఁచు నొక్కమాటు
పరమ యోగీంద్రజన సేవ్య భవ్య విభవ
యోగ్యమై కానఁగానగు నొక్కమాటు.[27]

వరాహరూపుడైన విష్ణువు విజృంభించాడు. వివిధ విధాలుగా క్రీడించాడు. ఏడుసముద్రాలు, పదునాలుగు లోకాలు అతని క్రీడకు ఆలవాలమయ్యాయి. ఇది విష్ణుదేవుని అనంత సత్వాన్ని ఆవిష్కరిస్తుంది. భవిష్యత్ కార్యాచరణకు అతడు తగినవాడేనని ఈ సన్నివేశం సూచిస్తుంది.

### 2.5.2 జయ విజయుల పతనం :

సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు బ్రహ్మమానస పుత్రులు. ఆది బ్రహ్మచారులు. ఆది గురువైన దక్షిణామూర్తి కటాక్షం పొందినవారు. ఎప్పుడూ ఐదు సంవత్సరాల బాల్యప్రాయంతోనే సంచరించేవారు. ఎక్కడికి వెళ్ళాలన్నా వారికి అడ్డువుండదు.

భక్తి, జ్ఞానం ఎంత శక్తిమంతమైనవో తెలుస్తూంది. భక్తి పరాకాష్ఠకు చేరుకున్న వారు ఎంత స్వేచ్ఛగా విహరించవచ్చో ఇక్కడ వెల్లడౌతూంది.

సనకాదులకు వైకుంఠం వెళ్ళాలనిపించింది. విష్ణుదర్శనం చేసుకోవాలని పించింది. వెంటనే బయలుదేరారు. వైకుంఠానికి వెళ్ళి విష్ణుదేవుని అంతఃపురంలో ప్రవేశించారు. ఆరు ద్వారాలు దాటారు. ఏడవ ద్వారం గుండా లోపలికి అడుగు పెట్టారు.

సనక సనందనాదులు దక్షిణామూర్తి శిష్యులు. శివానుగ్రహం పొందినవారు. వారు ఎక్కడికీ వెళ్లవలసిన పనిలేదు. ఏదైవాన్ని గానీ దర్శించుకోవలసిన పనిలేదు. అయినప్పటికీ వారి మనసు విష్ణుదర్శన కుతూహలంతో విరాజమానమయ్యింది. ఎంత గొప్పవారైనా భక్తిని, భగవద్దర్శనాసక్తిని వదలకూడదని సనకసనందనాదుల ప్రవర్తన జగతికి చాటుతూవుంది.

అది విష్ణుదేవుని ఏకాంత మందిరం. జగద్వినోదుడు రమావినోదుడై క్రీడించేచోటు. అక్కడ జయవిజయులనే ద్వారపాలకులుంటారు. వారికి హరిభక్తి మెండు. అందువల్ల మహిమ కూడా ఎక్కువే. ఆకారణం చేతనో ఏమో వారు ఎవరినీ లోపలికి ప్రవేశింపనీయరు. సనకాదులను కూడా జయవిజయులు అటకాయించారు. లోపలికి వెళ్ళరాదన్నారు. ఏకాంతంలో వుండటం వల్ల విష్ణుదర్శనం వీలుపడదన్నారు. బాలకులైన సనకాదులు చేస్తున్నపని సరికాదని అధిక్షేపించారు. మునులకు కోపం వచ్చింది. వారి నోటి నుంచి శాపం వచ్చింది. అసురభావం వహించి అధిక్షేపించినందువల్ల అవని మీద అసురులై జన్మించండని సనక సనందనాదులు జయవిజయులను శపించారు.

ఎంతటి ఉన్నత పదవిలో వున్నప్పటికీ గర్వం పనికిరాదు. అది సర్వమూ హరిస్తుంది. జయవిజయుల గర్వం వారి వివేచనా శక్తిని హరించింది. పర్యవసానంగా పతనం తటస్థించింది.

ద్వారపాలకులకు, ఋషులకు మధ్య చెలరేగిన వాగ్వివాదం విష్ణుదేవుని ఏకాంతాన్ని భగ్నం చేసింది. నారాయణుడు వారున్నచోటుకి వచ్చాడు. ఋషులను సాదరంగా సంభావించాడు. వారి వల్ల జరిగింది తెలుసుకున్నాడు. తన భృత్యులు చేసింది తప్పేనని అంగీకరించాడు. వారి తరపున తానే ఋషులను క్షమాపణ కోరాడు. ఋషులకు ఊరట కలిగించి పంపివేశాడు.

విష్ణువు సర్వశక్తి సంపన్నుడు. సర్వాధికుడు. మునులకు క్షమాపణ చెప్పవలసిన అవసరం లేదు. అయినా చెప్పాడు. బిడ్డలు చేసే తప్పు తల్లిదండ్రులకు, భార్య చేసే తప్పు భర్తకు, ప్రజలు చేసే తప్పు ప్రభువుకు వర్తిస్తాయని చెబుతారు. అలాగే సేవకులు చేసే తప్పులు కూడా యజమానికి వర్తిస్తాయి. ఈ దృష్టితోనే విష్ణువు మునులను క్షమాపణ కోరాడు. ప్రపంచంలోని యజమానులకు ఆదర్శప్రాయుడయ్యాడు.

జయవిజయులు విష్ణువుకు సాష్టాంగ నమస్కారం చేశారు. విష్ణువియోగం తమకు దుస్సహమన్నారు. తమను ఆదుకొమ్మని స్వామిని అర్థించారు. మాధవుడు వారిపట్ల ప్రసన్నుడయ్యాడు. వారికి ఋషుల శాపం అనుభవించక తప్పదన్నాడు. తనపట్ల వైరభావం కలిగి తనచేతనే హతులై మూడు జన్మల తర్వాత తమ స్థానాలకు చేరుకోగలరన్నాడు. వారు ఆయనకు నమస్కరించి వెళ్ళిపోయారు.

నిరంతరమూ విష్ణు సన్నిధిలో గడిపేవారు విష్ణువియోగాన్ని కొద్దిపాటిగా కూడా భరించలేరని ఈ అంశం స్పష్టంచేస్తూంది. విష్ణుదేవుని భక్త వాత్సల్యం, భృత్యు ప్రీతి వెల్లడవుతాయి.

### 2.5.3 కశ్యప సంతానం :

ప్రజాపతులలో కశ్యప ప్రజాపతికి గణనీయస్థానం వుంది. ఆయనకు అనేక మంది భార్యలు. వారిలో దితి, అదితి పేర్కోదగ్గవారు. ఒకరోజు దితి కామతాపంతో కలత చెందింది. ఆ తాపం అంతకంతకు అధికం కాగా భర్త కశ్యప మహర్షిని సమీపించి తన దుస్థితిని తెలియజేసింది. తనను మన్మథుని బారినుంచి కాపాడుమని ప్రాధేయపడింది. భర్త ఆమెను వారించాడు. అది అసుర సంధ్య వేళ కావటం చేత సంగమానికి అనుచితమన్నాడు. ఈశ్వరుడు తాండవించే వేళ కాబట్టి సంధ్యా సమయంలో సంగమమనర్థదాయకమన్నాడు. ముహూర్తకాలమాగమన్నాడు. అయినా దితి అంగీకరించలేదు. తాపం తనకు దుర్భరం కావడం వల్ల ఆలస్యం చెయ్యడానికి వీల్లేదంది. ఎట్టకేలకు కశ్యపమహర్షికి అంగీకరించక తప్పలేదు. దితి కశ్యపుల సంగమ ఫలితంగా దితి గర్భం ధరించింది. ఆమెకు పుట్టబోయే కుమారులు లోకకంటకులౌతారని కశ్యపమహర్షి దితికి

తెలియజేశాడు. ఆమె పౌత్రుని వల్ల కులముద్ధరింపబడుతుందని చెప్పాడు. దితి వంద సంవత్సరాలు గర్భం ధరించింది. నూరేళ్ళ తర్వాత దితికి ఇద్దరు కుమారులు జన్మించారు. కశ్యపుడు కుమారులిద్దరికీ జాతకర్మలు చేయించి నామకరణం చేశాడు.

కామమెంత బలీయమో, అధికకామమెంత అనర్థహేతువో ఇక్కడ వెల్లడౌతూంది. శాస్త్ర నిర్దేశాన్ని నిర్లక్ష్యం చెయ్యడమెంత ప్రమాదకరమో ప్రస్ఫుటం అవుతుంది. తన పిల్లలెలాంటి వారైనా వారిపట్ల నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని ఏ తండ్రీ ఉదాసీనం చెయ్యకూడదని కశ్యప మహర్షి ద్వారా వ్యక్తమౌతుంది.

**2.5.4 హిరణ్యాక్షుని విజృంభణ :**

మొదట పుట్టినవాడికి హిరణ్యకశిపుడనీ, తరువాత పుట్టిన వాడికి హిరణ్యాక్షుడనీ కశ్యపుడు పేరు పెట్టాడు. దితి కుమారులిద్దరూ పెద్దవారయ్యారు. బ్రహ్మను గూర్చి తపస్సు చేశారు. ఇతరులకు దుర్లభమైన వరాలను బ్రహ్మవారికి ప్రసాదించాడు. హిరణ్యాక్షుడు గొప్పవీరుడయ్యాడు. ఎవరితోనైనా యుద్ధం చెయ్యాలని అతనికనిపించింది. ప్రతివీరుల కోసం గాలింపసాగాడు. దేవలోకం వెళ్ళాడు. దేవతలు భయంతో దాక్కున్నారు. చేసేదిలేక అతడు సముద్రంలో ప్రవేశించాడు. వరుణదేవుని రాజధాని విభావరీపురం చేరుకున్నాడు. వరుణదేవుణ్ణి యుద్ధానికి పిలిచాడు. వరుణదేవుడు తనబలాన్ని, శత్రుబలాన్ని బేరీజు వేసుకున్నాడు. అప్పుడతనితో యుద్ధానికి తలపడడం సముచితం కాదనిపించింది. హిరణ్యాక్షుని దృష్టిని మరోవైపుకు మళ్ళించేందుకు ప్రయత్నించాడు. ప్రపంచంలో అతనితో యుద్ధం చేసేందుకు ఎవరూ సరిపోరన్నాడు. ఒక విష్ణువు మాత్రమే అందుకు సమర్థుడన్నాడు. అతని దగ్గరకు వెళితే హిరణ్యాక్షుడి కోరిక తీరుతుందన్నాడు.

తమకు లభించినవేవైనా వాటిని సద్వినియోగపరచు కోవడం సత్పురుషుల లక్షణం. దుర్వినియోగ పరచుకోవడం దురహంకారుల స్వభావం. ఏ విషయంలో గర్వం వచ్చినా అది ఎవరినీ తిన్నగా ఉండనీయదు. సక్రమంగా ఆలోచించనీయదు. హిరణ్యాక్షుని విషయంలో కూడా సరిగ్గా ఇదే జరిగింది. అతనిలో ప్రబలిన యుద్ధకండూతి అనేక ప్రదేశాలకు అతన్ని తిప్పించింది.

హిరణ్యాక్షుడు హరితో యుద్ధంచేసి తనయుద్ధ కండూతిని తీర్చుకోవాలను కున్నాడు. సరాసరి వైకుంఠానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో నారదుడు తారసపడ్డాడు. అసురేశుని ఆశయమేమిటో అడిగితెలుసుకున్నాడు. నారాయణుడు వైకుంఠంలో లేడన్నాడు. రసాతలంలో భూమిని ఉద్ధరించేందుకు అక్కడికి వెళ్ళాడన్నాడు. రసాతలానికి వెళితే హరితో యుద్ధం చెయ్యవచ్చన్నాడు. రాక్షసుడు యుద్ధోన్మాదంతో రసాతలంలోకి పరుగుతీశాడు.

తీవ్రమైన మంచి ఉద్దేశం కానీ, తీవ్రమైన చెడు ఉద్దేశం కానీ మనిషిలో పట్టుదలను పెంచుతాయి. తారసిల్లే కష్టాలను గానీ, పడవలసిన శ్రమనుగానీ ఖాతరు చెయ్యనీవు. హిరణ్యాక్షుడి పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదని అతని విజృంభణ అభివ్యక్తం చేస్తూంది.

విష్ణువు నీటిలో పడివున్న భూమిని తీసుకుని పైకి వస్తూ హిరణ్యాక్షుని కంటబడ్డాడు. ఆ భూమి తన అధీనంలో వుందని దానిని తీసుకుపోవడానికి వీల్లేదని హిరణ్యాక్షుడు హరిని అధిక్షేపించాడు. వరాహరూపంలో వున్న విష్ణువు రాక్షసుడి మాటలుపట్టించుకోలేదు. భూమిని తీసుకుని పైకి రాసాగాడు. హిరణ్యాక్షుడు కూడా అతడిని అనుసరించాడు. తనతో యుద్ధం చేసి గెలవకుండా భూమినలా తీసుకువెళ్ళడం సూరలక్షణం కాదని హిరణ్యాక్షుడు పలికాడు. 'దొంగలాగా తీసుకువెళ్ళడం సరికాద'న్నాడు. విష్ణువు కూడా పరుషోక్తులతో ప్రత్యుత్తరమిచ్చాడు. వట్టిమాటలు కట్టిపెట్టి యుద్ధానికి సిద్ధంకమ్మన్నాడు. తనతో యుద్ధం చేస్తే యుద్ధం చేయాలనే హిరణ్యాక్షుని కోరిక నెరవేరుతుందని విష్ణువు అతన్ని రెచ్చగొట్టాడు. యుద్ధం చెయ్యలేకుంటే వెళ్ళిపొమ్మన్నాడు.

విష్ణువు హిరణ్యాక్షుని అంతం చేసేందుకు వరాహరూపం ధరించాడు. హిరణ్యాక్షుడు విష్ణువుతో యుద్ధం చేసేందుకే వువ్విళ్ళూరుతున్నాడు. అవకాశం ఇద్దరికీ ఒకేసారి వచ్చింది. దాన్ని సద్వినియోగపరుచుకోవాలనే ఉబలాటం ఇద్దరిలోనూ యుద్ధకాంక్ష రగిలించింది.

హిరణ్యాక్షుడికి రోషం వచ్చింది. తన చేతి గదను విష్ణువు మీద ప్రయోగించాడు. విష్ణువు దానిని తన గదతో ముక్కలు చేశాడు. రాక్షసుడు మరోగదను ప్రయోగించాడు. ఇలా వారి మధ్య యుద్ధం కొనసాగింది. హరికి,

అసురారికి జరిగే యుద్ధాన్ని చూసేందుకు దేవతలు, మునులు వెంటరాగా బ్రహ్మదేవుడే స్వయంగా వచ్చాడు. తన వరబలగర్వంచేత విర్రవీగే రాక్షసుడ్ని వధించకుండా ఉపేక్షించడం తగదని వరాహస్వామికి సూచించాడు. సంధ్యా సమయం వస్తే అతని బలం పెరుగుతుందన్నాడు. ఆ తరువాత వధించడం కష్టమైపోతుందన్నాడు. వరాహమూర్తి విజృంభించాడు. గదను ప్రయోగించాడు. హిరణ్యాక్షుడు ఆ గదను ముక్కలు చేశాడు. హరి నిరాయుధుడయ్యాడు. నిరాయుధుడైన వరాహమూర్తి మీద ఆయుధాన్ని ప్రయోగించకుండా రాక్షసుడు చూస్తూ వూరకుండి పోయాడు. అతని యుద్ధనీతికి, పరాక్రమానికి హరి లోలోన ఆశ్చర్యపడ్డాడు. చక్రాన్ని స్మరించగానే అదివచ్చి అతని చేతిలో నిలిచింది. రాక్షసుడు గదను ప్రయోగించాడు విష్ణువు దానిని ముక్కలు చేశాడు. హిరణ్యాక్షుడు శూలాన్ని ప్రయోగించగా దానిని కూడా అతడు విరిచివేశాడు. రాక్షసుడు మాయను ప్రయోగించి అంధకారాన్ని సృష్టించాడు. వరాహమూర్తి తన చక్రంతో దాన్ని ఛేదించి నిర్మూలించాడు. రాక్షసుడు వరాహమూర్తితో బాహుయుద్ధానికి తలపడ్డాడు. ఇద్దరూ కొంతసేపలా పోరాటం సాగించిన తర్వాత విష్ణుదేవుడు తీవ్రమైన ముష్టిఘాతంతో దివిజారిని నొప్పించాడు. అతడు ఆ దెబ్బకు గిరగిరాతిరిగి యథాస్థితికి వచ్చాడు. వరాహమూర్తి అతనిని తన అరచేతితో గట్టిగా కొట్టాడు. రాక్షసుడు నెత్తురు కక్కుకుంటూ పడిపోయాడు. బ్రహ్మాదులు సంతోషించారు. హిరణ్యాక్షుడు హరిచేతిలో మరణించి అనితర సాధ్య సౌభాగ్యాన్ని పొందాడని కొనియాడారు.

*॥మ॥ వరయోగీంద్రులు యోగమార్గముల నెవ్వానిన్ మనోవీధిను*
*స్థిరతన్ లింగశరీర భంగమునకై చింతింతు; రాపంకజో*
*దరు పాణ్యాహతిఁ దన్ముఖాంబురుహమున్ దర్శించు చుంజచ్చెదు*
*ర్భరితోత్తంసుఁడు; దైత్యవల్లభుని సౌభాగ్యంబుదానెట్టిదో!* [28]

హిరణ్యాక్షుడు వరాహమూర్తి చేతిలో మరణించడం వల్ల యోగీంద్రులు సైతం పొందలేని మహోన్నత స్థితిని పొందాడు. మరణించేటప్పుడు విష్ణుముఖాన్ని వీక్షిస్తూ మరణించడమే ఇందుకు కారణం కావచ్చు. మరణించేటప్పుడు దేన్ని స్మరిస్తూ మరణిస్తారో తర్వాతి జన్మలో స్మరించబడే వస్తువుగా రూపాంతరం

చెందుతారని భగవద్గీత భావిస్తుంది. హిరణ్యాక్షుడు మరణిస్తూ విష్ణువునే దర్శించడం వల్ల విష్ణుపదం చేరుకున్నాడని విశ్వాసం.

దేవతలంతా వరాహస్వామిని వివిధ విధాలుగా వినుతించారు. విష్ణువు ప్రసన్నుడై వారిదగ్గర నుంచి సెలవు తీసుకొని వైకుంఠం చేరుకున్నాడు.

భగవద్భక్తి ఎంత గొప్పదో, భగవద్వైరం కూడా అంతే గొప్పదని ఇక్కడ అభివ్యక్తమౌతూవుంది. భగవద్వైరం వల్ల భగవద్భక్తులు పొందలేని సౌభాగ్యాన్ని హిరణ్యాక్షుడు పొందడమే ఇందుకు తార్కాణం.

వరాహావతారంలో విష్ణుమూర్తి లోకకంటకుడైన హిరణ్యాక్షుని వధించాడు. లోకాలను నిష్కంటకం చేశాడు. భూమిని ఉద్ధరించి సృష్టి కొనసాగేందుకు దోహదం చేశాడు. జననివాసానికి ఆధారభూతం చేశాడు. తద్వారా ప్రపంచం సక్రమంగా ప్రవర్తిల్లేందుకు హేతువేర్పడింది. ఈ దృష్ట్యా వరాహావతారానికి విశిష్ట ప్రాముఖ్య మేర్పడింది.

## 2.6 నరసింహావతారం :

ఈ విశాల విశ్వంలో ఎనభైనాలుగు లక్షల రకాల జీవరాశులున్నట్టు ప్రాచీన గ్రంథాలు తెలియజేస్తాయి. వీటిలో రెండు రూపాలు ధరించిన ఒకే ప్రాణి వుండటం అరుదు. అటువంటి ప్రాణివుంటే తక్కిన ప్రాణులకంటే దాన్ని విశిష్టంగా పరిగణించవలసి వుంటుంది. సామాన్య ప్రాణుల విషయమే ఈవిధంగా వుంటే విష్ణువు ధరించిన అవతారం సంగతి ఏమిటి? అది పరమశ్లాఘనీయంగానూ, పరమపూజనీయంగానూ పరిగణించవలసి వుంటుంది కదా !

దుష్టశిక్షణ, శిష్టరక్షణ లక్ష్యంగా శ్రీమన్నారాయణుడు ధరించిన నాలుగో అవతారం నరసింహావతారం. దీనికి ముందు ధరించిన అవతారాలకు మూలంకానీ, ఆధారంకానీ గోచరించదు. ఈ అవతారంలో స్వామి ఉక్కుస్తంభం నుంచి ఉద్భవించాడు. కొన్ని ఘడియలలోనే అవతార ప్రయోజనాన్ని నెరవేర్చుకున్నాడు. ఎవ్వరినీ దరిజేరరానంత భీకరాకారంతో విలసిల్లాడు.

ఈ అవతార విశేషాలను తెలుసుకోవడం ఎంతో ముదావహం.

### 2.6.1 హిరణ్యకశిపుని ప్రతిస్పందన :

హిరణ్యాక్షుడి మరణవార్త అతని అన్న హిరణ్యకశిపునిలో దుర్భరక్రోధాన్ని రగిలించింది. తన తమ్ముని చంపిన విష్ణువు మీద ఎలాగైనా పగతీర్చుకోవాలను కున్నాడు. పుత్రశోకంతో కుమిలిపోతున్న తల్లి దితిని ఓదార్చాడు. హిరణ్యాక్షుడికి అంత్యక్రియలు చేశాడు. అతని కుమారులైన శకుని, శంబర, కాలనాభ, మదోత్కచులను చేరదీసి ఓదార్చాడు. హిరణ్యాక్షుడి భార్యలందరినీ తన తల్లి దితి దగ్గరకు చేర్చి ఊరడించాడు. తల్లి శోకాన్ని వారిస్తూ ఈవిధంగా తెలియజేశాడు.

॥శా॥ "నీరాగార నివిష్ట పాంథుల క్రియన్ నిక్కంబు సంసార సం
చారుల్ వత్తురు; గూడి విత్తురు; సదాసంగంబు లేదొక్కచో;
శూరుల్వోయెడి త్రోవఁబోయెను భవత్పూనుండు; దల్లీ ! మహా
శూరుండాతఁడు; తద్వియోగమునకున్ శోకింప నీకేటికిన్?" [29]

ఈ పద్యం జీవితం అస్థిరత్వాన్ని బోధిస్తుంది. వీరమాత స్వభావాన్ని ఆవిష్కరిస్తుంది. దురహంకారి, అజ్ఞానావృతుడు అయిన హిరణ్యకశిపుడి చేత ఈ నీతిబోధ చేయడం విశేషం. ఇది దితినుద్దేశించి చెప్పబడినప్పటికీ లోకులకందరికీ వర్తించే పద్యం.

హిరణ్యాక్షుని మరణంతో హిరణ్యకశిపుడు నిస్తేజుడు, నిష్కర్ముడు కాలేదు. శోకసాగరమగ్నుడై నిరర్ధకంగా కాలంవెళ్ళబుచ్చలేదు. తక్షణ కర్తవ్యం గుర్తించాడు. దాన్ని నెరవేర్చాడు. ప్రతిక్రియను కూడా ఆలోచించి దానికి ఉపక్రమించాడు. బలీయమైన విఘాతం కలిగినప్పుడు ప్రతివారూ కింకర్తవ్యతా మూఢులు కాకుండా సముచితంగా స్పందించాలని హిరణ్యకశిపుని ప్రతిస్పందన విశ్వానికి సూచిస్తుంది.

### 2.6.2 హిరణ్యకశిపుని తపస్సు :

హిరణ్యకశిపుడు గొప్పబలాన్ని, శత్రువిజయాన్ని, అమరత్వాన్ని పొందాలను కున్నాడు. బ్రహ్మను గురించి మందర పర్వతం మీద నూరు దివ్యసంవత్సరాలు కఠిన తపస్సు చేశాడు. అతని తపోగ్నికి లోకాలు తట్టుకోలేక పోయాయి. దేవతలకు భయం పట్టుకుంది. బ్రహ్మదగ్గరకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. ప్రతిక్రియను ఆలోచించుమని ప్రార్థించారు. బ్రహ్మ హిరణ్యకశిపుని దగ్గరకు వచ్చాడు. అతని

తపోదీక్షను అభినందించాడు. ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. హిరణ్యకశిపుడు బ్రహ్మకు నమస్కరించాడు. భూతాలలో దేనివల్లా కూడా తనకు మృత్యువు కలుగకూడదన్నాడు. లోపల, వెలుపల, రాత్రి, పగలు, గాలిలో, నేలలో, నింగిలో, నిప్పులో, నీటిలో ఎక్కడా కూడా ఏ ఆయుధాల వల్లా, నరుల వల్ల, మృగాలవల్ల, ప్రాణం ఉన్నవాటిచేత, ప్రాణంలేనివాటిచేత, దేవతలవల్ల, దానవులవల్ల, ఉరగులవల్ల, చావు లేకుండా కోరుకున్నాడు. ఎదురులేని రాజ్యాధికారం, లోకపాలకులందర్నీ జయించేశక్తి, బలపరాక్రమాలు, అన్ని రకాల ఐశ్వర్యాలు తనకు ప్రసాదించమన్నాడు.

బ్రహ్మ సంతోషించాడు. 'దుర్లభమైన ఇటువంటి వరాలనెవ్వరూ ఇప్పటి వరకు కోరలేద'న్నాడు. 'తాను ఇలాంటి వరాలను ఎవరికీ ఇవ్వలేద'న్నాడు. హిరణ్యకశిపుడు కోరుకున్న వాటినన్నిటినీ ఇస్తున్నానన్నాడు. 'సుబుద్ధిగా, సుగుణ వంతుడిగా జాగ్రత్తగా మసలుకొమ్మ'ని హితవుచెప్పి బ్రహ్మ అంతర్హితుడయ్యాడు. కోరిన వరాలు పొందిన హిరణ్యకశిపుడు ఎంతో సంతోషంతో తన నగరానికి చేరుకున్నాడు.

ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం, దాన్ని పొందేందుకు మంచి మార్గాన్ని అవలంబించడం ప్రతివారికీ చాలామంచిది. ఎంత కఠినంగా పరిశ్రమిస్తే అంత సత్ఫలితాన్ని సాధించవచ్చు. తననుతాను తపింపజేసుకోవడం ఇతరుల సానుభూతికేగాక దైవానుగ్రహానికి కూడా పాత్రమౌతుంది. ఈ విషయంలో హిరణ్యకశిపుడు ఆదర్శవంతమైన పాత్రనే నిర్వహించాడు.

### 2.6.3 ప్రహ్లాద జననం :

హిరణ్యకశిపుడు తపస్సుకు వెళ్ళాడని తెలుసుకుని దేవతలు దానవ నగరం మీద దాడి చేశారు. రాక్షసులంతా చెల్లాచెదరై పారిపోయారు. దేవేంద్రుడు హిరణ్యకశిపుని అంతఃపురంలో ప్రవేశించి అతని భార్య లీలావతిని చెరపట్టాడు. గగనమార్గంలో ఆమెను తీసుకుపోసాగాడు. లీలావతి ఆక్రందనవిని నారదుడక్కడికి వచ్చాడు. దేవేంద్రుని వారించాడు. లీలావతి గర్భస్థ శిశువు విష్ణుభక్తుడన్నాడు. అతన్ని వధించడం శక్యం కాదన్నాడు. నారదుడు సూచన మేరకు దేవేంద్రుడు

లీలావతిని విడిచివెళ్ళాడు. నారదుడు ఆమెను తీసుకువచ్చి తన ఆశ్రమంలో ఆశ్రయం కల్పించాడు. అధ్యాత్మ విద్యను బోధించాడు. లీలావతి గర్భంలో వున్న ప్రహ్లాదుడు కూడా దాన్ని విన్నాడు. తన హృదయంలో నిక్షేపించుకున్నాడు. నారదుని ఆశ్రమంలోనే లీలావతికి ప్రహ్లాదుడు జన్మించాడు. హిరణ్యకశిపుడు వరాలు పొంది రాజధానికి తిరిగివచ్చాడని విని నారదుడు హిరణ్యకశిపుని భార్యాపుత్రులను తీసుకువెళ్ళి అతనికప్పగించాడు.

గర్భిణులకు మంచి విషయాలు చెబితే అవి వారి మీదనే గాక వారి గర్భంలో వున్న శిశువుల మీద కూడా మంచి ప్రభావాన్ని చూపిస్తాయి. అందుకే గర్భిణుల మనసుకు ఆహ్లాదాన్ని, శాంతిని కలిగించే పుస్తకాలు చదవాలనీ, శ్రావ్యమైన సంగీతం వినాలని చెబుతారు. నారదుని బోధన వల్ల ప్రహ్లాదుడు ఎక్కువ లాభాన్ని పొందడం ఈ విషయాన్నే సూచిస్తుంది.

### 2.6.4 హిరణ్యకశిపుని విజృంభణ :

వరాలు ఇస్తూ బ్రహ్మ చెప్పిన హితవును హిరణ్యకశిపుడు పెడచెవిని పెట్టాడు. తన సోదరుడైన హిరణ్యాక్షుణ్ణి వధించినందుకు శ్రీహరిమీద పగపట్టాడు. ప్రపంచంలోని అన్ని తెగలవారిని క్రూరంగా హింసింపసాగాడు. దిక్పాలకుల రాజధాని నగరాలను ఆక్రమించాడు. హిరణ్యకశిపుని ప్రతాపానికి అన్ని దిక్కులు భయభ్రాంతులు పొందాయి. హిరణ్యకశిపుడు స్వర్గాన్ని కూడా ఆక్రమించి దేవేంద్రుని సింహాసనం మీద కూర్చున్నాడు. త్రిలోకాధిపత్యం చేపట్టాడు. పలు తెగలకు చెందిన దేవతలు అతని దర్పానికి తలవంచి సేవింపసాగారు. కానుకలు సమర్పించారు. అతడు ఎప్పుడు, ఎవరికి ఏ ఉపద్రవం తెచ్చిపెడతాడోనని భయపడిచూడసాగారు. భీతావహమైన వారి దుస్థితిని బమ్మెర పోతన ఎంతో చక్కగా వర్ణించాడు.

*॥శా॥ ఏ దిక్పాలురఁజూచి నేఁడలుగునో యేదేవు బంధించునో*
*యేదిగ్భాగము మీఁద దాడిచనునో యేప్రాణులంజంపునో*
*యీ దైత్యేశ్వరుఁడంచు నొండొరులు దారింద్రాదులాస్థాన భూ*
*వేదిన్ మెల్లన నిక్కి చూతురు భయావిర్భూత రోమాంచులై* [30]

హిరణ్యకశిప విజృంభణ వల్ల నెలకొన్న అనిశ్చిత పరిస్థితిని, అప్పటి దేవతల దుస్థితిని ఈ పద్యం సవివరంగా వ్యక్తపరుస్తుంది.

రాక్షసులు దేవతలను అనేక విధాలుగా అజమాయిషీ చేశారు. భూలోకంలో మునులు నిర్వహించే యజ్ఞాలలో హవిర్భాగాలను హిరణ్యకశిపుడే స్వయంగా వచ్చి బలవంతంగా పట్టుకువెళ్ళేవాడు. దేవతలకు దక్కనిచ్చేవాడు కాడు. ఆరాజు పరిపాలనలో మూడు లోకాలు సమృద్ధిగా సస్యశ్యామలంగా వుండేవి. విధాత ఇచ్చిన వరగర్వంతో విజృంభించిన హిరణ్యకశిపుడు యథేచ్ఛగా పాలన సాగించాడు.

దేవతలు హిరణ్యకశిపుని నుంచి తమకు ఎప్పుడు విముక్తి లభిస్తుందోనని తహతహలాడారు. అందరి కష్టాలు తీర్చే విష్ణుదేవుడ్ని ప్రార్థించారు. అతడు అదృశ్యంగా వారితో మాట్లాడాడు. రాక్షసరాజు దుష్కృత్యాలు తనకు తెలుసునన్నాడు. అతనిని తానే సంహరింపనున్నట్టు చెప్పాడు. 'అప్పటి వరకు మీరు జాగ్రత్తగా కాలం గడుపుతూ ఉండండి అని' హితవు చెప్పాడు. హిరణ్యకశిపుని కొడుకు ప్రహ్లాదుణ్ణి అతడు ఎప్పుడు హింసిస్తాడో అప్పుడే అతని ఆయువు మూడుతుందని అభయమిచ్చాడు. హిరణ్యకశిపుడు మరణిస్తాడనే సంతోషంతో దేవతలంతా స్వస్థానాలకు వెళ్ళారు.

తమకు లభించిన వాటితో తృప్తిచెందడం, వాటిని సద్వినియోగ పరచి లోకక్షేమానికి దోహదం చేయడం సబబు. అయితే దుర్బుద్ధి కలవారు దానికి భిన్నంగా ప్రవర్తిస్తారు. గర్వం కన్నుకప్పగా తమకు లభించిన శక్తులతో ఇతరులను బాధపెడతారు. ఇతరుల బాధల్లో ఆనందాన్ని పొందేందుకు ప్రయత్నిస్తారు. వీరి ప్రవర్తన వల్ల లోకవ్యవస్థ, ధర్మవ్యవస్థ కూడా అస్తవ్యస్తమైపోతాయి. హిరణ్యకశిప విజృంభణ ఈవిషయాన్నే తెలియజేస్తుంది.

### 2.6.5 ప్రహ్లాదుని ప్రవర్తన :

హిరణ్యకశిపుని కుమారులలో ప్రహ్లాదుడు పేర్కొదగ్గవాడు. బాల్యం నుంచే హరిభక్తితో అలరారేవాడు. మంచి మంచి గుణాలన్నీ వచ్చి అతన్ని ఆశ్రయించాయి. రాక్షసులకు శత్రువులైన దేవతలు కూడా తమ సభలలో ప్రహ్లాదుణ్ణి కొనియాడుతూ

వుంటారు. పెద్దలపట్ల భక్తి, గురువుల పట్ల దైవభావన, నిరంతర నారాయణ స్మరణ ప్రహ్లాదుని ప్రత్యేకతలు. ప్రహ్లాదుడు ఎప్పుడూ హరిని గురించే ఆలోచిస్తూ వుండటం వల్ల ఇతరులనుగానీ, ఇతరాలను గానీ పట్టించుకునేవాడు కాదు.

ఆదర్శ సద్గుణాలు కలవారు అందరికీ ఆదరణీయులే. శత్రువులైనా వారిని ప్రశంసింపక తప్పదు. అటువంటివారు లోకారాధ్యులుగా పరిగణింపబడతారు. త్రికరణ శుద్ధితో కూడిన హరిభక్తి అలవడితే సమస్త సద్గుణాలు తమంతట తామేవచ్చి హరిభక్తుల్ని ఆశ్రయిస్తాయి. ప్రహ్లాదుడి విషయంలో కూడా ఇదే జరిగింది. ఒక రకంగా చెప్పాలంటే ప్రహ్లాదుడి జీవితం తెరిచిపెట్టిన మంచి పుస్తకమేమో అనిపిస్తుంది.

### 2.6.6 ప్రహ్లాదుని విద్యాభ్యాసం :

ప్రహ్లాదుడు హరిభక్తితో జడుడిలాగా, సోమరిలాగా, ఉండటాన్ని అతని తండ్రి హిరణ్యకశిపుడు గుర్తించాడు. విద్యాబుద్ధులతో అతన్ని తీర్చిదిద్దాలను కున్నాడు. కుమారుణ్ణి దగ్గరకు పిలిపించుకున్నాడు. చదువు ఆవశ్యకతను అతనికి తెలియజేశాడు. పోతన హిరణ్యకశిపుని చేత ప్రహ్లాదుడికి చెప్పించిన ఈపద్యం ఆయనకే కాదు అందరికీ అవదరణీయమే.

॥క॥ *చదువనివాఁడజ్ఞుండగుఁ, జదివిన సదసద్వివేక చతురత గలుగుం,*
*జదువఁగ వలయును జనులకుఁ, జదివించెదనార్యులొద్దఁజదువుము తండ్రీ!*[31]

మానవుడిని తక్కిన ప్రాణికోట్ల నుంచి వేరుచేసేది అతని సదసద్వివేకమే, ఆలోచనాశక్తే. ఇది లేకపోతే తక్కిన ప్రాణులకు మానవుడికి ఎటువంటి తేడావుండదు. అలాంటి సదసద్వివేకాన్ని చదువు సమకూరుస్తుంది. అందుకే పుట్టిన ప్రతిప్రాణీ తప్పక చదివి తీరాలని అసురేంద్రుని ఆకాంక్ష. ఇది ప్రహ్లాదుడి విషయంలోనే కాదు అందరి విషయంలోనూ వర్తిస్తుంది.

హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడికి విద్యనేర్పించే నిమిత్తం గురుపుత్రులైన చండుణ్ణి, అమర్కుడ్ని రప్పించాడు. తన కుమారుణ్ణి వారికి అప్పగించాడు. వేదశాస్త్రాది సమస్త విద్యల్లోనూ నిష్ణాతుడిగా చేసి తీసుకురమ్మన్నాడు. గురుపుత్రులు ప్రహ్లాదుణ్ణి

తీసుకువెళ్ళారు. సాటి రాక్షస విద్యార్థులతో కలిపి ప్రత్యేక శ్రద్ధతో విద్యలు నేర్పారు. గురువులు ఎలా చెబితే ప్రహ్లాదుడు అలాగే నేర్చుకున్నాడు.

తల్లిదండ్రులకు తమ పిల్లలు బాగా చదివి ప్రయోజకులు కావాలని వుంటుంది. విద్యార్థులు తమ అభిరుచికి అనుగుణంగా ఏకాగ్రతతో చదివి కృతకృత్యులవుతారు. ఈ విషయాన్నే ప్రహ్లాద విద్యాభ్యాస ఘట్టం స్పష్టపరుస్తుంది.

### 2.6.7 ప్రహ్లాదుని విద్యాపరీక్ష :

కొంత కాలానికి హిరణ్యకశిపునికి తన కుమారుడి విద్యాభ్యాస పురోగతిని గురించి తెలుసుకోవాలనిపించింది. భటులను పంపి ప్రహ్లాదుణ్ణి పిలిపించుకున్నాడు. ప్రహ్లాదుడితోపాటు గురువు కూడా వచ్చాడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి దగ్గరకు తీసుకొని 'గురువులు నీకేం చెప్పారో? నీవేమి నేర్చుకున్నావో? నాకు చెప్పు' అని కోరాడు.

ప్రహ్లాదుడు అన్నిటికంటే విష్ణుస్మరణే సర్వోత్కృష్టమైనదని చెప్పాడు. జనులు వారు–మేము అనుకుంటూ భేదబుద్ధితో అజ్ఞానంలో పడుతున్నారన్నాడు. అన్నీ విష్ణుమయమని భావించి అడవిలో వుండటమే అత్యుత్తమమన్నాడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ణి సున్నితంగా మందలించాడు. నీకీబుద్ధులు ఎవరు నేర్పారని ప్రశ్నించాడు. గిట్టనివాళ్ళు ఎవరైనా చెప్పారేమోనన్నాడు. లేదా గురువులే రహస్యంగా చెప్పివుంటారేమోనన్నాడు. విరోధిశాస్త్రాలు వల్లించడం మానుకోమన్నాడు. రాక్షసుల కుల ధర్మం దానికి భిన్నమన్నాడు. రాక్షస ధర్మాలను హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడికిలా తెలియజేశాడు.

*॥మ॥ సురలం దోలుటయో సురాధిపతులన్ స్రుక్కించుటో సిద్ధులం*
*బరివేధించుటయో మునిప్రవరులన్ బాధించుటో? యక్షకి*
*న్నర గంధర్వ విహంగ నాగపతులన్ నాశంబు నొందించుటో*
*హరియంచున్ గిరియంచునేల చెడమోహాంధుండవై పుత్రకా !* [32]

రాక్షసుల మనస్తత్వానికి, రాక్షసులు సాగించే అవాంఛనీయ దుష్కృత్యాలకు ఈపద్యం అద్దం పడుతుంది. మంచిగానీ, చెడుగానీ ఎవరికులధర్మాన్ని వారు అనుసరించడమే సముచితమని బోధపరుస్తుంది.

ప్రహ్లాదుడు తండ్రికి ప్రత్యుత్తరమివ్వలేదు. గురువువైపుకు తిరిగి ఇనుమును అయస్కాంతం ఆకర్షించినట్టు తన మనస్సును విష్ణుసన్నిధి ఆకర్షిస్తూవుందని చెప్పాడు. విష్ణువుచేత ఆకర్షింపబడిన మనస్సు మరి దేనిమీదకు వెళ్ళదని తెగేసి చెప్పాడు. గురువు ప్రహ్లాదుణ్ణి కోపించాడు. మంచిమాటలు అతని పట్ల పనిచేయవన్నాడు. కఠినంగా శిక్షించి తీసుకువస్తామన్నాడు. హిరణ్యకశిపునికి క్షమాపణ చెప్పుకున్నాడు. తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ప్రయత్నంచేశాడు. తనతో ప్రహ్లాదుణ్ణి తీసుకునివెళ్ళి అనేక విధాలుగా బుద్ధులు చెప్పాడు. చతురోపాయాలను, త్రివర్గవిద్యలను బోధించాడు. మరికొంత కాలానికి గురువు ప్రహ్లాదుణ్ణి అతని తల్లి లీలావతి దగ్గరకు తీసుకువచ్చాడు. లీలావతి కుమారుణ్ణి అలంకరించి తండ్రి దగ్గరకు పంపింది. గురువు సూచన మేరకు ప్రహ్లాదుడు తండ్రికి నమస్కరించాడు. హిరణ్యకశిపుడు సంతోషించాడు. కుమారుణ్ణి తొడ మీద కూర్చోబెట్టుకుని శిరస్సు మూర్కొన్నాడు. ప్రహ్లాదుడు నేర్చిన గ్రంథాలలో అతనికిష్టమైన ఒక పద్యాన్ని చెప్పి తాత్పర్యం చెప్పమన్నాడు.

ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడికి నవవిధ భక్తులను తెలియజేశాడు. వాటితో త్రికరణశుద్ధిగా విష్ణువును ఆరాధించి మంచిగా వుండడమే ఉత్తమమన్నాడు. విష్ణువు పట్ల మొగ్గుచూపని అవయవాలు వృధా అన్నాడు. హిరణ్యకశిపుడికి కోపం వచ్చింది. గురువును నిందించాడు. విరోధిని గురించి చెప్పాడని దోషారోపణ చేశాడు. గురువు తామెవరూ అటువంటి బుద్ధులు చెప్పలేదని హిరణ్యకశిపుడికి సవినయంగా తెలియజేశాడు. దీనికి ప్రతిక్రియ ఏదైనా ఆలోచించమన్నాడు. హిరణ్యకశిపుడు హరికథలెవరు చెప్పారో తెలియజేయవలసిందిగా ప్రహ్లాదుణ్ణి గద్దించాడు. ఎవరు చెప్పినా విష్ణుభక్తి కుదరదనీ విష్ణుభక్తిలేని జీవితం వ్యర్థమనీ ప్రహ్లాదుడు హిరణ్యకశిపునికి స్పష్టం చేశాడు. హిరణ్యకశిపునికి కోపం వచ్చింది. అతన్ని తన తొడమీద నుంచి క్రిందికి నెట్టాడు. హరి తన పిన తండ్రిని చంపాడని లేకుండా ఇతడు హరినే కొనియాడుతున్నాడన్నాడు. తండ్రియైన తనకే విరోధిగా తయారయ్యాడన్నాడు.

విద్యార్థుల విద్యాప్రమాణాలను పరీక్షించడం ఉపాధ్యాయులకే గాక తల్లిదండ్రులకు కూడా పరిపాటి. ఇది అత్యంత అవసరం కూడా. విద్యార్థి స్థితిని

గుర్తించి దాన్ని మెరుగుపరచేందుకు ఇది దోహదపడుతుంది. హిరణ్యకశిపుని కాలంలోనూ ఇటువంటి విధానం అమలులోవున్నట్టు ప్రహ్లాదుడి విద్యాభ్యాసాన్ని పరీక్షించే ఘట్టాన్ని బట్టి తెలుసుకోవచ్చు.

### 2.6.8 ప్రహ్లాదుడు ఎదుర్కొన్న కఠిన శిక్ష :

హిరణ్యకశిపుడు రాక్షసవీరులను పిలిచి ప్రహ్లాదుణ్ణి వధించండని ఆజ్ఞాపించాడు. క్రూరాకారులైన రాక్షసులతనిమీదికి విజృంభించారు. కత్తులతో, శూలాలతో పొడిచారు. కొడుతూదారుణంగా హింసించారు. ప్రహ్లాదుడు ఏ మాత్రమూ చలించలేదు. కంటనీరు పెట్టలేదు. తండ్రి రక్షణ కోరలేదు. తల్లిదగ్గరకు వెళ్ళలేదు.రాక్షసవీరుల ప్రయత్నాలన్నీ వమ్మయ్యాయి. ప్రహ్లాదుని శరీరం కందలేదు. ఎముకలు విరుగలేదు, నెత్తురురాలేదు. హిరణ్యకశిపుడు ఆశ్చర్యపడ్డాడు. ఇంకా దారుణమైన శిక్షలకు గురిచెయ్యాలనుకున్నాడు. ఏనుగుల చేత త్రొక్కించమన్నాడు. పాములచేత కరిపించమన్నాడు. అగ్నిగుండాలలో త్రోయించమన్నాడు. నడి సముద్రంలో ముంచి చంపమన్నాడు. విషం పెట్టించమన్నాడు. కత్తితో వాడ్ని నరకమన్నాడు. కొండశిఖరాలపై నుంచి క్రిందకు నెట్టివేయమన్నాడు. ఒకచోట కదలకుండా కట్టి పడవేయమన్నాడు. రాక్షసవీరులు హిరణ్యకశిపుడు చెప్పినట్టల్లా చేశారు. అయినప్పటికీ ప్రహ్లాదునిలో మార్పులేదు. ముఖకాంతి తగ్గకపోగా ఇనుమడింపసాగింది. హిరణ్యకశిపుడికిది ఆశ్చర్యం కలిగించింది. ఇదేదో దేవతా ప్రభావం అనిపించింది. ప్రహ్లాదుడు తనను ద్వేషించకపోగా ప్రేమిస్తున్నట్టే గోచరించడం అతనికి బాధ కలిగించింది.

అనాటి కఠిన శిక్షా విధానాన్ని హిరణ్యకశిపుని వైఖరి తెలియజేస్తుంది. శిక్ష విధించడంలో వయసును పరిగణనలోకి తీసుకొనేవారు కాదని తెలియ జేస్తుంది. రాక్షసుల హృదయకాఠిన్యాన్ని, శిక్షలలో వారు అవలంబించే క్రూరత్వాన్ని ఇక్కడ గ్రహించవచ్చు. హరిభక్తి కలవాడు ఎటువంటి క్రూరశిక్షనైనా సునాయాసం గానే ఎదుర్కోగలడని ఈ ఘట్టం బోధపరుస్తుంది.

### 2.6.9 ప్రహ్లాదుని ధోరణి :

హిరణ్యకశిపుడు ఏకాంతంగా విచారిస్తున్నప్పుడు గురు పుత్రులు అక్కడికి వచ్చారు. రాక్షసరాజును ప్రశంసించారు. ప్రహ్లాదుడి స్థితికి విచారించవలసిన

పనిలేదన్నారు. విద్యాబుద్ధులు నేర్పితే వయసులో మార్పువచ్చేసరికి బుద్ధిలో కూడా మార్పువస్తుందన్నారు. హిరణ్యకశిపుడికి కొంతవూరట కలిగింది. గృహస్థులకు కావలసిన ధర్మార్థ కామాలను గురించి బోధించండని పురమా యించాడు. గురుపుత్రులు ప్రహ్లాదుడికి త్రివర్గాలను గురించి బోధించారు. ముముక్షువులకు వాటి వల్ల ప్రయోజనం లేదని గ్రహించిన ప్రహ్లాదుడు అనాసక్తితోనే వాటిని నేర్చుకున్నాడు.

గురువులు తమ పనులను చేసుకోవడానికి వెళ్ళినప్పుడు తోటి రాక్షస బాలకులతో కలిసి ప్రహ్లాదుడు ఆడుకునేవాడు. వారినంతా దగ్గరకు చేర్చుకుని విష్ణుతత్వాన్ని బోధించేవాడు. గురువులు మంచివారు కాదన్నాడు. వారు చెప్పే చదువులు నిరుపయోగం అన్నాడు. జీవితం వృధా అయిపోతుందన్నాడు. విష్ణువును ఆశ్రయించి మోక్షాన్ని పొందడం సముచితం అన్నాడు. దేహతత్త్వాన్ని, ఆత్మతత్త్వాన్ని, ప్రకృతి తత్త్వాన్ని విడమరచి చెప్పాడు. నారదుడివల్ల తనకీజ్ఞానం లభించిందన్నాడు. గురువుల పుస్తకాలను వారికే అప్పగించండని హితవు చెప్పాడు. గురువులు చెప్పిన చదువులను తిరస్కరించి మాధవుడిని మనసులో నిలుపుకుని ఆడుకుందాంరండని తోటి బాలకులను ఆహ్వానించాడు.

రాక్షస బాలకుల కంటే ప్రహ్లాదుడి ధోరణి భిన్నంగా గోచరించడం అతని విశిష్ఠ వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. ప్రహ్లాదుడు గర్భస్థుడుగా ఉన్నప్పుడు నారదుడు అతనికి బోధించిన జ్ఞానాన్ని బాగా గుర్తుపెట్టుకోవడం ప్రహ్లాదుని ఏకాగ్రతకు, ధారణకు పరాకాష్ట. విద్యార్థులు ఈవిధంగా కదా ! వుండాలని లోకానికి చాటే విధంగా ప్రహ్లాదుడి ధోరణి గోచరిస్తుంది.

### 2.6.10 నరసింహావిర్భావం :

పరిస్థితిని పసిగట్టిన చండామర్కులు ప్రహ్లాదుని ప్రవర్తన గురించి రాక్షస రాజుకు ఫిర్యాదుచేశారు. హిరణ్యకశిపుడు వెంటనే ప్రహ్లాదుని రప్పించాడు. అతని చర్యలు దుండగాలుగా పరిగణించి దుయ్యబట్టాడు. ఆత్మ ప్రశంస చేసుకున్నాడు. హరినిందచేశాడు. హరి ఎక్కడున్నాడని ప్రశ్నించాడు. అన్నిచోట్లా వున్నాడని ప్రహ్లాదుడు సమాధానం చెప్పాడు. హరి సర్వాంతర్యామిత్వాన్ని చాటే ప్రహ్లాదుడి పద్యమిక్కడ పేర్కోదగివుంది.

॥కం॥ ఇందుఁగలఁడందులేఁడని, సందేహమువలదు, చక్రిసర్వోపగతుం
డెందెందువెదకి చూచిన, నందందేకలఁడు, దానవాగ్రణి! వింటే.[33]

**ఈ పద్యంలో మూడు అంశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.**

1. విష్ణుదేవుని సర్వవ్యాపకత్వం.
2. ప్రప్రథమంగా దాన్ని గురించి వినవలసిన అవశ్యకత
3. దాన్ని సునిశితంగా పరిశోధించవలసిన అవసరం.

విష్ణు దేవుడు కూడా ప్రహ్లాదుడు చెప్పినదానిని ధృవీకరించే విధంగా నరసింహాకృతి ధరించి చరాచరాలన్నిటిలోనూ నిండివున్నట్టు పోతన పద్యం తెలియజేస్తుంది. ఇది నరసింహావతార వైశిష్ట్యాన్ని ఆవిష్కరించే పద్యం కావడం విశేషం.

*॥మ॥ 'హరిసర్వాకృతులం గలం' డనుచుఁ బ్రహ్లాదుండు భాషింప స*
*త్వరుడై 'యెందును లేఁడు లేఁడ'ని సుతున్ దైత్యుండు తర్జింప శ్రీ*
*నరసింహాకృతి నుండె నచ్యుతుఁడు నానాజంగమ స్థావరో*
*త్కర గర్భంబుల నన్నిదేశముల నుద్దండ ప్రభావంబునన్.* [34]

భక్తులు చెప్పేదాన్ని ధ్రువీకరించేందుకు భగవంతుడు సిద్ధంగా వుంటాడని దీన్ని బట్టి గ్రహించవచ్చు. ఒకే ఆకారంతో అన్ని వస్తువుల్లోనూ నిండి వుండడం సామాన్యమైన పనికాదు. అది విష్ణుదేవుని మహామహిమోన్నత వైభవాన్ని బోధపరుస్తుంది.

తన ఎదుటనేవున్న స్తంభాన్ని చూపుతూ హరి ఇక్కడ కూడా ఉన్నాడా? అని హిరణ్యకశిపుడు ప్రశ్నించాడు. ఉన్నాడని ప్రహ్లాదుడు సమాధానం చెప్పాడు. హిరణ్యకశిపుడు కత్తిఝుళిపిస్తూ ప్రహ్లాదుని భయపెట్టాడు. అరచేతితో స్థంభాన్ని గట్టిగా కొట్టాడు. నరసింహస్వామి ఆవిర్భవించాడు. హిరణ్యకశిపుడు జంకాడు. అయినా వీరుడు కావడం చేత గద పుచ్చుకుని అతని మీదకు విజృంభించాడు. నరసింహుడు ఆ గదనుంచి లాఘవంగా తప్పించుకున్నాడు. హిరణ్యకశిపుని ఒడిసిపట్టుకున్నాడు. హిరణ్యకశిపుడు కొంతసేపు నరహరితో యుద్ధం చేశాడు. నరకేశరి హిరణ్యకశిపుణ్ణి ద్వార ప్రదేశానికి తీసుకువెళ్ళాడు. అప్పటికే సాయం

సమయం వచ్చింది. నరసింహుడు హిరణ్యకశిపుణ్ణి తన తొడల మీద వేసుకుని తన వాడిగోళ్ళతో పొట్ట చీల్చిచంపాడు. అతని ప్రేవులను బయటకి లాగి జంద్యాలుగా వేసుకున్నాడు. రాక్షసరాజు రక్తాన్ని జుర్రుకున్నాడు. సింహాసనం మీద కూర్చున్నాడు.

రాక్షసరాజు మరణించడంతో బ్రహ్మ, రుద్ర, దేవేంద్రాదులక్కడికి వచ్చారు. లక్ష్మీదేవి కూడా వచ్చింది. నరసింహమూర్తి రౌద్రాకారాన్ని చూసి ఎవరూ సమీపించలేకపోయారు. దేవతలు లక్ష్మీదేవిని వెళ్ళమని ప్రార్థించారు. లక్ష్మీదేవి ఆ భీకరాకారాన్ని చూసి భయపడి సమీపించలేకపోయింది. బ్రహ్మసూచన మేరకు ప్రహ్లాదుడు నరసింహుని దగ్గరకు వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేశాడు. విష్ణువతనిని ఆదరించి అతని తలమీద తనచేతిని వుంచి ఆశీర్వదించాడు. వరం కోరుకో మన్నాడు. ప్రహ్లాదుడు నిరంతరం హరిభక్తినే కోరుకున్నాడు. తన తండ్రిపాప విముక్తిని కోరాడు. వారి వంశంలో ఇరవైఒక్క తరాలవారికి పాపముండదని విష్ణువు అతనిని అనుగ్రహించాడు. అంతర్హితుడయ్యాడు. బ్రహ్మాదులు ప్రహ్లాదుడికి పట్టాభిషేకం చేసి స్వస్థానాలకు వెళ్ళారు.

విష్ణువు బ్రహ్మకంటే అధికుడు. అయినప్పటికీ బ్రహ్మ ఇచ్చిన వరాన్ని, దాని ప్రభావాన్ని ఒమ్ముచేయదలచుకోలేదు. తన ప్రభావంతో దాని ప్రభావాన్ని రూపుమాపనూలేదు. తమ ప్రభావం మొక్కబోకుండా ఎలా వుండాలనుకుంటారో ఎదుటివారి ప్రభావం కూడా అలాగే వుండాలని భావించడం మంచి వారి లక్షణం. విష్ణువిక్కడ అటువంటి విధానాన్నే అవలంబించాడు. తన శత్రువు కుమారుణ్ణి కరుణించడమేగాక అతని పరలోక క్రియలకు కూడా ఏర్పాటుచేశాడు. ఇది శ్లాఘనీయం.

నరసింహావతారం స్వల్పకాలానికే పరిమితమైనప్పటికీ ఒక ఆదర్శ భక్తుని చరిత్రను ఆవిష్కరించింది. ప్రతివారూ ఆదర్శభక్తిని అలవరచుకోవాలని ప్రబోధించింది. భగవచ్చింతనామయంగా కాలం గడిపే భక్తులకు భగవంతుడి దయ ఎప్పుడూ వుంటుందని సూచించింది. భగవద్దాసులు తాత్కాలికంగా ఇబ్బంది పడ్డప్పటికీ చివరికి వారి జీవితాలు విజయవంతాలవుతాయని విస్పష్టంచేసింది.

## 2.7 వామనావతారం :

పరోపకారమే ప్రధాన లక్ష్యంగా కలిగి పరిఢవిల్లిన విష్ణుదేవుడి అవతారమే వామనావతారం. ఇతరులకు వచ్చిన ఇబ్బందులను పోగొట్టడంలో ఎటువంటి ఇబ్బందినైనా సహించడానికి సంసిద్ధం కావడం సామాన్యమైన పని కాదు. ఇది మాటలకందని మంచిపని. దీనినే శ్రీమహావిష్ణువు నిర్వర్తించాడు. అందరికీ అనుసరణీయుడయ్యాడు. అభినందనీయుడయ్యాడు. ఎంత చిన్న వ్యక్తి అయినా పరోపకారంతో మహోన్నతుడౌతాడని తన చర్యల ద్వారా నిరూపించాడు.

విష్ణువింత వరకు ధరించిన అవతారాలకు మాతృగర్భం ఆవశ్యకత లేదు. విష్ణుదేవుని అవతారాలలో వామనావతారమైదవదైనప్పటికీ విష్ణువు తల్లిగర్భంలో ప్రవేశించి ఆవిర్భవించిన మొదటి అవతారమిదే. ఉపనయనాదులను చేయించుకుని స్వయంగా కర్మకాండకు శ్రీకారం చుట్టిన మొదటి అవతారం కూడా ఇదే. తాను సంపాదించిన పదవిని, ఆస్తిని నిస్వార్ధంగా అగ్రజునకు సమర్పించిన అవతారం కూడా ఇదే. ఈ కారణాల వల్ల వామనావతారానికెంతో విశిష్టత చేకూరింది.

### 2.7.1 బలివిజృంభణ :

ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. విరోచనుని కొడుకు బలి. విరోచనుడు మరణించాక ప్రహ్లాదుడు  బలిచక్రవర్తిని దానవ రాజ్యానికంతా చక్రవర్తిగా చేశాడు. దానవులు దేవతల మీదికి యుద్ధానికి వెళ్ళారు. దేవదానవుల యుద్ధం ఘోరంగా జరిగింది. అమృత ప్రభావం వల్ల దేవతలు మరణించలేదు. రాక్షసుల మీదికి విజృంభించి  వీరవిహారం చేశారు. రాక్షసులు చాలామంది మరణించారు. కొందరు బ్రతుకు జీవుడా అనుకొని పలాయనం చిత్తగించారు. అలావెళ్ళిన కొందరు రాక్షస గురువు శుక్రాచార్యుణ్ణి శరణుజొచ్చారు. శుక్రుడు తన మృతసంజీవనీ విద్యాప్రభావంతో చనిపోయిన రాక్షసులను బ్రతికించాడు.

శత్రువిజయ కాంక్షతో బలి శుక్రుణ్ణి ఆశ్రయించాడు. భక్తితో సేవించాడు. శుక్రాచార్యుడు ప్రసన్నుడయ్యాడు. బలిచేత 'విశ్వజిత్' అనే యజ్ఞం చేయించాడు. యజ్ఞగుండం నుంచి బంగారు వస్త్రాలు కప్పిన రథం, సూర్యుని గుఱ్ఱాల వంటి గుఱ్ఱాలు, సింహపు జెండా, గొప్పవిల్లూ, అంపపొదల జంటా, కవచమూ

లభించాయి. ప్రహ్లాదుడు వాడని కమలహారం ఇచ్చాడు. చంద్రుడు తెల్లని శంఖం ఇచ్చాడు. బలి బ్రహ్మను గురించి తపస్సు చేసి విష్ణుభక్తి, ధర్మప్రీతి, త్రిభువన ప్రభుత్వం వరాలుగా పొందినట్టు గూడా కొందరు చెబుతారు.

బలి రాక్షస సైన్యంతో స్వర్గాన్ని ఆక్రమించాడు. బృహస్పతి సలహామేరకు దేవతలక్కడనుంచి తప్పుకున్నారు. బలిచక్రవర్తి దేవేంద్రుడి సింహాసనం అధిష్టించి త్రిలోకపాలన సాగించాడు. అతని పరిపాలనలో ధర్మం నాలుగుపాదాల మీద నడిచింది. భార్గవులతనిచేత నూరు అశ్వమేధయాగాలు చేయించారు.

దౌర్జన్యంగా ఇతరుల ఆస్తులను కబళించడం తాత్కాలికంగా లాభమే అనిపించినా దీర్ఘకాల ప్రయోజనం దానికుండదు. చివరికి దాని వల్ల ముప్పే చేకూరుతుంది. జయాపజయాలు దైవాధీనాలు. కష్టాలు వచ్చినప్పుడు క్రుంగి పోకూడదు, సుఖాలు వచ్చినప్పుడు పొంగిపోకూడదు. ఆపదలు వచ్చినప్పుడు తాత్కాలికంగా తలదాచుకుని ఆపైన ఒక పథకం ప్రకారం విజయాలు పొందే ప్రయత్నం చెయ్యడం వివేకం. ఈ అంశాన్నే బలివిజృంభణ ఉదంతం తెలియ జేస్తుంది.

### 2.7.2 అదితి ఆవేదన :

దేవతలంతా అమరావతిని విడిచి వెళ్ళి తమకు అనుకూలమైన విధంగా తలదాచుకున్నారు. దేవతలు పడుతున్న కష్టాలకు దేవమాత అదితి ఎంతగానో విచారించింది. భర్త కశ్యపుడు తనను చూడవచ్చినప్పుడు తన ఆవేదనను అతనికి నివేదించింది. దేవతలు కష్టాలనుంచి గట్టెక్కే విధానాన్ని ఆలోచించమంది. కశ్యపుడు అంతా విష్ణు సంకల్పానుసారమే జరుగుతుందని ఆమెను ఓదార్చాడు. కశ్యపుడు విష్ణుమాయా విలసనం గురించి అదితికి చెప్పిన విషయం అందరూ గ్రహించదగి వుంది.

*॥మ॥ జనకుండెవ్వఁడు ? జాతుఁడెవ్వఁడు ? జనిస్థానంబు లెచ్చోటు? సం*
*జననం బెయ్యది? మేను లేకాలది ? సంసారంబు లేరూపముల్?*
*వినుమాయింతయు విష్ణుమాయ దలఁపన్వేఱేమియున్ లేదు; మో*
*హ నిబద్ధంబు నిదానమింతటికి జాయా; విన్నఁబో నేటికిన్?* [35]

తల్లిదండ్రులు, పిల్లలు, శరీరాలు, సంసారము ఇవన్నీ భ్రాంతితో కూడినవే కానీ వాస్తవాలూ కావు, శాశ్వతాలూ కావు. ఇవన్నీ విష్ణుమాయచేత కల్పింప బడినవేగానీ స్వయం వ్యక్తకాలు, ప్రవర్తకాలు కావు. అందువల్ల దేవతలపట్ల పుత్రవ్యామోహం అర్ధరహితమని కశ్యప ప్రజాపతి తన భార్య అదితికి సూచించాడు.ప్రపంచంలో అనేక మానవ సంబంధాలున్నప్పటకీ జనకజాత సంబంధాన్ని మాత్రమే ఇక్కడ ప్రస్తావించడం విశేషం. అదితి తన కుమారుల దైన్యాన్ని కశ్యపుని దృష్టికి తీసుకురావడం వల్ల ఈ సంబంధాన్ని గురించి మాత్రమే ప్రస్తావించడం ఎంతో సమంజసంగా వుంది.

అదితి కోరికమేరకు కశ్యపుడామెకు పయోభక్షణ వ్రతాన్ని మంత్ర పురస్సరంగా, సాంగోపాంగంగా ఉపదేశించాడు. ఈ వ్రతంతో విష్ణువును ఆరాధించి సాఫల్యం పొందమన్నాడు. అదితి ఫాల్గుణ శుక్లపాఢ్యమి నాడు వ్రతాన్ని ప్రారంభించి నియమ పూర్వకంగా నిర్వర్తించింది. ద్వాదశినాడు వ్రతం పూర్తి అయ్యింది. విష్ణుదేవుడామెకు సాక్షాత్కరించాడు. తానే స్వయంగా ఆమె గర్భంలో జన్మిస్తానన్నాడు రాక్షసుల సంపదలను హరించి దేవతలకిస్తానన్నాడు. వారి కష్టాలు పోగొడతా నన్నాడు. తన రూపాన్ని ధ్యానిస్తూ భర్తను సేవిస్తూవుండమని అంతర్హితుడయ్యాడు. అదితి భక్తితో తన భర్తను సేవించింది. విష్ణువామె గర్భంలో ప్రవేశించాడు. క్రమంగా నెలలు నిండాయి. అదితి గర్భస్థ విష్ణువును బ్రహ్మదేవుడు వినుతించాడు.

సంతానం పడే సంతాపాన్ని ఏతల్లీ ఓర్చుకోలేదు. దానికి ప్రతిక్రియ ఆలోచిస్తుంది. చేతనైతే బిడ్డల కష్టాలు పోగొట్టే ప్రయత్నం చేస్తుంది. విష్ణువు భక్తసులభుడు. భక్తుల ఆరాధనకు పరితృప్తి చెంది వెంటనే వారి ఆవేదన పోగొడతాడు. విష్ణువు తన అవతార ప్రయోజనాన్ని నెరవేర్చుకునేందుకు అదితి గర్భంలో పుట్టడం రెండవసారి.

### 2.7.3 వామన జననం :

విష్ణువు శ్రావణమాస ద్వాదశి, శ్రవణ నక్షత్రం, మధ్యాహ్న సమయం అభిజిత్తులగ్నంలో అదితి గర్భంలో జన్మించాడు. జన్మించినప్పుడు బాల విష్ణువు గానే భాసిల్లాడు. కశ్యపుడు అతణ్ణి అభినుతించాడు. విష్ణువు తన రూపాన్ని విడిచి వామనుడయ్యాడు. ఉపనయనప్రాయ బాలకుడయ్యాడు. కశ్యపుని

ఆధ్వర్యంలో మునులతనికి ఉపనయనం చేశారు. వామనునికి సూర్యుడు గాయత్రీ మంత్రాన్ని బోధించాడు. బృహస్పతి జంద్యాన్నీ, కశ్యపుడు ముంజుదర్భల మొలత్రాడునూ,అదితి కౌపీనాన్ని, భూదేవి నల్లని జింక చర్మాన్నీ, చంద్రుడు దండాన్నీ, ఆకాశం గొడుగునూ, బ్రహ్మ కమండలాన్నీ, సరస్వతీదేవి జపమాలనూ, సప్తఋషులు పవిత్రమైన దర్భలనూ, కుబేరుడు భిక్షాపాత్రను ఇచ్చాడు. అన్నపూర్ణ పార్వతి తొలిభిక్ష పెట్టింది. సంప్రదాయం ప్రకారం వామనుడు హోమం చేసాడు.

విష్ణువు జన్మించినప్పుడు విష్ణురూపంతోనే కనిపించడం, తర్వాత వామనరూపం ధరించడం ఆయన లీలావిభూతిని ఆవిష్కరిస్తుంది. అన్నిటికీ అతీతుడైనప్పటికీ సంప్రదాయబద్ధంగా కర్మకాండ నిర్వర్తించడం లోకానికి ఆదర్శంగా వుండాలనే అతని సంకల్పాన్ని అభివ్యక్తంచేస్తుంది. తాను ఆదర్శప్రాయంగా వుండాలనే ఉద్దేశంతోనే అన్నీ పనులు చేస్తున్నట్టు కృష్ణుడు భగవద్గీతలో తెలియజేయడాన్ని ఇక్కడ గుర్తుచేసుకోవడం సముచితం.

యద్యదాచరతి శ్రేష్ఠః
తత్తదేవేతరో జనాః
సయత్ప్రమాణం కురుతే
లోకస్తదను వర్తతే. [36]

## 2.7.4 బలి యజ్ఞశాలకు వామనుడి రాక :

వామనుడు దాతల గురించి వాకబు చేశాడు. బ్రాహ్మణుల సూచన మేరకు బలిదగ్గరకు బయలుదేరాడు. నర్మదా నదీతీరంలో వున్న యజ్ఞవాటికలో ప్రవేశించాడు. తన చేతల ద్వారా అందరినీ ఆకర్షించాడు. బలిని సమీపించి ఆశీర్వదించాడు.వారి పూర్వుల గొప్పతనాన్ని కొనియాడుతూ బలిని కూడా ప్రశంసించాడు. మూడడుగులు దానమడిగాడు. వామనుడు అంత చిన్న భూభాగం దానమడగడాన్ని బలి తప్పుపట్టాడు. గొప్పదానం కోరుకోమన్నాడు. మూడడుగుల దానమే తనపాలిట బ్రహ్మాండమని వామనుడు తన కోరికను సమర్థించుకున్నాడు. బలి వామనుడికి మూడడుగులు దానమియ్యడానికే సిద్ధపడ్డాడు. శుక్రుడు వచ్చి వారించాడు. వచ్చిన వాడు విష్ణువన్నాడు. బలి సంపదలు హరించి దేవేంద్రుడి

కిస్తాడన్నాడు. ఆ దానం వల్ల బలి పదవి, సంపదలు అన్నీ నశిస్తాయని హెచ్చరించాడు. అయినా బలి ఆ మాటలను లక్ష్యపెట్టలేదు. తన మాటకు తిరుగులేదన్నాడు.

*॥మ॥ నిరయంబైన, నిబద్ధమైన, ధరణీ నిర్మూలనంబైన, దు*
*ర్మరణంబైన, గులాంతమైన నిజమున్ రానిమ్ము; కానిమ్మిపో;*
*హరుఁడైనన్, హరియైన, నీరజభవుండభ్యాగతుండైన నౌఁ;*
*దిరుగన్ నేరదు నాదు జిహ్వ ; వినుమా । ధీవర్య; వేయేటికిన్?*[37]

శుక్రాచార్యుడు బలిని అన్నివిధాలా ఆదుకున్నాడు. బ్రతికి బట్టకట్టేందుకు కూడా దోహదం చేశాడు. ఒక్కమాటలో చెప్పాలంటే బలిపదవి, ఐశ్వర్యం అన్నీ అతని వల్ల సంక్రమించినవే. అటువంటి గురువు శుక్రాచార్యుడి మాటనే బలి పెడచెవిని పెట్టాడు. నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. అతిథి త్రిమూర్తులలో ఎవరైనా కానిమ్మన్నాడు. తనకు ఏమి వచ్చినా రానిమ్మన్నాడు. మాట చెప్పి తప్పడం తనవల్ల కాదన్నాడు. ఇది ఉత్తమ మానవుడికుండవలసిన లక్షణం. మాటిమాటికి మాటమార్చేవాడు, వేషాలు మార్చేవాడు, నక్కజిత్తులు ప్రదర్శించేవాడు మనిషి కావడానికి వీలులేదు. అతడు మానవరూపంలో సంచరించే ఊసరబిల్లి. ఊసరబిల్లి శత్రువు నుండి ఆపద శంకించి రంగులు మారుస్తుంది. మనిషి ఇతరులకు ప్రమాదాన్ని కలిగించేందుకే రంగులు మారుస్తాడు. ఒక విధంగా చెప్పాలంటే ఊసరబిల్లి కంటే కూడా దానిలా ప్రవర్తించే మానవుడే దానికంటే అధమస్థాయికి చెందినవాడు. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో పెట్టుకునే బలిచక్రవర్తి మాటనిలబెట్టుకునే ప్రయత్నం చేసివుండవచ్చు. తన సత్యవాక్పరిపాలన ద్వారా అభినందనీయుడుగా, ఆదర్శప్రాయుడుగా బలి అభినుతికెక్కాడంటే అతిశయోక్తి కాదు.

బలి దానమిచ్చేందుకే తన సంసిద్ధతను వ్యక్తపరిచాడు. శుక్రుడికి కోపం వచ్చింది. తనమాటను ధిక్కరించినందువల్ల పదవిని, ఐశ్వర్యాన్ని బలి కోల్పోతాడని శపించాడు. అప్పటికీ దానమివ్వడానికి బలి వెనుదియ్యలేదు. బలిచక్రవర్తి సైగచేశాడు. అతని భార్య వింధ్యావళి కలశంతో నీళ్ళు తెచ్చింది. బలి వామనుడి పాదాలు కడిగాడు. పాదజలాన్ని తలమీద చల్లుకున్నాడు. దానమిచ్చేందుకు

ధారాదత్తం చేశాడు. శుక్రుడు ఆ నీళ్ళు క్రిందపడకుండా అడ్డుకున్నాడు. వామనుడు దర్భతో కలశాన్ని పొడిచాడు. శుక్రుడికి ఒక కన్ను పోయింది. బలిచక్రవర్తి దానధారను విష్ణువు గ్రహించాడు. ఉభయ లోకాల్లోనూ అతని కీర్తి, పుణ్యం విరాజిల్లుతా యన్నాడు.

విష్ణువు సర్వాధికుడైనప్పటికీ, సర్వాత్మకుడైనప్పటికీ సామాన్య వామనుడు గానే బలి దగ్గరకు వెళ్ళాడు. అందువల్ల తాను ధరించిన రూపానికి తగ్గట్టే ప్రవర్తించాడు. ఇక్కడ బలిని వంచించవచ్చిన వామనుడు తక్కువగానూ, ఇచ్చిన మాట నిలబెట్టుకున్న బలి ఎక్కువగానూ కనిపిస్తారు. ఎవరు ఎంతటివారైనా మోసంచేసేవారు తక్కువ వారని, మాటనిలబెట్టుకునేవారు మహోన్నతులని అభిప్రాయం.

**2.7.5 వామన విజృంభణ :**

సభలోని వారంతా బలిని అభినందించారు. వామనుడు త్రిగుణాత్మకమైన విశ్వరూపం ధరించి క్రమక్రమంగా పెరిగాడు. వామనుడి పెరుగుదలను క్రమానుగతంగా పోతన ఒక పద్యంలో హృద్యంగా వర్ణించాడు.

*॥శా॥ ఇంతింతై, వటుఁడింతయై, మఱియుఁదానింతై, నభోవీధిపై*
*నంతై, తోయదమండలాగ్రమున కల్లంతై, ప్రభారాశి పై*
*నంతై, చంద్రుని కంతయై, ధ్రువుని పైనంతై మహర్వాటిపై*
*నంతై, సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై.*[38]

విష్ణు విజృంభణను చక్కగా, సమర్ధవంతంగా ఇంత చిన్న పద్యంలో ఇమడ్చడం అభినందనీయం. ఈ పద్యానికి వ్యాఖ్యానప్రాయంగానే తదుపరి అంశాలన్నీ చోటుచేసుకోవడం గమనార్హం. ఇంత-అంత-అల్లంత అనే పదాల ప్రయోగం ఇక్కడ చక్కగా కుదిరింది. త్రివిక్రమ ధ్యానానికి కూడా ఈ పద్యం ఉపకరిస్తుందంటే అతిశయోక్తికాదు.

వామనుడు త్రివిక్రముడై బ్రహ్మాండమంతా వ్యాపించాడు. అతని వ్యాప్తికి తట్టుకోలేక బ్రహ్మాండమంతా పిటపిటలాడింది. పాతాళం విష్ణుదేవుని పాదాబ్జానికి అంటుకున్న బురదగా, ఆకాశం పైకెత్తిన మరోపాదాబ్జానికి సోకిన తుమ్మెదగా

భాసిల్లాయి. సత్యలోకం దాటి వ్యాపించిన విష్ణుదేవుని పాదాబ్జాన్ని బ్రహ్మ పురస్సరంగా సత్యలోకవాసులందరూ కొనియాడారు.

ఆ విధంగా త్రివిక్రమాకృతి ధరించి విజృంభించిన విష్ణువు యధాపూర్వంగానే వామనుడయ్యాడు. అతని విజృంభణను, చొరవను సహించలేని హేతి, ప్రహేతి, విప్రచిత్తి మొదలైన రాక్షసవీరులు వామనుడి మీదికి విజృంభించారు. కత్తులు దూసి యుద్ధానికి సిద్ధమయ్యారు. విష్ణుసైన్యాధిపతులైన నందుడు, సునందుడు, జయుడు, విజయుడు, కుముదుడు మొదలైన వారు రాక్షసుల మీదికి విజృంభించారు. బలి రాక్షసవీరులను వారించాడు. యుద్ధానికది సమయం కాదన్నాడు. కాలాన్ని దృష్టిలో పెట్టుకుని కథనం సాగించాలన్నాడు.

విష్ణువు మనసు తెలుసుకొని బృహస్పతి బలిని వరుణపాశాలతో బంధించాడు. బలి ఇస్తానన్న దానం రెండడుగులకే సరిపోయిందని, మూడవ అడుగు ఎక్కడ పెట్టాలో చెప్పమని వామనుడు బలిని ప్రశ్నించాడు. అసత్యదోష మంటకుండా మూడవ అడుగును తన తలమీద పెట్టమని బలి విష్ణువుకు చెప్పాడు. ప్రహ్లాదుడు, వింధ్యావళి, బ్రహ్మ బలిపక్షాన విష్ణువుతో మాట్లాడారు. బలిని కాపాడమని కోరారు. వామనుడు ప్రసన్నుడయ్యాడు. బలి వ్యక్తిత్వాన్ని శ్లాఘించాడు. బలికి సావర్ణి మనువు కాలంలో ఇంద్రపదవి లభిస్తుందన్నాడు. అంతవరకు నిరుపద్రవంగా సుతలంలో నివసించమన్నాడు. గదాధరుడై తానే బలిరక్షణా బాధ్యతను వహిస్తానన్నాడు. వామనుడి సూచన మేరకు ప్రహ్లాదుడు బలిని, అతని పరివారాన్ని వెంటబెట్టుకొని ఒక బిలం గుండా సుతలానికి వెళ్లిపోయాడు. శుక్రాచార్యుడు వామనుడి ఆదేశానుసారం బలియజ్ఞాన్ని పూర్తిచేశాడు. దేవతలు వామనుణ్ణి విమానం మీద స్వర్గానికి తీసుకువెళ్లారు. వామనుడు బలిని యాచించి తాను పొందిన సంపదనంతా దేవేంద్రునికే ఇచ్చివేశాడు.

భగవంతుడు సర్వశక్తిమంతుడు. అజ్ఞానులైన రాక్షసులకు అతని గొప్పతనం తెలుసుకునే అవకాశం లేదు. అందువల్లనే దానవులు భగవంతుడైన వామనుడి మీదికి విజృంభించారు. గొప్పవాళ్ళను విమర్శించడం, అనాలోచితంగా ఢీకొనడం అల్పుల లక్షణం.

భగవంతుడు భక్తవత్సలుడు. భక్తులను శిక్షించినా రక్షించేందుకే. వామనుడు బలిని శిక్షించి ఇంద్రపదవిని ఇవ్వడం దీన్నే సూచిస్తుంది. ఏ కార్యంగానీ అసమగ్రంగా వుండిపోకూడదు. పరిపూర్ణం కావాలి. అందుకే బలి యజ్ఞాన్ని పరిపూర్ణం చేయవలసిందిగా వామనుడు శుక్రుణ్ణి ఆదేశించాడు.

తక్కిన అవతారాల కాలం నిడివికన్నా వామనావతార కాలం నిడివి ఎక్కువ. విష్ణువు తక్కిన అవతారాల్లో దుష్టులను హతమార్చాడు. వామనావతారంలో ఎవరినీ హతమార్చకుండానే సన్మార్గం చూపాడు. తన పట్ల వ్యతిరేకతను ప్రదర్శించిన శుక్రుడిపట్ల కూడా సానునయంగానే ప్రవర్తించాడు. ఈ వామనుడి గుణాలన్నీ అందరికీ ఆదర్శప్రాయాలే. యాచించే వాడు తగ్గిపోతాడనీ, తగ్గిపోవాలనీ వామనావతారం ద్వారా వనజనాభుడు వసుధకంతటికీ చాటినట్లయ్యింది.

## 2.8 పరశురామావతారం :

సత్వగుణ ప్రధానుడైన విష్ణుదేవుడు రజోగుణాన్ని ప్రదర్శించిన అవతారం పరశురామావతారం. బ్రాహ్మణవంశంలో జన్మించి క్షాత్ర ధర్మాన్ని ప్రదర్శించిన అవతారం కూడా ఇదే. రాజులు దురహంకారులై పరిధి లేని దౌష్ట్యాన్ని అవలంబించినప్పుడు లోకాలను రక్షించేందుకు విష్ణువీయవతారాన్ని ధరించవలసి వచ్చింది. అధర్మపరులను శిక్షించి ధర్మాన్ని రక్షించవలసిన రాజులు తమ కర్తవ్యాన్ని విస్మరించి ధర్మానికి హాని తలపెట్టినప్పుడు ధర్మస్థాపనకోసం విష్ణుదేవుడీయవతారం ధరించాడు.

విష్ణు అంశతో జన్మించిన పరశురాముడు ఈశ్వరుణ్ణి గురువుగా పొందడం విశేషం. తన అంశే అయినా రాముణ్ణి ఎదుర్కోవడం కూడా గమనార్హం. బలి దగ్గర దానం పొందిన విష్ణువు ఈ అవతారంలో తాను జయించిన భూభాగాన్నంతా కశ్యప మహర్షికి దానమివ్వడం చెప్పుకోదగ్గ అంశం.

### 2.8.1 పరశురామ జననం :

కుశాంబుని కుమారుడు గాధిరాజు. అతడికి సత్యవతి అనే కుమార్తె వుండేది. ఋచీకుడు అనే ఋషి ఆమెను వివాహం చేసుకున్నాడు. తనకూ, తన తల్లికి పుత్ర సంతానం కావాలని సత్యవతి తన భర్త ఋచీకుణ్ణి ప్రార్థించింది.

ఋచీకుడు బ్రహ్మ, క్షాత్ర హవిస్సులను సిద్ధంచేశాడు. అతడు లేని సమయంలో సత్యవతి క్షాత్ర హవిస్సును స్వీకరించి బ్రహ్మహవిస్సును తల్లికిచ్చింది. అందువల్ల సత్యవతి తల్లికి బ్రహ్మజ్ఞాన సంపన్నుడైన విశ్వామిత్రుడు జన్మించాడు. సత్యవతికి క్షాత్రంతో భాసిల్లే కుమారుడు పుట్టవలసివుండగా ఋచీకుని అనుగ్రహంవల్ల సప్తర్షులలో ఒకడైన జమదగ్ని సత్యవతికి జన్మించాడు. జమదగ్నీ-రేణుకలకు క్షాత్రోచిత గుణం కలిగిన పరశురాముడు జన్మించాడు.

పూర్వకాలంలో బ్రాహ్మణ క్షత్రియుల మధ్య కూడా వైవాహిక సంబంధాలుండేవనీ, ఋషులు తమ తపో మహిమతో, మంత్రశక్తితో సంతానం కలిగేలా చేసేవారనీ, సంతాన స్వభావాన్ని కూడా నియంత్రించేవారని దీన్నిబట్టి తెలుస్తోంది. శక్తి సంపన్నులైన ఋషులుగానీ, తదితరులుగానీ ఎంత ప్రయత్నించినా దైవ సంకల్పానుసారమే అన్నీ జరుగుతాయని బోధపడుతుంది.

### 2.8.2 విద్యాభ్యాసం-శస్త్ర సంపాదన :

పరశురాముడు బాల్యంలోనే విద్యలన్నీ నేర్చుకున్నాడు. తండ్రి అనుమతితో తాత ఋచీకుని ఆశ్రమానికి, ఔర్వుని ఆశ్రమానికి, అక్కడి నుంచి భృగుమహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. భృగుమహర్షి పరశురాముణ్ణి ఈశ్వరుని గురించి తపస్సు చెయ్యమని ఆదేశించాడు. పరశురాముడు మహేశ్వరునుద్దేశించి తీవ్రంగా తపస్సు చేశాడు. శివుడు వ్యాధుడి రూపంలో వచ్చి పరీక్షించాడు. కొంత సంభాషించిన పిమ్మట ఆ వ్యాధుడెవరో మహాపురుషుడైవుంటాడని పరశురాముడు భావించాడు. అతనికి సాష్టాంగ నమస్కారం చేశాడు. శివుడు ప్రత్యక్షమయ్యాడు. పరశురాముడు బాలుడు కాబట్టి అస్త్రాలను ప్రయోగించే పరిపక్వత రాలేదన్నాడు. తీర్థయాత్రలు చేసి రమ్మన్నాడు. పరశురాముడు ఒక సంవత్సరం పాటు తీర్థయాత్రలు చేసివచ్చాడు. మళ్ళీ తపస్సు ప్రారంభించాడు.

దానవులు స్వర్గాన్ని ఆక్రమించడంతో దేవతలు ఈశ్వరుణ్ణి ఆశ్రయించారు. ఈశ్వరుడు పరశురాముణ్ణి తీసుకురమ్మన్నాడు. పరశురాముడు రాగానే అతనికి శక్తిమంతమైన 'పరశువు'ను ప్రదానం చేసి రాక్షసులను జయించమని పంపాడు. శివతేజస్సును కూడా అతనిలో నిక్షేపించాడు. పరశురాముడు వెళ్ళి రాక్షసులను

నిర్జించి దేవతలకు వచ్చిన ఉపద్రవాన్ని తొలగించాడు. ఈశ్వరుడతన్ని మెచ్చుకుని అమోఘాస్త్రాలను అనుగ్రహించాడు.

పరశురాముడు ఒక సరస్సు దగ్గర కూర్చుని జపం చేస్తున్నపుడు ఒక ఆడులేడి, ఒక మగలేడి అక్కడికి వచ్చాయి. పరశురాముడు కృష్ణకవచం కోసం తపస్సు చేస్తున్నాడని మగలేడి ఆడులేడితో చెప్పింది. అగస్త్యాశ్రమంలో కృష్ణామృతస్తోత్రం వింటే అది అతనికి లభిస్తుందని చెప్పింది. రాముడు అగస్త్యాశ్రమం వెళ్ళాడు. ఆ స్తోత్రాన్ని విన్నాడు. కృష్ణుణ్ణి ప్రార్థించాడు. అతడు ప్రత్యక్షమయ్యాడు. తన తేజమతనికిచ్చాడు. రామావతారంలో దాన్ని తిరిగి పుచ్చుకుంటానని చెప్పి అంతర్హితుడయ్యాడు. ఇక్కడ పరశురాముడు కలుసుకున్న కృష్ణుడు విష్ణువే కావచ్చు.

బాల్యంలోనే విద్యనభ్యసించడం, అందునా తనలక్ష్యానికి కావలసిన విద్యలను ఎంత కష్టమైనా నేర్చుకోవడం మానవుని కర్తవ్యం. తపోదీక్ష కూడా వహించి ఆవిద్యలను గ్రహించడం పరశురాముణ్ణి ఒక ఆదర్శ విద్యార్థిగా నిలుపుతుంది. శస్త్రసముపార్జనా కాలంలోనే దుష్ట శిక్షణకు, శిష్టరక్షణకు ధర్మ సముద్ధరణకు అవి ఉపయోగపడేలా రాముడికి అవకాశం రావడం, దాన్ని అతడు చక్కగా వినియోగించుకోవడం అభినందించదగ్గ అంశాలు.

### 2.8.3 పరశురాముని తొలివిజయం :

హైహయ వంశానికి చెందిన కార్తవీర్యార్జునుడు గొప్ప పరాక్రమవంతుడు. దత్తాత్రేయుడ్ని ఆరాధించి అతని అనుగ్రహంతో శత్రువిజయమూ, వేయిచేతులూ, అణిమాది సిద్ధులూ, యశస్సూ, ఓజస్సూ, తేజస్సూ, అఖండమైన ఇంద్రియ పటుత్వమూ పొందాడు. సాటిలేని మేటి వీరుడిగా విరాజిల్లాడు. కార్తవీర్యార్జునుడు ఒకరోజు వేటకు వెళ్ళాడు. బాగా అలసిపోయాడు. జమదగ్ని మహర్షి ఆశ్రమానికి వెళ్ళి అతనికి నమస్కరించాడు. జయదగ్ని రాజును ఆదరించాడు. తన హోమ ధేనువును రప్పించి దాని ప్రభావంతో రాజుకు, అతని పరివారానికి సుష్ఠుగా భోజనం పెట్టించాడు. రాజుకాకామధేనువును తనదిగా చేసుకోవాలనే దుర్బుద్ధి పుట్టింది. ముని వారిస్తున్నా వినకుండా భటులను పంపి కామధేనువును, దాని దూడను మాహిష్మతీ పురానికి తీసుకువెళ్ళాడు.

అడవికి వెళ్ళిన పరశురాముడు ఆశ్రమానికి వచ్చాడు. జరిగిన దుర్ఘటన గురించి తెలుసుకొని సంతాపం చెందాడు. ఉపకారం పొంది అపకారం చేసిన ఉర్వీశుణ్ణి వూరికే వదలకూడదనుకున్నాడు. ఆగ్రహోదగ్రుడై గండ్రగొడ్డలి పుచ్చుకొని మాహిష్మతీపురం చేరుకున్నాడు. తన రాక గురించి రాజుకు చెప్పిపంపాడు. యుద్ధంలో అతనిని వధిస్తానని హెచ్చరించాడు. కార్తవీర్యార్జునుడు పదిహేడు అక్షౌహిణుల సైన్యాన్నిరాముడి మీదికి పంపాడు. భార్గవుడాసైన్యాన్నంతా మట్టుబెట్టాడు. కార్తవీర్యార్జునుడు తన ఐదువందల చేతుల్లో ధనస్సులు ధరించి యుద్ధానికి వచ్చాడు. ఐదువందల ధనస్సుల నుంచి శరపరంపరను పరశురాముడి మీద ప్రయోగించాడు. రాముడు వాటినడ్డుకోవడమే గాక తన బాణాలతో హైహయుని చేతులలోని ధనస్సులను ఖండించాడు. కార్తవీర్యుడు వృక్షాలతో అతనిని ఎదుర్కోగా, గండ్రగొడ్డలితో రాజు చేతులన్నిటినీ పరశురాముడు నరికాడు. శిరస్సును ఖండించాడు. కార్తవీర్యుని కుమారులు పదివేలమంది భయంతో పలాయనం చిత్తగించారు. గోవత్సాలను వెంట బెట్టుకొని పరశురాముడు ఆశ్రమానికి వెళ్లాడు.

దేవతలను ఆశ్రయించి గొప్ప శక్తులు పొందడం పూర్వకాలంవారికి రివాజు. అతిలోక శక్తులను ఆర్జించిన వారు మహా మదంతో మసలుకోవడం కన్పిస్తుంది. ధనం, విద్య, వంశం, చెడ్డవారికి మదాన్ని, మంచివారికి వినయాన్ని, అణకువను కల్గిస్తాయి. భారతంలోని విదురనీతి ఈ అంశాన్ని తెలియజేస్తుంది.

*ధనమును, విద్యయు, వంశం*
*బును దుర్మతులకు మదంబుఁబొనరించును, స*
*జ్జనులైన వారికడఁకువ*
*యును, వినయము నివియతెచ్చు నుర్వీనాథా!*[39]

ధనం, విద్య, వంశాల్లాగే గొప్ప శక్తులు కూడా చెడ్డవారికి మదాన్ని, మంచివారికి వినయాన్ని కల్గిస్తాయి. కాబట్టి కార్తవీర్యార్జునుడు దుర్మదంతో ఋషి హోమధేనువును బలవంతంగా తీసుకువచ్చాడు.

తండ్రికి అపకారం జరిగినప్పుడు దాన్ని ఎదుర్కొని న్యాయం జరిగేట్టు చూడడం కుమారుని బాధ్యత. దీనినే పరశురాముడు నిర్వర్తించాడు. అధర్మకృత్యం హానికరమని కార్తవీర్యుని కథ తెలియజేస్తుంది.

### 2.8.4 పితృవాక్పాలన :

పరశురాముడు తన విజయ వృత్తాంతాన్ని జమదగ్నికి నివేదించాడు. పరశురాముడు చేసిన పని సరికాదని జమదగ్ని సహేతుకంగా వివరించాడు. క్షమ ఆవశ్యకతను, దాని వైశిష్ట్యాన్ని తెలియజేశాడు.

*॥కం॥ క్షమ గలిగిన సిరిగలుగును,*
*క్షమ గలిగిన వాణిగలుగు సౌఖ్యములెల్లన్,*
*క్షమ గలుగఁదోన కలుగును,*
*క్షమ కలిగిన మెచ్చు శౌరి సదయుఁడు తండ్రీ!* [40]

ఓ తండ్రీ! క్షమ కలిగివుంటే సంపద కలుగుతుంది. క్షమ వుంటే విద్య అబ్బుతుంది. క్షమ వుంటే సుఖములన్నీ కలుగుతాయి. క్షమ కలిగివుంటే దయామయుడైన శ్రీహరి సంతోషిస్తాడు.

రాజును చంపిన పాపం నశించేందుకు తీర్థయాత్రకు వెళ్లిరమ్మని జమదగ్ని కుమారుణ్ణి ఆదేశించాడు. రాముడు తండ్రి ఆజ్ఞను తలదాల్చి ఒక సంవత్సరం పాటు తీర్థయాత్రలు చేసి తిరిగి వచ్చాడు.

ఒకరోజు జమదగ్ని భార్య రేణుక నీళ్ళు తీసుకువచ్చేందుకు నదికి వెళ్ళింది. చిత్రరథుడనే గంధర్వుడు అప్సరసలతో కలిసి జలక్రీడలాడడం ఆమె కంట పడింది. రేణుక ఆ దృశ్యాన్ని తదేకంగా చూస్తూ అక్కడే చాలాసేపు గడిపింది. హోమకార్యానికి జలం తీసుకుపోవడం ఆలస్యమైనందుకు చింతించింది. భయంభయంగా వెళ్ళి భర్తకు నమస్కరించింది. ఆమె ఆలస్యంగా రావడానికి కారణమేమిటో జమదగ్ని తన యోగదృష్టి ద్వారా తెలుసుకున్నాడు. కుమారులను పిలిచి ఆమెను వధించమని పురమాయించాడు. జమదగ్ని నలుగురు కుమారులు తండ్రి ఆజ్ఞను నెరవేర్చడానికి తటపటాయించారు. జమదగ్ని రాముణ్ణి పిలిచి రేణుకను, ఆమె పుత్రులు నలుగురిని వధించమని ఆజ్ఞాపించాడు. రాముడు మారు మాట్లాడకుండా తల్లిని, తన నలుగురు అన్నలను సంహరించాడు. జమదగ్ని సంతోషించాడు. రాముని కోరిక మేరకు మృతులందరినీ బ్రతికించాడు.

పరశురాముడు తండ్రి ఆజ్ఞను పరస్పర విరుద్ధంగా రెండు విధాలుగా పాటించాడు. మొదటిది-చంపినందుకు ప్రాయశ్చిత్తం చేసుకోవడం. రెండవది-తన తల్లిని, అన్నలను చంపడం. తండ్రి ఆజ్ఞ ఏదైనా తలదాల్చడమే తనయుని ధర్మమని రాముడిక్కడ నిరూపించినట్లైంది. పితృవాక్పరిపాలనం సర్వులకూ అనుల్లంఘనీయ ధర్మమని భారతం తెలియజేస్తుంది. తండ్రి చెప్పినపని చెయ్యనివాడు, అతని మాటను పెడచెవిన పెట్టిన వాడు పుత్ర శబ్దానికి అర్హుడు కాదని యయాతి తన కుమారులతో చెప్పాడు. ఆ పద్యాన్ని కూడా ఇక్కడ అనుసంధించుకోవడం సముచితం.

*॥కం॥ తనయుండు తల్లిదండ్రులు,*
*పనిచినపని సేయఁడేని పలుకెదలోఁజే*
*కొనఁడేని వాఁడు తనయుం,*
*డనఁబడునే పితృధనమున కర్హుండగునే.*[41]

తమ తండ్రిని చంపిన పగ తీర్చుకోవడానికి కార్తవీర్యార్జునుని కొడుకులు సరైన సమయంకోసం వేచివున్నారు. ఒకరోజు పరశురాముడు తన అన్నలతో కలిసి అరణ్యంలోపలికి వెళ్ళాడు. అదే అదునుగా భావించి కార్తవీర్యార్జునుని కొడుకులు జమదగ్ని ఆశ్రమంలో ప్రవేశించారు. యజ్ఞశాలలో దైవధ్యానంలో నిమజ్ఞుడైవున్న జమదగ్నిని కదలకుండా పట్టుకుని అతడి శిరస్సును ఖండించారు. రేణుక వచ్చి చంపవద్దని ఎంతగా ప్రాధేయపడినా వారామెను లక్ష్యపెట్టలేదు. తన తండ్రిని చంపిన వారిని శిక్షించేందుకు రమ్మని రేణుక పరశురాముణ్ణి ఇరవైఒక్క సార్లు పిలిచి రొమ్ములు బాదుకుంది. పరశురాముడు, అతని అన్నలు వచ్చారు. తమ తండ్రి మరణానికి పరశురాముని అన్నలు విలపించారు. పరశురాముడు వారిని ఓదార్చాడు.

పరశురాముడు పదునైన గండ్రగొడ్డలి పుచ్చుకుని మాహిష్మతీపురం వెళ్ళాడు. కార్తవీర్యార్జునుని కుమారులు పదివేలమందిని వధించాడు. ఇరవైఒక్క సార్లు భూప్రదక్షిణం చేశాడు. తారసపడిన రాజులందరినీ వధించాడు. వారి రక్తంతో శమంతపంచకంలో మడుగుల నేర్పరిచాడు. తన తండ్రి శిరస్సును, మొండాన్ని

కలిపి వుంచి యాగం చేశాడు. హోతకు తూర్పుదిక్కును, బ్రహ్మకు దక్షిణభాగాన్ని, అధ్వర్యునికి పడమటి దిక్కును, ఉద్గాతకు ఉత్తర దిక్కును, మిగిలిన ఋత్విజులకు అవాంతర దిశలను, కశ్యపునికి మధ్యదేశాన్నీ, ఉపద్రష్టకు ఆర్యావర్తాన్నీ, సదస్యులకు మిగిలిన దిక్కులను ఇచ్చాడు. యజ్ఞం పూర్తయ్యాక పరశురాముడు సరస్వతీ నదికి వెళ్ళి అవభృథస్నానం చేసి పవిత్రుడయ్యాడు. జమదగ్ని తన తపోబలం వల్లను, కుమారుని యజ్ఞ కర్మబలం వల్లను సప్తర్షి మండలం చేరుకుని ప్రకాశించాడు. పరశురాముడు మహేంద్రపర్వతానికి వెళ్ళి శాంతచిత్తంతో తపస్సు చేస్తున్నాడు. రానున్న మనువు కాలంలో అతడు కూడా సప్తర్షి కాగలడు.

ఇతరులకు చేసే అపకారం బలోపేతమై తిరిగి వచ్చి తమనే బాధిస్తుందని హైహయుల ఉదంతం అభివ్యక్తం చేస్తుంది. తండ్రికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం చేయడం తనయుని ధర్మమని జమదగ్ని చర్య బోధపరుస్తుంది. మదోన్మత్తులైన రాజులను మట్టుబెట్టి భూభారాన్ని తగ్గించేందుకు అవతరించిన పరశురాముడు హైహయవంశపు రాజులను మిషగా చేసుకొని రాజులందరినీ వధించడం ఇక్కడ గమనార్హం. యజ్ఞమయుడు, యజ్ఞభోక్త అయిన శ్రీమన్నారాయణుడు పరశురామ రూపంతో యజ్ఞం చేయడం ఇక్కడ విశేషం. కర్మకాండలో లోకులకాదర్శంగా వుండడమే ఈ యజ్ఞాచరణలోని ఆంతర్యం. తాను జయించిన భూభాగాన్ని ఇతరులకు ఇచ్చివేయడమే గాక ఆ భూభాగంనుంచి వైదొలగి మహేంద్ర పర్వతానికి వెళ్ళడం అతని ఉన్నత వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది.

పరశురాముడు బ్రాహ్మణవంశంలో జన్మించినా రాజ పరాక్రమాన్నే ప్రదర్శించాడు. ముల్లును ముల్లుతో తియ్యడమనే విధానాన్ని అనుసరించి రాచరిక వ్యవస్థను ప్రక్షాళనం చేశాడు. బ్రాహ్మణ్యాన్నీ, క్షాత్రాన్నీ సమతుల్యంగా ప్రదర్శించి తన సామర్థ్యాన్ని లోకానికి వెల్లడిచేసిన మహిమాన్వితుడుగా పరశురాముడు ఇక్కడ కనిపిస్తాడు. పరశురాముడు విష్ణుదేవుడి అవతారమే అయినప్పటికీ క్రూరంగా వ్యవహరించడం వల్లనేమో తక్కిన అవతారాల్లాగా పరశురాముని అవతారం జనుల మెప్పుకు పాత్రంకాలేకపోయింది. అందువల్లనే భక్తులు, వాగ్గేయకారులు ఈ అవతారాన్ని సమగ్రంగా, సాంగోపాంగంగా కొనియాడలేదేమో అనిపిస్తుంది.

## 2.9 రామావతారం :

విష్ణువు పలు అవతారాలు ధరించాడు. పలు రకాల శరీరాలను ధరించాడు. జలచరాలుగానూ, ఉభయచరంగానూ, ఉభయశరీరిగానూ క్రమంగా వివిధ రకాల మానవుడి గానూ జన్మించాడు. మొదట భార్గవరాముడుగా తన ఔద్ధత్యాన్ని ప్రదర్శించి శ్రీరాముడుగా ఆదర్శమానవజీవితాన్ని లోకానికి చూపాడు. ఆదర్శకుమారుడుగా, ఆదర్శయువరాజుగా, ఆదర్శ అగ్రజుడుగా, ఆదర్శ మిత్రుడుగా, ఆదర్శ భర్తగా, ఆదర్శ విలుకాడుగా, ఆదర్శ సేవాపరాయణుడుగా, ఆదర్శ రక్షకుడుగా పలు పాత్రలు నిర్వహించి ఆదర్శ మానవుడంటే ఇలా కదా! వుండాలని వినుతికెక్కాడు.

రామకథను ఆయన సమకాలికుడైన వాల్మీకి మహర్షి గ్రంథస్థం చేసి ప్రపంచానికి అందించాడు. ఇది రామచరిత ప్రామాణికతను తెలియజేస్తుంది. మునిజనులను, యుగధర్మాన్ని కాపాడడం కోసం రాజ్యభోగాలను త్యాగంచేసి వనవాస జీవితం గడిపిన మహామనీషి శ్రీరామచంద్రుడు. ఇంతటి మహనీయుడు కాబట్టే రాముడు మర్యాదా పురుషోత్తముడుగా అందరి మన్ననలకూ పాత్రుడయ్యాడు.

### 2.9.1 రామ జనన హేతువు :

సనక సనందనాదుల శాపానికి గురైన జయవిజయులు విశ్రవసునికి, కైకశికి రావణ-కుంభకర్ణులుగా జన్మించారు. వారి తర్వాత విభీషణుడు, శూర్పణఖ జన్మించారు. రావణ, కుంభకర్ణ, విభీషణులు బ్రహ్మను గురించి తీవ్రంగా తపస్సు చేశారు. పద్మజుడు వారికి ప్రత్యక్షమయ్యాడు. వరాలు కోరుకోమన్నాడు. నరుల చేత, వానరులచేత తప్ప ఇతరుల చేత తనకు మరణం సంభవించకూడదని రావణుడు కోరుకున్నాడు. కుంభకర్ణుడు నిర్దేవత్వాన్ని కోరుకోబోయి నిద్రను వరంగా పొందాడు. సత్వగుణ సంపన్నుడైన విభీషణుడు మాత్రం విష్ణుభక్తిని కోరుకున్నాడు. బ్రహ్మదేవుడు వారికి ఆ వరాలిచ్చి అంతర్హితుడయ్యాడు.

వరగర్వంతోనూ, బలగర్వంతోనూ రావణుడు విజృంభించాడు. దేవతలను జయించాడు. దేవకాంతలను చెరబట్టాడు. అష్టదిక్పాలకులను ఓడించాడు.

మునులను బాధించాడు. అతని దౌర్జన్యానికి మేరలేకపోయింది. దేవతలతని ధాటికి తట్టుకోలేక పోయారు. విష్ణువును శరణుజొచ్చారు. నారాయణుడు ప్రసన్నుడయ్యాడు. వారి మొరాలించాడు. తానే స్వయంగా రావణాదులను అంతంచేస్తానన్నాడు. దేవతలు వానరులుగా ఆవిర్భవించి తనకు తోడ్పడాలన్నాడు. తాను నరుడుగా దశరథ మహారాజు కుమారుడై జన్మిస్తానన్నాడు. సూర్యుడి అంశతో సుగ్రీవుణ్ణి, దేవేంద్రుడి అంశతో వాలిని, బ్రహ్మదేవుని అంశతో జాంబవంతుణ్ణి జన్మింపజేయమని సూచించాడు. దేవతలంతా సంతోషంతో స్వస్థానాలు చేరుకున్నారు.

పూర్వకాలంలో గొప్పవిజయాలను సాధించాలనుకునేవారు కఠిన సాధనలు చేసి తపస్సు మొదలైన వాటి ద్వారా అజేయ శక్తులను పొందేవారని దీన్ని బట్టి తెలుస్తుంది. తీవ్రపరిశ్రమే విజయానికి సాధనమని కూడా బోధపడుతుంది. తాము ఇతరుల కంటే అధికులమనీ, ఎవరిచేత గానీ జయింపబడనివారనీ విశ్వాసం కలిగినట్లైతే వారు ఇతరుల కంటే భిన్నంగా ప్రవర్తిస్తారు. వరాల వల్లనో, బలంవల్లనో వారికి లభించిన ఆ విశ్వాసం వున్నచోట వుండనీయదు. ఎప్పుడూ ఎవరినో ఒకరిని ఇబ్బంది పెట్టేందుకే పురికొల్పుతూ ఉంటుంది. దుర్జనులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. రావణాసురుడి విషయంలో జరిగింది కూడా ఇదే.

### 2.9.2 శ్రీరామ జననం :

పూర్వం దశరథుడనే సూర్యవంశపు రాజు అయోధ్యను రాజధానిగా చేసుకొని కోసల దేశాన్ని పాలించేవాడు. అతనికి సంతానం లేదు. ఋష్యశృంగ మహర్షిని రప్పించి పుత్రకామేష్టియాగం చేశాడు. యజ్ఞగుండం నుంచి దివ్యపురుషుడొకడు పాయసపాత్ర పట్టుకొని బయటకు వచ్చాడు. దాన్ని దశరథుడికి ఇచ్చాడు. ముగ్గురు భార్యలకు ఇచ్చి భుజింపజేయమన్నాడు. దశరథుడాపాయసాన్ని రెండు భాగాలుగా చేసి ఒకభాగం కౌసల్యకిచ్చాడు. రెండవభాగంలో సగం సుమిత్రకు, మిగిలిన సగాన్ని రెండుభాగాలుగా చేసి సగం కైకేయికి, తక్కిన సగం మళ్ళీ సుమిత్రకు పంచి పెట్టాడు. రాణులు ముగ్గురూ గర్భం ధరించారు. నెలలు నిండాక కౌసల్యకు శ్రీరాముడు, కైకకు భరతుడు, సుమిత్రకు లక్ష్మణ-శత్రుఘ్నులు జన్మించారు. దశరథుడు కులగురువు వశిష్ఠుని సహాయంతో వారికి

జాతకర్మాదికాలు నిర్వహించాడు. రాముడు, అతని సోదరులు వశిష్ఠుని దగ్గర విద్యనభ్యసించారు. విలువిద్య నేర్చుకున్నారు.

పూర్వకాలంలో సంతాన హీనులు సంతానంకోసం పడరాని పాట్లు పడేవారు. తపస్సు ద్వారా, యజ్ఞాల ద్వారా కూడా సంతానం పొందేందుకు ప్రయత్నించేవారు. ఈ అంశాన్నే పుత్రకామేష్టియాగ ఉదంతం తెలియజేస్తుంది.

### 2.9.3 యాగ సంరక్షణ :

ఒకరోజు విశ్వామిత్ర మహర్షి దశరథుని దగ్గరకు వచ్చాడు. తన యాగాన్ని సంరక్షించేందుకు రాముణ్ణి పంపమని అర్థించాడు. ముక్కుపచ్చలారని రాముడు రాక్షసులతో యుద్ధం చేయలేడని దశరథుడు మొదట నిరాకరించాడు. విశ్వామిత్రుడు రాముని సామర్థ్యాన్ని కొనియాడాడు.

*॥ఉ॥ బాలుడశక్తుఁడీతడను భావము మాను; మితండు సర్వది*
*క్పాలక పాలన క్షమ నృపాలుడు; నానత విద్విషత్ క్షమా*
*పాలుడు, లోకపాలుడుఁ, గృపాళుడు, సజ్జనపాలుడన్య భూ*
*పాలుర యజ్ఞపాలనకుఁబాడిగ నేనిటుకోరి వత్తునే.*[42]

'ఇతడు పసిబాలుడు, శక్తిలేనివాడు అనే ఆలోచన విడిచిపెట్టు. ఇతడు అష్టదిక్పాలకులు పరిపాలించే భూమండలానికంతటికీ రాజు. నమస్కరించి లొంగిపోయిన శత్రురాజుల భూమిని పాలించేవాడు. లోకాలను పాలించేవాడు, దయామయుడు, మంచివారిని కాపాడేవాడు. ఇటువంటివాణ్ణి విడిచిపెట్టి నా యజ్ఞాన్ని రక్షించేందుకు తగిన వారని ఇతర రాజులను కోరివస్తానా!' అని పద్యభావం.

ఈ పద్యంలో రాముని గొప్పతనం కొనియాడబడింది. రాముణ్ణి కేవలం బాలుడుగా భావించిన దశరథ మహారాజు పుత్రవాత్సల్యమెంతటిదో కూడా తెలియజేయబడింది.

వశిష్ఠుడు కూడా విశ్వామిత్రుణ్ణి సమర్థించాడు. ఎట్టకేలకు దశరథుడికి విశ్వామిత్రుని వెంట రాముణ్ణి పంపక తప్పలేదు. లక్ష్మణుడు కూడా రాముడి వెంట బయలుదేరాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంటబెట్టుకుని

అరణ్యంలో ప్రవేశించాడు. కొంతదూరం వెళ్ళేసరికి తాటకి అనే రాక్షసి వారి దారికి అడ్డుతగిలింది. భయంకరాకారంతో రామలక్ష్మణుల మీదికి వచ్చింది. విశ్వామిత్రుని సూచన మేరకు రాముడు ఆమెమీదకి బాణం ప్రయోగించాడు. తాటకి పలుమాయలు ప్రదర్శించింది. రాళ్ళు కురిపించింది. దాశరథి తన నిశితాస్త్రంతో ఆ మాయలన్నిటినీ చెదరగొట్టాడు. ఆమెను వధించాడు.

విశ్వామిత్రుడు సంతోషించాడు. వారికి దివ్యమంత్రాలతో కూడిన అస్త్ర విద్యను బోధించాడు. విశ్వామిత్ర, రామ-లక్ష్మణులు ముగ్గురూ సిద్ధాశ్రమం చేరుకున్నారు. రామలక్ష్మణులు ధనుర్ధరులై పర్యవేక్షిస్తుండగా విశ్వామిత్రుడు యాగం ప్రారంభించాడు. మారీచుడు, సుబాహుడు అనే రాక్షసులు వచ్చి యజ్ఞగుండం మీద రక్తమాంసాలు కుమ్మరిస్తూ యజ్ఞాన్ని ధ్వంసం చేయాలని ప్రయత్నించారు. రాముడొక బాణంతో మారీచుణ్ణి సముద్రతీరంలో పడేటట్టు కొట్టాడు. మరోబాణంతో సుబాహు అక్కడికక్కడే మరణించేలా కొట్టాడు. విశ్వామిత్రుడు తలపెట్టిన యజ్ఞం నిర్విఘ్నంగా పరిసమాప్తం అయ్యింది.

ఎన్ని విఘ్నాలు ఎదురైనా దీక్ష, పట్టుదల వుంటే వయసుతో నిమిత్తం లేకుండా ఏదైనా సాధించవచ్చని బాలరాముని విజయగాథ బోధపరుస్తుంది. ఇతరులకు ఇబ్బంది కల్గించేవారు స్త్రీలైనా, పురుషులైనా, తుదకు బాలురైనా దండనార్హులేగాని మన్నించదగ్గ వారుకారని ఇక్కడ తెల్లమౌతుంది. క్రతువు చెయ్యడం ఎంత కష్టమో, క్రతువులాంటి సత్కృతులు చెయ్యడం కూడా అంతేకష్టమని దీన్నిబట్టి గ్రహించవచ్చు.

### 2.9.4 సీతాకల్యాణం :

యాగం పూర్తికాగానే విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంటబెట్టుకుని మిథిలకు బయలుదేరాడు. మార్గశ్రమ తెలియకుండా విశ్వామిత్రుడు వారికి కథలు చెప్తూ ముందుకు సాగాడు. మార్గమధ్యంలో గౌతమ మహర్షి తపోవనం వచ్చింది. భర్త శాపానికి గురైన అహల్య రాముని పాదధూళి శోకగానే శాపం నశించి తన రూపం ధరించింది. రామ, లక్ష్మణ, విశ్వామిత్రులు మిథిలానగరం చేరుకున్నారు. జనకుడు వారికి మంచి ఆతిథ్యమిచ్చాడు. రాముడు విశ్వామిత్రుని

అనుమతితో శివుని వింటిని ఎక్కుపెట్టాడు. అది విరిగిపోయింది. జనకుడు సంతోషించాడు. సీతను రాముడికిచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు. దశరథునికి వర్తమానమంపాడు. దశరథుడు సపరివార సమేతంగా మిథిలకు చేరుకున్నాడు. సీతారామ కల్యాణం వైభవోపేతంగా జరిగింది. ఈ వివాహంతో పాటే ఊర్మిళను లక్ష్మణుడికి, మాండవిని భరతుడికి, శ్రుతకీర్తిని శత్రుఘ్నుడికి ఇచ్చి జనకుడు వివాహాలు జరిపించాడు.

వివాహ కార్యక్రమాలు పూర్తయ్యాక కొడుకులను, కోడళ్ళను వెంటబెట్టుకుని దశరథుడు అయోధ్యకు బయలుదేరాడు. దారిలో పరశురాముడు తారసపడ్డాడు. తన గురువైన శివుని ధనస్సును విరిచినందుకు మహోగ్రతను ప్రకటించాడు. శ్రీరాముడు మేటి విలుకాడైతే తన చేతిలోవున్న విష్ణువు ధనస్సును ఎక్కుబెట్టమని సవాలు చేశాడు. శ్రీరాముడు అతని చేతి విల్లందుకున్నాడు. సునాయాసంగా ఎక్కుపెట్టాడు. పరశురాముడు అందించిన వింటి ద్వారా రాముడతని బలాన్ని, తేజస్సును హరించాడు. తాను, శ్రీరాముడు విష్ణుదేవుని అంశలేనని పరశురాముడు గుర్తించాడు. రాముడితో పరశురాముడు ఈ విషయం తెలియజేశాడు.

*॥ఉ॥ కావున నీవు రాఘవ, జగత్త్రయకర్తవు; సర్వదేవతా*
*దేవుఁడవైన విష్ణుఁడవు; తెల్లము నాకిటులౌట నిందగా;*
*దీవిజయంబు నావిజయ; మేనును నీవును వైష్ణవాంశ సం*
*భావిత భద్రమూర్తులము; పంకజనాభుని లీల లిన్నియున్.* [43]

రఘువంశ సంభూతుడైన రామా! నీవు మూడు లోకాలకు కర్తవు. దేవతలకందరికీ దేవుడైన విష్ణుదేవుడవు. ఇది నాకు స్పష్టమైంది. నీ విజయం కూడా నా విజయమే. ఎందుకంటే మనమిద్దరమూ విష్ణుదేవుని అంశలోనే జన్మించిన వాళ్ళం. ఇవన్నీ విష్ణుదేవుని లీలలే అని తాత్పర్యం.

పరశురాముడు; రాముడు కూడా విష్ణుదేవుడి అంశమేనని గుర్తించడం గమనార్హం. రామ, పరశురాముల యుద్ధోత్సాహం కూడా విష్ణుదేవుడి లీలల్లో ఒకటేనని అభిప్రాయం.

పరశురాముడు రాముడికి ప్రదక్షిణం చేసి తపస్సు చేసుకోవడానికి మహేంద్ర పర్వతం మీదికి వెళ్ళాడు. దశరథుడు ఎంతగానో సంతోషించాడు. అందరూ అయోధ్య చేరుకొని సుఖంగా కొంత కాలం గడిపారు.

భర్తకు తగిన భార్యను ఎంపిక చేసుకోవడం ఒక ఎత్తైతే ఆనాటి రాచరికపు వ్యవస్థలో భార్యకు తగిన భర్తను ఎంపిక చేసుకోవడం కూడా మరో ఎత్తు. దమయంతీ స్వయం వరం, ఇందుమతీ స్వయం వరం, సీతా స్వయంవరం, ద్రౌపదీ స్వయం వరం ఈకోవకే చెందుతాయి. " తాడెక్కేవాడొకడుంటే వాడి తలదన్నే వాడింకొకడు" అనే సామెత ప్రసిద్ధం. తాను అజేయుడనుకున్న పరశురాముడు రాముడి చేతిలో పరాజయంపాలు కావడం దీన్నే సూచిస్తుంది.

**2.9.5** రామవన గమనం :

దశరథ మహారాజు అరవైవేల సంవత్సరాలు రాజ్యపరిపాలన చేశాక తన రాజ్యభారాన్ని కుమారుడైన రాముడికి అప్పగించాలనుకున్నాడు. హితులను, సన్నిహితులను, సచివులను రావించి సంప్రదించాడు. వారంతా శ్రీరామ పట్టాభిషేకానికి ఏకగ్రీవంగా అంగీకరించారు. వశిష్ఠ మహర్షి రామ పట్టాభిషేక ముహూర్తం నిర్ణయించాడు. పట్టాభిషేకాన్ని పురస్కరించుకొని అయోధ్యా నగరాన్ని అలంకరించారు. కైక ఆంతరంగిక దాసి మంథర చెవిలో రామ పట్టాభిషేక వార్త పడింది. ఆమె తీవ్రంగా స్పందించింది. ఆ పట్టాభిషేకాన్ని ఎలాగైనా భగ్నం చేయాలనుకుంది. రాముడు రాజైతే కైకకు,భరతుడుకి కలిగే అనర్థాల గురించి వివరంగా తెలియజేసింది. కైక మంథర దుర్బోధతో మనసు మార్చుకుంది.

మందర సూచన మేరకు పద్నాలుగు సంవత్సరాలు రామ వనవాసం, భరత పట్టాభిషేకం వరాలుగా ఇవ్వవలసిందిగా దశరథుడ్ని కైక ఒత్తిడి చేసింది. దశరథుడు దిగ్భ్రమ చెందాడు. మూర్ఛిల్లాడు. కైక రాముణ్ణి పిలిచింది. తన వరాల విషయం తెలియజేసింది. రాముడు సమ్మతించాడు. సీతా లక్ష్మణులతో కలిసి నారబట్టలు ధరించి వనానికి బయలుదేరాడు. అయోధ్య పౌరులు కొంత దూరం వెంబడించారు. శృంగిబేరి పురాన్ని పాలించే గుహుడు రామ లక్ష్మణులను, సీతను గంగానది దాటించాడు.

జ్యేష్ఠ కుమారునికి రాజ్యాభిషేకం చేయడం రఘువంశ రాజుల ఆనవాయితి. దశరథుడు భార్యకిచ్చిన మాటను కాపాడుకోవడం కూడా చాలా ముఖ్యమే. ఈ రెండు ధర్మాల నడుమ పడి దశరథుడు నలిగిపోయాడు. తండ్రికిచ్చిన మాటను కాపాడటం కోసం రాముడు తన సుఖమయ జీవితాన్ని త్యాగం చేశాడు. రాజ్యాన్ని పరిత్యజించాడు. త్యాగం ఎంత గొప్పదో ఇక్కడ గ్రహించవచ్చు. రాముని ఉన్నత వ్యక్తిత్వానికి సజీవ సాక్ష్యంగా ఈ సంఘటన నిలిచిపోతుంది.

### 2.9.6 పాదుకా పట్టాభిషేకం :

రామాదులు గంగానదిని దాటి కీకారణ్యంలో ప్రవేశించారు. ప్రయాగ చేరుకుని అక్కడ నుంచి భరద్వాజ మహర్షి ఆశ్రమానికి వెళ్ళారు. మహర్షి దంపతులను పూజించి వారి ఆతిథ్యం స్వీకరించారు. యమునా నది దాటి చిత్రకూట పర్వత ప్రాంతానికి వెళ్ళారు. అక్కడ పర్ణశాల నిర్మించుకుని నివశింపసాగారు.

రామ వియోగంతో దశరథుడు మరణించాడు. వశిష్ఠుడు మొదలైన పెద్దలు కేకయ రాజ్యానికి వెళ్ళిన భరత, శత్రుఘ్నులను రప్పించారు. తన తల్లి వల్లనే రాముడు అడవుల పాలయ్యాడని భరతుడు తెలుసుకున్నాడు. తల్లి మీద కోప్పడ్డాడు. రామ వనగమనానికి విచారించాడు. రాముడు లేని అయోధ్యలో తానుండజాలనన్నాడు. అరణ్యానికి వెళ్ళి రాముణ్ణి మళ్ళీ తీసుకు వస్తానన్నాడు. రాముడు రాకపోతే తానుకూడా అడవుల్లోనే వుండిపోతానన్నాడు. దశరథునికి పరలోక క్రియలు నిర్వర్తించాడు.

శత్రుఘ్నుణ్ణి, ఇతర పెద్దలను వెంటబెట్టుకొని రాముణ్ణి తీసుకు వచ్చేందుకు భరతుడు బయలు దేరాడు. దారిలో గుహుడతనికి తారస పడ్డాడు. భరతుడు రాముడికి అపకారం చేయవస్తున్నాడని గుహుడు మొదట భావించాడు. భరతుని అభిప్రాయం తెలుసుకుని అతన్ని చిత్రకూటానికి తీసుకువెళ్ళాడు. లక్ష్మణుడు కూడా మొదట అపార్థం చేసుకున్నప్పటకీ తర్వాత శాంతించాడు. తండ్రి మరణవార్తను రాముడు భరతాదుల ద్వారా తెలుసుకున్నాడు. ఎంతగానో విచారించాడు. తండ్రికి ఉత్తర క్రియలు నిర్వహించాడు. భరతుడు రాముణ్ణి

అయోధ్యకు రమ్మని ప్రాధేయపడ్డాడు. రాముడు రాజ్యం కన్నా పితృవాక్పాలనమే తనకు ముఖ్యమన్నాడు. పద్నాలుగు సంవత్సరాలు పూర్తయ్యాకే అయోధ్యకు వస్తానన్నాడు. భరతుడు చేసేదిలేక రామ పాదుకలు తీసుకొని నందిగ్రామం చేరుకున్నాడు. అక్కడ వాటిని ప్రతిష్ఠించి వాటి తరఫున రాజ్యం పాలించసాగాడు.

రాముడు స్వయంగా విష్ణువే అయినప్పటికీ భరద్వాజ మహర్షిని పూజించి ఆశీస్సులు పొందడం మానవులు పెద్దల పట్ల కనబరచవలసిన విధేయతను తెలియజేస్తూవుంది. భరతుడు తల్లిని తిరస్కరించి రాముణ్ణి ఆశ్రయించడం అతని పట్ల గల అచంచల భక్తిని ఆవిష్కరిస్తుంది. భరతుడు ప్రాధేయపడినప్పటికీ పితృవాక్పాలనా ప్రతిజ్ఞను నెరవేర్చుకోవాలనుకోవడం రాముని మనోదార్ఢ్యానికి, ధర్మ దీక్షకు అద్దం పడుతుంది.

### 2.9.7 సీతాపహరణం :

సీతారామ లక్ష్మణులు చిత్రకూటం నుంచి దండకారణ్యానికి వెళ్ళారు. అక్కడ ఎక్కువ సంఖ్యలో రాక్షసులు నివసిస్తూ వున్నారు. వారి బాధ నివారించి తమను కాపాడవలసిందిగా అక్కడి ఋషులు రాముణ్ణి ప్రార్థించారు. రాముడు వారికభయమిచ్చాడు. చాలా మంది రాక్షసులను చంపివేశాడు. విరాధుడనే రాక్షసుణ్ణి వధించి అతనికి శాపవిమోచనం చేశాడు. ఋషుల ప్రశంసను పొందాడు. వారు ముగ్గురూ పంచవటి చేరుకొని పర్ణశాల నిర్మించుకున్నారు.

రావణుడి చెల్లెలు శూర్పణఖ రాముడి జగన్మోహనాకారం చూసి మోహించింది. రాముడు లక్ష్మణుని చూపాడు. లక్ష్మణుడు తిరస్కరించాడు. శూర్పణఖ సీతను మ్రింగబోయింది. లక్ష్మణుడు ఆ రాక్షసి ముక్కు, చెవులు ఖండించాడు. ఆమె జనస్థానం వెళ్ళి తన సోదరులైన ఖర, దూషణులకు మొరపెట్టుకుంది. ఖరదూషణులు వేల మంది రాక్షస వీరులతో రాముడి మీదికి యుద్ధానికి వచ్చారు. రాముడొక్కడే వారినందరినీ సంహరించాడు. శూర్పణఖ లంకకు వెళ్ళి జరిగిన వృత్తాంతమంతా రావణుడికి నివేదించింది. సీత అందం గురించి చెప్పింది. ఆమెను పొందడం రావణుడి అదృష్టం అంది. దశకంఠుడు వివశుడయ్యాడు. మారీచుడి సహాయం కోరాడు. అతడు మొదట తిరస్కరించాడు.

రావణుడికి హితవు చెప్పాడు. రావణుడు చంపుతానని బెదిరించడంతో మారీచుడు అంగీకరించక తప్పలేదు.

మారీచుడు బంగారు లేడిగా సీతారామ లక్ష్మణులకు కనిపించేలా పర్ణశాల ముంగిట తిరుగసాగాడు. సీత ఆ బంగారు లేడిని చూచి ముచ్చటపడి తనకు కావాలంది. లక్ష్మణుడు వారించినా వినకుండా రాముడాలేడివెంట వెళ్ళాడు. చాలా దూరం తరుముకొని వెళ్ళి విసిగి దానిమీద బాణం ప్రయోగించాడు. హా! సీతా! లక్ష్మణా! అంటూ బంగారు జింకరూపంలో వున్న మారీచుడు మరణించాడు. రాముడికేదో ఆపద వాటిల్లిందని సీత భయపడింది.లక్ష్మణుణ్ణి సహాయంగా వెళ్ళమంది. అది రాక్షసమాయ అని లక్ష్మణుడు సీతకు నచ్చజెప్పచూశాడు. ఆమె దుర్భాషలాడడంతో అతనికక్కడ నుంచి వెళ్ళక తప్పలేదు.

రావణుడు సన్యాసి వేషంలో పర్ణశాల దగ్గరికి వచ్చాడు. భిక్షపెట్టమని కోరాడు. సీత వెలుపలికి వచ్చింది. రావణుడు తన కోరికను ఆమెకు తెలియజేశాడు. ఆమె నిరాకరించింది. దశగ్రీవుడు తన నిజరూపం చూపి ఆమెను బలవంతంగా తన విమానం మీద కూర్చోబెట్టుకుని లంకాభిముఖుడై బయలుదేరాడు. అడ్డుపడి పోరాడిన జటాయువును హతమార్చాడు.

దుష్ట శిక్షణకే అవతరించిన రాముడు దండకారణ్యంలో తన పని కొనసాగించడం గమనార్హం. లంకలోని దుష్టరాక్షసులను వధించడానికే సీతాపహరణ జరిగినట్లు ఊహించవచ్చు. మారీచుడు రావణుని హితవు కోరినప్పటికీ రావణుడు చెప్పి నట్లే చేసి సీతాపహరణకు దోహదం చేయడం, రాముడు ఆపదలో వున్నాడని భ్రమ పుట్టించడం అతని నిజాయితీని తెలియజేస్తున్నాయి.

### 2.9.8 సీతాన్వేషణ :

రాముడు దారిలో తనకు తారస పడిన లక్ష్మణుడి వల్ల సీత ఆతురతను తెలుసుకున్నాడు. ఇద్దరూ పర్ణశాలకు వెళ్ళి చూసేసరికి సీత వారికి కనిపించలేదు. రాముడెంతో బాధపడ్డాడు. సీతను పిలుస్తూ పరిసర ప్రాంతాల్లో వెతికాడు. ఆమె కనిపించక పోయే సరికి అతని హృదయం దుఃఖంతో నిండిపోయింది.

లక్ష్మణుడు ఎంత ఓదార్చినా లాభం లేకపోయింది. విశేషజ్ఞుడైన రాముడికి దుః ఖం వల్ల కలిగే అనర్థాలను లక్ష్మణుడు చెప్పవలసి వచ్చింది.

॥కం॥ "శోకము బొందిన వానిన్
భీకర రోగములు సెందుఁబ్రథులార్థంబుల్
సేకుఱవు వాని కెప్పుడు
శోకముగని విడుచువాడు సుజ్ఞాని నృపా!"[44]

రాజా! దుఃఖ పొందిన వారికి భయంకర రోగాలు వస్తూవుంటాయి. మేటి మంచి విషయాలేవి వాళ్ళకు చేకూరవు. అందువల్ల శోకాన్ని అనుభవించి విడిచిపెట్టేవాడే సుజ్ఞాని అని భావం.

సాక్షాత్ విష్ణుస్వరూపుడైన రాముడంతటి వాడిని కూడా శోకము ఆవహించింది. పర్యవసానంగా అతడు ఉద్విగ్నతకు గురయ్యాడు. లక్ష్మణుడు శోకాన్ని పరిహరించవలసిన ఆవశ్యకతను రాముడికి తెలియజేయడం గమనార్హం. ఈ పద్యం రాముడికే కాదు లోకులందరికీ కూడా వర్తించే విధంగా రూపొందించబడింది.

రామ లక్ష్మణులు సీతను వెతుక్కుంటూ అడవిలో ముందుకు నడిచారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న జటాయువు వారికి తారసిల్లాడు. రావణాసురుడు సీతను తీసుకెళ్ళిన దుర్వార్త చెప్పి కన్నుమూసాడు. తనకోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన జటాయువుకు రాముడు దహన సంస్కారం చేశాడు. కబంధుడనే రాక్షసుడు రామ లక్ష్మణుల మీదికి రాగా రాముడతనిని హతమార్చాడు. శాప విముక్తుడైన కబంధుడు దివ్యరూపం ధరించి వెళుతూ ఋశ్యమూక పర్వతం మీద నివసించే సుగ్రీవునితో సఖ్యం చేయమని సూచించాడు. రామలక్ష్మణులు ముందుకు వెళుతూ మహాభక్తురాలు శబరిని కలుసుకున్నారు. ఆమె ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించారు. రాముడామెకు మోక్షం ప్రసాదించాడు. సోదరులిద్దరూ కొంత దూరం నడిచి పంపాసరోవర తీరం చేరుకున్నారు. దాని సమీపంలోనే ఋశ్యమూక పర్వతం వుంది. సుగ్రీవుడు హనుమదాది మంత్రులతో కలిసి ఆ పర్వతం మీద నివసిస్తూవున్నాడు.

రాముడు తనకోసం పోరాడి ప్రాణం విడిచిన జటాయువుకు దహన సంస్కారం చెయ్యడం ఇక్కడ చెప్పుకోదగ్గ అంశం. మానవ రూపంలో వున్న రాముడు పక్షిజాతికి చెందిన జటాయువును మానవ స్థాయికి చెందిన వాడు గానే పరిగణించడం అతని ఉదాత్త సంస్కారాన్ని ఆవిష్కరిస్తుంది. ఎవరైనా మేలు చేస్తే వారికి కృతజ్ఞత చూపడం ఉత్తమ మానవ ధర్మమనిపించుకుంటుంది. సమయోచిత సహాయం స్వల్పమైనప్పటికీ ప్రపంచంలోనే అది అత్యధికమైందిగా పరిగణించదగివుందని తమిళ కవి తిరువళ్ళువర్ తన తిరుక్కురళ్ గ్రంథంలో తెలిపివుండడం ఇక్కడ గమనార్హం.

### 2.9.9 రామ సుగ్రీవుల మైత్రి :

పంపాతీరంలో రామలక్ష్మణులు సుగ్రీవుడికి కనిపించారు. వారు వాలి పంపగా వచ్చిన వారని భయపడ్డాడు. వెళ్ళి వారెవరో, ఎందుకు వచ్చారో తెలుసుకు రమ్మని సుగ్రీవుడు హనుమంతుడ్ని పంపాడు. హనుమంతుడు రామలక్ష్మణులను కలుసుకున్నాడు. వారిని గురించి తెలుసుకున్నాడు. తాను సుగ్రీవుడి దగ్గర నుంచి వచ్చినట్టు చెప్పాడు. రామలక్ష్మణులు సుగ్రీవుడి మైత్రిని కోరారు. హనుమంతుడు వారిని తీసుకువెళ్ళి సుగ్రీవుడితో కలిపాడు. భార్యను, రాజ్యాన్ని పోగొట్టుకున్న వారిద్దరూ పరస్పరం సహాయం చేసుకునేందుకు ప్రతినబూనారు.

రాముడు తన బలాన్ని నిరూపించుకునేందుకు గుట్టగా పడివున్న దుందుభి అనే రాక్షసుడి కళేబరాన్ని దూరంగా పడేట్టు కాలితో తన్నాడు. సప్తతాలభంజనం చేశాడు. సుగ్రీవుడితో పోరాడుతున్న వాలిని చెట్టుచాటునుంచి ఒకే బాణంతో నేలకూలేట్టు చేసాడు. సుగ్రీవుడు కిష్కింధకు రాజయ్యాడు. వాలి కుమారుడైన అంగదుడు యువరాజయ్యాడు. సుగ్రీవుని భార్య రుమ మళ్ళీ అతడికి లభించింది. వర్షాకాలం వెళ్ళాక అనుకున్న ప్రకారమే సీతాన్వేషణకు సుగ్రీవుడు వానరులను పంపాడు. మిగిలిన వానరులు తక్కిన మూడు దిక్కులకు వెళ్ళగా, హనుమంతుడు-అంగదుడు-జాంబవంతుడు దక్షిణ దిక్కుకు వెళ్ళారు. హనుమంతుని సామర్థ్యాన్ని అంచనావేసిన రాముడు అతని చేతికి తన అంగుళీయకమిచ్చాడు. సీత కనిపిస్తే తన ఆనవాలుగా దానినామెకిమ్మని కోరాడు. సీతను చూచి వచ్చి తమ రఘువంశాన్ని, తన ప్రాణాలను నిలుపమన్నాడు.

॥కం॥ జానకి వెదకగ జని కని
యానందము తోడవచ్చి, యాదట రఘుసం
తానము నా ప్రాణంబులు
మానుగఁగలుగంగజేయు; మారుత పుత్రా.[45]

ఆంజనేయా! జానకిని వెదకడానికి వెళ్ళి సంతోషంతో తిరిగి వచ్చి ఆపైన నాప్రాణాలను, రఘువంశాన్ని మనోజ్ఞంగా నిలుపుమని తాత్పర్యం.

"మానుగ గలుగంగజేయు" అనే ప్రయోగాన్ని బట్టి సీతాపహరణం వల్ల రాముని ప్రాణాలు, రఘువంశం తాత్కాలికంగా నశించాయనే అభిప్రాయం ధ్వనిస్తూవుంది. 'ప్రస్తుతం నేను జీవశ్చవంగానే వున్నాను సుమా!' అని రాముడు చెప్పినట్లెయ్యింది. ఇది రాముని దుస్థితిని తెలియజేస్తుంది. హనుమంతుని భుజస్కందాల మీద పెట్టబడిన బృహత్తర బాధ్యతను కూడా గుర్తు చేస్తుంది.

రాజులు శత్రురాజులకు భయపడడం, భద్రతపట్ల జాగ్రత్త వహించడం పరిపాటి. అన్నదమ్ములు కూడా పరస్పరం శత్రురాజులుగా ప్రవర్తించడం ఎప్పటినుంచో కనిపిస్తుంది. ఒకేరకమైన స్థితిలో వున్న వాళ్ళు, ఒకే అనుభూతిని పొందిన వాళ్ళు, ఒకేరకమైన సమస్యను ఎదుర్కొనేవాళ్ళు తొందరగా స్నేహితులవుతారు. పరస్పరం సహాయం చేసుకుంటారు. ఎంత బలాఢ్యుడైనా సమయానుకూలంగానే బలప్రదర్శన చెయ్యాలేకానీ ఎప్పుడుపడితే అప్పుడు కాదు. ఈ అంశాలన్నీ రామసుగ్రీవుల మైత్రీ ఉదంతం ద్వారా వెల్లడౌతాయి.

### 2.9.10 లంకాదహనం :

హనుమదాది వానరులు సీతను వెతుక్కుంటూ దక్షిణం వైపుకు బయలు దేరారు. మహేంద్ర పర్వతంలో వారికి సంపాతి అనే పక్షిరాజు కనిపించాడు. అతడు జటాయువు అన్న. దశగ్రీవుడు సీతను తీసుకువెళ్ళి లంకలో చెరపెట్టినట్టు అతడావానరులకు చెప్పాడు. హనుమంతుడు వానరుల ప్రేరణతో మహేంద్ర పర్వతం నుంచి నూరు యోజనాల సముద్రాన్ని అవలీలగా దాటాడు. లంకిణిని పడగొట్టి లంకలో ప్రవేశించాడు. సీతకోసం లంకంతా కలయతిరిగాడు. అంతః పురాలు గాలించాడు. తుదకు అశోకవనంలో శోకదేవతలావున్న సీతను చూశాడు.

రావణాసురుడు అప్పుడే వచ్చి సీతమీద తనకు గల వలపును తెలిపాడు. ఆమె తృణీకరించగా దుర్భాషలాడి వెళ్ళాడు.

హనుమంతుడు వెళ్ళి సీతకు నమస్కరించాడు. తననామెకు పరిచయం చేసుకున్నాడు. రాముడు పంపగా వచ్చినట్లు చెప్పాడు. ఆనవాలుగా రాముడు తనచేతికిచ్చి పంపిన ముద్రికనామెకు సమర్పించాడు. సీత సంతోషించింది. తన కష్టాలనతనితో చెప్పుకుంది. రాముడు త్వరగా వచ్చి తీసుకుపోకపోతే తనకు మరణమే శరణ్యమంది. తన దుస్థితిని రాముడికి తెలియజేయమని కోరింది. రాముడు వచ్చి యుద్ధంలో రావణుణ్ణి వధించి సీతను తీసుకుపోతాడని ఆంజనేయుడామెకు బరోసా ఇచ్చాడు. సీత అనుమతితో అక్కడ నుంచి బయలుదేరాడు.

ఆంజనేయుడు రావణుడికి తన రాకను గురించి తెలియజేయాలనుకున్నాడు. రావణుడెంతో ఇష్టపడే అందమైన అశోకవనాన్ని ధ్వంసం చేశాడు. సీత వున్న చోటును మాత్రం మినహాయించాడు. కాపలావున్న రాక్షసులు అతని మీద కలయబడ్డారు. హనుమంతుడు సునాయాసంగా వారిని వధించాడు. హతశేషులు వెళ్ళి రావణుడికావార్త చెప్పారు. హనుమంతుణ్ణి హతమార్చిరండని మహావీరులు, బలవంతులు అయిన రాక్షసులెందరినో రావణుడు పంపాడు. మారుతి వారినందరినీ మట్టుబెట్టాడు. రావణుడి కుమారుడైన అక్షయుడిని హతమార్చాడు. మేఘనాథుడు వచ్చి బ్రహ్మాస్త్రం ప్రయోగించగా ఆంజనేయుడు దానికి కట్టుబడ్డాడు. ఇంద్రజిత్తు ఆంజనేయుడిని బంధించి తీసుకువెళ్ళి రావణుడి సమక్షంలో నిలిపాడు.

రావణుడు హనుమంతుణ్ణి అధిక్షేపిస్తూ చులకనగా మాట్లాడాడు. తాను రామదూతననీ, సీత జాడ తెలుసుకునిపోవడానికి వచ్చాననీ ఆంజనేయుడు చెప్పాడు. సీతను రాముడికప్పగించి క్షమాపణ కోరడం హితకరమన్నాడు. రావణుడికి కోపం వచ్చింది. అతనిని వధించమని రాక్షసులనాదేశించాడు. విభీషణుడు వారించాడు. దూతను చంపడం ధర్మవిరుద్ధమన్నాడు. రావణుడి సూచన మేరకు రాక్షసులు హనుమంతుని తోకకు నిప్పంటించారు. అతడానిప్పుతో లంకను కాల్చి సముద్రంలో తోకను చల్లార్చుకున్నాడు. మళ్ళీ సీత దగ్గరకు వచ్చి ఆమె దీవెనలు అందుకున్నాడు. సముద్రం దాటి అంగదాది వానర వీరులను

కలుసుకున్నాడు. వారంతా కలిసి కిష్కింధ చేరుకున్నారు.హనుమంతుడు రాముడి దగ్గరకు వెళ్ళాడు. 'చూశాను సీతను' అని అతనికి ఊరట కలిగించాడు. సుగ్రీవుడు పెద్ద ఎత్తున వానర సైన్యాన్ని సమకూర్చుకుని రామలక్ష్మణులతో కలిసి సముద్రతీరం చేరుకున్నాడు.

హనుమంతుడు సీతకు ఊరట కలిగించే విధంగా మాట్లాడడం, ఇతరుల బాధను పోగొట్టే అతని మనస్తత్త్వాన్ని ఆవిష్కరిస్తుంది. అవసరం లేకపోయినా అశోకవనంలో అల్లకల్లోలం సృష్టించి రావణుడి దృష్టిని ఆకర్షించడం వానరవీరుల బలాన్ని, రామానుచరుల బలాన్ని రావణుడికి పరోక్షంగా తెలియజేసి అతని మనసు మార్చాలనే ఆంజనేయుడి ఉద్దేశాన్ని తెలియజేస్తుంది. మేఘనాథుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి కట్టుబడడం బ్రహ్మాస్త్రానికి ఆంజనేయుడిచ్చే గౌరవాన్ని బోధపరుస్తుంది. ఆంజనేయుడు అనుకొనివుంటే ఆ అస్త్రానికి కట్టుబడకుండా కూడా ఉండివుండవచ్చు. దూతలు విపక్షం వారు చెప్పిపంపే వాటినే తెలియజేస్తారు కాబట్టి వారు దండనార్హులో, వధార్హులో కారు. ఈ రాజనీతినే విభీషణుడు తెలియజేశాడు. ఇది ఆ కాలపు సమాజంలో పాటింపబడే పద్ధతి కావచ్చు. సుగ్రీవుడు రాముడి కిచ్చిన మాట ప్రకారం ససైన్యంగా కదిలిరావడం మిత్ర ధర్మానికి, కృతజ్ఞతకు అతడిచ్చే విలువను వెల్లడిచేస్తుంది.

### 2.9.11 శ్రీరామ విజయం :

యుద్ధ సన్నాహాలను గురించి చర్చించేందుకు రాముడు సభ ఏర్పాటు చేశాడు. విభీషణుడు రావణుడికి హితవు చెప్పాడు. అతనికామాటలు రుచించలేదు. విభీషణుణ్ణి కొట్టి బహిష్కరించాడు. తల్లి సూచన మేరకు విభీషణుడు రాముణ్ణి శరణుజొచ్చాడు. రాముడతనికి అభయమిచ్చాడు. రావణసంహారానంతరం లంకాధిపతిగా చేస్తానన్నాడు.

రాక్షసులకు వానరులకు భీకర యుద్ధం ప్రారంభమైంది. వానరుల బలం ముందు రాక్షసులు నిలువలేకపోయారు. చెట్లను, పర్వతాలను ప్రయోగించి ఇరువైపుల వారు యుద్ధంచేశారు. రాక్షసులలో మేటివీరులంతా నేలకూలారు. రావణుడు తన సోదరుడైన కుంభకర్ణుణ్ణి నిద్రలేపి రాముడితో యుద్ధానికి పంపాడు. రాముడు ఒకే బాణంతో అతడిని హతమార్చాడు. దశగ్రీవుడు పంపిన మేఘ

నాథుడు భీకర యుద్ధం చేసి వానర సైన్యాన్ని చెల్లాచెదరయ్యేట్టు చేశాడు. లక్ష్మణుడు ఇంద్రజిత్తు మాయలను భగ్నంచేసి అతన్ని చంపివేశాడు. మేఘనాథుని మరణం రావణాసురిడికెంతో బాధ కలిగించింది.

రావణుడు మహాకోపంతో యుద్ధానికి వచ్చి శక్తిని ప్రయోగించాడు. సౌమిత్రి మూర్ఛిల్లాడు. ఆంజనేయుడు సంజీవిని పర్వతాన్ని తీసుకువచ్చి అతన్ని బ్రతికించాడు. రావణాసురుడు స్వయంగా వచ్చి యుద్ధంలో రాముణ్ణి ఎదుర్కొన్నాడు. మాతలి తీసుకువచ్చిన రథం మీద అధిరోహించి రాముడు రావణుడితో యుద్ధం చేశాడు. ఆదిత్య హృదయాన్ని పఠించి తన బాణంతో లంకాధిపుణ్ణి అంతం చేశాడు. దేవతలు హర్షధ్వానాలు చేశారు. పుష్ప వృష్టి కురిసింది. రాముడు లక్ష్మణుడి ద్వారా విభీషణ పట్టాభిషేకం జరిపించాడు. రామ తిరస్కృతితో సీత అగ్నిప్రవేశం చేసి తన నిష్కళంకతను నిరూపించుకుంది. వనవాస కాలం పద్నాలుగు సంవత్సరాలు పూర్తికావడంతో పుష్పకమెక్కి అందరూ అయోధ్యకు బయలుదేరారు.

ఒక వ్యక్తికి సంబంధించిన శత్రువు లిద్దరూ మిత్రులౌతారు అనే న్యాయం ప్రకారం రామవిభీషణులిద్దరూ ఏకపక్షం వారు కావడం గమనార్హం. త్రేతాయుగ యుద్ధ విధానం ఎలా ఉండేదో రామరావణ యుద్ధాన్ని బట్టి గ్రహించవచ్చు. భర్త తిరస్కరించి హృదయ విదారకంగా మాట్లాడినప్పటికీ సీతకు అతని పట్ల భక్తి కొంచెం కూడా చెదరక పోవడం గమనార్హం.

### 2.9.12 శ్రీరామ పట్టాభిషేకం :

రాముడు, అతని పరివారం నందిగ్రామం చేరుకున్నారు. భరతుడు ఎదురువచ్చి వారిని సాదరంగా సంభావించాడు. అందరూ కలిసి అయోధ్యకు వెళ్ళారు. అయోధ్యావాసుల ఆనందానికి మేరలేదు. వానరవీరులు నలుదిక్కులకూ వెళ్ళి పుణ్యతీర్థాలు తీసుకువచ్చారు. వశిష్ఠుడు, వామదేవుడు మొదలైన ఋషులు దగ్గరుండి రామపట్టాభిషేకం జరిపించారు. లక్ష్మణుడి కోరికమేరకు భరతుణ్ణి యువరాజుగా చేశారు. పట్టాభిషేకానంతరం రాముడు తనకు సహాయం చేసిన వారందరికీ అమూల్యమైన కానుకలిచ్చాడు. అనేక యాగాలు చేసి ప్రజలకు ఏ కొరతా లేకుండా పాలన సాగించాడు.

రాముడు మొదట పట్టాభిషేకానికి దూరమయినప్పటికీ అనేక కష్టాలనుభవించి మళ్ళీ పట్టాభిషిక్తుడయ్యాడు. రాజ్యలక్ష్మి తనంతటతానే రాముణ్ణి వరించింది. కష్టాలనుభవించే వారిని సుఖం స్వయంగా వచ్చి వరిస్తుందని అభిప్రాయం. ఆకలి, జబ్బు, వైరం లేని దేశమే మంచి దేశమని విజ్ఞుల విశ్వాసం. రాముని పరిపాలన కూడా ఈ మేరకే ఉండడం, ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లడం గమనార్హం.

విష్ణుదేవుని అవతార ప్రయోజనం దుష్టశిక్షణ - శిష్టరక్షణ. ఇది రామావతారంలో కూడా చక్కగా నెరవేరింది. మానవుడి ప్రతికోణం నుంచి దర్శించినప్పటికీ రాముడు ఆదర్శమానవుడుగానే గోచరిస్తాడు. ధర్మస్థాపన అనే అవతార లక్ష్యమేగాక ధర్మవైరుధ్యం సంభవించినప్పుడు దాన్ని ఎలా ఎదుర్కోవాలో? ఎలా నడుచుకోవాలో ? రాముడు ఆచరణ ద్వారా చూపించాడు. విష్ణుదేవుని దశావతారాల్లో రామకృష్ణావతారాలు ముఖ్యమైనవి. వాటిలోనూ సత్యధర్మ పరాయణంగా రామావతారం గోచరిస్తుంది.

## 2.10 కృష్ణావతారం :

దశావతారాల్లో కృష్ణావతారం పూర్ణావతారంగా పరిగణింపబడుతూ వుంది. రాముడు ఆదర్శ మానవుడు కాగా, కృష్ణుడు అందరికీ ఆరాధింపదగిన మేధావిగా వినుతికెక్కాడు. తక్కిన అవతారాల కంటే ఎక్కువగా దుష్టశిక్షణకు ఈ అవతారంలో ప్రాధాన్యమివ్వబడింది. దుష్టులను తాను స్వయంగా సంహరించడమే గాక ధర్మానుయాయులైన తన అనుయాయుల చేత కూడా చంపించడం ఇక్కడ విశేషం. భక్తులను కాపాడడంలో కూడా కృష్ణావతారం తక్కిన అవతారాలకు మార్గదర్శకంగా కనిపిస్తుంది. విష్ణువు కృష్ణుడుగా జన్మించడానికి దుష్టశిక్షణ మాత్రమే కారణం కాదు. సనక సనందనాదుల శాపానికి గురైన జయ విజయులను సముద్ధరించడం, పృశ్ని-సుతపుల కిచ్చిన వరాన్ని నిలబెట్టుకోవడం మొదలైన కారణాలెన్నో వున్నాయి.

కృష్ణుడు అంటే నల్లనివాడు, ఆకర్షణీయమైనవాడు అని అభిప్రాయం. కృష్ణుని ఆకారం, లీలలు, ఎత్తుగడలు, నవ్వుపుట్టించే బాల్య క్రీడలు, అతని పరిపూర్ణ వ్యక్తిత్వం అందరినీ ఆకర్షిస్తాయి. కృష్ణుడు మానవులకు అంతుపట్టని మానవాతీత

లీలలెన్నో చూపాడు. అందువల్ల అతన్ని విష్ణు స్వరూపుడు గానే భావిస్తారు. భక్తితో సేవిస్తారు.

### 2.10.1 అవతార నేపథ్యం :

ద్వాపర యుగం సగం గడిచాక భూమిమీద రాక్షసులు ప్రబలారు. రాజుల రూపంలో అక్రమానికి, అధర్మానికి ఆసరాగా నిలిచారు. దేవతలను ద్వేషించారు. సాధు సజ్జనులకు సంకటాలు కలిగించారు. ఒకవైపు ధర్మం నశించడం, మరోవైపు దుండగుల దుశ్చేష్టలు పెరగడం భూదేవికి సహింపలేని భారంగా తయారయ్యాయి. భూదేవి ఉపేక్షించలేక పోయింది. గోరూపం ధరించింది. బ్రహ్మ దగ్గరకు వెళ్ళి తన దుర్భర దుస్థితిని విన్నవించుకుంది.

బ్రహ్మదేవుడికి ఏంచేయాలో పాలుపోలేదు. భూదేవిని, దేవతలను వెంటబెట్టుకుని వైకుంఠం వెళ్ళాడు. పురుషసూక్తం పఠించాడు. విష్ణువును వివిధ విధాలా వినుతించాడు. విష్ణువు ప్రసన్నుడయ్యాడు. భూభారం తీర్చేందుకు భూలోకంలో తానవతరిస్తానన్నాడు. యదుకులంలో ప్రాదుర్భవిస్తానన్నాడు. దేవతలు, దేవతాంగనలు- గోప, గోపికలుగా జన్మించాలన్నాడు. వాసుదేవుడు వసుదేవుని కుమారుడుగా జన్మించాలనుకున్నాడు. తన కళతో ఆదిశేషుణ్ణి తనకు అగ్రజుడుగా జన్మింపజేయాలని నిశ్చయించుకున్నాడు.

ఉత్తరాపథంలో మధురదేశం, శూరసేనదేశం అనే రెండు యాదవ రాజ్యాలుండేవి. వాటిని మొదట శూరసేనమహారాజు పరిపాలించేవాడు. ఆయన తర్వాత ఉగ్రసేనమహారాజు రాజయ్యాడు. అతని కుమారుడు కంసుడు. తండ్రిని చెరసాలలో బంధించి తనను రాజుగా ప్రకటించుకున్నాడు. శూరసేన మహారాజు కుమారుడు వసుదేవుడికి, ఉగ్రసేన మహారాజు తమ్ముడు దేవకుని కుమార్తె దేవకికి వివాహమైంది. దేవకిని అత్తగారింట్లో వదిలిరావడానికి కంసుడు నవదంపతులతో వెళ్ళాడు. దేవకి అష్టమ గర్భంలో జన్మించేవాడి వల్లనే కంసుడికి మరణమని అశరీరవాణి చెప్పింది. కంసుడు దేవకిని చంపబోయాడు. వసుదేవుడు వారించాడు. ఆమెకు పుట్టబోయే బిడ్డలందరినీ అతనికప్పగిస్తానన్నాడు. కంసుడప్పటికి వారిని విడిచిపెట్టాడు.

దుష్టులు ప్రబలినప్పుడు శాంతి నశిస్తుంది. ధర్మం అస్తవ్యస్తమౌతుంది. పర్యవసానంగా ప్రజలకు సంతోషం కంటే బాధలే ఎక్కువవుతాయి. ఇది భూభారం పెరిగినట్లు సూచన. భూభారాన్ని తగ్గించి సమతుల్యాన్ని ఏర్పరచేందుకు స్థితికారకుడైన విష్ణువు ప్రయత్నిస్తుంటాడు. కృష్ణావతారంలో కూడా జరిగిందదే. రాక్షస ప్రవృత్తి గల కంసుణ్ణి, అతని పరివారాన్ని పరిమార్చేందుకు విష్ణువు, దేవతలు యాదవులుగా పుట్టడం సమంజసంగానే కనిపిస్తుంది. కంసుడు తన తండ్రిని బంధించి సింహాసనాన్ని చేజిక్కించుకోవడం ధర్మాతిక్రమణంగానే పరిగణింపబడుతుంది.

## 2..10.2 శ్రీకృష్ణజననం:

ఒక రోజు నారదుడు కంసుడి దగ్గరకు వచ్చాడు. దేవకి అష్టమగర్భం వల్ల అతనికి ముప్పు తప్పదన్నాడు. కంసుడు దేవకి, వసుదేవులను కారాగారంలో బంధించాడు. వారికి పుట్టిన ఆరుగురు బిడ్డలను నిర్దయగా హతమార్చాడు. దేవకి ఏడవ గర్భంలో విష్ణుదేవుని కళతో శేష అంశ ప్రవేశించింది. దేవకి ఏడవ గర్భస్థ పిండాన్ని రోహిణి గర్భంలో వుంచి రమ్మని విష్ణువు యోగమాయను పురమాయించాడు. రోహిణికి బలరాముడు జన్మించాడు. దేవకి ఎనిమిదవ గర్భంలో కృష్ణుడు జన్మించాడు. శ్రావణ బహుళాష్టమి రోహిణీ నక్షత్రంలో ఆయన అవతరించాడు. తల్లిదండ్రులకు మొదట విష్ణువుగానే కనిపించాడు. తనను రేపల్లెకు తీసుకువెళ్ళి నందుని ఇంట్లో యశోదాదేవి ప్రక్కన పడుకోబెట్టి అక్కడున్న ఆడ శిశువును మళ్ళీ ఇక్కడికి తీసుకురమ్మని వసుదేవుణ్ని ఆదేశించాడు.

కృష్ణుడు అప్పుడే పుట్టిన శిశువుగా మారిపోయాడు. వసుదేవుడు కృష్ణుడు చెప్పినట్టు చేశాడు. విష్ణువు ఆదేశంతో యశోదకు ఆడబిడ్డగా జన్మించిన యోగమాయను తీసుకువచ్చి దేవకి ప్రక్కన పడుకోబెట్టాడు. బిడ్డ ఏడవడంతో కంసుడికి వార్త వెళ్ళింది. అతడు వచ్చి దేవకి చేతిలో వున్న బిడ్డను బలవంతంగా లాక్కొని పైకెగురవేసి కత్తిపట్టాడు. యోగమాయ నిజరూపం ధరించింది. తనను చంపడం కంసుడి తరం కాదంది. కంసుణ్ణి చంపేవాడు పుట్టి పెరుగుతున్నాడంది. కంసుడికి భయం పట్టుకుంది. ఆ బాలుడెవరో కనిపెట్టి వధించేందుకు తన రాక్షస పరివారానికి చెందిన అనేకమందిని పంపించాడు.

అధర్మావలంబకుడు కాబట్టి శిశువులను సైతం హతమార్చేందుకు కంసుడు వెనుదియ్యలేదు. విష్ణువు దేవకీ గర్భంలో జన్మించినప్పుడు మొదట చతుర్భుజుడుగా దేవకీ - వసుదేవులకు దర్శనమివ్వడం ఇక్కడ గమనార్హం. ఈ విధంగా దర్శనమివ్వడంతో వారికి మూడు జన్మలలోనూ దర్శనమిచ్చినట్లైంది. పృశ్ని-సుతపులకు మొదటి జన్మలోనూ, అదితి-కశ్యపులకు రెండవ జన్మలోనూ, దేవకీ-వసుదేవులకు మూడవ జన్మలోనూ విష్ణువు దర్శనమిచ్చాడు. అతని భక్తవాత్సల్యాన్ని ఇది తెలియజేస్తుంది.

కృష్ణుడు రేపల్లెకు వెళ్ళకుండానే కంసుణ్ణి హతమార్చి వుండవచ్చు. అయితే తన శైశవ లీలలను ప్రదర్శించి ప్రజలను ఆనందపరచడం, కంసుని పరివారాన్ని ఒక్కరిని ఒక్కరినిగా వధించడం కృష్ణుని ఉద్దేశం కావచ్చు. యోగమాయ ద్వారా, నారదుని ద్వారా కంసుని మరణ రహస్యం అతనికి చేరవేయడం వల్ల కృష్ణుని మీదికి రాక్షసులనేకులను పంపడానికి దోహదమేర్పడుతుంది. వారిని వధించడానికి కృష్ణుడికి సులభమవుతుంది. ఈ కారణాల చేతనే కృష్ణుడు ప్రదర్శింపదగిన మహిమలున్నప్పటికీ సలక్షణంగానే శైశవం గడిపాడు.

### 2.10.3 శ్రీకృష్ణుడిబాల్యం :

కంసుడు పంపగా పూతన అనే రాక్షసి వ్రేపల్లెకు వచ్చింది. స్త్రీ రూపం ధరించి శ్రీకృష్ణుడికి పాలు ఇచ్చేందుకు సిద్ధమైంది. తన వక్షోజాల్లో పూసుకున్న విషం ఆ బాలుడి ప్రాణాలను హరిస్తుందని ఆమె అంచనా. కృష్ణుడు పూతన మాయను పసిగట్టాడు. పాలు తాగుతున్నట్లు నటిస్తూ రాక్షసి ప్రాణాలను పీల్చివేశాడు. ఆమె మరణించేటప్పుడు నిజరూపం ధరించి క్రిందపడిపోయింది. అపాయం తప్పినందుకు రోహిణి, యశోద, గోపికలు సంతోషించారు. పూతనలాగే దురుద్దేశంతో వచ్చిన శకటాసురుణ్ణి, తృణావర్తుణ్ణి కృష్ణుడు వధించాడు. అది వ్రేపల్లె ప్రజలకు ఆశ్చర్యం కలిగించింది.

కృష్ణుడు పెరిగి బాలుడయ్యాడు. ఎవరికీ తెలియకుండా మన్నుతినసాగాడు. తోటి గోపకులు దాన్ని పసిగట్టారు. యశోదకు ఫిర్యాదు చేశారు. యశోద కృష్ణుణ్ణి పిలిచి మందలించింది. కృష్ణుడు బిక్కముఖం వేశాడు. తాను మన్ను

తినలేదన్నాడు. కావలిస్తే తన నోరు చూసుకోమన్నాడు. కృష్ణుడు తెరిచిన నోటిలో లోకాలన్నీ ఆమెకు కనిపించాయి. యశోద ఆశ్చర్యానికి అవధులు లేవు. తనలో ఇలా అనుకుంది.

॥మ॥ *కలయో! వైష్ణవమాయయో! యితర సంకల్పార్థమో! సత్యమో!*
*తలఁపన్ నేరక యున్నదాననొ! యశోదాదేవిఁగానో! పర*
*స్థలమో! బాలకుఁడెంత! యీతని ముఖస్థంబైయజాండంబు ప్ర*
*జ్వలమై యుండుట కేమి హేతువొ!మహాశ్చర్యంబు చింతింపఁగన్!* [46]

నేను కలగనలేదు గదా? లేకపోతే ఇది విష్ణువు యొక్క మాయకాదు గదా? దీనిలో మరేదైనా అర్థముందా? లేకపోతే ఇదే సత్యమేమో? నాబుద్ధి పనిచేయడం లేదు? అసలు నేను యశోదనేనా? ఇది అసలు మాయిల్లేనా? లేకపోతే ఈ కుర్రవాడు ఎంత? వీని నోటిలో ఈ బ్రహ్మాండమంతా వెలుగులు చిమ్ముతూ ఉండడం ఎంతటి వింత? ఆలోచించి చూచిన కొద్దీ ఇదంతా ఎంతో ఆశ్చర్యంగా ఉన్నది అని భావం.

కృష్ణుడు మూడుసార్లు మాత్రమే తన విశ్వరూపం చూపాడు. మొదటిసారి యశోదకు, రెండవసారి కౌరవసభలోని వారికి, మూడవ సారి అర్జునుడికి. దీన్ని బట్టి కృష్ణుడు యశోదకిచ్చిన ప్రాధాన్యం బోధపడుతుంది.బాల్యమంటే మానసిక పరిపక్వత లేని దశ. అటువంటి బాల్యంలోనే కృష్ణుడు తన నోట్లో బ్రహ్మాండాన్ని ప్రదర్శించడం అతని మానవాతీత స్థితిని ఆవిష్కరిస్తుంది. ఈ పద్యంలో సామాన్య స్త్రీగా యశోదపొందిన ఆశ్చర్యం సహజంగా వ్యక్తమౌతుంది.

యశోద విష్ణుమాయ వల్ల తన పూర్వస్థితికి వచ్చి విశ్వరూప విషయాన్ని పూర్తిగా విస్మరించింది. కృష్ణుడు ఇరుగుపొరుగు ఇండ్లకెళ్లి పాలు, పెరుగు, వెన్న దొంగిలించి తినేవాడు. తోటి బాలకులకు పెట్టేవాడు. పాలకుండలను పగులగొట్టేవాడు. గోపస్త్రీలు వచ్చి కృష్ణుడి దుడుకు చేష్టలను యశోదకు మొరపెట్టుకున్నారు. యశోద ఆ బాలుణ్ణి రోటికి బంధించింది. తల్లిలేని సమయం చూసి కృష్ణుడారోలు ఈడ్చుకుంటూ మద్దిచెట్ల మధ్యగా వెళ్ళాడు. అవి పడిపోయాయి. నారదుడి శాపం వల్ల మద్దిచెట్లుగా మారిన నలకూబరుడు, మణిగ్రీవుడు శాపవిముక్తులయ్యారు. కృష్ణుడికి నమస్కరించి వెళ్ళిపోయారు.

ఒకరోజు కృష్ణుడు బలరాముడితోనూ తక్కిన గోపబాలకులతోనూ ఆవులు తోలుకుని అడవికి వెళ్ళాడు. ఆవులలో ఒక కొత్తదూడ వారికి కనిపించింది. కృష్ణుడు దానితోక, కాళ్ళు గట్టిగా పట్టుకుని సమీపంలోని చెట్టుకు మోది చంపాడు. చెట్టు రూపంలో వున్న కపిత్థాసురుడు, దూడరూపంలో వున్న వత్సాసురుడు అప్పటికప్పుడే అసువులు బాసారు. అదే విధంగా ధేనుకాసురుణ్ణి, బకాసురుణ్ణి కూడా కృష్ణుడు  మట్టుబెట్టాడు.

యమునా నదిలో కాళింది మడుగు వుంది. దానిలో కాళీయుడనే సర్పరాజు తన భార్యలతో కలిసి నివసించేవాడు. అతని విషంతో ఆమడుగులోని నీరంతా కలుషితమైపోయింది. ఉపయోగించడానికి వీలులేకుండా పోయింది. కృష్ణుడానీటిని శుభ్రం చేయాలనుకున్నాడు.మడుగులోనికి దూకాడు. ఆభయంకర శబ్దానికి కాళీయుడు పైకి వచ్చి కృష్ణుణ్ణి చుట్టివేశాడు.తన వాడి కోరలతో కాట్లు వేశాడు. కృష్ణుడు భయపడలేదు. ఎలాగో పాము పట్టు తప్పించుకుని పైకి వచ్చాడు. కాళీయుని పడగల మీద నాట్యంచేయసాగాడు. అది కాళీయునికి ప్రాణాంతకరంగా పరిణమించింది. కృష్ణుణ్ణి కాళీయుడు  విష్ణువుగా భావించాడు. అతని గర్వం అవిరైపోయింది. నందనందనుణ్ణి శరణువేడాడు. కాళీయుని భార్యలు కూడా పతిభిక్ష పెట్టమని ప్రార్థించారు. కృష్ణుడు తన నాట్యం చాలించి వారికభయ మిచ్చాడు. సముద్రంలో సంచరించమని వారందరినీ పంపివేశాడు.

కృష్ణుణ్ణి  భర్తగా పొందాలనే లక్ష్యంతో గోకులంలోని గోప కన్యలంతా కాత్యాయనీ వ్రతం ప్రారంభించారు. ఒకరోజు తెల్లవారు జామున యమునా హ్రదానికి వెళ్ళి స్నానానికి ఉపక్రమించారు. కృష్ణుడు దొంగచాటుగా వెళ్ళి తీరంలో విడిచివెళ్ళిన వారి బట్టలన్నిటినీ సంగ్రహించి పొన్నమాని మీదికెక్కి కూర్చున్నాడు. తమ చీరలిచ్చి వేయమని గోపికలు కృష్ణుణ్ణి  ప్రాధేయపడ్డారు. నది నుంచి వెలుపలికి వచ్చి తీసుకోమని కృష్ణుడు వారికి చెప్పాడు.ఏమి చేయడానికీ పాలుపోక కరాచ్ఛాదిత మర్మాంగులై వాళ్ళంతా బయటికి వచ్చారు. చీరలిమ్మని కోరారు. రెండు చేతులా పైకెత్తి నమస్కరిస్తేనే వారి వ్రతం సఫలమవుతుందని కృష్ణుడు తెలియజేశాడు. కృష్ణుడి సూచన మేరకే గోపికలందరూ అతనికి నమస్కరించి చీరలు పుచ్చుకున్నారు. కృష్ణుడు వారినాశీర్వదించాడు. కోరికలు నెరవేరు తాయన్నాడు. మోక్షం సిద్ధిస్తుందన్నాడు.

గోకులంలో ఇంద్రయాగం తలపెట్టారు. కృష్ణుడు ఇంద్రగర్వాన్ని హరించాలనుకున్నాడు. వారి ప్రయత్నాన్ని వారించాడు. గోవుల సమృద్ధికి తోడ్పడే పర్వతానికే పూజలు చేయమన్నాడు. తానే పర్వత రూపం ధరించి వారి పూజలందుకున్నాడు. నైవేద్యాలు స్వీకరించాడు. ఇంద్రుడికి గోపకుల మీద, కృష్ణుడి మీద కోపం వచ్చింది. గోకులం మీద శిలావృష్టి కురిపించమని మేఘాలను ఆదేశించాడు. ఏడురోజులు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. కృష్ణుడు గోవర్ధన గిరిని పైకెత్తి గొడుగుగా పట్టి గోకులం వారికందరికీ ఆశ్రయం కల్పించాడు. కృష్ణుడి సామర్థ్యానికి దేవేంద్రుడు ఆశ్చర్యపడ్డాడు. అతణ్ణి విష్ణువుగా గుర్తించాడు. స్వయంగా వచ్చి క్షమాపణ కోరుకున్నాడు.

ఈ ఉదంతాన్ని కృష్ణశతకకారుడు ఒక కందంలో పొందుపరిచాడు.

*॥కం॥ దేవేంద్రుఁడలుక తోడను*
*వావిరిగా ఱాళ్ళవాన వడిఁగురియింపన్*
*గోవర్ధన గిరియెత్తితి*
*గోవుల గోపకులఁగాచు కొరకై కృష్ణా!* [47]

దేవేంద్రుడు కోపంతో రాళ్ళవాన కురిపించగా గోవులను, గోపకులను కాచే నిమిత్తం గోవర్ధన గిరిని పైకెత్తావు కదా! అని భావం.

ఈ చిన్న పద్యంలో దేవేంద్రుని కోపం, పర్యవసానంగా చేసిన దుష్క్రియ, దానికి కృష్ణుడు చేసిన ప్రతిక్రియ, కృష్ణుడి జీవకారుణ్యం, దుర్జన గర్వాన్ని రూపుమాపే దృఢస్వభావం వ్యక్తమౌతున్నాయి.

కృష్ణుడు వృషభాకారంలో వచ్చిన అరిష్టాసురుణ్ణి వధించాడు. కుంభకుని మందలో వృషభాలుగా ప్రవేశించిన రాక్షసులు ఏడుమందిని హతమార్చి నీలాసుందరిని చేపట్టాడు. కంసుడు పంపగా అశ్వాకారంలో వచ్చిన కేశిని అంతం చేశాడు. తన మోహన మురళీరవంతో గోకుల గోపాంగనలను ఆకర్షించాడు. రాసక్రీడతోనూ, జల క్రీడతోనూ వారిని వినోదింపజేశాడు.

శ్రీ కృష్ణుడు శైశవంలోనూ, బాల్యంలోనూ వ్రేతలకు ముచ్చటగొలిపే ఎన్నో కార్యాలు చేశాడు. పాలు, వెన్నలు దొంగిలించి తినడం, సాటి పిల్లలతో

ఆడుకోవడం, గోవర్ధన గిరిఎత్తి అందరినీ కాపాడడం, గోపికల చీరలను దొంగిలించడం, కాళింది మడుగును అందరికీ ఉపయోగపడేలా చేయడం, రాసక్రీడ, జలక్రీడలు ఈ కోవకే చెందుతాయి. వ్రేపల్లె వాసుల అభిమానాన్ని చూరగొనడమే ఇక్కడ కృష్ణుడి ఆంతర్యం. అవతార ప్రయోజనాల్లో చాలా ముఖ్యమైన దుష్ట శిక్షణ లేదా రాక్షసవధ శైశవం నుంచే ప్రారంభించడం గమనార్హం. విష్ణువెత్తిన అవతారాల్లో వామన బాల్యం, కృష్ణ బాల్యం మానవాతీత ధోరణిలో సాగాయి. అందువల్లనే భారతీయులందరికీ బాలకృష్ణ తత్త్వమారాధ్యమైంది.

**2.10.4 కంసవధ :**

తాను పంపిన రాక్షసులందరినీ కృష్ణుడు హతమార్చడంతో కంసుడికి బాగా భయం పట్టుకుంది. నారదుడు వచ్చి కృష్ణుడే కంసుణ్ణి వధిస్తాడనీ, రామకృష్ణులిద్దరూ అతని మేనళ్ళుల్లేననీ చెప్పాడు. కంసుడి భయం ఇనుమడించింది. ఎలాగైనా కృష్ణబలరాములిద్దరినీ హతమార్చాలనుకున్నాడు. ధనుర్యాగం మిషతో వారిని మధురకు రప్పించాలని కుట్రపన్నాడు. రామకృష్ణులను తీసుకువచ్చేందుకు అక్రూరుణ్ణి వ్రేపల్లెకు పంపాడు. అక్రూరుడు వ్రేపల్లెకు వెళ్ళి రామకృష్ణులను సందర్శించాడు. కంసుడి ఆలోచనను వారికి తెలియజేశాడు. రామకృష్ణులిద్దరూ యశోదానందుల దగ్గర సెలవుతీసుకొని మధురకు ప్రయాణమయ్యారు.

దారిలో అక్రూరుడు నీళ్ళుత్రాగేందుకు యమున మడుగులో దిగాడు. రథంతోపాటు రామకృష్ణులిద్దరూ ఆమడుగు నీటిలో అతనికి కనిపించారు. ఆశ్చర్యంతో అతడు గట్టుకు వచ్చి చూశాడు. అక్కడ కూడా రథంలో వారు కనిపించారు. అతని ఆశ్చర్యానికి అవధులు లేకపోయాయి. గోపాలురతో కలిసి బలరామకృష్ణులు మధురానగరంలో ప్రవేశించారు. ఎదురుపడిన రజకుణ్ణి వధించి అమూల్యవస్త్రాలను పరిగ్రహించారు. సుదాముని ఇంటికి వెళ్ళి అతడిచ్చినమాలలు పుచ్చుకున్నారు. కుబ్జనుంచి సుగంధలేపనాలు తీసుకుని కృష్ణుడామెను నిర్వక్రగా, సౌందర్యవతిగా చేశాడు.

బలరామకృష్ణులిద్దరూ కంసుడి యాగశాలలో ప్రవేశించారు. కృష్ణుడు అక్కడవున్న ధనస్సును పైకెత్తి విరిచివేశాడు. ఎదుర్కొన్న కావలివాళ్ళను రామకృష్ణులు హతమార్చారు. మావటి వాళ్ళు కువలయాపీడమనే మదపుటేనుగును సోదరుల

మీదికి ఉసిగొల్పారు. కృష్ణుడు దాని మీదికి విజృంభించి క్రిందపడవేసి చంపాడు. దాని దంతాలతో మావటి వాళ్ళను మట్టుబెట్టాడు.

సోదరులిద్దరూ మల్లయుద్ధరంగంలో ప్రవేశించారు. కంసుడి ప్రేరణతో చాణూర, ముష్టికులనే మల్లులు వారితో తలపడ్డారు. కృష్ణుడు చాణూరుణ్ణి, బలరాముడు ముష్టికుణ్ణి సునాయాసంగా వధించారు. కంసుడి భయం హెచ్చింది. వాళ్ళను వెలుపలికి గెంటివేయమని భటులను ఆదేశించాడు. కృష్ణుడు ఆ మాటలు లక్ష్యపెట్టలేదు. అమాంతంగా అతని మీదికి విజృంభించాడు. కంసుడు కూడా కత్తిదూసి యుద్ధానికి సిద్ధమయ్యాడు. కృష్ణుడు తటాలున కంసుడి వెంట్రుకలు పట్టుకొని లాగి క్రిందపడవేశాడు. ఈ దృశ్యాన్ని బమ్మెరపోతన ఎంతో మనోహరంగా వర్ణించాడు.

*॥శా॥ పక్షీంద్రుండురగంబుఁబట్టు విధమొప్పన్ గేశబంధంబు లో*
*క క్షోభంబుగఁ బట్టి మౌళిమణులాకల్పాంత వేళాపత*
*న్న క్షత్రంబుల భంగిరాల రణసన్నాహంబు డిందించి రం*
*గక్షోణి బడఁద్రోచెఁ గృష్ణుఁడు వెసన్గంసున్ నృపోత్తంసునిన్.*[48]

పక్షులకు ప్రభువైన గరుత్మంతుడు పామును పట్టేరీతిగా శ్రీ కృష్ణుడు కంసుని జుట్టుముడి పట్టుకున్నాడు. సభలోని జనులంతా భయభ్రాంతులయ్యారు. ప్రళయ కాలంలో నక్షత్రాల లాగా కంసుని కిరీటంలోని మణులు జలజల నేలరాలాయి. యుద్ధసన్నాహం అణగించి క్షాత్రకులావతంసుడైన కంసుణ్ణి యదువల్లభుడు మల్లరంగస్థలం మీద పడద్రోసి వేశాడు.

ఇక్కడ కృష్ణ-కంస వైరాన్ని గరుడ-సర్ప వైరంతో పోల్చడం గమనార్హం. కంసుడు పాములాగా ఇతరులకు హానిచేసే స్వభావం కలవాడు. శ్రీకృష్ణుడు తద్భిన్నమనస్తత్వం కలిగివుండడమే గాక దుస్స్వభావాన్ని అంతం చేయడం కూడా ఇక్కడ చెప్పుకోదగివుంది.కంసుడు మరణించడంతో అతని సోదరులు శ్రీ కృష్ణుడి మీదికొచ్చారు. బలరాముడు వారినడ్డుకొని నిశ్శేషంగా హతమార్చాడు. బలరామ కృష్ణులిద్దరూ చెరసాలకు వెళ్ళి దేవకీ, వసుదేవులను విడిపించి వారి ఆశీస్సులు పొందారు. కంసుడు మరణించడంతో అతని తండ్రి ఉగ్రసేన మహారాజును కారాగారం నుంచి విడిపించారు. మునుపటిలాగే రాజుగా చేశారు.

బలరామకృష్ణులిద్దరినీ మధురకు రప్పించడం, కంసుడికీ వారికీ మధ్య సాగిన వైరంలో ఉచ్ఛఘట్టమని చెప్పుకోవచ్చు. భూమికి భారంగా పరిణమించిన వారిలో కంసుడు, అతని పరివారం కూడా ఉండడం గమనార్హం. వారివధతో దుష్టశిక్షణ ప్రథమ ఘట్టం పూర్తైనట్టు చెప్పకోవచ్చు. చాకలిని వధించి వస్త్రాలు పుచ్చుకోవడం రామకృష్ణుల ధైర్యసాహసాలకు నిదర్శనం. గంధమాల్యాదులలో లక్ష్మీదేవి నివసిస్తుందని పెద్దల నుడి.

విజయలక్ష్మిని కైవసం చేసుకోదలుచుకున్న సోదరులు యుద్ధానికి ముందే గంధమాల్యాలు ధరించడం శుభసూచకం. కంసుడి రాజ్యాన్ని తాము పాలించడమో, తమ వారిచేత పాలింపజేయడమో చేయకుండా కంసుడి తండ్రికే అప్పగించడం కృష్ణుడి నిస్స్వార్థాన్ని, ధర్మ నిబద్ధతను తెలియజేస్తుంది.

### 2.10.5 బలరామకృష్ణుల విద్యాభ్యాసం :

వసుదేవుడు ప్రియ పుత్రులైన రామకృష్ణులకు ఉపనయనం చేయించాడు. కాశిలో మహాపండితుడుగా ప్రసిద్ధి వహించిన సాందీపని దగ్గరకు వారిని పంపాడు. కృష్ణుడు సర్వజ్ఞుడైనప్పటికీ లోకానికి ఆదర్శంగా నిలిచేందుకు గురుకులంలో విద్యాభ్యాసం మొదలెట్టాడు. అరవైనాలుగు రోజుల్లోనే అరవైనాలుగు విద్యలను సునాయాసంగా అభ్యసించాడు. రామకృష్ణుల సామర్థ్యానికి గురువు నివ్వెర పోయాడు. గురుదక్షిణగా తన కుమారుని తెచ్చి ఇమ్మని కోరాడు. ప్రభాస తీర్థంలో స్నానం చేస్తూ తన కుమారుడు మునిగిపోయిన సంగతి చెప్పాడు. రామకృష్ణులిద్దరూ సముద్రతీరానికి వెళ్ళారు. తమ గురుపుత్రుని తెచ్చిఇమ్మని సముద్రుని కోరారు. సముద్రుడు వారి ముందుకొచ్చాడు. గురుపుత్రుణ్ణి పంచజనుడు మింగాడని చెప్పాడు. అతని నివాసాన్ని తెలియజేశాడు. కృష్ణుడు పంచజనుణ్ణి పట్టుకొని వధించాడు. ఆ రాక్షసుడి కడుపు చీల్చాడు. అతడి కడుపులో ఒక శంఖం కనిపించింది. దాన్ని కృష్ణుడు స్వీకరించాడు. పంచజనుడి కడుపులో నుంచి లభించడం వల్ల ఆ శంఖానికి పాంచజన్యమనే ప్రసిద్ధనామమేర్పడింది. కృష్ణుడు అక్కడి నుంచి యమసదనానికి వెళ్ళాడు. గురుపుత్రుని తీసుకురమ్మని యముడ్ని ఆదేశించాడు. సమవర్తి కృష్ణుడికి గురుపుత్రుని సమర్పించాడు. రామకృష్ణులిద్దరూ

గురుపుత్రుని వెంటబెట్టుకుని సాందీపని దగ్గరకు వచ్చారు. గురువు సంతోషానికి మేరలేదు. వారినాశీర్వదించి పంపివేశాడు.

తనకు అవసరం లేకపోయినా లోకం కోసం విద్యనభ్యసించడం కృష్ణుడి లోకోపకార ప్రీతిని ఆవిష్కరిస్తుంది. కృష్ణుడు విష్ణు స్వరూపుడు. స్వయంగానే దేవదేవుడు. సాందీపని కూడా అతనిని ఆరాధించవలసినవాడే అయినప్పటికీ కృష్ణుడు గురువునెంతో భక్తితో సేవించాడు. సలక్షణంగా శుశ్రూష చేశాడు. ఇది అతని అణకువను, ఆదర్శనీయ మనస్తత్వాన్ని అభివ్యక్తం చేస్తుంది. మొదట సముద్రుణ్ణి, తర్వాత సమవర్తిని ఆదేశించగలగడం ఆతని మానవాతీత మహోన్నత స్థితిని ద్యోతకం చేస్తుంది.

### 2.10.6 ద్వారకా నగర నిర్మాణం :

మగధ దేశాన్ని జరాసంధుడనే రాజు పాలించేవాడు. అస్థి, ప్రాప్తి అనేవారు ఇతని కుమార్తెలు. వారు కంసుని భార్యలు. కంసుడు మరణించాక వారెలాగో మగధదేశం చేరుకున్నారు. కృష్ణుడు కంసుణ్ణి వధించి తమకు వైధవ్యం కలిగించిన వార్త జరాసంధుడికి చెప్పారు. జరాసంధుడికి కోపం వచ్చింది. కృష్ణున్ని, యాదవ సమూహాన్ని నిర్మూలిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ఇరవైమూడు అక్షౌహిణుల సైన్యంతో మధురను ముట్టడించాడు. చేసేది లేక కృష్ణబలరాములు జరాసంధుడితో తలపడ్డారు. మొదట జరాసంధుడిదే పైచేయి. యాదవ సైన్యం కకావికలమైంది. మగధ సైన్యం ఆనంద పారవశ్యంతో హాహాకారాలు చేసింది. కృష్ణబలరాములు ఇతోధిక బలంతో శత్రుసైన్యం మీదికి విజృంభించారు. కృష్ణుడి ప్రేరణతో బలరాముడు నాగలి ధరించి శత్రుసైన్యాన్ని మట్టికరిపించాడు. జరాసంధుణ్ణి పట్టుకున్నాడు. వధించబోయాడు. కృష్ణుడతన్ని వారించాడు. జరాసంధుణ్ణి విడిపించాడు. ఓటమికి చింతించవద్దన్నాడు. సైన్యాన్ని సమకూర్చుకొని మళ్ళీ యుద్ధానికి రమ్మన్నాడు. వైరులను హతమార్చమన్నాడు. అలా చేయలేని పక్షంలో మరణించుమని హితవు చెప్పాడు. జరాసంధుడు బిక్కచచ్చి హతశేషులైన రాజ సైన్యంతో వెనుదిరిగాడు.

కాలయవనుడు కృష్ణుడి మీదికొచ్చాడు. మధురను ముట్టడించాడు. కాలయవనుడి చావు తన చేతిలో లేదని కృష్ణుడు పసిగట్టాడు. అతనికి కనిపించేలా

పరుగుతీశాడు. కాలయవనుడు ఒంటరిగా అతణ్ణి వెంబడించాడు. కృష్ణుడు వేగంగా వెళ్ళి ఒక గుహలో ప్రవేశించి అదృశ్యుడయ్యాడు. కాలయవనుడు కూడా గుహలోకి ప్రవేశించాడు. అక్కడే పడుకొనియున్న ముచుకుందుడే కృష్ణుడని భావించాడు. మాయావీ! నన్ను వంచించలేవులే అని అతణ్ణి ఒక తాపుతన్నాడు. ముచుకుందుడికి మెలకువ వచ్చింది. తనను తన్నింది ఎవరా? అని కళ్లుతెరచి చూశాడు. కాలయవనుడాచూపుతో భస్మమైపోయాడు. కృష్ణుడు ముచుకుందునికి దర్శనమిచ్చి అనుగ్రహించాడు.

జరాసంధుడు మళ్ళీ మధుర మీద దాడిచేశాడు. బలరామకృష్ణులు అతన్ని ఎదుర్కొన్నారు. ఓడించిపంపివేశారు. జరాసంధుడు పట్టువదల్లేదు. ఓడుతున్నప్పటికీ అనేకసార్లు మధురమీదికొచ్చాడు. బలవంతులైన శత్రువులు మాటిమాటికీ యుద్ధానికి రావడం వల్ల మధుర వాసులకు మనశ్శాంతి కొరవడింది. ఈ దుస్థితిని తొలగించేందుకు తన నివాసాన్ని శత్రుదుర్భేద్యమైన దుర్గానికి మార్చాలను కున్నాడు. సముద్రుణ్ణి కోరి సాగరమధ్యంలో పండ్రెండు ఆమడల పొడవు, అంతే వెడల్పు కల్గిన దుర్గమ ప్రదేశాన్ని సంపాదించాడు. విశ్వకర్మనాదేశించి అక్కడ ఒక సుందర నగరం నిర్మింపజేశాడు. ఆ నగరమే ద్వారవతి, ద్వారక అని ప్రసిద్ధి వహించింది. మధురలోని సంపదలన్నిటినీ ద్వారకకు తరలిస్తుండగా ఇరవైమూడు అక్షౌహిణుల సైన్యంతో జరాసంధుడు మళ్ళీ యుద్ధానికి వచ్చాడు. బలరామకృష్ణులు ఆ సంపదనంతా అక్కడే వదిలి సామాన్యుల్లాగా వెళ్ళి ప్రవర్షణ గిరిపైకెక్కారు. జరాసంధుడు కూడా ససైన్యంగా వారిని వెంబడించాడు. పర్వతాన్ని చుట్టుముట్టి తగుల బెట్టించాడు. బలరామకృష్ణులు కొండ శిఖరాగ్రం నుంచి కుప్పించి క్రిందికి దూకి ద్వారక చేరుకున్నారు.

సర్వశక్తిమంతుడు, సర్వసమర్థుడు అయిన శ్రీకృష్ణుడు జరాసంధుణ్ణి చంపగలిగినప్పటికీ వధించలేదు. కృష్ణుడు వారిస్థానాలకు వెళ్ళి దుష్టులను చంపడానికి బదులు ఆదుష్టులే కృష్ణుడి దగ్గరకు వచ్చేందుకు జరాసంధుడు దోహదం చేశాడు. అందువల్ల కృష్ణుడి పని సులువైంది. ఈ విధంగా కృష్ణుడి అవతార ప్రయోజనం నెరవేరేందుకు జరాసంధుడు పరోక్షంగా తోడ్పడినట్లైంది. కాలయవనుడి మరణం ముచుకుందుడి చూపులో వుందని తెలియడం వల్ల కృష్ణుడతణ్ణి

ముచుకుందుడి చూపుచేతనే దహింపజేశాడు. జరాసంధుడు దాడిచేసినప్పుడు మధురానగరంలో జననష్టం కలుగకుండా నగరం వెలుపలికి వచ్చి యుద్ధం చెయ్యడం కృష్ణుడి నేర్పును, భూతదయను తెలియజేస్తూవుంది. సముద్రంలో నగరాన్ని నిర్మింపజేయడం కృష్ణుడి రాజకీయ చతురతనే గాక ప్రకృతిని, దేవతలను శాసించగల అతని మహిమను ఆవిష్కరిస్తుంది.

### 2.10.7 శ్రీకృష్ణ కల్యాణం :

విదర్భ దేశాన్ని కుండిన నగరం రాజధానిగా భీష్మకుడు అనే రాజు పాలించేవాడు. అతనికి ఐదుమంది కుమారులు, ఒక కుమార్తె. ఆమె పేరు రుక్మిణి. లక్ష్మీదేవి అంశంలో ఆమె జన్మించింది. కృష్ణుడి గుణగణాలు విని చిన్నప్పటి నుంచీ అతని మీద భక్తి పెంచుకుంది.కృష్ణుణ్ణే భర్తగా వరించింది. అయితే దురదృష్టవశాత్తు ఆమె అన్న రుక్మి రుక్మిణిని శిశుపాలుడికిచ్చి పెళ్ళి చేయాలనుకున్నాడు.

శిశుపాలుడు ఛేది దేశపు రాజు. పరమ దుష్టుడు. తనలాంటి దుష్టరాజులతో కలిసి కాలం గడిపేవాడు. అతనికి పిల్లనివ్వడానికి భీష్మకుడు ఇష్టపడలేదు. రుక్మిణికి కూడా ఆప్రతిపాదన ఎంతో బాధ కలిగించింది. ఆమెకు యుక్తవయసు రాగానే వివాహ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. రుక్మిణి అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణుణ్ణి ద్వారకకు పంపింది. కృష్ణుడికి తన దీనావస్థను తెలియజేయమంది. నచ్చజెప్పి ఎలాగైనా తీసుకురమ్మంది. అగ్నిద్యోతనుడు ద్వారకలో కృష్ణుణ్ణి దర్శించుకున్నాడు. రుక్మిణీదేవి అందచందాలు గురించి, ఆమె ఉద్దేశం గురించి కృష్ణుడికి చెప్పాడు. ఆమెకు అతడు, అతడికి ఆమె తగిన వాళ్ళన్నాడు. కృష్ణుడు కుండిన నగరానికి వచ్చి రుక్మిణీదేవిని తీసుకువస్తానని అగ్నిద్యోతనుడితో చెప్పిపంపాడు.

పెళ్ళివేడుకలు ప్రారంభమయ్యాయి. కృష్ణుడి రాక ఆలస్యమయ్యే కొద్దీ రుక్మిణిలో ఆత్రుత పెరిగిపోసాగింది.ఇంతలో అగ్నిద్యోతనుడు వచ్చాడు. కృష్ణుడి అంగీకారాన్ని తెలియజేశాడు. పెళ్ళికి ముందు కులదేవతను మ్రొక్కే ఆచారం ప్రకారం రుక్మిణీదేవి గౌరీదేవి ఆలయానికి వెళ్ళింది. కృష్ణుణ్ణే భర్తగా అనుగ్రహించమని శాంభవితో మొరపెట్టుకుంది. ఆలయం నుంచి వెలుపలికి

వచ్చింది. దూరంగా రథం నిలుపుకొని వేచివున్న కృష్ణుడామెకంటబడ్డాడు. ఆమె మెల్లగాఅటువైపు కదిలింది. శౌరి రుక్మిణీదేవిని అమాంతంగా ఎత్తి రథంలో పెట్టుకున్నాడు. విదర్భ సైన్యంతో పాటు ఛేది, మగధ దేశాల సైన్యం కూడా కృష్ణుడి మీదికి వచ్చింది. అతడాసైన్యమంతటినీ సునాయాసంగా ఓడించాడు. శిశుపాల, జరాసంధులను పరాజయంపాలు చేశాడు. ఇంతలో బలరాముడి నేతృత్వంలో అక్కడికి వచ్చిన యాదవ సైన్యం కూడా కృష్ణుడికి తోడ్పడింది. కృష్ణుడు రుక్మిణీదేవిని ద్వారకకు తీసుకువచ్చి రాక్షస వివాహం చేసుకున్నాడు.

కృష్ణుడు రుక్మిణి దేవినే గాక మరో ఏడుగురు కన్యలను కూడా వివాహం చేసుకున్నాడు. వారు సత్యభామ, జాంబవతి, కాళింది, మిత్రవింద, సుదంత (నాగ్నజితి), భద్ర, లక్షణ. వీరందరినీ కలిపి అష్టమహిషులని వ్యవహరిస్తారు.

భూపుత్రుడైన నరకాసురుడు బలగర్వంతో విజృంభించాడు. స్వర్గలోకం మీద దాడి చేశాడు. దేవమాత అదితి కుండలాలను అపహరించాడు. వరుణఛత్రం కాజేశాడు. మణిపర్వతాన్ని పట్టుకెళ్లాడు. దేవతలనే గాక మునులను, ముని భార్యలను బాధించాడు. అతని దౌర్జన్యకాండకు తట్టుకోలేక ఋషులు, దేవతలు కృష్ణుడికి మొరపెట్టుకున్నారు. అతన్ని అంతం చేయుమని అభ్యర్థించారు. కృష్ణుడు అంగీకరించాడు. వారికి అభయమిచ్చి పంపివేశాడు.

కృష్ణుడు స్మరించగానే గరుత్మంతుడు వచ్చాడు. సత్యభామా సహితంగా వైనతేయుణ్ణి అధిరోహించి కృష్ణుడు నరకాసురుని రాజధాని ప్రాగ్జ్యోతిషపురం చేరుకున్నాడు. పర్వత, జల, పవన, పావక దుర్గాలు ఛేదించాడు. మురాసురుణ్ణి, అతని కుమారులను వధించాడు. యుద్ధానికి వచ్చిన నరకాసురుని తలను చక్రంతో ఖండించాడు. అతడు చెరబట్టిన పదహారు వేలమంది రాచకన్యలను విడిపించాడు.

కృష్ణుడు సత్యభామతో కలిసి స్వర్గానికి వెళ్ళాడు. అదితిని సందర్శించి ఆమెకుండలాలు ఆమెకు ఇచ్చివేశాడు. సత్యభామ కోరిక మేరకు పారిజాత వృక్షాన్ని పెకలించి గరుడుని వీపుమీద పెట్టుకుని కృష్ణుడు ద్వారకకు బయలుదేరాడు. దేవేంద్రుడు ససైన్యంగా వచ్చి అతన్ని ఎదుర్కొన్నాడు. కృష్ణుడు దేవేంద్రాదులందరినీ ఓడించి ద్వారక చేరుకున్నాడు. సత్యభామకిచ్చిన మాట ప్రకారం పారిజాతవృక్షాన్ని

ఆమె పెరటిలో నాటించాడు. అంతకు ముందే ప్రాగ్జ్యోతిషపురం నుంచి ద్వారక చేరుకున్న పదహారువేలమంది కన్యలను పరిణయమాడాడు. పదహారు వేల ఎనమండుగురు భార్యలతోనూ సంసార సౌఖ్యాంబుధిలో తేలియాడాడు. శ్రీకృష్ణుని శృంగారలీలను నందితిమ్మన తన పారిజాతాపహరణములో రమ్యంగా వర్ణించాడు.

॥శా॥ ఏయేవేళల నేసరోజముఖి యేయేలీలలం గోరుఁదా
నాయావేళల నాసరోజముఖి నాయాలీలలందేల్చి, యే
చాయం జూచినఁ దానయై మెలఁగుచు న్సౌఖ్యాబ్ధి నోలాడు భో
గాయత్తుండయి పెక్కురూపముల మాయా కల్పనా చాతురిన్. [49]

ఎప్పుడు ఏ ఇల్లాలు ఏవిధంగా క్రీడించాలని కోరుకుంటుందో అప్పుడు ఆఇల్లాలితో ఆవిధంగా కృష్ణుడు క్రీడించేవాడు. ఎక్కడ చూసినా తానేయై మెలగుతూ భోగించడానికి సంసిద్ధంగా మసలుకుంటూ వారిని సౌఖ్యసముద్రంలో ఓలలాడించేవాడు.

కృష్ణుడు తన పదహారువేలయనమండుగురు భార్యల కోరికలను సమానంగానే నెరవేర్చేవాడు. అంటే సమదృష్టితోనే వారిని చూసేవాడు. ఇక్కడ అతని దక్షిణనాయకత్వం ప్రస్ఫుటమవుతూవుంది.

కృష్ణుడు విష్ణుదేవుని అంశ. అందువల్లనే లక్ష్మీదేవి అంశతో జన్మించిన రుక్మిణీదేవి అతనికి భార్యఅయ్యింది. పదహారువేల ఎనిమిదిమంది భార్యల్లోనూ రుక్మిణీదేవి మాత్రమే పట్టమహిషి కాగలగడం గమనార్హం. తక్కిన భార్యలలో పదహారువేలమంది రామాయణకాలంలో మునులుగా వుండేవారని, రాముడు వనవాసం వచ్చినప్పుడు వారతని పరిష్వంగం కోరగా కృష్ణావతారంలో ఇస్తానని చెప్పినట్టు ప్రతీతి. అందువల్లనే వారంతా పదహారువేల కన్యలుగా కృష్ణుడికి తారసపడ్డారని చెబుతారు. కృష్ణుడు పదహారువేల ఎనిమిదిమంది భార్యలతో కాపురం చేసినప్పటికీ, సంతానం పొందినప్పటికీ అతడు అస్ఖలిత బ్రహ్మచారిగానే జీవించినట్టు చెబుతారు. ఇది కృష్ణుని మనోదార్ఢ్యాన్ని తెలియజేస్తుంది. ధీరగుణాన్ని బోధపరుస్తుంది. మానవ జగుత్తుకే ఆదర్శప్రాయంగా నిలుస్తుంది.

### 2.10.8 దుష్టశిక్షణ :

బలి కుమారుడు బాణాసురుడు. గొప్ప బలవంతుడు. వేయి భుజాలు కలవాడు. ఈశ్వరుణ్ణి మెప్పించి తన నగరానికి కాపలాగా వుంచుకున్నాడు. అతని కుమార్తె ఉష. అందగత్తె. తన చెలికత్తె చిత్రరేఖ సహాయంతో కృష్ణుడి మనుమడు అనిరుద్ధుణ్ణి తన అంతఃపురానికి తెప్పించుకుంది. అతని వల్ల గర్భవతి అయ్యింది. బాణుడు ఈ సంగతి తెలుసుకుని అనిరుద్ధుణ్ణి బంధించాడు. నారదుడి ద్వారా విషయం తెలుసుకున్న శ్రీకృష్ణుడు ససైన్యంగా వచ్చి బాణుడికి సహాయంగా వచ్చిన శివుణ్ణి, శివపరివారాన్ని ఓడించాడు. బాణుడి భుజాలు నాలుగు మినహాయించి తక్కిన వాటిని ఖండించాడు. ఉషానిరుద్ధులను తీసుకుని ద్వారక చేరుకున్నాడు.

అనేక విధాలుగా జీవహింస చేస్తూ తన పేరే పెట్టుకున్న పౌండ్రక వాసుదేవుణ్ణి శ్రీకృష్ణుడు యుద్ధంలో హతమార్చి లోకాన్ని నిష్కంటకం చేశాడు. కృష్ణుడు భీమార్జునులను వెంటబెట్టుకుని మగధరాజధాని గిరివ్రజపురం వెళ్ళాడు. భీముడిచేత జరాసంధుణ్ణి చంపించాడు. అతనిచేత బంధింపబడిన రాజులందరినీ విడిపించాడు. ధర్మరాజు రాజసూయయాగం సందర్భంగా తనను దూషించిన శిశుపాలుణ్ణి కృష్ణుడు చక్రంతోహతమార్చాడు. తనను ఎదిరించిన సాళ్వుణ్ణి, దంతవక్త్రుణ్ణి, విదూరదుణ్ణి కృష్ణుడు వధించాడు.

"ప్రకృత్యమిత్రాహి సతామసాధవః". ప్రకృతి సిద్ధంగానే మంచి వారికి చెడ్డవారు శత్రువులని భారవి కిరాతార్జునీయంలో తెలియజేశాడు. ఈవిధంగానే దుస్స్వభావం గల రాక్షసులు లేదా రాక్షసాంశలో జన్మించిన రాజులు కృష్ణుడికి వ్యతిరేకంగా ప్రవర్తించడమేగాక అతణ్ణి ఎదుర్కొన్నారు. లోకకంటకులైన వారందరినీ కృష్ణుడు హతమార్చాడు.

### 2.10.9 శ్రీకృష్ణ నిర్యాణం :

పాండవులు శ్రీకృష్ణుడికి మేనత్తబిడ్డలు. ధర్మతత్పరులు. అధర్మాన్ని సహించనివారు. అందువల్లనే కృష్ణుడికి వారంటే అత్యంత ఇష్టం ఏర్పడింది. వారు ఎదుర్కోవలసి వచ్చిన ప్రతి ఆపదలోనూ వారికి తోడ్పడ్డాడు. ధర్మరాజు

తలపెట్టిన రాజసూయయాగం విజయవంతం కావడానికి తన తోడ్పాటును అందించాడు. వనవాసంలో ఉన్నప్పుడు వారికివచ్చిన ఆపదలను పోగొట్టాడు. పాండవుల తరపున రాయబారం వెళ్ళి కౌరవుల చేత పరాభవం కూడా పొందాడు. భారత యుద్ధంలో అర్జునుడి రథానికి సారథ్యం వహించాడు. బాణం చేతపట్టకుండానే దుస్స్వభావులైన కౌరవ సైనికులు హతులయ్యేందుకు దోహదం చేశాడు. అర్జునుడికి భగవద్గీతను బోధించిముల్లోకాలకు మహోపకారం చేశాడు. కౌరవులు నిర్మూలంకాగా ధర్మరాజుకు పట్టంకట్టి అతని చేత రాజ్యమేలించాడు.

కృష్ణుడి నేతృత్వంలో ఎదురులేని వారుగా యాదవులు విజృంభించారు. వారి వల్ల కూడా భూభారం పెరిగే ప్రమాదం వుందని కృష్ణుడు గుర్తించాడు. తాను అవతారం చాలించేలోగా వారిని కూడా అంతమొందించాలనుకున్నాడు. కృష్ణుడి సంకల్పం కార్యరూపం దాల్చింది. కృష్ణుణ్ణి దర్శించేందుకు సనకసనందనాది మహామునులు ద్వారకకు వచ్చారు. యాదవులు వారిని ఆటపట్టించాలనుకున్నారు. సాంబుడనే వాడికి గర్భిణీ వేషం వేశారు. అతణ్ణి మునులకు చూపుతూ ఈమెకు పుట్టేబిడ్డ ఆడో, మగో చెప్పమన్నారు. ఋషులు వారి ఆంతర్యం గ్రహించారు. ఆగ్రహించారు. ఆ గర్భం నుంచి యదువంశ వినాశకరమైన ముసలంపుడు తుందన్నారు. వారు చెప్పినట్టే సాంబుని కడుపు నుంచి రోకలి పుటింది. యాదవులు భయపడ్డారు. దానివల్ల తమకు ఉపద్రవం కలుగుతుందనే భయంతో ఆరోకలిని పొడిచేసి సముద్రజలంలో కలిపివేశారు. ఆపొడి సముద్రములోని ప్రభాస తీర్థంలో చేరింది. దాని ప్రభావం వల్ల అక్కడ తుంగ మొలిచింది. యాదవులంతా విహారార్థం ప్రభాస తీర్థానికి వెళ్ళారు. మద్యం సేవించిన మత్తులో తుంగపెరుక్కుని ఒకరినొకరు కొట్టుకున్నారు. ఆవిధంగా యదువీరులందరూ మరణించారు.

బలరాముడు యోగంతో తన తనువును త్యజించి అనంతునిలో ఐక్యమయ్యాడు. రోకలిని యాదవులు పొడి చేసినప్పుడు పొడికాకుండా ఒక చిన్న ముక్క మిగిలింది. దాన్ని ఒక చేప మ్రింగింది. చేపలను వేటాడవచ్చిన ఒక బోయవాడు ఆములికిని సంగ్రహించాడు. దాన్ని బాణంగా చేసుకున్నాడు. ఒక చెట్టుచాటున విశ్రమించి ఆడిస్తున్న కృష్ణుడి కాలి బొటన వ్రేలు చూశాడు. అది జింక చెవ్వు అని భ్రమపడ్డాడు. బాణాన్ని ఎక్కుబెట్టి వదిలాడు. అది అతడి

బొటన వ్రేలిలో గుచ్చుకుంది. కృష్ణుడు బిగ్గరగా అరిచాడు. బోయవాడు కృష్ణుణ్ణి సమీపించిబాధపడ్డాడు. కృష్ణుడతణ్ణి ఓదార్చాడు. కర్మఫలం ఎవరికైనా అనుభవించక తప్పదన్నాడు. శరీరాన్ని పరిత్యజించి వైకుంఠం చేరుకున్నాడు.

కృష్ణుడు పాండవులకు సహాయం చెయ్యడంలో మూడు ప్రయోజనాలు గోచరిస్తాయి. ఒకటి – తనకు అత్యంత ఆప్తులు, ఇష్టులు అయిన మేనత్త కుమారులకు సహాయం చెయ్యడం. రెండు – రాక్షసాంశతో విర్రవీగే అధర్మపరులైన రాజులను హతమార్చి భూభారాన్ని తగ్గించడం. మూడు – తద్వారా ధర్మ సంస్థాపన చెయ్యడం. బలగర్వంతో విర్రవీగిన తన వాళ్ళను కూడా హతమార్చి లోకోద్ధరణ చెయ్యాలనుకోవడం కృష్ణుడి ధర్మపక్షపాతాన్ని, సమదృష్టిని తెలియజేస్తుంది. సృష్టి, స్థితి, లయాలు సాగించడానికి కూడా సమర్థుడైన కృష్ణుడు సామాన్య మానవుడైన బోయవాడి చేతిలో మరణించడం విధి విధాన విలాసాన్ని విశద పరుస్తుంది. కృష్ణ నిర్యాణ సంఘటన ఈ క్రింది నీతి శాస్త్ర శ్లోకాన్ని గుర్తు చేస్తుంది.

॥శ్లో॥ అవస్యమనుభోక్తవ్యం
కృతంకర్మ శుభాశుభం
హరినాపి హరేనాపి
బ్రహ్మనాపి సుర్తైరపి.

హరిహర బ్రహ్మలకైనా, దేవతలకైనా చేసిన మంచీ చెడులను అనుభవింపక తప్పదు. ఇక్కడ విష్ణుదేవుని అంశలో జన్మించిన కృష్ణుడికి కూడా బలవన్మరణం తప్పలేదని భావం.

రామావతారం కంటే కొంత ఎక్కువ తెలివైన అవతారంగా కృష్ణావతారాన్ని పరిగణించవచ్చు. మానవాతీత శక్తులు కలిగివుండటం వల్ల కృష్ణతత్త్వం విష్ణుతత్త్వానికి చేరువగానే గోచరిస్తుంది. అందువల్ల కృష్ణుణ్ణి పూర్ణపురుషుడుగా, కృష్ణావతారాన్ని పూర్ణావతారంగా ప్రశంసిస్తారు. కృష్ణుడు సర్వశక్తిమంతుడైనప్పటికీ దుష్టులు కొందరిని తాను స్వయంగా చంపక ఇతరుల చేత చంపించడం గమనార్హం. ఇది కృష్ణుడి లీలావిలాసాన్ని, విధి విలాసానికి అతడిచ్చే ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. తక్కిన తొమ్మిది అవతారాల్లోనూ లేని విధంగా మానవులకు ఆహ్లాదం కలిగించే నిమిత్తం కృష్ణుడు బాల్యక్రీడలను నిర్వహించాడు. ఇది మానవత్వ పరిమళానికి

అతడిచ్చే ప్రాముఖ్యాన్ని ప్రస్ఫుటం చేస్తుంది. మొత్తానికి శ్రీకృష్ణావతారం తక్కిన అవతారాల కంటే భిన్నంగానూ, మిన్నగానూ ఉందంటే అతిశయోక్తి కాదు.

## 2.11 బుద్ధావతారం :

విష్ణుదేవుడి దశావతారాల్లో బుద్ధావతారం విశేషించి పేర్కోదగ్గ అవతారం. తక్కిన అవతారాల్లో విష్ణువు ధర్మరక్షణ చేయగా ఈ అవతారంలో మాత్రం ధర్మధ్వంసం చేశాడు. అందువల్ల వైదిక ధర్మానికి గొడ్డలిపెట్టుగా ఈ అవతారం కనిపిస్తుంది. ఈ అవతారంలో కూడా లోకోపద్రవకరంగా పరిణమించిన రాక్షసులను సంహరించడం గమనార్హం.

బుద్ధావతారాన్ని గురించి రెండు విధాల అభిప్రాయభేదాలు వ్యాప్తిలో వున్నాయి. త్రిపురాసుర సంహార కారకుడైన బుద్ధుడే దశావతారాల్లోని బుద్ధుడని ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసిన వారు చెబుతున్నారు. వైదిక ధర్మాన్ని నిరసించి బౌద్ధధర్మాన్ని వ్యాప్తిలోనికి తెచ్చిన గౌతమ బుద్ధుడే దశావతారాల్లోని బుద్ధుడని ఆధునికులు భావిస్తున్నారు. ప్రాచీన గ్రంథాల్లో కొన్ని, అన్నమయ్య వంటి వాగ్గేయకారులు రచించిన కీర్తనల్లో కొన్ని త్రిపురాంగనల శీలాన్ని కొల్లగొన్న బుద్ధుడే దశావతారాల్లోని బుద్ధుడని స్పష్టం చేశాయి. శ్రీనాథుడు తన కాశీఖండంలో బుద్ధుణ్ణి గురించి ఈ విధంగా ప్రస్తావించాడు.

*॥తే॥ "త్రిపుర కాంతల శీలంబులపహరింప*
*బుద్ధి వేషంబు గైకొన్న పోకులాడు*
*జలజనాభుండు సుగత వేషము ధరించెఁ*
*గాశికా ప్రజకుల ధర్మగతి హరింప".*[50]

విష్ణుపారమ్యాన్ని ప్రతిపాదించే భాగవతం విష్ణుదేవుని లీలావతారాలను పేర్కొంటూ ప్రాచీన బుద్ధుణ్ణే ప్రస్తావించింది.

*॥మ॥ అతిలోలాత్ములు సూనృతేతరులు భేదాచార సంశీలురు*
*ద్ధత పాషండ మతౌపధర్మ్యులు జగత్సంహారులైనట్టి యా*
*దితిసంజాతుల ధర్మవాసనల వర్తింపం, దదాచార సం*
*హతి మాయించి హరించె దానవులఁ బద్మాక్షుండు బుద్ధాకృతిన్.*[51]

కృష్ణుడు కేంద్ర బిందువుగా రూపొందిన పారిజాతాపహరణములో నారదుడు చేసిన కృష్ణస్తుతి కూడా ఈ అవతారాన్నే పేర్కొంది.

*॥కం॥ రక్కసి మగువల యీలువు*
*మొక్కపఱచె దీన పాపములగమి గాలం*
*ద్రొక్కెదవు నీవయింటికి*
*నిక్కముగా నిన్నుం బొగడనేర్తునే కృష్ణా"[52]*

తెనాలి రామకృష్ణుడు తన పాండురంగమాహాత్మ్యంలో ప్రాచీన బుద్ధావతారాన్నే ప్రశంసించాడు.

*॥చ॥ ప్రతిదిన కేశలుంచనపురాయిడి నెట్టన బట్టకట్టి, పైఁ*
*బుతపుత మంచునున్న కుఱుబోదతలన్ ధరియింపనోడియున్*
*సతమగు సొమ్ముగా నవిడజాలవుగా శిఖిపింఛవల్లి సౌ*
*గతమతధుర్య దానిగిటిగిట్టుము పుట్టుము మిన్నకేటికిన్.[53]*

అన్నమయ్య శ్రీ వేంకటేశ్వరుని అభయహస్తాన్ని అభినుతిస్తూ బుద్ధావతార ప్రస్తావన చేశాడు.

*"పురసతుల మానములు కొల్లజేసిన చేయి".[54]*

ఇక్కడ బుద్ధావతారాన్ని పేర్కొన్న వారందరూ ప్రాచీన బుద్ధావతారాన్నే పేర్కొన్నారు. వారి కాలానికి గౌతమ బుద్ధుని ఉదంతం లేదు. తక్కిన అవతారాల కన్నా భిన్నంగా కనిపించే బుద్ధావతారం గురించి తెలుసుకోవడం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది.

### 2.11.1 త్రిపురాసురుల విజృంభణ :

కుమారస్వామి తారకాసురణ్ణి హతమార్చాడు. అతని ముగ్గురు కుమారులు తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి. తండ్రి మరణానికి చింతించారు. దేవతల మీద పగతీర్చుకోవాలనుకున్నారు. బ్రహ్మను గూర్చి కఠోర తపస్సు చేశారు. బ్రహ్మ ప్రత్యక్షమై వరాలు కోరుకోమన్నాడు. వారు శత్రు దుర్భేద్యమైన మూడు నగరాలు కోరుకున్నారు. బ్రహ్మ వారికావరాలు ప్రసాదించాడు. మయుణ్ణి

పిలిచి పురత్రయం నిర్మించి ఇమ్మని పురమాయించాడు. మయుడు తారకాక్షుడికి స్వర్గంలో హేమపురాన్ని, కమలాక్షుడికి ఆకాశంలో రజితపురాన్ని, విద్యున్మాలికి భూమిలో ఆయసపురాన్ని నిర్మించి ఇచ్చాడు. అవి కామగమనం కలవి. దిక్పాలకుల పట్టణాలు నేలమట్టం అయ్యేట్టు, పర్వత శృంగాలు పగిలేటట్లు, గ్రహాలు ఊడిపడేటట్టు, పాతాళవాసులు పరుగెత్తేటట్టు, దేవతావిమానాలు నేలకూలేటట్టు త్రిపురాలు తిరుగసాగాయి. ఆ పురాలను నశింపజేసేందుకు ఎవరికీ సాధ్యం కాలేదు.

దేవేంద్రుడొకసారి త్రిపురాసురుల మీదికి యుద్ధానికి వెళ్ళాడు. వారి చేతిలో ఓటమి పాలయ్యాడు. చేసేదిలేక స్వర్గాన్ని విడిచి పెట్టి అజ్ఞాత ప్రదేశాల్లో తలదాచుకున్నాడు. యజ్ఞయాగాదుల్లో దేవతలకు చెందవలసిన హవిర్భాగాలను కూడా త్రిపురాసురులు వారికి దక్కనియ్యలేదు. స్వయంగా తామే తీసుకోసాగారు. ఇది దేవగణానికంతటికీ బాధాకరంగా పరిణమించింది.

రాక్షసులు దేవతల మీద పగబట్టడం సహజమే. తండ్రి లేదా ఆత్మీయుల మరణం దృష్ట్యా శత్రువుల మీదికి విజృంభించడం రివాజే. తమ లక్ష్యాలను సాధించుకునేందుకు తీవ్రతర తపస్సు చేయడం, దుర్లభవరాలు సంపాదించడం, వాటితో జనజీవనాన్ని అస్తవ్యస్తం చేయడం ఆనవాయితే. త్రిపురాసురుల విషయంలో ఇవన్నీ వర్తించడం గమనార్హం. అసుర ప్రవృత్తి ఎంత ఘోరంగా వుంటుందో ఇక్కడ ద్యోతకమవుతుంది.

### 2.11.2 దేవతల విజ్ఞప్తి :

దేవతలు బ్రహ్మను, శంకరుణ్ణి వెంటబెట్టుకొని విష్ణువు దగ్గరకు వెళ్ళారు. వినయంగా వినుతించారు. త్రిపురాసురుల వల్ల, వారి పురాల వల్ల తాము పడుతున్న కడగండ్లు చెప్పుకున్నారు. వారి నుంచి రక్షణ కలిగించి పుణ్యం కట్టుకోమన్నారు. విష్ణువు ప్రసన్నుడయ్యాడు. దేవతల కష్టాలు తీర్చేందుకు నిశ్చయించాడు. వారికి ఊరట కలిగించే విధంగా మాట్లాడాడు.

"త్రిపురాసురులు వేద విహితాచార సంపన్నులు. వారి భార్యలు పరమపతి వ్రతా శిరోమణులు. పైగా తారకాక్షుడి కుమారుడు బ్రహ్మ, శంకరులు ఇద్దర్ని

గురించి తపస్సు చేసి తమ నగరంలో అమృత కూపాన్ని నిర్మింపజేసుకున్నాడు. దేవతలతో యుద్ధంచేసి క్షతగాత్రులైన, మరణించిన రాక్షసులను అమృతకూపంలోని పసురుతో మయుడు స్వస్థులను చేస్తాడు. అందువల్ల త్రిపురాసురులను జయించడం తేలిక కాదు. అయినా వారి నంతమొందించేందుకు ఏదో ఒక ఉపాయమాలోచిస్తాలే" అని విష్ణువు దేవతలకభయమిచ్చాడు. త్రిపురాసురుల పీడ విరగడైనట్టేనని దేవతలు తమతమ స్థానాలకు వెళ్ళిపోయారు.

విష్ణువు భక్తవత్సలుడుగా, దీనవత్సలుడుగా ఇక్కడ గోచరిస్తాడు. శత్రుబలాన్ని అంచనా వేసి వారికి సంబంధించిన నిగూఢవిషయాలను కూడా తెలుసుకొని ప్రతిక్రియ చేయడంలో విష్ణువెంత సిద్ధహస్తుడో ఇక్కడ బోధపడుతుంది.

**2.11.3 త్రిపురాసుర సంహారం :**

విష్ణువు గోవురూపం ధరించాడు. బ్రహ్మదూడయ్యాడు. ఇద్దరూ కలిసి హేమపురంలో ప్రవేశించారు. ఆశ్చర్యంతో అందరూ చూస్తుండగానే అమృతకూపంలో పడ్డారు. విష్ణువు అమృతరసాన్నంతా ఒక్క గుక్కలో త్రాగేశాడు. దానవులంతా కింకర్తవ్యతా మూఢులై చూస్తుండగానే మాయాగోవత్సాలు రెండూ మాయమయ్యాయి. విషయం విన్న మయుడు దానవులకేదో కీడు మూడిందని విచారించాడు.

విష్ణువు బోడితల, కావిబట్టలతో, బర్హిబర్హముతో సన్యాసి రూపం ధరించాడు. త్రిపురాసురుల కొలువుకూటంలో ప్రవేశించాడు. తనను బుద్ధుడుగా వారికి పరిచయం చేసుకున్నాడు. త్రిపురాసురుల వేద విహిత ధర్మాచరణను తప్పుపట్టాడు. వేదాలు ప్రమాణాలు కావన్నాడు. సదాచారాలు సబబుకావన్నాడు. యథేచ్ఛగా విహరించడమే ఆనందానికి మూలమన్నాడు. తన తీపిమాటలతో త్రిపురాసురులను వేదబాహ్యులుగా, ధర్మవిముఖులుగా, పాషండ మనస్తత్వం కలవారుగా మార్చి వేశాడు.

త్రిపురాసురులను వేదవిహితాచారాల నుంచి దూరం చేసిన బుద్ధుడు అంతటితో ఊరుకోలేదు. త్రిపురాంగనలు నివసించే అంతఃపురానికి వెళ్ళాడు. ఆ సమయంలో త్రిపురాంగనలందరూ సుస్నాతలై శాంభవీసదనంలో జగన్మాతకు

పూజలు చేస్తున్నారు. వారిని వెలుపలికి రమ్మని బుద్ధుడు పరిచారికల ద్వారా చెప్పిపంపాడు. బుద్ధుణ్ణి చూడడానికి త్రిపురాంగనలు మొదట నిరాకరించారు. తాను బుద్ధుడనని, వారికి వరాలిచ్చేందుకే వచ్చానని బుద్ధుడు మళ్ళీ చెప్పిపంపాడు. ఎట్టకేలకు త్రిపురాంగనలు వచ్చారు. బుద్ధుడు వారి శాంభవీ పూజను విమర్శించాడు. శిలలకన్నా వృక్షాలే శ్రేష్టమన్నాడు. అవి అనేక శుభాలను అనుగ్రహిస్తాయన్నాడు. శుక్రవారం నాడు సుస్నాతలై, వివస్త్రలై అశ్వత్థ వృక్షాన్ని ఆలింగనం చేసుకుంటే అది వారికెన్నో వరాలిస్తుందని నమ్మపలికాడు. వారినాశీర్వదించి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

బుద్ధుని మాటలు త్రిపురాంగనల మీద బాగా పనిచేశాయి. వారు బుద్ధుడు చెప్పినట్టే శుక్రవారం ఉదయాన్నే స్నానంచేసి ప్రమదావనానికి వెళ్ళారు. విష్ణువంతకు ముందే అశ్వత్థ వృక్ష రూపాన్ని ధరించి వనంలో నిలబడ్డాడు. త్రిపురాంగనలు నగ్న శరీరంతో ఆ రావిచెట్టును కౌగిలించుకున్నారు. ఆ అశ్వత్థ నారాయణుడే బుద్ధుడై వారినందరినీ రాగాబ్ధిలో తేల్చాడు. ఈ విధంగా విష్ణువు బుద్ధావతారం ధరించి త్రిపురాసురుల ధర్మబలాన్ని, త్రిపురాంగనల పాతివ్రత్య బలాన్ని నశింపజేశాడు. త్రిపురాసురులను వధించవలసిందిగా ఈశ్వరుణ్ణి ప్రేరేపించాడు. విశ్వకర్మ రథాన్ని సిద్ధంచేశాడు. యుద్ధ సామగ్రిని సమకూర్చాడు. బ్రహ్మ సారథియయ్యాడు. విష్ణువు దివ్యాస్త్రమయ్యాడు. మేరుపర్వతం బాణాసనమయ్యింది. సాధన సామగ్రిని సమకూర్చుకొని ఈశ్వరుడు త్రిపురాల మీదికి విజృంభించాడు. బాణాన్ని ప్రయోగించాడు. దాని నుంచి అనేక బాణాలు వెలువడ్డాయి. ఆ బాణాగ్నితో త్రిపురాలు భస్మమయ్యాయి. లోకాలకు త్రిపురాల పీడ, త్రిపురాసురుల పీడ నశించింది.

బుద్ధావతారంలో విష్ణుదేవుడు చేసిన పనులన్నీ అతని కోసం కావు. దేవతల కోసం. లోకం కోసం. ఇతరుల కోసం పడరాని పాట్లు పడడం సామాన్యమైన విషయం కాదు. అభినందించదగిన విషయం. ఇతరులకు ఉపకారం చెయ్యడం వల్ల ఉపకారం పొందేవారికే కాక చేసే వారికి కూడా ఆనందం కలుగుతుంది. ఇతరులకు ఉపకారం చెయ్యడంలోనే మేలుందని రంతిదేవుడు విశ్వసించాడు. తదనుగుణంగానే ఆచరించి చూపాడు. రంతిదేవుడు చెప్పినట్లు పోతన భాగవతంలో చోటుచేసుకున్న పద్యం పరోపకార విశిష్టతను చాటిచెబుతుంది.

॥ఉ॥ అన్నములేదు, కొన్ని మధురాంబువులున్నవి; ద్రావుమన్న; రా
వన్న, శరీరధారులకు నాపద వచ్చిన వారియాపదల్
గ్రన్నన మాన్పివారికి సుఖంబులు సేయుటకంటె నొండు మే
లున్నదె? నాకు దిక్కు పురుషోత్తముఁడొక్కఁడు, సుమ్ముపుల్కసా ![55]

పరాయివాళ్ళ ప్రదేశంలో దొంగచాటుగా చొరబడి వారి పదార్థాలను కాజేయడం, ఉద్దేశ పూర్వకంగా ఇతరులను సన్మార్గంలో నుంచి అపమార్గంలోకి మరలించడం, పతివ్రతలైన పరస్త్రీల శీలాన్ని పాడుచెయ్యడం ధర్మవిరుద్ధాలే. కానీ విష్ణువు ధర్మస్థాపన కోసమే వాటిని చేశాడు. స్థూలదృష్టికి అధర్మాలుగా కనిపించేవన్నీ సూక్ష్మదృష్టితో పరిశీలిస్తే ధర్మాలుగా గోచరించే అవకాశముంది. అలాగే పైకి ధర్మాలుగా కనిపించేవన్నీ కూడా ధర్మాలని చెప్పలేము. జాగ్రత్తగా గమనిస్తే అలాంటి కొన్నిటిలోనూ అధర్మ స్పర్శ గోచరిస్తుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తే బుద్ధుని కార్యాలన్నీ సమర్థనీయాలుగానే కనిపిస్తాయి.

జరిగిపోయిన విష్ణుదేవుని అవతారాల్లో బుద్ధావతారం చివరిది. ధర్మ ప్రవర్తనులైనప్పటికీ లోకులను బాధిస్తూ ధర్మాతిక్రమణ చేసిన త్రిపురాసురులను శిక్షించడం కోసమే విష్ణుదేవుడు ఈ అవతారాన్ని ధరించాడు. ఈ అవతారానికి సంబంధించిన కాలం నిడివిగాని, కార్యాచరణ దైర్ఘ్యం గానీ చాలా తక్కువ కావడం విశేషం. విష్ణుదేవుని తక్కిన అవతారాల్లో విష్ణువు మాత్రమే కార్యాచరణకు ఉపక్రమించగా ఈ అవతారంలో మాత్రం ఈశ్వరుని సహాయం తీసుకోవలసి వచ్చింది. త్రిపురాలు ఒకేసారి భస్మం కావడం ఇక్కడ చెప్పుకోదగ్గ ప్రత్యేకత. తక్కిన అవతారాలకు ప్రత్యేకత వున్నట్టే విష్ణుదేవుని బుద్ధావతారానికి కూడా ప్రత్యేకత వుంది. విశిష్టత వుంది.

## 2.12 కల్క్యవతారం :

విష్ణుదేవుడు ధరించిన అవతారాల్లో తొమ్మిది జరిగినవి కాగా, జరుగనున్న అవతారం పదవ అవతారంగా పరిగణింపబడుతూ వుంది. కలియుగంలో చోటు చేసుకోవడం వల్లనూ, కలిప్రభావాన్ని నశింపజేసేందుకే ఈ అవతారం ఉద్దేశింప బడటం వల్లనూ కల్క్యవతారంగా ఇది ప్రసిద్ధి వహించింది. జరిగిపోయిన

అవతారాల వృత్తాంతాలు స్పష్టంగానూ, నిడివిగానూ కన్పిస్తాయి. కల్కి అవతారం జరుగనున్న అవతారం కాబట్టి ఊహా నిర్మిత చరిత్రలో ఇది సంక్షిప్తంగానే గోచరిస్తుంది.

ధర్మదేవత నాలుగు పాదాలకు, నాలుగు యుగాలకు సంబంధం వుందని పెద్దలు చెబుతారు. ధర్మదేవతకు కృతయుగంలో నాలుగు పాదాలు, త్రేతాయుగంలో మూడుపాదాలు, ద్వాపరయుగంలో రెండు పాదాలు వుండేవి. కలియుగం వచ్చేసరికి తక్కిన మూడు పాదాలు లోపించి ఒక పాదం మాత్రమే మిగిలింది. కలిప్రభావం వల్ల కలియుగంలో ప్రజలు ధర్మవిముఖులై వ్యసనపరులవుతారు. ఈదుస్థితి రానురాను మహాదారుణంగా తయారవుతుంది. దుర్భరంగా పరిణమిస్తుంది. ఈ దుస్థితిని మార్చేందుకు, భూదేవికి స్వస్థత చేకూర్చేందుకు శ్రీమహావిష్ణువు కల్కి అవతారం ధరిస్తాడని భాగవతాది మహాపురాణాలు తదితర ప్రాచీన గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఈ గ్రంథాలు ఆవిష్కరించే ఉదంత సంగ్రహాన్ని ఈవిధంగా చెప్పుకోవచ్చు.

### 2.12.1 కల్కిజననం :

కలియుగం చివర అన్నిచోట్ల ధర్మం అంతరిస్తుంది. అధర్మం విలయతాండవం చేస్తుంది. అశాంతి, అలజడి ఆధిక్యత వహిస్తాయి. శోకంతో లోకం అట్టుడికిపోతుంది. ఈ దుస్థితిని సహించలేని భూదేవి బహువిధాలా పరితపిస్తుంది. తక్కిన అవతారాల్లోలాగే విష్ణుదేవుడి దగ్గరకు వెళ్ళి తన దుర్భర స్థితిని చెప్పుకొని విలపిస్తుంది. ఎలాగైనా తన భారం తగ్గించమని ప్రాధేయపడి ప్రార్థిస్తుంది. విష్ణువు ప్రసన్నుడై ఆమెకు అభయమిస్తాడు. అవతరించి ఆదుకుంటానని హామీ ఇస్తాడు.

ఉత్తర భారతదేశంలో శంబళ గ్రామం వుంది. దానిలో విష్ణుయశుడనే విప్రుడు నివసిస్తూ వుంటాడు. అతని భార్య పేరు దేవప్రభ. (కొన్ని గ్రంథాల్లో సుమతి అని కూడావుంది). విష్ణువు విష్ణుయశుని భార్య గర్భంలో ప్రవేశిస్తాడు. పన్నెండు సంవత్సరాలు ఆమె గర్భంలోనే వుంటాడు. వైశాఖ శుక్ల ద్వాదశినాడు జన్మిస్తాడు. వ్యాసాదులక్కడికి వచ్చి ఆబిడ్డను ప్రశంసిస్తారు. విష్ణుతత్త్వాన్ని వినుతిస్తారు. ఆ బిడ్డకు కల్కి అని నామకరణం చేస్తారు. కొన్ని సంవత్సరాలు

గడిచాక కల్కి ఉపనయనం చేసుకుంటాడు. పరశురాముడి దగ్గరకు వెళ్ళి తనకు గురువై విద్యలు బోధించమని ప్రార్థిస్తాడు. పరశురాముడు సంతోషంతో అంగీకరిస్తాడు. కల్కి పరశురాముడి దగ్గర చతుర్వేదాలను, ధనుర్వేదాన్ని, చతుష్షష్టి కళలను అభ్యసిస్తాడు. విద్యాభ్యాసం పూర్తయ్యాక పరశురాముడికి గురుదక్షిణ ఇచ్చేందుకు కల్కి సంసిద్ధుడవుతాడు. పరశురాముడు ధర్మపాలననే తనకు గురుదక్షిణగా కోరుతాడు. కల్కి భక్తితో ఈశ్వరుణ్ణి ఆరాధిస్తాడు. అతని భక్తికి మెచ్చి శివుడతనికి ఖడ్గాన్ని, అశ్వాన్ని, చిలుకను ప్రసాదిస్తాడు.

విష్ణువు ఇక్కడ బ్రాహ్మణ కుటుంబంలోనే జన్మించడం మొదట అగ్రవర్ణంగా పరిగణింపబడే వర్ణాన్ని సంస్కరిస్తే, తక్కిన వర్ణాలన్నీ కూడా సంస్కరింపబడతాయనే ఉద్దేశంతోనే కావచ్చు. తక్కిన అవతారాల్లోలాగా గాక కల్కి అవతారంలో విష్ణువు పన్నెండు సంవత్సరాలు మాతృగర్భస్థుడై వుండడం విశేషం. ఇది విష్ణుదేవుని ఘటనాఘటన సామర్థ్యాన్ని ఆవిష్కరిస్తుంది. కల్కి తన అంశలోనే జన్మించిన పరశురాముడి దగ్గరకు వెళ్ళి విద్యనభ్యసించడం గమనార్హం. గురుదక్షిణ అతని సంప్రదాయనిబద్ధతను అభివ్యక్తం చేస్తుంది. విష్ణు అంశతో జన్మించిన కల్కి శివుణ్ణి ఆరాధించడం, శివుడు కానుకలివ్వడం చెప్పుకోదగ్గ అంశాలు. ఇది శివకేశవ పరస్పర గాఢాభిమానాన్ని తెలియజేస్తుంది.

### 2.12.2 వివాహం :

సింహళ ద్వీపంలో పద్మావతి అనే రాకుమారికి స్వయంవరాన్ని ఏర్పాటు చేస్తారు. చిలుక వెళ్ళి రాకుమారికి కల్కిని గురించి చెబుతుంది. అయినా ప్రయోజనం కనిపించదు. చిలుక తిరిగివచ్చి పద్మావతి అందచందాలను గురించి కల్కికి తెలియజేస్తుంది. కల్కి చిలుకను వెంటబెట్టుకుని సింహళానికి వెళతాడు. అక్కడ ఉద్యానవనంలో స్నానానికై వచ్చిన పద్మావతి కల్కిమూర్తిని చూసి మోహిస్తుంది. అతన్నే పెండ్లాడతానని తండ్రితో చెపుతుంది. అతడు అంగీకరిస్తాడు. పద్మావతికి, కల్కికి వైభవోపేతంగా వివాహం జరుగుతుంది.

కల్కి వివాహ వృత్తాంతంలో సింహళద్వీప ప్రస్తావన రావడం భారతదేశానికీ, సింహళానికీ వున్న సాన్నిహిత్యాన్ని తెలియజేసినట్టైంది. నైషధీయ చరితంలో

హంస దౌత్యం చోటుచేసుకోగా ఇక్కడ శుకదౌత్యం స్థానం ఏర్పరచుకోవడం చెప్పుకోదగ్గ అంశం.

### 2.12.3 ధర్మస్థాపన :

ప్రాచీన సంప్రదాయాన్ని, వైదిక ధర్మాన్ని పునరుద్ధరించాలనుకున్న కల్కి విశ్వజిద్యాగాన్ని, అశ్వమేధయాగాన్ని చెయ్యాలని సంకల్పిస్తాడు. తన సంకల్పాన్ని తండ్రికి తెలియజేసి అనుమతించమని అణకువతో అభ్యర్థిస్తాడు. కుమారుని ధర్మాచరణను ప్రోత్సహిస్తూ విష్ణుయశుడు తన అంగీకారం తెలియజేస్తాడు.

కల్కి ఖడ్గం ధరించి, తెల్లని గుర్రాన్ని అధిరోహించి జైత్రయాత్రకు బయలు దేరుతాడు. మొదట బౌద్ధులను, తర్వాత యవనులను, ఆ తర్వాత మ్లేచ్ఛులను నిగ్రహిస్తాడు. తన మీదికి వచ్చిన కలితో తలపడతాడు. అధర్మ, అజ్ఞానాల అధిదేవతలు కలిపురుషుడికి సాయం చేస్తారు. శక్తివంతమైన శత్రువుల సైన్యాలను కల్కి ఒక్కడే నశింపజేస్తాడు. కలిపురుషుని పట్టుకొని వధించేందుకు ఉద్యుక్తుడవుతాడు. కలి పురుషుడు కల్కిని వినుతించి బ్రతుకుజీవుడా అని పారిపోతాడు.

కలి పలాయనం చిత్తగించిన తర్వాత అతని అనుచరులైన సోకి, విసోకి అనే వారు కల్కి మీదికి వస్తారు. కల్కి వారితో ఘోరంగా యుద్ధం చేస్తాడు. కల్కి ప్రయోగించే ఆయుధాలన్నీ వారి ముందు నిర్వీర్యమవుతాయి. వారిని ఎలా జయించాలో కల్కికి పాలుపోలేదు. ఆ విషమ పరిస్థితిలోనే బ్రహ్మ అక్కడికి వస్తాడు. సోకి, విసోకి వేరువేరుగా మరణించరని చెబుతాడు. వారిద్దరూ ఒకేసారి మాత్రమే మరణిస్తారనీ వారి మరణ రహస్యం చెబుతాడు. బ్రహ్మ సూచన మేరకు సోకికి, విసోకికి ఒకే సారి తగిలేలా కల్కి వజ్రాయుధాన్ని ప్రయోగిస్తాడు. వారిద్దరూ మరణిస్తారు.

కల్కి తన అవతార ప్రయోజనం నెరవేరేలా దుర్మార్గులను నిర్మూలిస్తాడు. సన్మార్గులను సంరక్షిస్తాడు. ధర్మాన్ని నాలుగు పాదాల మీద నడిపిస్తాడు. తద్వారా కృతయుగ ధర్మానికి గట్టి పునాదులు వేస్తాడు. భూచక్రాన్నంతా ఏకచ్ఛత్రాధిపత్యంతో పాలిస్తాడు. కొంత కాలానికి పరిపాలనా బాధ్యతను త్యజించి బదరికాశ్రమం చేరుకుంటాడు. అక్కడ యోగనిష్ఠతో కొంతకాలం గడుపుతాడు.

అనంత, గరుడ, విష్వక్సేనాదులు వచ్చి వైకుంఠానికి రమ్మని ప్రార్థిస్తారు. తన కల్కి అవతారాన్ని చాలించి శ్రీమన్నారాయణుడు వైకుంఠానికి వెళ్తాడు.

యజ్ఞం తలపెట్టడం, తండ్రి అనుమతి పొందడం ప్రాచీన సదాచారానికి కల్కి రూపంలోవున్న విష్ణువిచ్చే ప్రాధాన్యాన్ని విశదం చేస్తాయి. బౌద్ధ, యవన, మ్లేచ్ఛ సంస్కృతుల ఆధిక్యత వల్ల హైందవ సంస్కృతి బాగా దెబ్బతింటున్నట్లు భావించిన సంప్రదాయ వాదులు అన్యమతాల వారి మీద కల్కి దాడిచేస్తాడని విశ్వసించి వుంటారు. సోకి, విసోకి – అజ్ఞానానికి, అధర్మానికి ప్రతీకలు కావడం వల్ల వారిని ఒకే సారి అంతమొందించాలే కానీ, వేరువేరుగా నశింపజేయడం వీలుకాదని విధాత చేత చెప్పించినట్లైంది. కలి పురుషుణ్ణి నిగ్రహించడం కలియుగంలో పేట్రేగుతున్న అధర్మాన్ని నిగ్రహించడమే అవుతుంది.

కలి నిగ్రహణ, ధర్మస్థాపన కల్కి అవతార ప్రయోజనాలు. భూభారాన్ని పూర్తిగా తగ్గించి శాంతిస్థాపన చెయ్యడం కూడా కల్కి లక్ష్యమే. ఇవన్నీ సునాయాసంగానే నెరవేరడం కల్కి అవతారం విజయవంతంకావడాన్ని సూచిస్తుంది. బాల్యంలోనే విద్యనభ్యసించడం, యవ్వనంలో విషయసుఖాలను అనుభవించడం, వృద్ధాప్యంలో మునివృత్తిని స్వీకరించడం, చరమదశలో యోగం ద్వారా తనువు త్యజించడం ఆదర్శమానవ జీవనమనిపించుకుంటుంది. ఈ విషయాన్నే కాళిదాసు రఘువంశరాజులకు ఆపాదిస్తూ తన రఘువంశ కావ్యంలో తెలియజేశాడు.

॥శ్లో॥ శైశవేభ్యస్థ విద్యానాం
యౌవనే విషయైషిణామ్ ।
వార్థక్యే మునివృత్తీనాం
యోగేనాన్తే తనుత్యజామ్ ।[56]

ఈ ఆదర్శ జీవనాన్నే కల్కి కూడా అనుసరించి లోకులందరికీ ఆదర్శప్రాయుడయ్యాడనిపిస్తుంది. ధర్మమే ఆకారం ధరించినట్లుగా ప్రవర్తించి కల్కి అందరినీ ధర్మాచరణకు పురికొల్పినట్లైంది.

విష్ణుదేవుడు ధరించిన అవతారాలను దశావతారాలనీ, ఇతరావతారాలనీ రెండు విధాలుగా వర్గీకరించుకోవచ్చు. ఇతరావతారాల్లో దుష్టశిక్షణకు ప్రాధాన్యం

లేదు. అవి జ్ఞాన ప్రబోధానికీ, పరోపకారానికీ ఉద్దేశించబడినవే. ధన్వంతరిగా ఆవిర్భవించి అమృతాన్ని దేవతలకు తెచ్చి ఇచ్చి దేవతలకు, తద్వారా లోకానికి ఉపకారం చేసినట్లైంది. కపిలమహర్షిగా తల్లి దేవహూతి ద్వారా లోకానికి అపారజ్ఞానం అందించినట్లైంది. నరనారాయణావతారంలో సహస్రకవచుణ్ణి సమయించి లోకాన్ని నిష్కంటకం చేసినట్లైంది. ఈ విధంగానే ఇతరావతారాల వల్ల కూడా లోకానికెన్నో ప్రయోజనాలు చేకూరాయి.

దశావతారాల్లోని ప్రతి అవతారమూ దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు ఉద్దేశింప బడిందే. మొదటి అవతారాలు రెండూ జలచరాలు కాగా, తరువాత అవతారం ఉభయచరంగా రూపుదాల్చింది. రెండు విధాల శరీరాలను ఒకేసారి ధరించిన అవతారం నరసింహావతారం. ఆకారరీత్యా ఇది తక్కిన అవతారాలన్నిటికీ భిన్నమైంది. విశిష్టమైంది. ఐదవ అవతారం నుంచి బుద్ధావతారం మినహా తక్కిన అవతారాలన్నిటిలోనూ మాతృగర్భం ఆవశ్యకత ఏర్పడింది. యాచన వల్ల కలిగే న్యూనతను సహించి అయినా ఇతరులను ఆదుకోవాలని వామనుడు తన వర్తన ద్వారా బోధపరిచాడు. ధర్మస్థాపన కోసం వర్ణాశ్రమ ధర్మాలు తారుమారైనా పరవాలేదనీ, తారుమారయ్యేందుకు అవకాశం వుందనీ సూచన ప్రాయంగా తెలియజేసిన అవతారం పరశురామావతారం. ఆదర్శ మానవుడిగా రాముడు, ఆదర్శ మేధావిగా కృష్ణుడు గోచరిస్తారు. ధర్మరక్షణ కోసం ధర్మాతిక్రమణ కూడా సమంజసమేనని ధ్వనింపజేసే అవతారం బుద్ధావతారం. తక్కిన అవతారాలన్నీ జరిగినవి కాగా, జరగబోయే అవతారంగా కల్కి అవతారం గోచరిస్తుంది.

అవతారాల కాలం నిడివిలో తేడా వున్నప్పటికీ పది అవతారాల ప్రయోజనం దుష్టశిక్షణ శిష్టరక్షణే కావడం గమనార్హం. వరాహావతారం నుంచి అన్నీ అవతారాలు దేవతల ప్రార్థన మీదనే సంభవించాయి. మత్స్యావతారం స్వచ్ఛందంగానూ, కూర్మావతారం పాక్షిక స్వచ్ఛందంగానూ సంభవించాయి. మొత్తానికి విష్ణుదేవుడు ధరించిన అవతారాలన్నీ అతని పరోపకార స్వభావాన్నీ, అనుపమ ఔనత్యాన్నీ, ఘటనాఘటన సామర్థ్యాన్నీ, సాటిలేని మేటి వ్యక్తిత్వాన్నీ తెలియజేస్తున్నాయి. ఇవన్నీ కూడా లోకులందరికీ అందునా భక్తులందరికీ ఆరాధ్యాలై అలరారు తున్నాయి.

# పాద సూచికలు

1) డాక్టర్ పి. నాగరాజరావుడి.లిట్.- విజ్ఞాన సర్వస్వము; సంపుటము-7; దర్శనములు - మతములు; అవతారము, పుటలు: 268,69

2) VETTAM MANI - Puranic Encyclopaedia; Religion & Ethics; Vol-7; Page:192.

3) త్రిదండి శ్రీ భక్తిసుధీర్ దామోదర మహరాజ్ - శ్రీరాధాగోవింద చంద్రిక; అవతారము; పుట :1

4) డా॥వేదవ్యాస - వేదాలలో హిందూమతం; సంపుటము-3; పుట: 610

5) డా॥సముద్రాల వేంకట రంగరామానుజాచార్యులు - శ్రీరామానుజ కీర్తికౌముది; అవతారతత్త్వము-దశావతారములు; పుటలు: 14,15

6) రెంటాల గోపాలకృష్ణ - బాలానంద బొమ్మల దశావతారాలు; పుట: 5

7) ఆచార్య జక్కంపూడి మునిరత్నం- అన్నమయ్య, ఆళ్వారులు - తులనాత్మక పరిశీలన; ద్వితీయభాగం; పుట: 16

8) ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు- దశావతార తత్త్వవిశ్లేషణ; పుటలు: 20,21

9) VETTAM MANI - Puranic Encyclopaedia;Vol-7 Page:78.

10) త్రిదండి శ్రీభక్తిసుధీర్ దామోదర మహరాజ్ - శ్రీరాధాగోవింద చంద్రిక; అవతారము; పుట: 5

11) ఆచార్య జక్కంపూడి మునిరత్నం - అన్నమయ్య, ఆళ్వారులు - తులనాత్మక పరిశీలన; ద్వితీయభాగం; పుట:15

12) డా॥వేదవ్యాస - వేదాలలో హిందూమతం; సంపుటము-3; పుట: 626

13) వేదవ్యాసుడు - శ్రీమద్భగవద్గీత; అధ్యాయం-4; శ్లోకం-6

14) వేదవ్యాసుడు - శ్రీమద్భగవద్గీత; అధ్యాయం-4; శ్లోకం-7

15) వేదవ్యాసుడు - శ్రీమద్భగవద్గీత; అధ్యాయం-4; శ్లోకం-8

16) వేదవ్యాసుడు - శ్రీమద్భగవద్గీత; అధ్యాయం-10; శ్లోకం-19

17) తాళ్ళపాక అన్నమాచార్యులు - అధ్యాత్మ సంకీర్తనలు; సంపుటము-2; కీర్తన-374

18) ఆచార్య జక్కంపూడి మునిరత్నం - అన్నమయ్య, ఆళ్వారులు - తులనాత్మక పరిశీలన; ద్వితీయభాగం; పుట: 19

19) ఆచార్య జక్కంపూడి మునిరత్నం-అన్నమయ్య, ఆళ్వారులు - తులనాత్మక పరిశీలన; ద్వితీయభాగం; పుట: 20

20) ఆచార్య జక్కంపూడి మునిరత్నం- అన్నమయ్య, ఆళ్వారులు - తులనాత్మక పరిశీలన; ద్వితీయభాగం; పుట: 21

21) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; దశమస్కంధం, పూర్వభాగం; పద్యం:16.

22) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; దశమస్కంధం, పూర్వభాగం; పద్యం:59

23) బమ్మెర పోతన- శ్రీమదాంధ్ర మహాభాగవతం; అష్టమ స్కంధం; పద్యం: 703.

24) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; అష్టమ స్కంధం; పద్యం:173.

25) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; అష్టమ స్కంధం, పద్యం:205.

26) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; తృతీయ స్కంధం, పద్యం:409.

27) బమ్మెర పోతన-శ్రీమదాంధ్ర మహాభాగవతం; తృతీయస్కంధం,పద్యం:415.

28) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; తృతీయస్కంధం; పద్యం:703.

29) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; సప్తమస్కంధం; పద్యం:38.

30) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; సప్తమస్కంధం; పద్యం:100.

31) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; సప్తమస్కంధం; పద్యం:130.

32) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; సప్తమస్కంధం; పద్యం:146.

33) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; సప్తమస్కంధం; పద్యం:275.

34) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; సప్తమస్కంధం; పద్యం:277.

35) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; అష్టమస్కంధం; పద్యం:475.

36) వేదవ్యాసుడు - శ్రీమద్భగవద్గీత; మూడవ అధ్యాయం; శ్లోకం-21.

37) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; అష్టమస్కంధం; పద్యం:593.

38) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; అష్టమస్కంధం; పద్యం:622.

39) తిక్కన-శ్రీమదాంధ్ర మహాభారతం; ఉద్యోగపర్వం; ద్వితీయాశ్వాసం; పద్యం:35.

40) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; తొమ్మిదవస్కంధం; పద్యం:463.

41) నన్నయ-శ్రీమదాంధ్ర మహాభారతం; ఆదిపర్వం-తృతీయాశ్వాసం; పద్యం:199.

42) హుళక్కి భాస్కరుడు - భాస్కర రామాయణం; బాలకాండం; పద్యం:123.

43) హుళక్కి భాస్కరుడు- భాస్కర రామాయణం;బాలకాండం; పద్యం:617.

44) హుళక్కి భాస్కరుడు - భాస్కర రామాయణం; ఆరణ్యకాండం; ద్వితీయాశ్వాసం; పద్యం : 250.

45) హుళక్కి భాస్కరుడు- భాస్కర రామాయణం; కిష్కింధాకాండం; పద్యం:371.

46) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; దశమస్కంధం-పూర్వభాగం; పద్యం:342.

47) చెన్నుభట్ల వేంకట కృష్ణశర్మ - కృష్ణశతకము; పద్యం: 20.

48) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; దశమస్కంధం-పూర్వభాగం; పద్యం:1375.

49) నంది తిమ్మన- పారిజాతాపహరణము; ప్రథమాశ్వాసం; పద్యం: 40.

50) శ్రీనాథుడు - కాశీఖండము-షష్ఠాశ్వాసం; పద్యం: 72.

51) బమ్మెర పోతన- శ్రీమదాంధ్రమహాభాగవతం; ద్వితీయస్కంధం; పద్యం:196.

52) నంది తిమ్మన-పారిజాతాపహరణము; ప్రథమాశ్వాసం; పద్యం: 50.

53) తెనాలి రామకృష్ణుడు- పాండురంగమాహాత్మ్యం; ద్వితీయాశ్వాసం; పద్యం:64.

54) తాళ్ళపాక అన్నమాచార్యులు- అధ్యాత్మ సంకీర్తనలు; సంపుటం-1, కీర్తన-334.

55) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర మహాభాగవతం; తొమ్మిదవ స్కంధం; పద్యం:647.

56) మహాకవి కాళిదాసు - రఘువంశం; ప్రథమసర్గః; శ్లోకం:8.

# 3. అన్నమయ్య దశావతార సంకీర్తనలు

**3.0** అన్నమయ్య వేంకటేశ్వర భక్తుడు. వేంకటేశ్వరుడు, విష్ణువు ఒక్కరే. విష్ణుదేవుని లీలలు అనంతాలు. దుష్టశిక్షణ–శిష్టరక్షణ ధ్యేయంగా ఆయన అనేక అవతారాలు ధరించాడు. వాటిలో పూర్ణావతారాలు కొన్నయితే, అంశావతారాలు మరికొన్ని. స్వామి అంశ ఏదో ఒక రూపాన్ని ధరించి ఉద్దిష్ట కార్యక్రమాలను నిర్వహించడం అంశావతారం. అయితే, భగవంతుడే స్వయంగా ఆయా శరీరాలను ధరించి అవతార ప్రయోజనార్థం కృషి చేయడం పూర్ణావతారం. విష్ణుదేవుని అవతారాలు ఇరవై ఒకటి అని ప్రథమ స్కంధంలోనూ, ఇరవై మూడు అని ద్వితీయ స్కంధంలోనూ భాగవతం చెబుతూవుంది. వాటిలోనూ మిక్కిలి విశిష్టమయినవి, ఎంతో ప్రసిద్ధి వహించినవి పది అవతారాలే. వీటినే దశావతారాలంటారు. వీటిలో కొందరు కృష్ణావతారాన్ని ఎనిమిదవ అవతారంగా పరిగణిస్తే మరికొందరు బలరామావ తారాన్ని ఎనిమిదవ అవతారంగా పరిగణిస్తారు. బలరామావతారం శేషాంశతో కూడిన వైష్ణవాంశ కాగా విష్ణువే స్వయంగా దేవకీ వసుదేవులకు జన్మించినట్లు భాగవత కథనం. అందువల్ల కృష్ణావతారమే ఎనిమిదవ అవతారం అని కొందరు భావిస్తారు. పైగా మానవాతీత లీలలను ప్రదర్శించడం వల్ల ఈ అవతారానికి అదనంగా కొంత విశిష్టత చేకూరింది. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకునో ఏమో అన్నమయ్య కృష్ణుణ్ణి, బలరాముణ్ణి కూడా కీర్తించాడు.

అన్నమయ్య అనవరత విష్ణుచింతనా తత్పరుడు. విష్ణులీలలెప్పుడూ అన్నమయ్య మదిలో మెదులుతూనే వుండేవి. వీటన్నిటినీ కొనియాడుతూ అనేక కీర్తనలు రచించాడు. వాటిలో దశావతార కీర్తనలు కూడా కొన్ని. అన్నమయ్య రచించిన దశావతార కీర్తనలను రెండు రకాలుగా వర్గీకరించి పరిశీలించవచ్చు. పది అవతారాలను కలిపి ఒకే కీర్తనలో కొనియాడడం మొదటి కోవకు చెందిన

కీర్తనల్లో కనిపిస్తుంది. ప్రతి అవతారాన్ని ప్రస్తావనా మాత్రంగానో, వివరంగానో కొనియాడడం రెండవ కోవ కీర్తనల్లో గోచరిస్తుంది. అన్నమయ్య రచించిన దశావతార కీర్తనల సౌందర్యాన్ని ఆవిష్కరించడమే ఈ అధ్యాయ పరమావధి.

## 3.1 సంస్కృత సంకీర్తనలు :

తెలుగులోనే గాక సంస్కృతంలో కూడా అన్నమయ్య కీర్తనలు రచించాడు. వీటిలోనూ వివిధాంశాలు చోటుచేసుకున్నాయి. భావ సౌందర్యమే గాక శబ్దమార్దవం వీటి విశిష్టతను ఇనుమడింపజేశాయి. జయదేవుని గీత గోవింద గీతాలను తలపిస్తూ శ్రోతల హృదయాలను ఉర్రూతలూగిస్తున్నాయి. జయదేవుని దశావతార సంస్కృత గేయాన్ని తలపించే విధంగా అన్నమయ్య సంస్కృత దశావతార కీర్తనలు రూపుదిద్దుకున్నాయి. అన్నమయ్య కీర్తనలు సంస్కృతంలో చాలా వున్నప్పటికీ దశావతారాలను ఒకేసారి తెలియజేసే కీర్తనలు రెండు మాత్రమే కనిపిస్తున్నాయి. వాటిలో ఒకటి అధ్యాత్మ కీర్తనకాగా, రెండవది శృంగార కీర్తన.

### 3.1.1 అధ్యాత్మ సంకీర్తన :

తిరుమల శ్రీవారికి నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, అయనోత్సవ, సంవత్సరోత్సవాలు చక్కగా జరుగుతాయి. అందువల్ల ఆ స్వామి సన్నిధి నిత్యకల్యాణం పచ్చతోరణంగా భాసిల్లుతుంది. స్వామి వారికి జరిగే ఉత్సవాలలో డోలోత్సవం కూడా ఒకటి. 'డోల' అనే సంస్కృత శబ్దానికి 'ఊయల' అని తెలుగు అర్థం. తిరుమల శ్రీనివాసుణ్ణి ఉభయనాంచారులతో ఊయలలో నిలిపి ఊపడం ఈ సేవ ప్రధానాంశం. అన్నమయ్య స్వామి గుణగణాలతో పాటు ఆయనకు జరిగే సేవలకు సంబంధించి కూడా కీర్తనలు రచించాడు. డోలోత్సవానికి సంబంధించి అన్నమయ్య కీర్తనలు రెండు కన్పిస్తున్నాయి. ఆ రెంటిలో సంస్కృత కీర్తనలో దశావతారాల ప్రసక్తి కనిపిస్తుంది. ఈ పాటంతా సంబోధనలతోనే సాగుతుంది. చరణాల్లో దశావతారాలు పేర్కొబడ్డాయి. అవి కూడా సూటిగానే పేర్కొబడ్డాయి. క్రమాలంకారాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే అక్కడక్కడ ఆయా అవతారాలను తెలియజేసే సంబోధనలు యాదృచ్ఛికంగా పడినట్లు కన్పిస్తుంది. ఈ అంశాలు మినహా ఈ పాటంతా సాధారణంగానే సాగుతుంది.

॥కీర్తన॥ డోలాయాం చల డోలాయాం హరేడోలాయాం ॥పల్లవి॥

మీన కూర్మ వరాహా మృగపతి అవతారా
దానవారే గుణశౌరే ధరణీధర మరుజనక ॥డోలా॥

వామన రామ రామ వరకృష్ణ అవతారా
2-374 శ్యామలాంగా రంగరంగా సామజ వరద మురహరణ ॥డోలా॥

దారుణ బుద్ధ కలికి దశవిధ అవతారా
శీరపాణే గోసమాణే శ్రీవేంకటగిరి కూటనిలయ ॥డోలా॥[1]

### 3.1.2 శృంగార సంకీర్తన :

అన్నమయ్య సంకీర్తనల్లో కవిత్వం పాలు ఎక్కువ. అందుకే అవి పద్యాలు కాబోయి పాటలైపోయాయని అభిజ్ఞుల అభిప్రాయం. అన్నమయ్య దశావతార కీర్తనల్లో శృంగారపరంగా రచింపబడిన గేయం చిక్కని కవిత్వంతో చింతనను ఆకర్షిస్తూ ఉంది. ఈ గేయంలో దశావతారాలు స్పష్టంగా చోటుచేసుకోవడమే గాక బలరామావతారం కూడా చేరి పదకొండు అవతారాల ప్రస్తావన కనిపిస్తుంది. ప్రతి అవతారానికీ శృంగార పరమైన లంకె ఉండడం గమనార్హం. ఈ గేయంలో కొన్ని అవతారాల్లో దైవ సంబోధన చోటు చేసుకుంది. ఆ సంబోధనలు దనుజహర, నిపుణ, సింహ విక్రమణ, హింసాదూర, భూతరక్షక, ధీర, వేంకటనగాధీశ. ఇవన్నీ అవతారోచితంగా, సాభిప్రాయంగా ఉన్నాయి.

పదిరూపులు ధరించి, పది విధాలుగా ఆచరించడం 'మిష' మాత్రమే దశవిధ శృంగారావస్థల కోసమే విష్ణువీయవతారాలు ధరించాడని అన్నమయ్య ఈ పాటలో చమత్కరించాడు.

పూర్వం వేదాలను స్థాపించడం కోసం మత్స్యదేహంతో ప్రకాశించడం వ్యాజం మాత్రమే. అది అతని వ్యాపారం కాదు. అయితే విష్ణువు 'మత్స్యావతారం' ధరించడం దేనికంటే నిత్యతారుణ్యంతో నెగడే లక్ష్మీదేవి సౌందర్య జలధిలో ఓలలాడేందుకే.

మందర పర్వతాన్ని ధరించే మిషతో అందమైన తాబేలు రూపం ధరించాడు. అది నీరసమైన బుద్ధికి తోపట్టే అంశం. అలాంటప్పుడు 'కూర్మరూపం' దేనికంటే ప్రియవధూ కుచమందరాలను ధరించేందుకే ఈ రూపం గైకొన్నాడు.

పూర్వం భూమిని పునరుద్ధరించే నెపంతో శ్వేత 'వరాహరూపం' ధరించాడు. ఇది ఆ వ్యవహారం కాదు. భూదేవి కుచతటి మీద దంతక్షతాలు చేసేందుకే ఈ రూపం ధరించడం జరిగింది.

పూర్వం దనుజుడైన హిరణ్యకశిపుణ్ణి హరించడం నిమిత్తంగా నరసింహ పరాక్రమం చూపడం జరిగింది. అది ఆయన మహత్త్వం కాదు. ఇందిరకు నఖక్షతాలు ప్రసాదించడం కోసమే 'నరసింహ రూప ధారణ'.

పూర్వం బలి వైభవాన్ని అపహరించే వ్యాజంతో కపట 'వామన రూపం' ధరించాడు. అయితే అది వాస్తవం కాదు. స్త్రీల విషయంలో కపటంగా ప్రవర్తించేందుకే అతడలాచేశాడు.

రాజులను సంహరించేందుకే 'పరశురామావతారం' ధరింపబడింది. అధిక అరుణజల ప్రాప్తి అనే మాటతో పరశురామావతారమిక్కడ సూచింపబడింది. అది అతని స్థితికాదు. స్త్రీల బాధను తెలుసుకోవడం కోసమే ఈ అవతారం. ఇక్కడ స్త్రీలంటే మరణించిన రాజుల భార్యలు కావచ్చు. లేదా విష్ణుదేవుణ్ణి మోహించి విహ్వలత్వం పొందిన వనితలు కావచ్చు.

యుద్ధంలో రావణుణ్ణి జయించే నెపంతో విష్ణువు రాజభోగాన్ని స్వీకరించాడు. అంటే 'రామావతారం' ధరించాడన్నమాట. అది అలా కాదు. సావధానంగా సీతావిరహాన్ని అనుభవించడం కోసమే!

ఖలుడైన కంసుణ్ణి ఖండించేందుకు కృష్ణరూపంతో పుట్టుక స్వీకరించాడు. ఈ 'కృష్ణావతారం' అందుకు కాదు. వ్రజ స్త్రీలతో సంపర్కం పెట్టుకోవడం కోసమే.

ప్రలంబాసురుణ్ణి పడగొట్టే మిషతో, కోపంతో 'బలరామరూపం' ధరించడం జరిగింది. అది ఆయన ప్రభుత్వ వైఖరి కాదు. రేవతీ దేవిని అనుభవించేందుకే బలరా మావతారం.

పూర్వం త్రిపురాలను హరించే మిషతో 'బుద్ధరూపం' ధరించడం జరిగింది. అది ఆ అవతార హితం కాదు. త్రిపురాంగనల కౌగిళ్ళకోసమే.

కలి మతాన్ని పడగొట్టాలనే మిషతో, క్రూర కోపంతో 'కల్కి అవతారం' ధరించడం జరుగుతుంది. అది యదార్థం కాదు. భయపడిన భూదేవికి సంప్రీతి కలిగించడం కోసమే ఆ అవతారం.

ఈ కీర్తనలో అన్నమయ్య భావనాశక్తి, భావసౌందర్యం మేధస్సును, హృదయాన్ని కూడా పరవశింపజేస్తాయి. ఆలోచనకు విందుగా రూపొందిన ఈ కీర్తన అవశ్యమనుసంధేయం.

॥కీర్తన॥ దశవిధా చరణం తన్నభవతి
దశవిధావస్థార్థం తేతత్ర ॥పల్లవి॥

స్థాపయిష్యామి వేదానితి వ్యాజేన
దీపితోయం మత్స్యదేహః పురా
వ్యాపారోయమేవం నచ తరుణ్యా
5-374 రూపజలధౌ కేళిరుచయే తత్ర ॥దశ॥

ధారయిష్యామి మందరమితి వ్యాజేన
చారుకచ్ఛప విధాచరణం పురా
నీరసేయం తవ మనీషా ప్రియవధూ-
భారకుచమందరౌ భర్తుం తత్ర ॥దశ॥

భువముద్ధరిష్యామి పునరితి వ్యాజేన
ధవళకిటి వైభవం ధత్సే పురా
వ్యవహృతిరియం నచ మహామహీకుచతటే
తవ దంతక్షతం దాతుం తత్ర ॥దశ॥

దనుజం హరిష్యామి తమితి వ్యాజేన
ఘన నారసింహ విక్రమణం పురా

దనుజహార తవ మహత్త్వం తన్నచ నఖా-
ర్జన మిందిరాయా (యాం?) ప్రసర్తుం తత్ర ॥దశ॥

అపహరిష్యామి బలిమహమితి వ్యాజేన
కపట వామన రూపకలనం పురా
నిపుణ ఏవం నఖలు నియతిస్సతీషుతే
కపటా చరణం ఘటయితుం తత్ర ॥దశ॥

సంహరిష్యామి నృపజనమితి వ్యాజేన
బహ్వారుణతోయే ప్రాప్తిః పురా
సింహ విక్రమణతే స్థితిరియం నచ సతీ-
విహ్వాలత్వం తదా వేత్తుం తత్ర ॥దశ॥

రావణం జేష్యామి రణఇతి వ్యాజేన
భూవరత్వే తే భోగః పురా
ఏవం నభవతి మహీసుతా విరహం
సావధానేన ప్రహర్తుం తత్ర ॥దశ॥

కంసం హనిష్యామి ఖలమితి వ్యాజేన
సంసారోయ మాచరితః పురా
హింసాదూర నచ హితమిదం వ్రజవధూ-
సంసరణ లీలాం ప్రసక్తుం తత్ర ॥దశ॥

పాతయిష్యే ప్రలంబమితి వ్యాజేన
జాతరోషస్య తే జననం పురా
భూతరక్షక తే ప్రభుత్వం తన్నఖలు
భూతలే రేవతీం భోక్తుం తత్ర ॥దశ॥

బుద్ధో భవిష్యామి పురహృతి వ్యాజేన
బద్ధరోష ఇతితే ప్రాప్తిః పురా
తద్ధితం నహిఖలు తదావధూహస్త-
సిద్ధ ప్రసారేణ సేవితుం తత్ర ॥దశ॥

మారయిష్యామి కలిమతమితి వ్యాజేన
క్రూర కల్క్యవతార కోపః పురా
ధీర వేంకటనగాధీశ ఏవం నఖలు
భీరుముర్వీం సంప్రీణయితుమత్ర ॥దశ॥[2]

## 3.2 తెలుగు సంకీర్తనలు :

అన్నమయ్య సంకీర్తనల్లో సంస్కృత సంకీర్తనల కంటే తెలుగు సంకీర్తనలే అధికం. అన్నమయ్య తెలుగువాడు కావడం వల్లనో, తెలుగువారికి అవి అందాలనుకోవడం వల్లనో అత్యధిక సంఖ్యలో తెలుగు సంకీర్తనలను అతడు రచించాడు. వాటిలో జానపదబాణీలు, ఉత్సవ సంకీర్తనలు, తాత్త్విక సంకీర్తనలు, ప్రబోధాత్మక సంకీర్తనలు, వైరాగ్యాత్మక సంకీర్తనలు, స్తుత్యాత్మక సంకీర్తనలు, సంవాదాత్మక సంకీర్తనలు, నాయికానాయక భావాత్మక సంకీర్తనలు, దశావతార సంకీర్తనలు ఇలా ఎన్నో రకాల సంకీర్తనలు చోటుచేసుకున్నాయి. వాటిలో దశావతార సంకీర్తనలు హృదయాన్ని స్పృశించి ఉర్రూతలూగించే విధంగా రుపుదిద్దుకున్నాయి. అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లోనూ, శృంగార సంకీర్తనల్లోనూ వీటికి స్థానం లభించింది.

### 3.2.1 అధ్యాత్మ సంకీర్తనలు :

అన్నమయ్య రచించిన అధ్యాత్మ సంకీర్తనల్లో దశావతార ప్రస్తావన అనేకచోట్ల కనిపిస్తుంది. అనేక విధాలుగా కనిపిస్తుంది. అన్నమయ్య రచించిన దశావతార సంకీర్తనల్లో నీతిప్రబోధం, కర్మసిద్ధాంతం గోచరిస్తాయి. స్వామి కల్యాణ గుణాలు సాక్షాత్కరిస్తాయి. వెన్నుని చేతివాటం గోచరిస్తుంది. మహావిష్ణువుకూ దైన్యమున్న సంగతి ప్రస్ఫుటమవుతుంది. పొడుపుకథ జానపద ధోరణిలో స్థానం వహిస్తుంది. ఇవేగాక విష్ణువును భూతంగానూ, దొంగగానూ, బోయనాయడుగానూ, పొలంగానూ, తలపుగానూ అన్నమయ్య అభివర్ణించిన వైనం అభివ్యక్తమవుతుంది.

#### 3.2.1.1 ప్రబోధం :

అన్నమయ్య బాగా చదువుకున్నవాడు. శాస్త్రాలు, పురాణాలు అభ్యసించాడు. ఎందరో మహనీయులను సేవించాడు. వారినుంచి అమూల్యమైన విషయాలను

శ్రవణం చేసి ధారణలో పెట్టుకున్నాడు. ఇతరులు చెప్పగా విన్నవాటితోపాటు తన అనుభవాలను కూడా తలపులో నిలుపుకున్నాడు. వీటన్నిటినీ లోకులకు తెలియజేయాలని అతని ఉల్లం ఉరకలు వేసింది. తన కీర్తనల్లో అనేక నీతులను ప్రబోధించాడు. లోకులనుద్దేశించి,మనసునుద్దేశించి ఈ ప్రబోధం చేశాడు. ఇలాంటి ప్రబోధాత్మక కీర్తనలెన్నో అన్నమయ్య సాహిత్యంలో చోటుచేసుకున్నాయి. వాటిలో రెండు కీర్తనలు దశావతారాలను కూడా ప్రస్తావిస్తున్నాయి. ఒకటి ప్రత్యక్షంగా నీతినే ప్రబోధిస్తే, మరొకటి కర్మసిద్ధాంతాన్ని ఆవిష్కరిస్తుంది.

### 3.2.1.1.1 నీతిప్రబోధం :

నీతిని తెలియజేసే అన్నమయ్య సంకీర్తనలెన్నో లోకుల ధారణలో ఉండదగ్గవిగా కనిపిస్తాయి. ఈ నీతులను ఆచరించి మేలు పొందవలసిందిగా అఖిలాంధ్ర ప్రపంచాన్ని అన్నమయ్య ఉద్బోధించాడు. అలాంటి కీర్తనల్లో దేనివల్ల మేలు కలుగుతుందో తెలియజేసే కీర్తన ఒకటి. ఈ కీర్తనలో ప్రతిపాదంలోనూ 'మేలు' శబ్దం పునరావృతం కావడం విశేషం. ఈ మేలును గూర్చి తెలియజేస్తూనే అన్నమయ్య వేంకటేశ్వరుడి దశావతారాలను తెలియజేశాడు. కీర్తన అంతటా ప్రతివాక్యంలోనూ ఏదో ఒక అవతారం ధ్వనించేలా రచించడం అన్నమయ్య మేధోసంపత్తికి నిదర్శనం.

ప్రాణికోటికంతటికీ సంసారమే మేలు. సంసారమంటే పుట్టుతూ, మరణిస్తూ వుండడం. గృహస్థ జీవనం, కాపురం, పద్ధతి, మార్గం అని అనేక అర్థాలు కనిపిస్తాయి. అన్నమయ్య గృహస్థ జీవితాన్ని, జనన మరణ రూప క్లేశాన్ని సమర్థించాడనుకోవడానికి అవకాశం తక్కువ. కాబట్టి అన్నమయ్య ప్రయోగించిన సంసార శబ్దానికి పద్ధతి, మార్గము అనుకోవడమే సమంజసమనిపిస్తుంది. ప్రాణులందరికీ మంచి పద్ధతి లేదా మంచి మార్గము ఉండవలసిన ఆవశ్యకతను అన్నమయ్య ప్రయోగం తెలియజేస్తుందనడం సముచితం. కంసారి భక్తి కలిగితే సంసారి కూడా సన్యాసి కంటే అధికుడు కాగలడు. అందువల్ల కంసారి భక్తి కలిగితే మేలు.

వినయవాక్యాలతో కూడిన విద్యను (వేదాన్ని) సాధిస్తే మేలు

– మత్స్యావతారం.

తృప్తి చెంది అప్పులలో (నీటిలో, ఋణములో) దాగి ఉండకుంటే మేలు - కూర్మావతారం.

పూర్వం భూమి తనను ధరించి దించకుంటే మేలు. మునుపనే భూమి అనడం మునుపనే భూమిని అని కూడా స్వీకరించవచ్చు - వరాహావతారం.

వెంబడించే కోపాన్ని విడిచిపెడితే మేలు. కోపం నరసింహ స్వభావం - నరసింహావతారం.

ఒకరిని యాచించి చులకన కాకుంటే మేలు - వామనావతారం.

మాటిమాటికీ జీవులను వధించకుంటే మేలు - పరశురామావతారం.

ఎక్కువ బాధలతో కూడిన కష్టాలు పడకుంటే మేలు - రామావతారం.

ఇతరుల తిట్లకు పాత్రుడు కాకుంటే మేలు - కృష్ణావతారం.

పరస్త్రీలను భంగపాటు పాలు చేయకుంటే మేలు - బుద్ధావతారం.

బుద్ధిపూర్వకంగా ప్రక్కదారులు తొక్కకుంటే మేలు - కల్క్యవతారం.

శ్రీ వేంకటేశ్వరుణ్ణి సేవించి చింతలేకుండా జీవించడం మేలు.

॥కీర్తన॥ సంసారమే మేలు సకలజనులకును
కంసాంతకుని భక్తి గలిగితే మేలు ॥పల్లవి॥

వినయపు మాటల విద్యసాధించితే మేలు
తనిసి యప్పులలోన దాఁగకుంటే మేలు
3-447 మునుపనే భూమి దన్నుమోచి దించకుంటే మేలు
వెనుకొన్న కోపము విడిచితే మేలు ॥సంసా॥

కోరి వొకరినడిగి కొంచపడకుంటే మేలు
సారెసారె జీవులను చంపకుంటే మేలు
భారపుటిడుమలను పడకుండితే మేలు
కారించి తిట్ల కొడిగట్టకుంటే మేలు ॥సంసా॥

పరకాంతల భంగపరచకుంటే మేలు
దొరకొని కెళవులు దొక్కకుంటే మేలు
అరుదైన శ్రీవేంకటాద్రి విభునిc గొల్చి
యిరవై నిశ్చింతుcడైతే నిన్నిటాను మేలు ॥సంసా॥[3]

### 3.2.1.1.2 కర్మసిద్ధాంతం :

భారతీయ సంస్కృతి అందునా హైందవ సంస్కృతి కర్మసిద్ధాంతం మీదనే ఆధారపడుతుంది. మనకు తారసిల్లే ప్రతి మంచీ చెడు మనం ఇంతకు ముందు చేసిన కర్మాన్నిబట్టే ఏర్పడుతూ వుంటాయని హిందువుల దృఢ విశ్వాసం. ప్రజాకవిగా, తిరుగుబాటు కవిగా పేరు తెచ్చుకున్న వేమన కూడా కర్మసిద్ధాంతాన్నే బలపరిచాడు.

॥ఆ.వె॥ వ్రాcత వెంటcగాని వరమీcదు దైవంబు
చేcతకొలcది గాని వ్రాcతకాదు
వ్రాcతకజుcడు కర్త చేcతకుc దాcగర్త
విశ్వదాభిరామ వినురవేమ![4]

॥శ్లోకం॥ అవస్యమనుభోక్తవ్యమ్
కృతం కర్మ శుభాశుభమ్
హరినాపి హరేనాపి
బ్రహ్మనాపి సుర్తైరపి! - అని నీతి శాస్త్రం తెలియజేస్తుంది.

అన్నమయ్య తన దశావతార కీర్తన ఒక దానిలో కర్మసిద్ధాంతాన్ని ఆవిష్కరించాడు. తాము చేసిన కర్మానికంటే అధికంగా ఏదీరాదు. చేసిన కర్మం అనుభవించక తప్పదు. కర్మ సిద్ధాంతంలోని ఈ రెండు అంశాలను ప్రతిపాదిస్తూ అన్యాపదేశంగా అన్నమయ్య దశావతారాలను ప్రస్తావించాడు.

ఇటు అటు మిడిసిపడినా కొంచెం కూడా లేదు - మత్స్యావతారం.
వీపుబట్టగట్టే విధంగా మోతమోసి కష్టపడినా లేదు - కూర్మావతారం.
గట్టిగా ప్రయత్నించి లోకాన్ని తవ్వుకొన్నా లేదు - వరాహావతారం.

అమాయకంగా, అదిపనిగానోరు తెరచినా లేదు - నరసింహావతారం.

ఇతరులను యాచించి వారి బ్రతుకును ఆశించినాలేదు - వామనావతారం.

నిర్భయంగా యుద్ధంచేసి నెత్తురులో దొప్పదోగి వీరుడుగా వినుతికెక్కినా లేదు - పరశురామావతారం.

అడవులన్నీ తిరిగి అలమటించినా లేదు - రామావతారం.

ఇష్టంతో కష్టాలకు సిద్ధపడినా లేదు - కృష్ణావతారం.

తీవ్రంగా ప్రయత్నించి స్త్రీలను వలపించుకున్నా లేదు - బుద్ధావతారం.

గుఱ్ఱాన్నెక్కి దౌడుతీస్తూ ప్రకాశించినా లేదు - కల్క్యవతారం.

శ్రీవేంకటేశ్వరుణ్ణి సేవించడం మినహా ఏమి చేసినా ఎటువంటి సత్ఫలితమూ వుండదు.

ఏ పాటుపడినా, ఎన్నిపాట్లు పడినా పూర్వకర్మానుసారం లభించవలసిన మంచీచెడులు మాత్రమే లభిస్తాయి. తదితరాలేవీ లభించే అవకాశం లేదని ఈ కీర్తనలో అన్నమయ్య ధ్వనింపజేశాడు. అంతా కర్మసిద్ధాంతం మీదనే ఆధార పడినప్పటికీ వేంకటేశ్వరుణ్ణి ఆశ్రయిస్తే కర్మతీవ్రతలో కొంత సడలింపు వచ్చే అవకాశం వుందని ఈ కీర్తన ధ్వనింపజేస్తుంది.

॥కీర్తన॥ ఏమి సేయవచ్చుఁ గర్మమిచ్చినంతే కాని లేదు
తాము సేసినంత వట్టు తమకుఁబోరాదు ॥పల్లవి॥

ఇట్టునట్టు మిట్టిపడ్డ యించుకంతా లేదు, వీఁపు
బట్టగట్ట మోపు మోఁచి పాటువడ్డా లేదు
తట్టువడ లోకమెల్లఁ దవ్వుకొనినా లేదు
తెట్టఁదెరువున నోరు దెరచినా లేదు ॥ఏమి॥

అడిగి పరులబదు కాసపడ్డా లేదు, భీతి
విడిచి నెత్తుటఁదోఁగి వీరుఁడైనా లేదు
అడవులెల్లాఁ దిరిగి అలమటించిన లేదు
యిడుమపాటుకుఁజొచ్చి యియ్యకొన్నా లేదు ॥ఏమి॥

వచ్చివచ్చి వనితల వలపించుకొన్నా లేదు
మెచ్చుల గుఱ్ఱము నెక్కి మెరసినా లేదు
యెచ్చరికఁ దిరు వేంకటేశుఁ గొలువక వుంటే
యిచ్చటనచ్చట సుఖ మించుకంతా లేదు ॥ఏమి॥[5]

### 3.2.1.2 రూపవర్ణన :

భగవంతుడు ఆది మధ్యాంత రహితుడు. అతడు పలానా విధంగా మాత్రమే వుంటాడని ఖచ్చితంగా ఎవరూ చెప్పలేరు. కొందరతనికి రూపం ఉందంటే, మరికొందరు లేదంటున్నారు. రూపంలేని దేనిమీదైనా మనసు నిలపడం కష్టం కాబట్టి ఒక రూపాన్ని ఆలంబనగా చేసుకుని భగవంతుణ్ణి ధ్యానించాలని జ్ఞానులు చెబుతారు. ఈ నేపథ్యంలోనే మూర్తి పూజ, మూర్తి ఉపాసన అమలులోకి వచ్చివుంటాయి. అర్చామూర్తిగా తిరుమలలో వెలసిన శ్రీవేంకటేశ్వరుణ్ణి అనేకులు అనేక విధాలుగా ఆరాధించారు. అన్నమయ్య తనకు అన్నీ వేంకటేశ్వరుడేనని తలపోసి ఉపాసించాడు. ఈ స్వామిని భూతంగా, దొంగగా, బోయనాయదుగా, పొలంగా, తలపుగా కూడా వర్ణించాడు. అన్ని మూర్తభావనలతోపాటు అమూర్త భావమైన తలపును గురించి కూడా అన్నమయ్య ఇక్కడ తలపోయడం విశేషం. ఇది స్వామిపట్ల అతనికి గల ఎక్కువ మక్కువను, సాన్నిహిత్యగరిమను తెలియజేస్తుంది.

### 3.2.1.2.1 భూతం :

అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి అనేక విధాలుగా భావించాడు. అనేక రూపాలలో దర్శించాడు. అనేక రకాలుగా అభివర్ణించాడు. ఏ విధంగా కొనియాడినా స్వామిపట్ల తనకు గల ఆత్మీయత ప్రస్ఫుటంగా ప్రకాశించేలా స్వామిని గురించి గానం చేశాడు. ఈ ధోరణి అతడు రచించిన దశావతార కీర్తనల్లోనూ కనిపిస్తుంది.

'భూత' శబ్దానికి అనేక అర్థాలున్నప్పటికీ 'పిశాచం' అనే అర్థం జన సామాన్యంలో రూఢికెక్కింది. అన్నమయ్య దైవశిఖామణి అయిన వేంకటేశ్వరుణ్ణి పిశాచంగా కూడా భావించి ఆనందించాడు. మిక్కిలి నల్లగా, పొడవుగా వున్న

విష్ణువు అందరినీ ఆవహించి నడిపిస్తున్నాడనీ, అందువల్ల అతడు భూతమని అన్నమయ్య అభిప్రాయపడ్డాడు.

కోపించి ఓడను మ్రింగె భూతమని అభివర్ణించడం వల్ల విష్ణువు 'మత్స్యావతారం' ధరించి ఓషధులు, సప్తర్షులు వున్న ఓడ అనంత జలధిలో మునిగి పోకుండా ఆదుకున్న అంశాన్ని ధ్వనింపజేసినట్లు అయ్యింది.

పునుక వీఁపు పెద్ద భూతమనడం వల్ల విశాలమైన వీపు మీద కొండను ధరించిన 'కూర్మావతార' వృత్తాంతాన్ని ప్రస్తావించినట్లు అయ్యింది.

కోపంతో విజృంభించిన చీకటి భూతము అనడం వల్ల నలుపు రంగు గల 'వరాహ' వృత్తాంతాన్ని సూచించినట్లు అయ్యింది.

నివులు గప్పిన నిప్పుగా పరాక్రమాన్ని తనలో దాచుకున్న శ్రేష్టమైన మోము అనడం ' నరసింహావతారాన్ని' తెలియజేస్తూ వుంది. నరసింహుడు స్తంభంలో దాగివుండిన విషయాన్ని ఇది బోధపరుస్తుంది.

పొడవాటి కాళ్ళ భూతము అనడం వల్ల 'వామనుడు' ధరించిన త్రివిక్రమాకార విషయం తేటపడుతుంది.

యుద్ధంలో శౌర్యాన్ని ప్రదర్శించే మేటి వీరులలోనూ పెద్దభూతం అనడం 'పరశురామావతారాన్ని' ఆవిష్కరిస్తుంది.

గాటపు జడల బింకపు భూతమని పేర్కొనడం వల్ల జటావల్కలాలు ధరించి అడవిలో నడయాడిన 'అయోధ్యరాముని' కథను అభివ్యక్తం చేసినట్లు అయ్యింది.

నల్లని ఆకారం ధరించి మానవులను మభ్యపెట్టిన భూతమనడం 'కృష్ణావతారాన్ని' ప్రస్తావిస్తుంది.

వస్త్రాలు ధరించక ఉత్సాహంగా తిరిగిన భూతమనడం 'బుద్ధావతారాన్ని' బోధపరుస్తుంది.

దాంట్ల పెద్దభూతము అనటం గుఱ్ఱపు దాటులను తద్వారా 'కల్కి అవతారాన్ని' తెలియజేస్తుంది.

గరుడవాహనంతో వేంకటగిరి మీద నివసించే భూతము అని శ్రీవేంకటేశ్వరుణ్ణి అన్నమయ్య అభినుతించాడు.

||కీర్తన|| పుడమి నిందరిఁబట్టె భూతము కడుఁ
బొడవైన నల్లని భూతము ||పల్లవి||

కినిసి వోడమింగెడి భూతము
పునుక వీఁపు పెద్ద భూతము
కనలి కవియు చీఁకటి భూతము
పొనుగు సోమపు మోము భూతము ||పుడమి||

చేటకాళ్ళ మించిన భూతము
పోటుదారల పెద్ద భూతము 1-109
గాఁటపు జడల బింకపు భూతము
జూటరి నల్లముసుఁగు భూతము ||పుడమి||

కెలసి బిత్తలే తిరిగేటి భూతము
పొలుపుదాంట్ల పెద్ద భూతము
బలుపు వేంకట గిరిపయి భూతము
పులుగు మీఁది మహా భూతము ||పుడమి||[6]

**3.2.1.2.2** దొంగ :

విష్ణువు మహామహిమాన్వితుడు. అతని మాయలు అనంతం. అనితర జ్ఞేయం. అనితర సాధ్యం. పురుషోత్తముడు మునుల హృదయాలను అపహరించాడు. కృష్ణావతారంలో వెన్నలను, వ్రేతల వస్త్రాలను దొంగిలించాడు. వీటన్నిటినీ మనసులో వుంచుకునో ఏమో అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి దొంగగా కూడా తలపోశాడు.

వేంకటేశ్వరుడు వింతదొంగ అని అభివర్ణించడంలో ఎంతో అర్థం ఇమిడివుంది. అతడు సామాన్యమైన దొంగ కాదు. దొంగ కాని వాడూ కాదు. అతని లీలలు వింతగా ఉండటం వల్ల అతడు వింత దొంగగా పేర్కోబడ్డాడు. ఈ ఆరోపణలో దశావతారాలు చోటు చేసుకోవడం గమనార్హం.

నీటిలో జాడలు వేసేదొంగ. అంటే నీటిలో సంచరించే దొంగ. ఇది 'మత్స్యావతారాన్ని' సూచిస్తుంది.

తలకనిపించకుండా నీటిలో దాగివుండే దొంగ అనడం 'కూర్మావతారాన్ని' తెలియజేస్తుంది.

శ్రమ లేకుండా నేలత్రవ్వే దొంగ అనడం 'వరాహావతారాన్ని' వెల్లడి చేస్తుంది.

సందెకాడ తిరిగేటి దొంగ అనడంలో 'నరసింహస్వామి' సంధ్యా సమయంలో హిరణ్యకశిపుణ్ణి వధించిన వృత్తాంతం బోధపడుతుంది.

ఒక పాదం క్రిందనే లోకాన్ని అణగించేదొంగ అనడం 'వామనావతరం'లో చోటుచేసుకున్న త్రివిక్రమ రూపవిభవాన్ని ధ్వనింపజేసినట్లు అయ్యింది.

తల్లిపట్ల కూడా ప్రజ్జ్వరిల్లే కోపాన్ని ప్రసరింపజేసిన దొంగ అనడం 'పరశురామావతారాన్ని' గుర్తుచేస్తుంది.

అడవిలో నివాసాన్ని ఏర్పరచుకున్న దొంగ అనడం 'రామ' వనవాసాన్ని గుర్తుచేస్తుంది.

నీలివస్త్రము ధరించిన దొంగ అనడం 'బలరామావతారాన్ని' ప్రస్తావిస్తుంది.

ముదితలను మోసంచేసే మునిముచ్చు అనడంలో 'బుద్ధావతారం' వ్యక్తమవుతుంది.

గుఱ్ఱపు దొంగ అనడంలో 'కల్క్యవతార' ప్రసక్తి కనిపిస్తుంది.

వేంకటాద్రి మీద మూసిన ముత్యమై భాసిల్లే విషయాన్ని ప్రస్తావిస్తూ స్వామి శ్రేష్ఠతను అన్నమయ్య కొనియాడాడు. అన్నిటా, అన్ని వేళలా ఒకే విధంగా కనిపించని వాడిని దొంగ అని వ్యవహరిస్తారు. దాపరికం ఇక్కడ ప్రధాన అంశం. విష్ణుదేవుని దశావతారాల్లో దాపరికం ధ్వనించే అంశాలను తెలియ జేయడమే గాక వేంకటేశ్వరుడు మూసిన ముత్యంగా వున్నాడని భావించడం కూడా తన మహిమలను మరుగు పరుచుకుని మలయప్ప ఈ మలమీద నివసిస్తున్నాడని ప్రశంసించినట్లు అయ్యింది.

॥కీర్తన॥ వీఁడివో యిదె వింతదొంగ
వేఁడిపాలు వెన్న వెరఁజిన దొంగ ॥పల్లవి॥

వెలయనీటఁ జొప్పు వేసేటి దొంగ
తలగాననీక దాఁగు దొంగ
తలఁకక నేలదవ్వేటి దొంగ
తెలిసి సందెకాడఁ దిరిగేటి దొంగ ॥వీఁడి॥

అడుగు కింద లోకమడఁచేటి దొంగ
అడరి తల్లికినైన నలుగుదొంగ
అడవిలో నెలవైయున్న దొంగ
తొడరి నీలికాసెతో నుండు దొంగ ॥వీఁడి॥

1-322

మోసమింతులఁజేయుముని ముచ్చుదొంగ
రాసికెక్కిన గుఱ్ఱంపు దొంగ
వేసాల కిటువచ్చి వేంకటగిరి మీఁద
మూసినముత్యమై ముదమందు దొంగ ॥వీఁడి॥[7]

### 3.2.1.2.3 బోయనాయదు :

అన్నమయ్య తిరుమలేశుణ్ణి బోయనాయదుగా భావించాడు. 'బోయనీఁడంటే – బోయల నాయకుడు, మేటి కిరాతుడు, ఏనుగుతో సమానమైన బలంగలవాడు' అని సూర్యరాయాంధ్ర నిఘంటువు తెలియజేస్తుంది. బోయనీడు శబ్దాన్నే బోయనాయదు అని అన్నమయ్య వాడుకుని ఉండవచ్చు. దీన్నిబట్టి ఆలోచిస్తే వేంకటేశ్వరుణ్ణి శ్రేష్ఠ, బలిష్ఠ నాయకుడుగా అన్నమయ్య అంతరంగంలో నిలుపుకొని వుండవచ్చు. శేషాద్రి మీద నివసించే బోయనాయఁదు చాలాపొడవుగా ఉంటాడు. ఇది అతని త్రివిక్రమాకారాన్ని తలపిస్తుంది. తమిళంలో కూడా 'నెడుమాల్' అని విష్ణువును వ్యవహరిస్తారు. ఇక్కడ కూడా పొడవైన వాడు అనే అభిప్రాయం. ఎవర్నీ విదువకుండా అందరినీ కాపాడే ఆశ్చర్యమే ఈ అచ్యుతుడు. ఈ దైవ శిఖామణే పంచఁగాల వేలముల బోయనాయఁదు. అన్నమయ్య వెలిబుచ్చిన ఈ భావనలో కూడా దశావతారాలు చోటుచేసుకోవడం గమనార్హం.

మీసాలను స్మరించడం 'మత్స్యావతారాన్ని' స్మరించినట్లు అవుతుంది.

వీఁపున గట్టే అనడం వీపుమీద కొండమోసిన 'కూర్మావతారాన్ని' తలపింప జేస్తుంది.

రాజులాగా పొలమంతా తిరగడమంటే 'వరాహావతారాన్ని' భావింపజేస్తుంది.

స్తంభంలో వుండడం, వేటాడే సింహం కావడం 'నరసింహావతార' నైజం.

పొట్టిపొట్టి అడుగులు అనడంలో 'వామనావతార' స్ఫృహ కొట్టొచ్చినట్టు గోచరిస్తుంది.

పుట్టుపగ సాధించడమంటే రాజుల మీద పగసాధించి రాణకెక్కిన 'పరశురాముని' నెరతనం స్ఫురణకు వస్తుంది.

బొట్టుల మెకమును ఏసె అనడం మాయా మృగాన్ని వధించిన 'రామావతారాన్ని' గుర్తుచేస్తుంది.

నెమలి చుంగు అనడం నెమలి పించెం ధరించే 'కృష్ణావతారాన్ని' తెలియజేస్తుంది.

సిగ్గుఎగ్గు తెలియనివాడనడం త్రిపురాంగనల పట్ల అనుచితంగా ప్రవర్తించిన 'బుద్ధావతారాన్ని' బోధపరుస్తుంది.

రాళ్ళమీద దాటడం అంటే గుఱ్ఱపు స్వారీ చేసే 'కల్క్యవతారాన్ని' తలపిస్తుంది.

॥కీర్తన॥ పొడవైన శేషగిరి బోయనాయఁడు
విడువ కిందరిఁగాచు వెడబోయనాయఁడు ॥పల్లవి॥

పొలసి మీసాల పెద్దబోయనాయఁడు
మలిగి వీఁపునఁగట్టే మంకు బోయనాయఁడు
పొలమురాజై తిరిగే బోయనాయఁడు
వెలయ మోటుననుండే వేఁటబోయనాయఁడు ॥పొడ॥

పొట్టి పొట్టి యడుగుల బోయనాయఁడు యెందుఁ
బుట్టుపగ సాధించే బోయనాయఁడు

బొట్టుల మెకమునేసే బోయనాయఁడు
పట్టపు నెమలిచుంగు బలు బోయనాయఁడు ॥పొడ॥

పొంచి శిగ్గెగ్గెఱఁగని బోయనాయఁడు
మించి రాలమీఁద దాఁటే మెండు బోయనాయఁడు
అంచెల శ్రీవేంకటేశుఁడనే బోయనాయఁడు
పంచఁగాలవేలముల బలుబోయనాయఁడు ॥పొడు॥[8]

### 3.2.1.2.4 పొలం :

అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి ఎన్ని రూపాలతో భావించినా తనివి తీరలేదు. మరెన్నో నూతన భావాలతో ఏడుకొండలవాడు తొలితెలుగు వాగ్గేయకారుని తలపు తలుపు తట్టుతూనే వున్నాడు. అనేక తలపులు అందిస్తూనే వున్నాడు. అలాంటి తలపులలో ఒకటే వేంకటేశ్వరుడు పొలమన్న తలపు.

'తిమ్మిరెడ్డి' అంటే తిరుమలరెడ్డి. తిరుమలాధీశుడు అని అభిప్రాయం. 'బొమ్మిరెడ్డి' అంటే బ్రహ్మరెడ్డి. సృష్టి రచనలో సిద్ధహస్తుడైన బ్రహ్మ అని అభిప్రాయం. తిరుమలాధీశుడు తిరుమలాధీశుణ్ణే తనకు ఇచ్చాడని బ్రహ్మ ఆ తలపును తనలో ప్రోది చేశాడని అన్నమయ్య భావించాడు. అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి పొలంగా భావిస్తూనే దశావతారాలతో ఆ పొలాన్ని చమత్కారంగా అభివర్ణించాడు.

నిండినట్టి మడుగుల నీరువంక పొలము అనడం అనంత జలరాశిని తద్వారా 'మత్స్యావతారాన్ని' సూచించినట్లు అయ్యింది.

కొండను ధరించిన సారవంతమైన పొలము అనడం 'కూర్మావతారాన్ని' తెలియజేస్తుంది.

పొలము రాజులుండేటి పొలము అనడం 'వరాహావతార' సూచకం.

మాకులు ఖండించిన పొలము అనడం హిరణ్యకశిపుణ్ణి వధించిన 'నరసింహావతారాన్ని' బోధపరుస్తుంది.

ఆశపడి దానమడిగిన పొలము అనడం బలిని దానమడిగిన 'వామనావతారాన్ని' ఆవిష్కరిస్తుంది.

బాసలతోఁగడు నెత్రుపట్టమైన పొలము అనడం రాజుల నెత్తురుతో మడుగులు నింపిన 'పరశురామావతారాన్ని' తెలియజేస్తూవుంది.

మునులకు రక్షణయైన పొలము అనడం 'రామావతారాన్ని' ధ్వనింప జేస్తుంది.

వేసరక నాఁగేట వేగిలైన పొలము అనడం శీరపాణి అయిన 'బలరామావతారాన్ని' తలపింపజేస్తుంది.

రావిమాని చేసి పొలము అనడం రావిమానుగా నిలిచి రాకాసి రమణుల గుట్టురట్టు చేసిన 'బుద్ధావతారాన్ని' బోధపరుస్తుంది.

గుఱ్ఱముఁదోలే వయ్యాళి పొలము అనడం అశ్వాన్ని అధిష్ఠించే 'కల్క్యవతారాన్ని' తెలియజేస్తుంది.

వేంకటేశ్వరునికి నిలయమై లోకులందరికీ సొంతమైన పొలము అనడం స్వామికారుణ్యం మదిలో మెదిలేట్టు చేస్తుంది.

॥కీర్తన॥ తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైన పొలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసెఁ బొలము ॥పల్లవి॥

నిండినట్టి మడుగుల నీరువంక పొలము
కొండలు మోఁచిన పెద్ద గొబ్బరపుఁబొలము
అండనే పొలము రాజులుండేటి పొలము
చెండివేసి మాకులెల్లా సెలగిన పొలము ॥తిమ్మి॥

ఆసపడి వరదానమడిగిన పొలము
బాసలతోఁగడు నెత్రుపట్టమైన పొలము
రాసికెక్కె మునులకు రచ్చైనపొలము
వేసరక నాఁగేట వేగిలైన పొలము ॥తిమ్మి॥

మంచి గురుతైన రావిమాని చేని పొలము
వంచిన గుఱ్ఱముఁదోలే వయ్యాళి పొలము

యెంచఁగ శ్రీ వేంకటేశు నిరవైన పొలము
పంచుకొని లోకులెల్లా బ్రదికేటి పొలము ॥తిమ్మ॥[9]

### 3.2.1.2.5 తలపు :

భగవంతుడు నిరాకారుడని కొందరు, సాకారుడని మరి కొందరు భావిస్తారు. అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి సాకారుడుగానే గాక నిరాకారుడుగానూ భావించాడు. అందునా తలపుగా కూడా తలపోయడం ఎంతో మనోజ్ఞంగా వుంది. తలఁపు అంటే తలంపు, సంకల్పం. ఇది ఒక అమూర్త భావన.

భగవంతుడు మనసు లోపలి భావనగా మసలుకొంటాడు. అనేకసార్లు అనేక రూపాలు ధరించిన ఆలోచనే ఆ శ్రీహరి.

ప్రఖ్యాతి వహించిన వేదాలను తీసుకువచ్చిన సంకల్పం. -మత్స్యావతారం

మందర పర్వతాన్ని దేవతల సంతోషం కోసం నీటిమీద నిలిపి ప్రకాశింప జేసిన సంకల్పం. - కూర్మావతారం

భూకాంతను జతకూడాలని కోరిన సంకల్పం. -వరాహావతారం

విజృంభించి రాక్షసుడైన హిరణ్యకశిపుణ్ణి వధించిన సంకల్పం. -నరసింహావతారం

రాజలాంచనమైన గొడుగు ధరించిన బలి చక్రవర్తిని దానమడిగిన సంకల్పం. -వామనావతారం

ఏ మాత్రం తొట్రుపాటు లేకుండా బ్రాహ్మణులకు దానమిచ్చిన సంకల్పం. -పరశురామావతారం

బాణ ప్రయోగానికి ఉద్యమించి సముద్రాన్ని అనుకూలంగా మార్చుకున్న సంకల్పం. - రామావతారం

భయపడకుండా హలాయుధాన్ని జళిపించిన సంకల్పం. - బలరామావ తారం

త్రిపురాసురుల భార్యలను తనపట్ల వలపించుకుని వారి వ్రతము చెరిచిన సంకల్పం. – బుద్ధావతారం

మున్ముందు ఎన్నో నేర్పులు జూపగలిగియున్న సంకల్పం. –కల్క్యవతారం

వేంకటాచలం మీద నివసించే సంకల్పం కలియుగంలో మానవుల కలుషాలను హరించి వారికి మోక్షమార్గాన్ని చూపించే సంకల్పం. ఇక్కడ దశావతారాల్లోనూ భగవంతుని సంకల్పంతో పాటు భగవంతుడు కూడా ఒక సంకల్పంగా భావించబడడం విశేషం.

॥కీర్తన॥ తలఁపు లోపలి తలఁపు దైవ మితఁడు
పలుమారుఁ బదియునుఁ బదియైన తలఁపు ॥పల్లవి॥

సవతైన చదువులు సరుగఁదెచ్చిన తలఁపు
రవళిఁ దరిగుబ్బలిని రంజిల్లు తలఁపు
కవ గూడఁగోరి (రు?) భూకాంత ముంగిటి తలఁపు
తివిరి దూషకు గోళ్ళఁ దెగటార్చు తలఁపు ॥తలఁపు॥

గొడుగు వట్టిన వానిఁగోరి యడిగిన తలఁపు
తడఁబడక విప్రులకు దానమిదు తలఁపు
వొడిసి జలనిధినిఁ గడగూర్చి తెచ్చిన తలఁపు
జడియక హలాయుధము జళిపించు తలఁపు ॥తలఁపు॥

వలపించి పురసతుల వ్రతము చెరిచిన తలఁపు
కలికి తనములు చూపఁగలిగున్న తలఁపు
యిల వేంకటాద్రిపై నిరవుకొన్న తలఁపు
కలుషహరమై మోక్షగతి చూపుతలఁపు ॥తలఁపు॥ [10]

### 3.2.1.3 అవయవ ప్రస్తావన :

విష్ణుదేవుని రూపం వినుతింప వీలుకానిది. ఎంత పొగడినా తరగనిది. ఆ అనుపమ, అమృత, అనంతాకారంలోని అవయవాలన్నీ కూడా దేనికది ప్రత్యేకత సంతరించుకున్నదే. ఎంతో మహిమతో విరాజిల్లేదే. స్వామి వస్తువాహనాలకే

అమిత మహిమ వున్నప్పుడు అతని అవయవాలకు ఎంతో మహిమ ఉంటుందని వేరే చెప్పుకోనవసరం లేదు. బ్రహ్మకడిగిన పాదమని వేంకటేశ్వరుని పాద పంకజాన్ని వినుతిస్తూనే ఆ పాదానికి సంబంధించిన అనేకాంశాలను అన్నమయ్య ఒక కీర్తనలో ప్రస్తావించాడు. అదే విధంగానే వేంకటేశ్వరుని హస్తాన్ని కూడా అభినుతించాడు. ఇతర అంశాలను ప్రస్తావించడంతో పాటు దశావతారాల్లో హస్తం నిర్వహించిన పాత్రను అద్భుతంగా అభివర్ణించాడు. వేంకటేశ్వరునిది అభయహస్తం. సుస్థిర సువర్ణ హస్తం.

ఈ హస్తమే 'మత్స్యావతారం'లో సాటిలేని మేటి వేదాలను నీటి అడుగున వెదకి తెచ్చింది.

'కూర్మావతారం'లో కవ్వపు కొండ క్రింద దానికి ఆధారంగా నిలిచింది.

'వరాహావతారం'లో భూదేవిని విష్ణుదేవుడు తన కౌగిట్లోకి తీసుకునేందుకు తోడ్పడింది.

'నరసింహావతారం'లో వాడిగోళ్ళు ధరించి చూడభీతిగొలిపింది.

'వామనావతారం'లో బలిని దానం యాచించింది.

'పరశురామావతారం'లో మునులకు భూమిని దానమిచ్చింది.

'రామావతారం'లో సముద్రుడి మీదికి బాణం సంధించింది.

'బలరామావతారం'లో నాఁగలి పట్టుకుంది.

'బుద్ధావతారం'లో త్రిపురాసురుల భార్యల పాతివ్రత్యాన్ని భంగం చేసేందుకు పూనుకుంది.

'కల్క్యవతారం'లో గుఱ్ఱాన్ని నడుపుతుంది.

ఇప్పుడు వేంకటాచలం మీద ప్రాణులందరికీ మోక్షమార్గాన్ని చూపిస్తూ వుంది.

॥కీర్తన॥ ఇందరికి నభయంబు లిచ్చుఁజేయి
కందువగు మంచి బంగారు చేయి ॥పల్లవి॥

వెలలేని వేదములు వెదకితెచ్చిన చేయి
చిలుకు గుబ్బలికిందఁ జేర్చుచేయి
కలికియగు భూకాంతఁగా (గౌ?)గిలించిన చేయి
వలనైన కొనగోళ్ళ వాఁడిచేయి ॥ఇంద॥

తనివోక బలిచేత దానమడిగిన చేయి
వొనరంగ భూదాన మొసఁగుచేయి
మొనసి జలనిధియమ్ము మొనకుఁదెచ్చిన చేయి
యెనయ నాఁగేలు ధరియించు చేయి ॥ఇంద॥

పురసతుల మానములు పొల్లసేసిన చేయి
తురగంబుఁబరపెడి దొడ్డచేయి
తిరువేంకటాచలాధీశుఁడై మోక్షంబు-
తెరువు ప్రాణులకెల్లఁ దెలిపెడి చేయి ॥ఇంద॥[11]

### 3.2.1.4 గుణప్రస్తావన :

అనంత కల్యాణ గుణయుక్తుడుగా వేంకటేశ్వరుదు ప్రసిద్ధి వహించాడు. ఆయన గుణాలను లెక్కపెట్టడం గానీ, తెలిసేటట్టు చెప్పడంగానీ ఎవరికీ సాధ్యమయ్యే పనికాదు. ఆ స్వామికి శయ్యగా వున్న శేషుదు కూడా చెప్పలేదని వైష్ణవుల విశ్వాసం. కానీ యధాశక్తి ఆ మహనీయుని గుణాలను కొనియాడి అతని కృపకు పాత్రులు కావాలని భక్తుల ప్రయత్నం. ఈ దృష్టితోనే అన్నమయ్య వేంకటేశ్వరుని వివిధ గుణాలను వినుతించాడు. వాటిలో కొన్నిటిని కొనియాడే కీర్తనల్లో మాత్రమే దశావతారాలు తళుక్కుమంటున్నాయి. ఈ దశావతార కీర్తనల్లో స్వామి అప్రతిమానత్వం, సర్వవ్యాపకత్వం, దుర్జయత్వం, ఘనత కనిపిస్తాయి.

### 3.2.1.4.1 అప్రతిమానత్వం :

హరి ప్రతాపానికి అవనిలో అడ్డూ ఆపూ లేదు. సాటిలేని మేటి వేలుపుగా సన్నుతికెక్కిన సర్వేశ్వరుడతడు. ప్రత్యక్షదైవం అతడు. పద్ధతి ప్రకారం శరణుజొచ్చితే ఉద్ధరించే ఉన్నతుడామహాత్ముడు. అన్నమయ్య ఈ తలపులోనే దశావతారాలు తళుక్కుమన్నాయి.

నీలమేఘశ్యాముడు నీళ్ళు నమిలితే నిగమాలు నిండుదనం సంతరించు కున్నాయని సంభావించడం మాధవుని 'మత్స్యావతారాన్ని' మనసులో నిలిపినట్టయ్యింది.

వలదలెత్తడం కొండనెత్తడాన్ని సూచిస్తుంది. వలదలెత్తితేనే ఇంద్రపదవులు మించాయనడం 'కూర్మావతారాన్ని' గుర్తుచేస్తుంది.

మూతిని కదలిస్తే మూడులోకాలు నిలిచాయనడం భూమిని ఉద్ధరించిన 'వరాహావతారాన్ని' ప్రస్తావిస్తుంది.

వికటాట్టహాసం చేస్తే విపక్షానికి చెందిన అసురులు అంతమయ్యారనడం 'నరసింహావతార' వృత్తాంతాన్ని బోధపరుస్తుంది.

'వామనావతారం'లో త్రివిక్రముని ఊర్ధ్వపాదం నుంచి గంగ ఉద్భవించిన వృత్తాంతాన్ని గోరగీరితే నీరు కొండలన్నీ పారుతాయనడం ధ్వనింపజేస్తుంది.

క్షత్రియ వీరులను వధించి వారి రక్తాన్ని మడుగులుగా చేయడం 'పరశు రామావతారాని' కి సంబంధించింది.

అడుగువెట్టితే శిలకు ప్రాణము వచ్చినట్టు చెప్పడం 'రామావతారం' లోని అహల్యాశాప విమోచనా ఘట్టాన్ని సూచిస్తుంది.

కొండ గొడుగైనట్టు చెప్పడం 'కృష్ణావతారం' లోని గోవర్ధనోద్ధరణ వృత్తాంతాన్ని గోచరింపజేస్తుంది.

త్రిపురాలు కూలే విధంగా కొంగు జారడం 'బుద్ధావతారం'లోని త్రిపురాంగనల పాతివ్రత్య భంగాన్ని బోధపరుస్తుంది.

గమనించితేనే కలిదోషాలు నశిస్తాయనడం 'కల్క్యవతారాన్ని' ద్యోతకం చేస్తుంది.

॥కీర్తన॥ హరి నీ ప్రతాపమున కద్దమేది లోకమున
సరి వేరీ నీకు మరి సర్వేశ్వరా ॥పల్లవి॥

2-156

నీవు నీళ్ళు నమలితే నిండెను వేదములు
యీ వలదలెత్తితేనే యింద్రపదవులు మించె

మోవ మూఁతి గిరిపితే మూఁడు లోకాలు నిలిచె
మోవిఁబార నవ్వితేనే ముగిసి రసురలు ||హరి||

గోర గీరితే నీరై కొండలెల్లఁ దెగఁబారె
మారుకొంటే బయటనే మదుగులై నిలిచె
చేరి యడుగు వెట్టితే శిలకుఁబ్రాణము వచ్చె
కూరిమిఁ గావలెనంటే కొండ గొడగాయను ||హరి||

కొంగు జారినంతలోనే కూలెను త్రిపురములు
కంగి గమనించితేనే కలిదోషములు మానె
రంగుగ నీ శరణంటే రక్షించితి దాసులను
ముంగిట శ్రీవేంకటేశ మూలమవు నీవే ||హరి||[12]

### 3.2.1.4.2 సర్వవ్యాపకత్వం :

'వ్యాప్నోతి ఇతి విష్ణుః' అని విష్ణుశబ్ద వ్యుత్పత్తి. విష్ణువు అన్నిచోట్లా వ్యాపించి వుంటాడని అభిప్రాయం. విష్ణుదేవుని సర్వవ్యాపకత్వాన్ని భాగవతం ఈ విధంగా తెలియజేస్తుంది.

||కం|| ఇందుఁగలఁ, డందులేఁడని
సందేహము వలదు; చక్రి సర్వోపగతుం;
డెందెందు వెదకి చూచిన
నందందే కలఁడు దానవాగ్రణి! వింటే [13]

విష్ణు సహస్రనామ పారాయణ గ్రంథంలోని ఒక శ్లోకం విష్ణువు విశ్వమంతా వ్యాపించివున్న విషయాన్ని విశదం చేస్తుంది.

||శ్లోకం|| వాసనాద్వాసుదేవస్య వాసితం తే జగత్త్రయమ్,
సర్వభూతనివాసోఽపి వాసుదేవ నమోఽస్తుతే[14]

ఎక్కడ వెదకిన విష్ణువు వున్నాడని అన్నమయ్య అభిప్రాయపడ్డారు. అందువల్ల ఇతనిలాంటి దేవుడు ఎక్కడాలేడనీ, అనేక మహిమలతో అలరారుతున్నాడనీ, అన్నిటికీ ఆధారమైవున్నాడనీ స్పష్టం చేశాడు. ఎక్కడెక్కడ వెదకితే ఏఏ రూపాలతో కనిపిస్తాడో తెలియజేసాడు.

సముద్రంలో వెదకితే 'మత్స్యరూపం'తో,

పాతాళంలో వెదకితే ఆది 'కూర్మరూపం'తో,
అడవుల్లో వెదకితే 'వరాహరూపం'తో,
కొండగుహల్లో వెదకితే 'శ్రీనరసింహరూపం'తో,
భూమ్యాకాశాల్లో వెదకితే 'త్రివిక్రమాకారం'తో,

వీరులలోవెదకితే'పరశురామరూపం'తో,

శివపార్వతులు వెదకితే 'తారకబ్రహ్మ (రామావతారం)' రూపంతో,
ఆలమందల్లో అన్వేషిస్తే 'బలరామ కృష్ణ' రూపాలతో,
అసురకాంతలలో వెదకితే 'బుద్ధాకారం'తోనూ,
భవిష్యత్ కాలంలో వెదకితే 'కల్కిరూపం'తోనూ,
జీవులలో వెదకితే 'అంతర్యామి'గానూ,

ఇహపరాలలో వెదకితే 'శ్రీవేంకటేశ్వరుడు'గానూ విష్ణువు కనిపిస్తాడని అన్నమయ్య చమత్కరించాడు. ఈ కీర్తనలో దశావతారాలు గాక ఏకాదశావతారాలు గోచరించడం విశేషం.

॥కీర్తన॥ ఇతనికంటే మరిదైవముఁగానము యెక్కడ వెదకిన నితఁడు
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటి కాధారముదానె ॥పల్లవి॥

మదిజలధుల నొకదైవము వెదకిన మత్స్యావతారం బితఁడు
అదివో పాతాళమందు వెదకితే నాదికూర్మ మీ విష్ణుఁడు 3-370
పొదిగొని యడవుల వెదకి చూచితే భూవరాహమని కంటిమి
చెదఱక కొండల గుహల వెదకితే శ్రీనరసింహంబున్నాఁడు ॥ఇతని॥

తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది
బలువీరులలో వెదకి చూచితే పరశురాముఁడొకఁడైనాఁడు
తలఁపున శివుఁడునుఁ బార్వతి వెదకిన తారకబ్రహ్మము రాఘవుఁడు
కెలఁకుల నావులమందల వెదకిన కృష్ణుఁడు రాముఁడునై నారు ॥ఇతని॥

పొంచియసుర కాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాఁడు
మించిన కాలము కడపట వెదకిన మీఁదటి కల్క్యవతారము

అంచెల జీవులలోపల వెదకిన నంతర్యామై మెరసెను
యెంచుక ఇహమునఁబరమున వెదకిన యీతఁడే శ్రీ వేంకట విభుఁడు
॥ఇతని॥ [15]

### 3.2.1.4.3 దుర్జయత్వం :

విష్ణుదేవుడు అరివీర భయంకరుడు. అప్రతిమాన ప్రతాపుడు. అనితర సాధ్యుడు. అవక్రపరాక్రముడు. దేవతలు నమస్కరించే దివ్యతేజం గలవాడు. ఈ ఆలోచన రాగానే అన్నమయ్యకు తిరుమలేశుడు ధరించిన దశావతారాలు, వాటి సాటిలేని మేటితత్వం గోచరించాయి. మనకూ గోచరింపజేసి స్వామి గొప్పతనాన్ని సహేతుకంగా తెలియజేయాలనుకున్నట్టున్నాడు. పర్యవసానంగా పాట పల్లవించింది. అన్నమయ్య దశావతారాలను ఈ కీర్తనలో సూటిగా పేర్కోలేదు. చమత్కారంగా పేర్కొన్నాడు.

మీసమదిరితే గగ్గులకాడవుతారనడం 'మత్స్యావతారం' ధాటికి ఎవరూ నిలువలేరు చెల్లాచెదరైపోతారు అని అభిప్రాయం.

ఈతడు తలజూపితే శత్రువులు ఎదిరించలేరనడం క్షీరసముద్రంలో కొండను మోసిన 'కూర్మావతార' స్ఫృహను కలిగిస్తుంది.

గొరిశరాయడి శబ్దం గిట్టలు గల వరాహాన్ని సూచించడం వల్ల విజృంభిస్తే వరాహానికి తట్టుకోలేరు అనే భావం స్ఫురిస్తుంది. తద్వారా 'వరాహావతారం' ధ్వనిస్తుంది.

చేతి గోరుతో మీటితే చిన్నాభిన్నమైపోతారనడం వల్ల 'నరసింహుడు' తన గోటితో హిరణ్యకశిపుణ్ణి చీల్చిన ఉదంతం స్మృతిపథంలో మెదులుతుంది.

పైన అడుగుబెట్టితే పాతాళానికి క్రుంగిపోతారనడం బలి తలపై కాలు మోపనుద్యమించి పాతాళానికి పంపిన 'వామనుని' ఉదంతం గుర్తుకుతెస్తుంది.

కోపించినంతనే నెత్తురు గుండాల పాలౌదురని తెలియజేయడం వల్ల 'పరశురాముని' కోపానికి గుర్రై రాజులు మరణించగా వారి నెత్తురు మడుగులుగా ఏర్పడిన వృత్తాంతం స్ఫురణకు వస్తుంది.

బాణాన్ని చేతబట్టితే నుగ్గునూచమైపోతారనడం 'కోదండరాముని' విలువిద్యా కౌశలాన్ని వెల్లడిచేస్తుంది.

నీలికాశగంటే యుద్ధభయం కలుగుతుందనడం నీలి వస్త్రాన్ని ధరించే 'బలరాముని' బలపరాక్రమాలను వెల్లడిచేస్తుంది.

మంతనమాడితే మానము కోల్పోతారనడం 'బుద్ధుడు' త్రిపురాంగనలకిచ్చిన సలహాల సంగతిని ధ్వనింపజేస్తుంది.

గుఱ్ఱమెక్కితే శత్రువులు కూలిపోతారనడం ఆశ్వికరూపంలో అలరారే 'కల్కి' ని మనోగోచరం చేస్తుంది.

ఇప్పుడు కూడా ప్రతాపంతో వేంకటేశ్వరుడు విఱ్ఱవీగుతున్నాడని అభిప్రాయ పడుతూ అన్నమయ్య ఈ కీర్తన ముగించాడు.

॥కీర్తన॥ ఎదిరించి పోట్లాడ నెవ్వరితరము లిఁక
త్రిదశవంద్యుఁడు హరిఁదేరి చూడఁగలరా ॥పల్లవి॥

ఘాత మీసమదరితే గగ్గులకాడవుదురు
యీతఁడు దలచూపితే నెదిరించ రరులు 3-186
ఆతురాన గొరిశరాయడికి నోపఁగ లేరు
చేతిగోరు మీటితేనే ఛిన్నభిన్న మవుదురు ॥ఎది॥

పైపై నితఁడడుగిడ పాతాళానఁ గుంగుదురు
కోపించినంత నెత్తురు గుండాలపాలౌదురు
తూపుచేత నంటితేనె తుత్తుమురై పారుదురు
రాపు నీలికాశ గంటే రణభీతి గొందురు ॥ఎది॥

మంతన మీతఁడాడితే మానము గోలుపోదురు
కొంత గుఱ్ఱ మెక్కితేనే గుంటఁగూలిపోదురు
యింతటా శ్రీవేంకటేశుఁడెక్కడఁజూచినఁదానే
వింత ప్రతాపముతోడ విఱ్ఱవీఁగీ నిదివో ॥ఎది॥[16]

### 3.2.1.4.4 ఘనత :

విష్ణువు సర్వలోక నియామకుడు. సర్వశక్తిమంతుడు. సర్వాధారుడు. సంకల్పమాత్రంగానే సకలమూ సాధించుకోగల సమర్థుడు. అలాంటి మహనీయుడికి సామాన్యులైన భక్తులను సంరక్షించడం లెక్కలోని పనిగాదు. అతడు పదిరూపాలు ధరించి ప్రపంచాన్ని ఉద్ధరించిన ఘనుడు. అందుకే అతడు అందరి స్తుతికి పాత్రుడయ్యాడు. అన్నమయ్య వేంకటేశ్వరుని ఘనతను కొనియాడుతూనే అతడు ధరించిన దశావతారాలను, వాటి ప్రయోజనాలను ఈ కీర్తనలో ఆవిష్కరించాడు.

చదువుల చిక్కుదిద్ది చక్కచేయడం 'మత్స్యావతార' ప్రయోజనం.

మొదట సముద్రంలో క్రుంగిపోయిన కవ్వపు కొండను మోచి ఎత్తడం 'కూర్మావతార' ప్రయోజనం.

పొదిగి చేపట్టితెచ్చి భూమిని ఉద్ధరించడం 'వరాహావతార' ప్రయోజనం.

ప్రహ్లాదుణ్ణి మన్నించి రక్షించడం 'నరసింహావతార' ప్రయోజనం.

మూడడుగులతో అఖిలాన్ని ఆక్రమించి అమరపతిని ఆదుకోవడం 'వామనావతార' ప్రయోజనం.

వెంటవెంటనే రాజుల శత్రుత్వాన్ని పోగొట్టుకోవడం తద్వారా భూభారాన్ని తగ్గించడం 'పరశురామావతార' ప్రయోజనం.

లంకను విభీషణుని చేత ఏలించడం 'రామావతార' ప్రయోజనం.

పాండవులకు ఆప్తుడుగా నిలిచి ఆదుకోవడం 'కృష్ణావతార' ప్రయోజనాల్లో ఒకటి.

అసుర కాంతల పాతివ్రత్యాన్ని అంతం చేయడం 'బుద్ధావతార' ప్రయోజనం.

కలికిరూపుతో ఉండడం 'కల్క్యవతార' స్వభావం.

ఈ పాటలో దశావతార ప్రస్తావన స్పష్టంగానే గోచరిస్తుంది.

॥కీర్తన॥ ఇట్టె మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేఁడు
బట్ట బాయిటనే నీవు పదిరూపులైతివి ॥పల్లవి॥

చదువుల చిక్కుదిద్ది చక్కఁగఁ జేసితివి
మొదలఁ గుంగిన కొండ మోఁచి యెత్తితి
పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి
అదనునఁ బ్రహ్లాదు నట్టె మన్నించితివి ॥ఇట్టె॥

అడుగులు మూఁటనే యఖిలము గొలచితి
బడిబడినే రాచపగ నీఁగితి 2-503
బెడిదపులంక విభీషణు నేలించితివి
అదరి పాండవుల దిక్కై నిలిచితివి ॥ఇట్టె॥

త్రిపుర కాంతల గుట్టు దీర బోధించితివి
వుపమఁ గలికి రూపై యున్నాఁడవు
ఇపుడు శ్రీవేంకటేశ యేలితివి లోకాలెల్ల
యెపుడు మానుతులకు నిరవైతివి ॥ఇట్టె॥[17]

**3.2.1.5** దైన్య ప్రస్తావన :

విష్ణువు సర్వవ్యాపకుడు. సర్వాంతర్యామి. సర్వాధికుడు. సర్వసద్గుణ సంపన్నుడు. సర్వశక్తిమంతుడు. అతడే శ్రీవేంకటేశ్వరుడు. అంతటి మహనీయుడికి కూడా అన్నమయ్య దైన్యాన్ని అంటగట్టాడు. సానుభూతిని తెలియజేసి సాదరంగా పలుకరించాడు. ఆ పలుకరింపులో దశావతారాలు గోచరిస్తాయి.

శ్రీవేంకటేశ్వరుడికి అనేక లంపటాలు. అందువల్ల అతని మనసు పేద అయ్యింది. మనసు పేదకావడం వల్ల మమత చూపే మనుషులు కరువయ్యారు. లంపటాల వల్ల మనసు పేద కావడం, మనసు పేద అయితే అందరూ దూరం కావడం లోకసహజమని అన్నమయ్య అభిప్రాయపడ్డాడు.

కన్ను మూయడానికి కూడా పొద్దులేదనడం, ఎప్పుడూ రెప్పలు వాల్చని 'మత్స్యావతారాన్ని' బోధపరుస్తుంది.

కాలు చాఁచదానికి కూడా స్థలం లేదనడం సముద్రంలో సంచరించిన 'కూర్మావతారాన్ని' గోచరింపజేస్తుంది.

మట్టిని త్రవ్వుకొని క్రిందికి వెళ్ళినా బ్రతుకు లేదనడం 'వరాహావతారాన్ని' వర్ణించినట్లు అయ్యింది.

మునుపటిలా గోరుమోపడానికైనా చోటులేదనడం గోళ్ళతో హిరణ్యకశిపుని ఉదరం చీల్చిన 'నరసింహ' వృత్తాంతాన్ని జ్ఞాపకం చేస్తుంది.

అడుగు పెట్టడానికి కూడా స్థలం లేదని భావించడం 'వామనావతారాన్ని' ధ్వనింపజేస్తుంది.

సకాలంలో తల్లిదండ్రుల వెంట వుండలేదనటం 'పరశురామావతారాన్ని' వెల్లడిచేస్తుంది.

రాజ్య సంబంధమైన ఆహారాన్ని స్వీకరించడానికి కూడా సమయం లేదనడం రాజరికంలో కొనసాగలేక అడవులపాలైన 'శ్రీరాముని కథ'ను తెలియజేస్తుంది.

వెర్రితనాన్ని విడువలేదనడం 'కృష్ణుడి' అమాయకత్వాన్ని సూచించినట్లు అవుతుంది.

వేదం కూడా చదువలేదనటం వేద బాహ్యుడైన 'బుద్ధ' తత్త్వాన్ని (బుద్ధావతారం) బోధపరుస్తుంది.

ఔన్నత్యాన్ని పరిత్యజించి లోకసామాన్యంగా వుండలేదనడం 'కల్క్యవతారాన్ని' సూచిస్తుంది.

॥కీర్తన॥ పెక్కులంపటాల మనసు పేదవైతివి నీకు
నెక్కడా నెవ్వరు లేరు యేమి సేతువయ్యా ॥పల్లవి॥

కన్ను మూయఁబొద్దలేదు; కాలుచాఁచ నిమ్ములేదు,
మన్ను దవ్వి కిందనైన మనికి లేదు,
మున్నిటివలెనే గోరుమోపనైనఁ జోటు లేదు,
యిన్నిటా నిట్లానైతి వేమి సేతువయ్యా ॥పెక్కు॥

అడుగిడఁగ నవ్వలలేదు, అండనైన నుండలేదు,
పుడమిఁ గూడు గుడువనైనఁ బొద్దులేదు,
వెడఁగుఁదనము విడువలేదు, వేదమైనఁజదువలేదు,
యెడపఁదడప నిట్లనీకు నేమి సేతువయ్యా ॥పెక్కు॥

వుప్పరములు మానియైన నుండలేదు లోకమందు,
నిప్పుడైన నీ విహార మిట్ల నాయను
చెప్పనరుదు నీ గుణాలు శ్రీవేంకటేశ యిట్ల-
నెప్పుడును ఘనుఁడ వరయ నేమి సేతువయ్యా ॥పెక్కు॥[18]

**3.2.1.6 పొడుపు కథ :**

జానపద ధోరణులలో పొడుపు కథకు స్థానం వుంది. జానపదులకు కథలు, గేయాలంటే ఎంత ఇష్టమో, పొడుపు కథలంటే కూడా అంతే ఇష్టం. వారు తీరిక సమయాల్లో పొడుపుకథలు చెప్పుకుని వాటిని విప్పుకుని వినోదిస్తూ వుంటారు. ఈ ధోరణి గేయాల్నుంచి పద్యాలకు కూడా పాకింది. శిష్ట సాహిత్యంలో చోటుచేసుకున్న అనేక పద్యాల్లోనూ ఈ పొడుపు కథల ధోరణి కనిపిస్తుంది.

ఉదా॥ 1)॥ఆట॥ ఒడలి నిండ కన్నులుండు నింద్రుడు కాఁదు
కంఠమందు నలుపు కాఁదు శివుడు
ఫణులబట్టి చంపు పక్షీంద్రుడాకాఁదు
దీని భావమేమి తిరుమలేశ!

2)॥ఆట॥ పదములాఱు కలవు బంబరంబా కాదు
తొండముండు కాని దోమకాఁదు
రెక్కలుండు కాని పక్కి కానేరదు
దీని భావమేమి తిరుమలేశ !

జానపదులను మెప్పించిన ఈ పొడుపు కథ ధోరణిని జానపద బాణీలపట్ల ఎంతో ఆసక్తివున్న అన్నమయ్య తన కీర్తనల్లో చొప్పించాడు. విష్ణుదేవుని దశావతారాలను పేర్కొని ఆసక్తి గల వారి అంతరంగాలను అలరించాడు. మనసు

లోనూ వుంటాడు, దూరంగానూ వుంటాడు. ఇతడెవరో తెలుసుకోవడం ఎంతో కష్టం (దేవుడు).

ఎప్పుడూ అతనికి రెక్కలుంటాయి. అయితే అతడు ఎగిరిపోలేడు.
-మత్స్యావతారం

ఎవరికంటా పడకుండా బాగా దాక్కుంటాడు. కానీ దొంగ కాదు.
- కూర్మావతారం

(ఎవరికీ కనిపించకుండా నీళ్ళలోనే వుండి మందర పర్వతాన్ని మోసిన కూర్మావతారం)

తొందరగా క్రిందపడిపోతాడు. అయితే సేవకుడు కాదు. -వరాహావతారం

వికారంగా గోళ్ళు పెంచుతాడు. కానీ విటుఁడు కాఁడు. -నరసింహావతారం

చాలాపొట్టివాడు. అయితే ఊహించలేనంత పొడవరి. -వామనావతారం

కయ్యానికి కాలుదువ్వుతూ ఉంటాడు. అయితే తపసివేషం ధరిస్తాడు.
- పరశురామావతారం

స్త్రీ కోసం యుద్ధం చేస్తాడు. అయితే స్త్రీ చాపల్యం లేనివాడు.
- రామావతారం

నాగలి ధరించి కాపు పనులు చేస్తాడు. అయితే నల్లబడక తెల్లగానే వుంటాడు.
-బలరామావతారం

స్త్రీలకు వలపు కలిగిస్తాడు. కానీ తాను వలచి వారిపైకి వెళ్ళడు.
-బుద్ధావతారం

గుఱ్ఱంమీద స్వారీ చేస్తాడు. అయితే రౌతు కాఁడు. - కల్క్యవతారం

ఈ పాటలో పరస్పర విరుద్ధ చమత్కారం వుంది. ఈ చమత్కారానికి ఆలంబనం శ్రీవేంకటేశ్వరుడే. అన్నమయ్య అనుభూతుల పేటిక నుంచి అంకురించిన ఆలోచనా తరంగం ఈ మధురపదం.

॥కీర్తన॥ ఎవ్వఁడో కాని యెరఁగరాదు కదు
దవ్వులనే వుండు తలఁపులో నుండు ॥పల్లవి॥

ఎడయవు తనరెక్క లెగసిపోలేఁడు
కదు దాఁగుఁగాని దొంగయుఁగాఁడు 1-74
వడిఁగిందుపడును సేవకుఁడునుఁగాఁడు
వెడఁగు గోళ్ళు వెంచు విటుఁడునుఁగాడు ॥ఎవ్వడో॥

మిగులాఁబొట్టివాఁడు మింటికినిఁ బొడవు
జగడాలు తపసి వేషములును
మగువకై పోరాడు మరి విరక్తుఁడును
తగుఁగాఁపుఁబనులు నెంతయుఁదెల్లఁదనము ॥ఎవ్వడో॥

తరుణుల వలపించు తగిలి పై కొనఁడు
తురగముఁదోలు రౌతునుఁగాఁడు
తిరువేంకటాద్రిపైఁ దిరుగు నెప్పుడును
పరమ మూర్తియై పరగు నీఘనుఁడు ॥ఎవ్వడో॥[19]

### 3.2.2. శృంగార సంకీర్తనలు :

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో నాయికా నాయకుల గురించి, వారు దగ్గర కావడానికి చెలికత్తెలు నిర్వహించే పాత్ర గురించి ప్రధానంగా కనిపిస్తుంది. నాయకుని ఆనవాళ్ళు, ఆతని లీలలు, చేతలు, శృంగారావస్థలు, నాయిక నాయకుణ్ణి నిందించడం, దెప్పిపొడవడం, ప్రణయకోపాన్ని ప్రదర్శించడం, స్వామి అద్భుత కృత్యాలు, అలంకరణ మొదలైనవి ఎన్నో ఈ కీర్తనలో చోటు చేసుకున్నాయి. వీటన్నిటిలోనూ వేంకటేశ్వరుడు ధరించిన దశావతారాలు ధ్వనిస్తాయి. ఆలోచించే కొద్దీ వీటి మనోజ్ఞత అవగతమవుతుంది. ఆనందం కలిగిస్తుంది.

#### 3.2.2.1. నాయకుని వ్యక్తిత్వం :

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో చోటుచేసుకున్న నాయకుడు శ్రీ వేంకటేశ్వరుడు. అతడు ఏకత్వంలో అనేకత్వాన్ని ప్రదర్శించే అందగాడు. లీలలతో,

హేలలతో మహిళామణుల మనసులు దోచే మహిమాన్వితుడు. ఈయన వ్యక్తిత్వాన్ని తెలియజేసే ఆనవాళ్ళు, లీలలు, చేతలు, శృంగారావస్థలు అన్నమయ్య కీర్తనల్లో అలరారుతున్నాయి.

**3.2.2.1.1. నాయకుని ఆనవాళ్ళు :**

మొన్న మొన్నటి దాకా ఏ ఇద్దరు ఆడవాళ్ళు ఒకటిగా చేరిన తమ భర్తల ముచ్చట్లు గురించి, పిల్లల ముచ్చట్లు గురించి చెప్పుకుని మురిసిపోయేవారు. ఈ అంశాన్ని దృష్టిలో వుంచుకునో ఏమో అన్నమయ్య ఒక కీర్తన రచించాడు. ఇది శృంగార సంకీర్తన. ఒక నాయిక చెప్పినట్లుగా ఈ సంకీర్తన రూపొందింది. నాయిక చెలికత్తెతో తన నాయకుణ్ణి గురించి మెప్పులు, గొప్పలు చెప్పుకుంది. నాయకుని ఘనతను తెలిపే సందర్భంలో అతని దశావతారాలను కూడా నాయిక ప్రస్తావించింది.

నాయకుడు ఎప్పుడూ మొలకనవ్వుతో మురిపిస్తూ వుంటాడు. అతనికి భయం ఉండదు.

అతని శరీరంలో పొలసులు వుంటాయి. - మత్స్యావతారం

అతనిది బోరవీపు. - కూర్మావతారం

సెలసు మోదగలవాడు. - వరాహావతారం

గొలుసుల్లాగా వంగిన కోరలు కలవాడు. - నరసింహావతారం

చాలా పొట్టిగా ఉంటాడు. - వామనావతారం

ఎప్పుడూ మెడమీద గొడ్డలి ఉంటుంది. - పరశురామావతారం

భార్యనెడబాసినప్పటికీ అడవుల్లో తిరిగి రాక్షసులను వేటాడిన ఘనుడతడు.
- రామావతారం

పిల్లన గ్రోవిని వెంటబెట్టుకుని వుంటాడు. - కృష్ణావతారం

భయం నటించే చూపులవాడు. - బుద్ధావతారం

'కలికి' మూర్తియై నాయకుడైన వేంకటేశ్వరుడు తనను కూడినట్లు నాయిక చెప్పింది. నాయకుని ఆకార చేష్టలను, అతనిని గుర్తించేందుకు దోహదం చేసే ఆనవాళ్ళను నాయిక ఈ కీర్తనలో తెలియజేసింది, తద్వారా దశావతారాలను పరోక్షంగా ప్రస్తావించింది. కవితా సౌందర్యంతో కూడిన ఈ కీర్తనను భావించేకొద్దీ అన్నమయ్య చమత్కారాత్మక అభివ్యక్త అవగతమవుతుంది.

॥కీర్తన॥ శిఱుత నవ్వులవాఁడు శిన్నెకా వీఁడు
వెఱపెఱఁగడు సూడవే సిన్నెకా ॥పల్లవి॥

పొలసుమేనివాఁడు బోరవీఁపు వాఁడు
సెలసు మోరవాఁడు సిన్నెకా
గొలసుల వంకల కోరలతో బూమి
వెలసినాఁడు సూడవే సిన్నెకా ॥శిఱుత॥

మేఁటి కుఱుచవాఁడు మెడమీఁది గొడ్డలి -
సీటకాలవాఁడు సిన్నెకా
ఆఁటదానిఁ బాసి అడవిలో రాకాశి -
వేఁటలాడీఁ జూడవే సిన్నెకా ॥శిఱుత॥

బింకపు మోఁతల పిల్లఁగోవి వాఁడు
సింక సూపుల వాఁడు సిన్నెకా
కొంకక కలికియై కొసరి కూడె నన్ను
వేంకటేశుఁడు సూడవే సిన్నెకా ॥శిఱుత॥ [20]

5-182

### 3.2.2.1.2. నాయకుని లీలలు :

నాయిక అంతరంగంలో నాయకుని మీది వలపు నానాటికీ బలిష్ఠం కాసాగింది. అతని చేతలు ఎప్పటికప్పుడు కొత్తలుగా గుండెకు హత్తుకోసాగాయి. తనను మురిపించే నాయకుని చేతలు అతనికి మాత్రం పొద్దుపోకలే. నాయకుని చేతలను కొనియాడే నాయిక గళంలో దశావతారాలు తారాడాయి. చమత్కార విలసితంగా భాసించాయి.

ఘోషించే సాగరంలో నాయకుడు ఈదదాన్ని పేర్కోవడం 'మత్స్యావతార' సూచన.

నాయకుని మూపు మీద తిరిగిన కొండవల్ల దేవతలకు ఆహారం పుట్టిందని తెలియజేస్తూ నాయకుని ఘనతను ధ్వనింపజేసింది. ఇది 'కూర్మావతార' విధానం.

మూతిమీది కత్తి అనడం 'వరాహస్వామి' కోరను సూచిస్తుంది.

మొనగోరివాత అనడం 'నరసింహస్వామి' నఖాలను స్ఫురింపజేస్తుంది.

నాయకుడు 'వామనుడు' గా వెళ్ళి బలి నుంచి దానాన్ని గ్రహించి దేవేంద్రునికి ఇచ్చివేశాడు. ఇది రీతిలేని దానమని నాయిక పేర్కొంది.

'పరశురాముడు' పాపమని కూడా భావించకుండా రాజులలో సాపరాధులనే గాక, నిరపరాధులను కూడా నిహతులు గావించిన విధాన్ని పాపము చూడని చేత అని నాయిక పేర్కొంది.

నాతిమీది తలపోత అనడం సీతమీద మాత్రమే తలపు నిలిపిన 'దశరథరాముణ్ణి' తలపిస్తుంది.

నాగేటి గీత అనడం నాగలితో యుద్ధం చేసిన 'బలరాముణ్ణి' భావింప జేస్తుంది.

వలపు చల్లిన విధాన్ని ప్రస్తావించడం అసుర వనితల వలపించిన 'బుద్ధుణ్ణి' గుర్తుచేస్తుంది.

అశ్వాన్ని అధిరోహించిన అందాన్ని స్మరించడం 'కల్క్యవతారాన్ని' ధ్వనింప జేసినట్లు అయ్యింది.

ఇష్టపడీ ఇష్టపడకుండా వలపులో ఆలస్యం చెయ్యడం ప్రాణుల మీద వలపు నిలపడానికి ఏ మేరకు తోడ్పడుతుంది? అని నాయిక నాయకుణ్ణి ప్రశంసా పూర్వకంగా అధిక్షేపించడం ఈ కీర్తనలో కనిపిస్తుంది.

॥కీర్తన॥ పొద్దు వోకలివి నీకు భువిలో నెన్నఁగ నీ-
సుద్దులు చెప్పెదమన్న చూడఁజూడఁగొత్తలు ॥పల్లవి॥

మోఁత నీటిలోని యీఁత మూఁపునఁబుట్టిన మేఁత
మూఁతి మీఁది కత్తికోఁత మొనగోరివాఁత
బాఁతిలేని దారవోఁత పాపము చూడని చేఁత
నాఁతిమీఁది తలపోఁత నాఁగేటి గీఁత ॥పొద్దు॥

వలపు చల్లినలాగు వాజినెక్కిన బాగు
వలసి నొల్లములైన వలవని జాగు
తెలిసితిమిదె నేఁడు తిరువేంకటేశ్వర
తలఁపు ప్రాణుల మీఁదఁదగులుటేలాగు. ॥పొద్దు॥[21]

5-275

### 3.2.2.1.3 నాయకుని చేతలు :

నాయిక నాయకుని వాలకాన్ని నానా విధాలుగా ఎత్తి చూపుతూ తన భావాన్ని బహిర్గతం చేసింది. నాయకుడిని ఉద్దేశించే పలుకుల పంకజాలతో ఆయన హృత్పంకజాన్ని అలరించింది.

నాయకుడు చూపులతోనే తృప్తిని, పారవశ్యాన్ని కలిగిస్తాడు. చూపులు చేపచూపులను ధ్వనింపజేసి 'మత్స్యావతారాన్ని' తలపింపజేస్తాయి.

అపేక్షతో కింద పడి తేలిస్తాడు. ఇది నాయికను ఆనందాంబుధిలో తేలించడమే కావచ్చు. విష్ణువు 'కూర్మరూపం'తో క్షీరసముద్రంలో కిందికి వెళ్ళి మందర పర్వతాన్ని తేలించిన విషయాన్ని కూడా ఈ అంశం ధ్వనింపజేస్తుంది.

నాయకుడు నాయికను శృంగార క్రీడకోసం బెట్టుగా అదలిస్తాడు. బెట్టుగా అదలించడం అనేది 'వరాహ' గుర్గురు శబ్దాన్ని ధ్వనింపజేస్తుంది.

మాపటి చేతలకు మచ్చిక చల్లడం అంటే రతిసౌఖ్యానికి నాయకుడు ప్రాధాన్యం ఇవ్వడమే. ఇది మునుమాపటివేళ 'నరసింహస్వామి' హిరణ్యకశిపుని వధించిన వృత్తాంతాన్ని పరోక్షంగా ఆవిష్కరిస్తుంది.

నాయకుడు సందర్భోచితం కాని విధంగా అడుగరానిది అడుగుతాడు. ఆశలు కల్పిస్తాడు. అడుగరానిది అడుగడం అనే పదబంధం బలిని యాచించిన 'వామనావతార' ప్రసక్తిని తీసుకవస్తూవుంది.

మడుగులను కలచివేసే మాటలు పలుకుతాడు. మడుగు శబ్దానికి గుణమని కూడా అర్థం వుంది. ఇక్కడ మడుగులు గలంచడం అనడం శమంతపంచకాన్ని రాజుల రక్తంతో నింపిన 'పరశురాముని' వృత్తాంతాన్ని తెలియజేస్తుంది.

విజృంభించి రాయి కూడా కరిగే విధంగా పరిశ్రమిస్తాడు. ఇక్కడ 'రాయిగరంగ' అనే ప్రయోగం రాతిని నాతిగా మార్చిన 'రామావతారాన్ని' సూచిస్తుంది.

అందని పనికి కూడా తొందరగా వలపు చల్లుతాడు. వలపు చల్లడం 'కృష్ణావతారాన్ని' సూచిస్తుంది.

చీర తొలగగా చూచి సిగ్గువిడిచి నవ్వుతాడు. ఇది త్రిపురాంగనల మానాన్ని హరించిన 'బుద్ధావతారాన్ని' బోధపరుస్తుంది.

మోరను పొడవుగా పెట్టుకుని ముఖాన్ని చుంబిస్తాడు. ఇది గుఱ్ఱపు సుదీర్ఘ గమనాన్ని తద్వారా 'కల్క్యవతారాన్ని' సూచిస్తుంది.

ఇటువంటి నాయకుడు నాయికను సమీపించి చెఱగుతీసి సారెసారెకు సమాగమాన్ని ఇచ్చి చనువు ప్రదర్శిస్తాడు. ఈ కీర్తన శృంగార పరంగానూ, దశావతార పరంగానూ రూపొందించబడడం విశేషం.

॥కీర్తన॥ ఎఱుంగుదు మిదే నీయేతులెల్లా
తెఱవల నిటు దినదినము నేఁచేవు ॥పల్లవి॥

చూపులనే తనిపేవు సొలపు లాడేవు
తీపులం గ్రిందుపడేవు తేలించేవు
ఆపనికి బెట్టుగా నన్నదలించేవు
మాపటి చేఁతలకే మచ్చిక చల్లేవు ॥ఎఱుం॥

అడుగరాని దడిగే వాసలు సేసేవు
మడుగులు గలంచేటి మాటలాడేవు
అదరి రాయి గరంగ నలపు చూపేవు
వడి నందని పనికి వలపు చల్లేవు ॥ఎఱుం॥

1-128

చీర వెలిగా నవ్వేవు సిగ్గు విడిచేవు
మోర నిడుపు చేసుక మూఁతులు నాఁకేవు
చేరి చెఅంగు వట్టేవు శ్రీవేంకటేశుండా
సారెకు నిట్టే కూడేవు చనువు లిచ్చేవు. ॥ఎఱు॥[22]

### 3.2.2.1.4 నాయకుని శృంగారావస్థలు :

అలమేలుమంగనుద్దేశించి ఆమె చెలికత్తె మాట్లాడినట్టుగా అన్నమయ్య ఈ కీర్తనను రూపొందించాడు. ఏమమ్మా! ఎవరైనా ఇంతచేస్తారా? అంటే ఈ విధంగా చేస్తారా! అని అభిప్రాయం. ఆలస్యం చేయడమెందుకు ఇంకైనా దయచూడు. నాయకుణ్ణి శృంగారపరంగా ఆదుకొమ్మని అభిప్రాయం.

నాయికను ఉన్ముఖీకరించిన చెలికత్తె నాయకుణ్ణి గురించి ఆమెకు చెప్పడం మొదలు పెట్టింది. అలా చెప్పిన తీరులో దశావతారాలు కూడా ధ్వనించాయి.

తగిలి తప్పక చూస్తాడు. చూపులో 'మత్స్యావతార' ధ్వని.

చూడగానే తలవంచుకుంటాడు. తలవంచుకోవడం కొండమోసిన 'కూర్మావతారాన్ని' ధ్వనింపజేస్తుంది.

చింతిస్తూ నేలత్రవ్వుతాడు. నేల త్రవ్వడం 'వరాహ' స్వభావం.

నిన్ను ఎడబాయడం వల్ల మ్రాన్పడి నిశ్చేష్టుడై ఉంటాడు.

మానుపడడం స్తంభంలో వున్న 'నరసింహావతారాన్ని' సూచిస్తుంది.

దైన్యంతో చిన్నబోతాడు (చిన్నబుచ్చుకుంటాడు). దైన్యంతో చిన్నబోవడం 'వామనావతారాన్ని' తలపిస్తుంది.

తెగింపులను, అంటే సాహసాలను తలపోస్తాడు. ఇలా తెగువలకు పూనుకొన్నవాడు 'పరశురాముడు'.

ఒంటరిగా ఉండి మోహ వివశుడవుతాడు. ఇది 'శ్రీరామావతారాన్ని' గుర్తుచేస్తుంది.

మోహించడం వల్ల విరహంతో ముఖం తెల్లబారేవాడు. ఇది 'కృష్ణావతారాన్ని' సూచిస్తుంది. 'బలరామావతారం'గా భావించేందుకు కూడా ఇక్కడ అవకాశం ఉంది.

మదనతాపంతో కాగిపోతుండడం వల్ల పై కొంగు కూడా వేసుకోలేదు. ఇది త్రిపురాంగనలతో క్రీడించిన 'బుద్ధుని' ఉదంతాన్ని బోధపరుస్తుంది.

ఇతరులు మెచ్చుకునే విధంగా తిరిగినచోటే తిరుగుతాడు. తిరగడం 'కల్క్యవతారాన్ని' సూచిస్తుంది.

నిష్కల్మషుడైన వేంకటేశ్వరుణ్ణి నీవిది వరకే కూడి ఆనందాంబుధిలో తేలించావు. ఇంకా పంతమెందుకమ్మా అని చెలికత్తె నాయిక అలమేలుమంగను నిలదీసింది.

ఈ కీర్తనలో ఒకటి, రెండు చరణాల్లో ప్రతి చరణంలోనూ నాలుగు అవతారాలు పేర్కోబడ్డాయి. చివరి చరణంలో రెండు అవతారాలు ప్రస్తావింపబడ్డాయి. ప్రతి చరణంలోని చివరి పాదంలోనూ చెలికత్తె నాయికను ఉన్ముఖీకరించడం కనిపిస్తుంది. ఒక వైపు అవతారాలు, మరోవైపు నాయకుని శృంగార పరమైన చేష్టలు ఈ కీర్తనలో ఒకేసారి చోటుచేసుకోవడం గమనార్హం.

॥కీర్తన॥ ఏమమ్మ మగువా నీవింత సేతురా
తామసించనేఁటి కిఁక దయఁజూడవమ్మా ॥పల్లవి॥

తగిలి తప్పకచూచు తలవంచు నంతలోనే
నిగిడి చింతారతి నేలదవ్వును
మగువ నిన్నిటువాసి మానుపడి వూరకుండు
అగడాయ నీపతి నదె చూడవమ్మా ॥ఏమ॥

దీనతతోఁజిన్నఁబోవు తెగువలే తలపోయు
తానే యేకతాననుండి తమకించును
మోమునఁ దెల్లఁబారు మోహించిన విరహాన
మానిని నీవే విచ్చేసి మరి చూడవమ్మా ॥ఏమ॥

కొచ్చిన కాఁకలచేఁ బైకొంగువేయ నెఱఁగఁడు
మెచ్చుగ మెట్టినచోటే మెట్టి భ్రమయు
అచ్చపు శ్రీవేంకటేశు నలమేలుమంగ నీవు
పచ్చిసేసి కూడితివి పంతమేఁటికమ్మా ॥ఏమ॥[23]

### 3.2.2.2 కుల ప్రస్తావన :

నాయకుడి ఆనవాళ్ళనే గాక, అతని కులాన్ని కూడా అన్నమయ్య కీర్తన ప్రస్తావించింది. నాయకుడు బ్రాహ్మణుడని, యాదవుడని అన్నమయ్య నాయిక సంబోధన ద్వారా తెలియజేయడం ఇక్కడ గమనార్హం.

### 3.2.2.2.1 బ్రాహ్మణుడు :

అన్నమయ్య తనను నాయికగా భావించుకుని వేంకటేశ్వరుని నాయకునిగా భావించి నాయకుణ్ణి ఉద్దేశించి చెబుతున్నట్లుగా చాలా కీర్తనలు రచించాడు. వాటిలో ఒకటి దశావతారాలను ప్రస్తావిస్తూ ఉంది. నాయకుడు నాయిక పైట చెరగును పట్టుకున్నాడు. ఆమె గమనానికి నిరోధమేర్పడింది. ఆమె మాట్లాడింది. అది పాటగా పల్లవించింది. నాయకుడు బ్రాహ్మణ వంశానికి చెందినవాడు. అయితే అతడు ఏనాడో తన కులాన్ని ఉట్టిగట్టివేసిన పెద్ద మనిషి. ఆ విషయాన్ని నాయిక ప్రస్తావించింది. అడ్డూ ఆపూలేకుండా ప్రవర్తించే అక్రమస్తుడని నాయిక నాయకుణ్ణి పరోక్షంగా అధిక్షేపించింది. అలా అధిక్షేపిస్తూనే అతని ఘనతను కొనియాడింది. అందులో భాగంగానే నాయకుని దశావతారాలను ప్రస్తావించింది.

'పలుకుల వాదాల బాఁపఁడా' అనడంలో తొలి పలుకులుగా పరిగణింపబడె వేదాల ప్రసక్తి 'మత్స్యావతారం'లో వాటిని ఉద్ధరించిన వృత్తాంతం అభివ్యక్తమవుతున్నాయి.

'పలునీళ్ళ మునగడం' 'కూర్మావతారం' ధరించి సముద్రంలో మునిగి కొండను మోసిన వృత్తాంతం స్ఫురణకు తెస్తుంది.

'పలుపంచలఁపొరలడం' వరాహాన్ని సూచిస్తుంది. ఇక్కడ 'వరాహావతార' ప్రసక్తి ధ్వనిస్తుంది.

బహిర్గతమయ్యే కోపాన్ని ప్రస్తావించడం 'నరసింహావతారాన్ని' తలపిస్తుంది.

తొలగని ఆశ్చర్యాన్ని కలిగించే విషయాన్ని ప్రస్తావించడం 'వామనుడు' త్రివిక్రముడైన వృత్తాంతాన్ని గుర్తుచేసినట్టైంది.

శివుడి దగ్గర నేర్చుకున్న విలువిద్యను, రౌద్రాన్ని లోకక్షేమార్థం బహిర్గతం చేసిన 'పరశురాముడి వృత్తాంతం' విద్య బయటబడిందని చెప్పడం ద్వారా విదితమవుతుంది.

ప్రాయంలోనే శిరోజాలు జడలు గట్టిన వైనం ప్రస్తావించబడడం వల్ల 'రామావతారాన్ని' పేర్కొన్నట్లైంది.

సుందరాంగుల పొందుకు బతిమాలుతున్నట్టు చెప్పడం గోపికల పొందుకోసం ఆరాటపడిన 'కృష్ణావతారాన్ని' సూచించినట్లైంది.

సిగ్గంతా పారవేయడం లజ్జను విసర్జించి త్రిపురాంగనలతో క్రీడించిన 'బుద్ధుని తీరు' ప్రస్తావించినట్లైంది.

పాఱుతెంచడం గుఱ్ఱం మీద స్వారీచెయ్యడం, తద్వారా 'కల్క్యవతారాన్ని' సూచిస్తుంది.

ఇటువంటి ఘనుడు వేంకటగిరిలో నివసించే బారపు బాఁపఁడు. అతడు నాయికను దూరం చెయ్యకుండా దగ్గరకు తీసుకొని కూడినట్లు నాయిక తెలియజేసింది. మహామహిమాన్వితుడు, శక్తి సంపన్నుడు అయిన వేంకటగిరి నాయకుడు సామాన్యురాలైన నాయికను పెద్దచేసి ఏలుకున్నట్లు ఈ కీర్తన తెలియజేస్తుంది. నాయకుని కీర్తినిచక్కగా ఆవిష్కరిస్తుంది.

॥కీర్తన॥ పట్టకింత మాచెఱఁగు బాఁపఁడా నాఁడె
వుట్టిఁ గట్టితివి కుల మోబాఁపఁడా ॥పల్లవి॥

పలుకుల వాదాల బాఁపఁడా యిట్టె
పలునీళ్ల మునిఁగె బాపఁడా
పలువంచలఁ బొరలే బాఁపఁడా యిట్టె
వొలికి జంటెలఁ గోప మోబాఁపఁడా ॥పట్ట॥

పాయని యాసోదపు బాఁపఁడా ఇట్టె
బాయిటఁబడె నీవిద్య బాఁపఁడా
పాయపు తలజడల బాఁపఁడా యిట్టె
వోయయ్య బతిమాలకు మో బాఁపఁడా ॥పట్టు॥

పారవేసేవు సిగ్గెల్ల బాఁపఁడా యిట్టె
పాఱుతెంచేటి కమ్మటి బాఁపఁడా
భారపు వేంకటగిరి బాఁపఁడా మమ్ము
నోరసేయక కూడితి వోబాఁపఁడా ॥పట్టు॥[24]

### 3.2.2.2.2 గొల్లబోయిడు :

అన్నమయ్య వేంకటేశ్వరునికి, విష్ణువుకు అభేదం పాటిస్తూ అనేక కీర్తనలు రచించాడు. అందులో భాగంగానే కృష్ణుడికి, వేంకటేశ్వరునికి భేదమే లేదని తెలియజేసేవిధంగా అసంఖ్యాక కీర్తనలు ఆయన గళం నుండి ఆవిర్భవించాయి. అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి గొల్లబోయఁడు గానూ, తనను నాయిక గానూ భావించుకుని ఈ కీర్తన రచించాడు. ఇక్కడ నాయిక గోపిక, నాయకుడు గోపాలుడు. నాయకుడు చేయతలపెట్టిన ఆగడాన్ని నాయిక వారిస్తూఉంది. తన కొంగుపట్టవచ్చిన గొల్లబోయిణ్ణి అలా చేయవద్దని వారించింది. అతడు కొంగుపట్టుకుంటున్నాడనే బాధతో కుంగిపోకుండా తానతనికి నమస్కరిస్తున్నానని చెప్పింది.

నాయిక నాయకుణ్ణి 'పొలసు మాటల గొల్లబోయిఁడా' అని సంబోధించడం నాయకుడు మత్స్యావతారం ధరించడాన్ని సూచిస్తుంది. 'పొలసు' శబ్దం చేప మీది పొట్టును, కౌటిల్యాన్ని సూచిస్తూ ఉంది. అందువల్ల నాయకుడి 'మత్స్యావతారం' ఇక్కడ ధ్వనిస్తుంది.

తాను చెందిన గొల్లకులాన్ని దాచవద్దంది. ఎందుకంటే తాను కూడా అదే కులానికి చెందింది కాబట్టి ఇక్కడ 'కొల' (కుల) శబ్దం చిప్పను కూడా సూచించడం వల్ల 'కూర్మావతారం' కూడా ధ్వనిస్తుంది.

గొల్లలు గోవుల్ని మేపుతారు కాబట్టి పంటపొలాన్ని మేపవద్దని నాయిక నాయకుడికి సూచించినట్లు అయ్యింది. ఇక్కడ వరాహం కూడా పొలం మేస్తుంది

కాబట్టి మేయవద్దు అనడానికి బదులు మేపవద్దు అని తెలియజేసినట్లు అయ్యింది. అందువల్ల 'వరాహావతారం' గానే ఈ అంశాన్ని పరిగణించవచ్చు.

'కొలువు కంబము చాటు గొల్లబోయిఁడా' అని నాయకుడిని సంబోధించడం హిరణ్యకశిపుని కొలువు కూటంలోని స్తంభాన్ని, తద్వారా 'నరసింహస్వామి' ఆవిర్భావాన్ని ఆవిష్కరించినట్లు అవుతుంది.

'పొడవాటికాళ్ళ గొల్లబోయిఁడా' అనడం వామనుడి 'త్రివిక్రమాకారాన్ని' తెలియపరుస్తుంది.

నాయకుణ్ణి గొడవలు మానమనడం గొడవలతోనే బహుకాలం వెళ్ళబుచ్చిన 'పరశురామావతారాన్ని' స్మరింపజేస్తుంది.

'పొడల మృగం గొల్లబోయిఁడా' అనడంలో జింకను వేటాడిన 'రాముని అవతారం' స్ఫురిస్తుంది.

కొండను గొడుగుగా ధరించి ఆవులను కాపాడిన గొల్ల బోయిఁడా అనడం 'కృష్ణావతారాన్ని' గుర్తుచేస్తుంది.

'అనేక బుద్ధులున్న గొల్లబోయిఁడా' అనడం 'బుద్ధావతారాన్ని',

'అధిక గుఱ్ఱపుదాటుల గొల్లబోయిఁడా అనడం 'కల్క్యవతారాన్ని సూచిస్తూఉన్నాయి.

వేంకటాద్రి మందబోయిఁడా అనడం గొర్రెలను మేపే గొల్లవాణ్ణి సూచిస్తూ వుంది. అంటే వేంకటాద్రిలో నివసించే యాదవ కృష్ణుడే నాయకుడు అని అభిప్రాయం. ఒకచోట బోయినాయిఁడా అని స్వామిని సంబోధించిన అన్నమయ్యే గొల్లబోయిఁడా అని సంబోధించడం గమనార్హం.

॥కీర్తన॥ కొంగువట్ట కంత నీవు గొల్లబోయిఁడా
కుంగక నీకు మొక్కేము గొల్లబోయిఁడా ॥పల్లవి॥

పొలసు మాటల గొల్లబోయిఁడా నీ -
కొలము దాఁచకువోయి గొల్లబోయిఁడా

పొలము మేపకు గొల్లబోయిఁడా
కొలువు కంబము చాటు గొల్లబోయిఁడా ॥కొంగు॥

పొడవాటి కాళ(ళ్ల?) గొల్లబోయిఁడా
గొడవలు మానవోయి గొల్లబోయిఁడా
పొడల మెకము గొల్లబోయిఁడా
గొడగెత్తియాలఁగాచే గొల్లబోయిఁడా ॥కొంగు॥

బుద్దుల గొల (లు?)వు గొల్లబోయిఁడా
కొద్దిలేని దాఁటుల గొల్లబోయిఁడా
మద్దుల శ్రీవేంకటాద్రి మందబోయిఁడా! నీకు
గుద్దే బాదాలు నే గొల్లబోయిఁడా ॥కొంగు॥[25]

22-98

### 3.2.2.3. నాయిక స్పందన:

నాయిక నాయకుడి పట్ల వివిధ విధాలుగా స్పందిస్తుంది. నాయిక స్పందనా వైవిధ్యాన్ని అనేక గేయాల్లో అన్నమయ్య ఆవిష్కరించాడు. వాటిలో నాయిక ప్రణయకోపం ప్రదర్శించే తీరువుంది. నాయకుని నిందించే జోరువుంది. నిష్ఠురోక్తులతో ఊపిరి సలుపుకోనియ్యని హోరువుంది. నాయకుడికి హెచ్చరిక చేసే వైనం ఉంది. ఎగతాళి చేసే సాహసం ఉంది.

### 3.2.2.3.1. ప్రణయకోపం:

నాయకుడు అన్యాంగనాసక్తుడైనందుకో, అనుకున్న అనుకూల సమయానికి రానందుకో నాయికకు అతని మీద కోపం వచ్చింది. తాపం హెచ్చింది. ఇంతలో చెలికత్తె వచ్చి నాయికకు నాయకుని రాక గురించి తెలియజేసింది. అప్పటికే ప్రజ్జ్వరిల్లుతున్న నాయిక ప్రణయకోపం కట్టలు తెంచుకుంది. చెలికత్తెకు తెలియజేసే పాటగా పరిమళించింది. ఈ పాటలో నాయకుని పట్ల నాయిక ధిక్కారం, అధిక్షేపణ కనిపిస్తాయి. వాటితో పాటు నాయకుని దశావతారాల ముచ్చట్లూ ధ్వనిస్తాయి.

నేనెక్కడికి వెళతాను నాయకుడు ఎక్కడికి వెళతాడు. వస్తేరానీలే. అతడు వచ్చాక 'మత్స్యమైన' ఆనాటి మిడిసిపాటంతా దిగిపోవాలి.

తలచూపేనాటి అంటే 'కూర్మమైన' ఆనాటి ఆలోచనంతా తొలగిపోవాలి. నన్ను గురించే తలుస్తూ ఉండని.

'వరాహమైన' నాటి కాపట్యమంతా దిగిపోవాలి. తిరుగనీలే.

'నరసింహమైన' నాటి ఉద్రేకమంతా దిగిపోవాలి.

'వామనుడైన' నాటి వస అంతా వదలిపోవాలి.

'పరశురాముడై' కోపించిన ఆనాటి కోపమంతా దిగిపోవాలి.

'రామావతారం' లో భార్యను ఎడబాసిన నాటి పంతమంతా దిగిపోవాలి.

ముసలము ధరించి 'బలరాముడైన' నాటి ముసుపంతా దిగిపోవాలి.

'బుద్ధావతారం'లో రావిమానైన నాటి మదమంతా దిగిపోవాలి.

'కలికి' యైన నాటి ఉత్సాహమంతా దిగిపోవాలి.

'ఆనాటి వేంకటపతే నన్ను కూడనీ' అని నాయిక తెలియజేసింది. మొదట ఆమెలో కనిపించిన ప్రణయకోపం క్రమంగా తగ్గుముఖం పట్టడం గమనార్హం. ఈ గేయంలో దశావతారాలు కొన్ని ప్రత్యక్షంగానూ, కొన్నిపరోక్షంగానూ గోచరిస్తున్నాయి.

॥కీర్తన॥ నేనెందు వోయెతా (యేఁదా?) నెందు వోయీ
రానీలే రానీలే రానీలే ॥పల్లవి॥

మీనైన నాఁటి తన మిదుకెల్ల దిగవలె
కానీలే కానీలే కానీలే ॥నేనెందు॥

తలచూపేనాఁటి తలఁపెల్ల దిగవలె
తలఁచనీ తలఁచనీ తలఁచనీవే ॥నేనెందు॥

కిరియైన నాఁటి కిటుకెల్ల దిగవలె
తిరుగనీ తిరుగనీ తిరుగనీవె ॥నేనెందు॥

హరియైన నాఁటి అదటెల్ల దిగవలె
జరగనీ జరగనీ జరగనీవే ॥నేనెందు॥

5-2-76

వడుగైన నాఁటి వస విడువఁగ వలె
తడవకు తడవకు తడవకువే ॥నేనెందు॥

కలుషించే నాఁటి కడమెల్ల దిగవలె
అలుగనీ అలుగనీ అలుగనీవే ॥నేనెందు॥

సతిఁబాసేనాఁటి చలమెల్ల దిగవలె
తతిగానీ తతిగానీ తతిగానీవే ॥నేనెందు॥

ముసలైన నాఁటి ముసుపెల్ల దిగవలె
విసుగనీ విసుగనీ విసుగనీవే ॥నేనెందు॥

మానైన నాఁటి మదమెల్ల దిగవలె
పోనీవే పోనీవే పోనీవే ॥నేనెందు॥

కలికైన నాఁటి గజరెల్ల దిగవలె
చెలఁగనీ చెలఁగనీ చెలఁగనీవే ॥నేనెందు॥

వేడుకతో నాఁటి వేంకటపతి నన్నుఁ
గూడనీ కూడనీ కూడనీవే ॥నేనెందు॥ [26]

### 3.2.2.3.2 నిందన :

నాయిక చెలికత్తెతో నాయకుని చేతలను, వాటి పర్యవసానాలను తెలియ జేయడం మొదలెట్టింది. నాయకుడుండే చోటుకి తనను పిలువవద్దంది. వృధాకాల యాపన చేయకుండా చెలికత్తెనే తన దగ్గరకు రమ్మంది. ఇక్కడ 'గోడగడుగఁ గ నేల' అనడం చక్కని తెలుగు జాతీయం.

సముద్రం లోపల ప్రవేశించిన వాడు అక్కడ నుంచి నీమాట వింటాడా? –మత్స్యావతారం

మూతిమీదికి ఎత్తేవాడు ఇతరుల ముఖాన్ని చూడగలడా? – కూర్మావతారం

ఎప్పుడూ త్రవ్వడం చేసేవాడు సిగ్గుపడతాడా? – వరాహావతారం

నాటిన స్తంభంగా ఉండేవాడు విజృంభిస్తాడా? పాఁతుమాకు శబ్ధ స్తంభాన్ని, స్తంభంలోనుంచి ఉద్భవించిన నరసింహ స్వామిని సూచిస్తుంది. –నరసింహావతారం

పెచ్చుగా పెరిగేవాడు ప్రియాన్ని స్వీకరిస్తాడా? -వామనావతారం

తనలోనూ, ఇతరులలోనూ మత్సరాన్నే పెంచుతూ ఉండేవాడు మనసివ్వ గలఁడా? మత్సరం ఉండేవాడు మనస్వికాలేడని అభిప్రాయం -పరశురామావతారం

తప్పులు వెదకేవాడు క్రమంగానైనా నిజం తెలుసుకోగలడా? -రామావతారం

హెచ్చుపనులు, తక్కువ పనులు చేసేవాడు మేలుకలిగే విధంగా చూస్తాడా? -కృష్ణావతారం

కపటంగా మాట్లాడేవాడు సక్రమంగా నడుచుకుంటాడా ? -బుద్ధావతారం

గుఱ్ఱం మీద వంకరగా స్వారీ చేసేవాడు రహస్యాన్ని చెప్పగలడా? -కల్క్యవతారం

ఈ కారణాల వల్ల శృంగార పరంగా అశక్తుడైన వేంకటేశ్వర స్వామి నన్ను కలిసాడు. ఈ విధంగా వున్న నేను అతన్ని ఎలా ఎడబాస్తాను. ఈ శృంగార కీర్తనలో దశావతారాలు ధ్వనించడం గమనించవచ్చు. ఈ కారణాల వల్ల శృంగార పరమైన అశక్తత కూడా స్వామికి కలిగిందనడం విశేషం.

॥కీర్తన॥ ఆడకేల పిలిచేవే అప్పటి నన్ను
గోడ గడుగఁగ నేల గొబ్బున రాఁగదవే ॥పల్లవి॥

11-475
లోఁతుకుఁజొచ్చినవాఁడు లోన నీమాట వినీనా
మూఁతి మీఁది కెత్తేవాఁడు మోము చూచీనా
చేఁతలు దవ్వేటివాఁడు సిగ్గు వడ నేరుచునా
పాఁతుమాకై వుండేవాఁడు పైకొనీనా ॥ఆడకేల॥

పెచ్చు వెరిగెటివాఁడు ప్రియము చేకొనునా
మచ్చరమే పెంచేవాఁడు మనసిచ్చీనా
వొచ్చెము వెదకేవాఁడు వొగినిజ మెరుఁగునా
యెచ్చుకుందు చేఁతవాఁడు యితవై చూచీనా ॥ఆడకేల॥

సటల మాటలవాఁడు సరవిగా నడచీనా
కుటిలపు గతివాఁడు గుట్టు చెప్పీనా

యిటు శ్రీ వేంకటేశుఁడు యీ మాటకే నన్నుఁగూడె
యిటువలె నుండినాను యింకఁ బాసీనా ॥ఆడకేల॥[27]

### 3.2.2.3.3 ఎద్దేవా :

నాయిక నాయకుడిని గురించి చెలికత్తెతో మాట్లాడుతుంది. నాయకుణ్ణి గురించి నలుగురూ నాలుగు విధాలుగా మాట్లాడుకోవడం నాయకుడికి బొత్తిగా తెలియదు. తగిన సమయంలో పరులాడుకునేమాటను తలచి చూడమని చెలికత్తెను నాయకుడికి చెప్పమంది.

చేపపొలుసులుండే శరీరానికి తట్టుపునుగు అవసరమా? చేపపొలుసుల దుర్గంధం పునుగు సుగంధాన్ని అధిగమిస్తుంది అని అభిప్రాయం. ఇది 'మత్స్యావతారాన్ని' తెలియజేస్తుంది.

బట్టతలకు టోపీ ఎందుకు ? బట్టతల అనే శబ్దం తాబేలును సూచించడం వల్ల ఇది 'కూర్మావతారాన్ని' బోధపరుస్తుంది.

చెదరే సెలసు మోరకు చిరునవ్వు కుదురుతుందా? సెలసుమోర అనే శబ్దం వరాహాన్ని బోధించడం వల్ల ఇది 'వరాహావతారం'.

సగం మనిషికి అందం ఎందుకు? సగం మనిషి అనడం 'నరసింహావతారాన్ని' సూచిస్తుంది.

పుట్టినప్పటి నుంచి తిరిపెమెత్తుకునే వాడికి ఆభరణాలెందుకు? తిరిపెమెత్తుకోవడం 'వామనావతారాన్ని' సూచిస్తుంది.

బ్రహ్మచారికి స్త్రీ సౌఖ్యమెందుకు? బ్రహ్మచారి శబ్దం 'పరశురామావతారాన్ని' సూచిస్తుంది.

ఎంగిలితో అపవిత్రమైన నోరు గలవాడికి ప్రతిరోజూ సంఘటన లెందుకు? శబరి ఎంగిలి పండ్లను తిన్న 'శ్రీరాముని' వృత్తాంతం ఇక్కడ ధ్వనితం.

ఎప్పుడూ తిట్లుతినే వాడికి దీవెనలు ఎందుకు? తిట్లుతినడం అనేక ఆరోపణలను ఎదుర్కొన్న 'కృష్ణుణ్ణి' తెలియజేస్తుంది.

సిగ్గు విడిచిపెట్టిన తర్వాత వస్త్రాన్ని ధరించాలా? సిగ్గువిడవడం అనేది 'బుద్ధావతారాన్ని' సూచిస్తుంది.

అధికంగా విజృంభించి హద్దును అధిగమించేవాడికి విచారమెందుకు? ఇది పరోక్షంగా గుఱ్ఱం మీద స్వారీ చేసే 'కల్క్యవతారాన్ని' ధ్వనింపజేస్తుంది.

ఇంతటి స్వామి వేంకటాద్రిలో నివసించే వాడు నన్ను కలుసుకున్నాడు. ఇంక అశుభం ఎక్కడిది? ఎడమాటలెందుకు? ఈ గేయంలో దశావతారాలకు సంబంధించిన ఇబ్బందులను తెలియజేస్తూ, అలాంటప్పుడు మంచి ఎలా పొసగుతుంది? అని నాయిక నాయకుణ్ణి ఎద్దేవా చేసినట్లుంది.

॥కీర్తన॥ ఎఱఁగఁడు గాక తన్ను నిందరు నాడుకొనేది
తటితో నామాఁట తానే తలఁచు కొమ్మనవే ॥పల్లవి॥

తగునా పొలుసు మేనఁదట్టు పుళుగు
సొగయు బట్టతలకు చుట్టు తపారమేలే
అగడు సెలసుమోర కమరునా చిరునవ్వు
సగము మానిసికేలే చక్కఁదనాలు ॥ఎఱఁ॥

పుట్టు తిరిపేనకేలే భూషణములు
యిట్టె బ్రహ్మచారికేలే యింతులపొందు
నెట్టన యెంగిలీ నోఁట నిచ్చల ఘటనలేలే
తిట్టులఁబడే వానికి దీవన లేలే ॥ఎఱఁ॥

సిగ్గు విడిచిన మీఁద చీర గట్టవలెనా
వెగ్గళమై గెరదాఁటే విచారమేలే
నిగ్గుల శ్రీవేంకటాద్రి నిలయుఁడు నన్నుఁగూడె
యెగ్గులెల్లాఁబాసె నిఁక యెడమాటలేలే ॥ఎఱఁ॥[28]

### 3.2.2.3.4 నిష్ఠురోక్తులు :

నాయిక నాయకుడితో నిష్ఠూరాలాడుతున్నట్టు అన్నమయ్య ఈ కీర్తనను రచించాడు. అనవసరంగా ఒట్టి జోలిబెట్టేదెందుకని నాయిక నాయకుణ్ణి

నిలదీసింది. ఆయన చెప్పే సుద్దులతోనే తృప్తిపడి తాను పరవశించి వున్నట్టు తన పరిస్థితిని తెలిపింది.

మాటలు తెలుసుకోవచ్చు, కొండనైనా మోయవచ్చు గానీ మేటి దొర అయిన శ్రీవేంకటేశ్వరుణ్ణి మెప్పించడం దుస్తరమంది. ఇక్కడ 'మత్స్య, కూర్మావతారాల' సూచన గోచరిస్తుంది.

ఎక్కడైనా దూరవచ్చు, నచ్చిన చోటనే నివసించవచ్చు. కానీ ఆడదాని నైన నేను నిన్ను అవునని కాదని అనలేను. ఇక్కడ 'వరాహ, నరసింహావతారాల' ప్రసక్తి ధ్వనిస్తుంది.

ఆకాశాన్నైనా అందుకోవచ్చు, శత్రువులనైనా లోబరచుకోవచ్చు. కానీ నాయకుడితో మనసారా నవ్వడం మహాకష్టమని నాయిక నాయకుణ్ణి అధిక్షేపిస్తుంది. ఇక్కడ 'వామన, పరశురామావతారా'లు అభివ్యక్తమవుతాయి.

సముద్రాన్నైనా వారధి గట్టి బంధించవచ్చు, మాయ చూపవచ్చు. అయినా విజృంభించి నాయకుడి చేత పలికించడం దుస్తరమని నాయిక వాపోత. ఇక్కడ 'రామ, కృష్ణావతారాలు' రవళిస్తాయి.

రట్టుగా తిరుగనైనావచ్చు, రాతిరూపు అయిపోనైనా వచ్చు అయితే నాయకుడి రతులవల్ల కలిగే మేలును తలపోయడం తలకుమించిన పని అని నాయిక తెలియజేస్తుంది. ఇక్కడ 'బుద్ధ, కల్క్యవతారాల' ప్రసక్తి గోచరిస్తుంది.

నాయకుడైన వేంకటేశ్వరుణ్ణి వలచవచ్చు. కానీ అతణ్ణి ఎడబాయడం దుస్తరమని నాయిక తన అశక్తతను వ్యక్తపరిచింది.

॥కీర్తన॥ వద్దు వద్దు మమ్ము నీవు వట్టిజోలిఁబెట్టనేల
సుద్దులనే తనిసి నేఁజొక్కి వున్నదానరా ॥పల్లవి॥

మాఁటలు నెఱఁగవచ్చు మరికొండ మోవవచ్చు 20 - 210
మేఁటిదొరవు నిన్నైతే మెప్పించరాదు
దూఁటుకెఁ(కెం?) దైనాఁదూరి తోఁచినందే వుండవచ్చు
ఆఁటదాన నిన్ను నౌఁగాదన లేనురా ॥వద్దు॥

తిరిగేవారిని పగసాధించవద్దంది. ఇది 'రామావతారాన్ని' సూచిస్తుంది.

పరస్త్రీలను బాధించవద్దంది. ఇది 'కృష్ణావతారం'.

సిగ్గులు విడువవద్దంది. ఇక్కడ 'బుద్ధావతారం' ధ్వనిస్తుంది.

'కలికివి' అని నాయిక నాయకుణ్ణి అభినందించింది.

నాయకుడు నాయికతో శృంగార క్రీడ సలిపినట్టు నాయికే చెప్పింది.

॥కీర్తన॥ ఒక్కరీతినే వుండరా నీకు
మొక్కేను నాతో మొఱఁగకురా ॥పల్లవి॥

బెళకుల మాటలు పెంచకురా! నేఁ
దెలిసిన నటు తలదియ్యకురా 24-168
ములుచెనకులకే ములుగకురా
నలుగడ వికవిక నవ్వకురా ॥ఒక్క॥

బిరుదునఁ బెచ్చులు పెరుగకురా! కడు-
బరవగుబతి మిటు పట్టకురా
తిరుగులఁ బగ సాధించకురా
యెరవుల కాంతల నేఁచకురా ॥ఒక్క॥

వేగమె సిగ్గులు విడువకురా
వాగుల కలికివి భళిభళిరా
యీగతి శ్రీవేంకటేశ్వరుఁడా నను
బోగించి కూడితివి పొందాయరా ॥ఒక్క॥ [30]

### 3.2.2.4 అవతార వక్రీకరణ:

చెలికత్తె నాయకుని గొప్పదనాన్ని నాయికకు తెలియజేసింది. అతడు చేసేవన్నీ ఆమెకోసమేనని మెప్పజెప్పింది. నాయకుని దశావతారాల ఉద్దేశాలను కూడా వక్రీకరించి నాయికకు చెప్పడం ఈ కీర్తనలో ప్రధానాంశం.

ఇందుకోసమే నాయకుడు ఇన్నిపనులూ చేశాడు. నాయిక కోసం కళ్ళతోనే కాలం గడిపేశాడు.

చెమటల్లో శరీరాన్ని ముంచివేసేందుకే 'చేప' అయ్యాడు.

దాగి ఉండడం కోసమే 'తాబేలు' రూపం ధరించాడు.

అదలించడం కోసమే 'వరాహ' రూపం ధరించాడు.

మారు మోముతో మసలుకొనేందుకే స్తంభం చాటును 'నరసింహుడై' ఆశ్రయించాడు.

నేలమీద నడిచేందుకే 'వామనుడు' త్రివిక్రముడై కాలుచాచాడు.

'పరశురాముడై' రాజులను వధించడం కోసమే వారిని కష్టబెట్టాడు.

విరహులను బాధపెట్టేందుకే ఏకపత్నీవ్రతం శీలించే రాజా'రాముడ' య్యాడు.

నాయిక కుచాలను పైకెత్తేందుకే 'కృష్ణుడై' గోవర్థన పర్వతాన్ని పైకెత్తాడు.

ఉన్నవాటినన్నిటినీ 'బుద్ధుడై' నాయిక కోసమే వదులుకున్నాడు.

నాయిక సంయోగం కోసమే 'కలికి' అయ్యాడు.

వలపుల సౌందర్యంతో వేంకటేశ్వరుడు ఆ నాయిక కోసమే (అలమేలు మంగకోసమే) వెలశాడు. నాయిక మనసు నాయకుడికి సన్నిహితమయ్యేందుకు నాయిక ప్రయత్నించింది.

॥కీర్తన॥ ఇన్ని చేఁతలును జేసెనిందు కొరకే - వీఁడు
కన్నులనె పొద్దుపుచ్చీఁ గదవె నీకొరకే ॥పల్లవి॥

మీనమాయఁజెమటల మేను ముంచుకొరకే
తానే కమఠమునాయ దాఁగుకొరకే
ఆనుకొని కిటియాయ నదలించు కొరకే
మానఁడు కంబము చాటుమారుమోము కొరకే ॥ఇన్ని॥

కాలుచాఁచె నేలమీఁద యగమనించుకొరకే
జాలిఁబెట్టె చేఁతలనే చంపుకొరకే
యేలికాయ విరహులనేఁపెడి కొరకే
శైలమెత్తె నీకుచములెత్తే కొరకే ॥ఇన్ని॥

కలవెల్ల నిరసించెఁ గదవె నీ కొరకే
కలికి యాయెను నీసంగతి కొరకే
వలపుల వేంకటేశ్వరుఁడు లోకమున
చెలువముతో మెరసెను నీకొరకే ॥ఇన్ని॥[31]

### 3.2.2.5 అద్భుత చర్య:

ప్రళయకాలంలో విశ్వమంతా జలమయమైపోతుంది. ఏకార్ణవం అయిపోతుంది. ఆ సమయంలో నీటి మీద ఒక మఱ్ఱాకు తేలుతూ ఉంటుంది. ఆ ఆకు మీద విష్ణువు బాలుడి రూపంలో పడుకుని వుంటాడు. ఈ రూపంలో ఉన్న స్వామిని ఎందరో ఎన్నో విధాలుగా కొనియాడారు.

॥శ్లోకం॥ కరారవిన్దేన పదారవిన్దం
ముఖారవిన్దే వినివేశయన్తమ్
వటస్య పత్రస్య పుటే శయానం
బాలం ముకున్దం మనసాస్మరామి. [32]

కరపద్మాలతో పదపద్మాలను తీసుకొని నోటిలో పెట్టుకుంటూ మర్రి ఆకు మీద పడుకొని ఉండే బాలముకుందుణ్ణి మనసారా స్మరిస్తున్నాను.

ఇదేవిధంగా అన్నమయ్య కూడా బాలముకుందుణ్ణి భావించాడు. ఆ భావనా సమయంలో ఆ అద్భుత గాత్రుని దశావతార లీలలు అన్నమయ్య తలపులో తళుక్కున మెరిశాయి. చిన్నపిల్లవాడుగా చిత్తాన్ని దోచే ఇతడా ఇన్ని పనులు ఇలా చేశాడు? అని ఆశ్చర్యపడ్డాడు. ఆ ఆలోచనే అమృత కీర్తనగా అలరారింది. అలరించింది.

మోఁతనీటి మడుగులో ఈత నేర్చుకున్న విధాన్ని గుర్తు చేసుకొని 'మత్స్యావతారాన్ని' తలపోశాడు.

పాఁతగిలే నూతికింద పదిలంగా వుంటూ ఒక్క నిముషం కూడా ఎడబాయనివాడు అని 'కూర్మావతారాన్ని' గుర్తుచేసుకున్నాడు.

మూతి సహాయంతో మట్టిముద్దను పెళ్లగించడం 'వరాహం' చేసేపని. పాతాళం నుంచి వరాహమూర్తి భూమిని ఉద్ధరించిన విషయాన్ని ఇక్కడ స్మరించి నట్లైంది.

జుగుప్స కలిగించే పేగులను దండలుగా ధరించినవాడు అనడాన్ని బట్టి హిరణ్యకశిపుని పేగులను దండలుగా వేసుకున్న 'నరసింహ రూపాన్ని' స్మరించినట్లైంది.

దేవేంద్రుడు అహల్యకోసం వెళ్ళి కోడియై కూశాడు. అటువంటి దేవేంద్రుని తమ్ముడు ఉపేంద్రుడు. ఈ విషయాన్ని స్మరించడం ద్వారా 'వామనావతారాన్ని' గుర్తు చేసుకున్నట్లైంది.

బూడిద పూసుకునే వాడు ఈశ్వరుడు. ముక్కోపి. ఈశ్వరుని శిష్యుడైన పరశురాముడికి కూడా ఆ బుద్ధే సంక్రమించింది. ఈ తలపు 'పరశురామావతారా'న్ని తలపిస్తుంది.

జింకను వెంటనంటి వెళ్లడాన్ని తలపోయడం 'రామావతారాన్ని' స్మరించినట్లైంది.

దూడలను, ఆవులను కాచి ఆపైన దొరతనం నెరపినవాడు శ్రీకృష్ణుడు. ఈ ఆలోచన 'కృష్ణావతారాన్ని' సూచిస్తుంది.

ఆకాశంలో తిరిగే ఊళ్ళు త్రిపురాలే. త్రిపురాసురుల ఇల్లాండ్ర మానం కొల్లగొనడం ప్రస్తావింపబడింది. ఇది 'బుద్ధుని' ప్రస్తావనే.

తురగము పైవాడు అనడం గుఱ్ఱాన్ని నడిపే 'కల్కి'ని గుర్తుచేస్తుంది.

ఇన్ని మహత్కార్యాలు నిర్వహించి తిరువేంకటగిరి మీద తిరముగా నెలకొని సిరిని బాయని నిరుపముడు అని అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి విస్తృతంగా వినుతించడం ఈపాట ప్రతిపాదన.

॥కీర్తన॥ తెప్పగా మర్రాకు మీఁదఁ దేలాడువాఁడు
ఎప్పుడు లోకములెల్ల నేలేటివాఁడు ॥పల్లవి॥

మోఁతనీటి మడుగులో యీఁతగరచినవాఁడు
పాఁతగిలే నూతికిందఁ బాయనివాఁడు
మూఁతి దోసిపట్టి మంటిముద్ద పెల్లగించువాఁడు
రోఁతయైన పేగుల పేరులఁగలవాఁడు ॥తెప్ప॥

కోడికూఁత నోరివాని కుఱ్ఱతమ్ముఁడైనవాఁడు
బూడిది పూసినవాని బుద్ధులవాఁడు
మాడవన్నె లేటివెంట మాయలఁదగిలినవాఁడు
దూడల నావులఁగాచి దొరయైనవాఁడు ॥తెప్ప॥

ఆకసానఁబారేవూరి అతివల మానములు
కాకు సేయువాఁడు తురగముపైవాఁడు
ఏకమై వేంకటగిరి నిందిరారమణి ఁగూడి
యేకాలముఁబాయని యెనలేని వాఁడు ॥తెప్ప॥ [33]

### 3.2.2.6 అలంకరణ :

శ్రీ వేంకటేశ్వరుని వక్షస్థలాన్నే గదిగా చేసుకునే అలమేలుమంగమ్మ నివసిస్తూవుంది. అంటే స్వామి, అమ్మవారు ఏకరూపంగానే ఉన్నారనే అభిప్రాయం.

స్వామి 'మత్స్యావతారం' ధరించినప్పటి చేప పొలుసు కంపు పొయ్యే విధంగా పన్నీటితో స్నానం చెయ్యించండి.

'కూర్మావతారం, వరాహావతారం' ధరించినప్పటి శ్రమ తీరే విధంగా కర్పూరపు ధూళి మేని నిండా మెత్తండి.

'నరసింహావతారం, వామనావతారం, పరశురామావతారం' ధరించినప్పటి గదరు, జిడ్డు, గబ్బు తొలగిపోయే విధంగా తట్టుపునుగు పూయండి.

'రామ, కృష్ణ, బుద్ధ, కల్కి' అవతారాల నాటి జిడ్డు, ముంజు, సిగ్గు, నూగు రొచ్చులు ఎప్పుడూ మానవు.

కాబట్టి వేంకటేశ్వరుణ్ణి ఆభరణాలతోనూ, పూదండలతోనూ అలంకరించండి. ఈ కీర్తనలో ఒక్కొక్కచోట రెండు అవతారాలు, మూడు అవతారాలు, నాలుగు

అవతారాలు ఒకేసారి పేర్కోబడడం విశేషం. స్వామికి స్నానం చేయించి అలంకరణ చేయడం ఈ కీర్తన ముఖ్యాంశం.

॥కీర్తన॥ శ్రీ వేంకటేశ్వరునికి చెలి యలమేలుమంగ
వోవరిగా నెలకొని వురముపైనున్నది. ॥పల్లవి॥

పొంచి మచ్చ (చ్చె?) మైన నాఁటి పొలసు కంపులువాయ
సంచులఁబన్నీట మజ్జనమార్చరే
అంచెఁ గూర్మవరహములైనట్టి సొగటుదీర
మించఁ గప్పురధూళి మెత్తరే మేనను ॥శ్రీవేం॥

7-198

నరసింహపు గదరు నాఁటి వామనపు జిడ్డు
పరశురాముని గబ్బు పచ్చివీడను
పరిమళము గట్టిన బంగారు గిన్నెఁదెచ్చి
పొరిఁదిరుమేనఁ దట్టుపునుఁగిట్టె నించరే ॥శ్రీవేం॥

గొల్లముంజు రాచజడ్డు కోరి బుద్ధుడైన సిగ్గు
చొల్లుగుట్టపు నూఁగురొచ్చులు మానునా (నఁగా?)
ఇల్లిదె శ్రీవేంకటేశుఁడీరూపై తానున్నవాఁడు
యెల్లపూదండలు సొమ్ము లెక్కించరే ॥శ్రీవేం॥ [34]

## 3.3 దశావతార సంకీర్తనలు :

అన్నమయ్య విష్ణుదేవుని దశావతారాలను ఒకే కీర్తనలో పేర్కొన్నాడు. వివిధ విధాలుగా పేర్కొన్నాడు. సుందర కవితాత్మకంగా పేర్కొన్నాడు. ఈ విధంగానే గాక దశావతారాలను విడివిడిగా వేరువేరు కీర్తనల్లో పేర్కొన్నాడు. రామకృష్ణా ద్యవతారాలను పూర్తి కీర్తనల్లో పేర్కొన్న అన్నమయ్య మత్స్య కూర్మాద్యవతారాలను ఇతరావతారాలతో కలిపి పేర్కొన్నాడు. ఆయా అవతారాలను గురించి ఆయన ఆవిష్కరించిన అంశాలు ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.

### 3.3.1 మత్స్యావతారం :

దశావతారాల్లో మొదటి అవతారంగా పేర్కోబడేది మత్స్యావతారం. ఇది సంపూర్ణ జలచరం. విశ్వమంతా ఏకార్ణవమైనప్పుడు దానిలో దాగిన

లోకకంటకుణ్ణి పరిమార్చేందుకు వేదాలను, సప్తర్షులను, బీజాలను, మానితీగలను పరిరక్షించేందుకు తద్వారా సృష్టి నిరాఘాటంగా సాగడానికి దోహదం చేసేందుకు విష్ణువు మత్స్యావతారం ధరించాడు. ఈ అంశాలన్నీ ఇమిడే విధంగా తక్కువ మాటల్లో ఎక్కువ వృత్తాంతాన్ని తెలియజేసేందుకు అన్నమయ్య విలక్షణంగా ప్రయత్నించాడు. ఆతని ప్రయత్నం ఈ క్రింది కీర్తనాచరణ పాదాల్లో గోచరిస్తుంది.

॥కీర్తన॥ "వేదుకనజుఁడు చెప్పె వేదముగా నీవుదొల్లి
వోదక మీనై కొన్నాళ్ళుండితి వంటా
తోడనేసప్తరుషులు తొల్లియునుఁ జెప్పిరదె" [35]

॥కీర్తన॥ "వేమరుఁ జదివెడి విప్రుల వేదము
సోము (మ?) క వైరి యశోవిభవం." [36]

### 3.3.2 కూర్మావతారం :

విష్ణుదేవుని దశావతారాల్లో కూర్మావతారం రెండవది. దేవతలకు జరా మరణాలు లేని జీవితాన్ని ప్రదానం చేసేందుకు విష్ణువు క్షీరసాగర మథనం సూచించాడు. దేవతలు, రాక్షసులు మందర పర్వతాన్ని కవ్వంగా చేసుకొని పాల సముద్రాన్ని చిలికే పనికి ఉపక్రమించారు. కొండ సముద్రంలో మునిగిపోవడంతో దాన్ని పట్టి నిలిపేందుకు విష్ణువు కూర్మరూపం ధరించాడు. ఈ అవతారాన్ని అన్నమయ్య అనేకచోట్లకొనియాడాడు. వాటిలో కొన్ని.

॥కీర్తన॥ "పట్టి యెత్తవలె నంటేఁ బాతాళానఁ బద్దకొండ
తట్టియెత్తి పాలవెల్లి దచ్చవా నీవు" [37]

॥కీర్తన॥ "అదివో పాతాళమందు వెదకితే నాదికూర్మ మీ విష్ణుఁడు." [38]

॥కీర్తన॥ "శ్రీమించు నమరల జీవనమెల్ల సు-
ధామథనుని సంతత కరుణే" [39]

సముద్రం అడుగున మందర పర్వతం పడిపోవడాన్ని పాతాళం అనే శబ్దంతో సూచించాడు. దేవతల జీవనమంతా అమృతాన్ని సమకూర్చిన హరి అనవరత కరుణే అని అన్నమయ్య స్పష్టం చేయడం ఇక్కడ గమనించవచ్చు.

### 3.3.3 వరాహావతారం :

విష్ణుదేవుడు మూడవసారి ధరించిన అవతారం వరాహావతారం. వరాహం ఉభయచరమైనప్పటికీ అగాధ జలరాశిలో ప్రవేశించి భూమిని పైకి తీసుకురావడం యథాపూర్వంగా స్థాపించడం స్తవనీయాంశం. లోకకంటకుడైన హిరణ్యాక్షుణ్ణి మట్టుబెట్టడం కూడా ఈ అవతార ప్రయోజనమే. ఈ అంశాలన్నీ ప్రతిబింబించే విధంగా అన్నమయ్య వరాహావతారాన్ని శ్లాఘించాడు.

॥కీర్తన॥ "చలమున హిరణ్యుఁజక్కాడి యిటు భూ-
వలయము నిలిపిన వరాహమా"[40]

### 3.3.4 నరసింహావతారం :

అన్నమయ్య వేంకటేశ్వర భక్తుడు. అహోబిల నరసింహస్వామి ఆరాధకుడు. అహోబిల మఠ సంస్థాపకుడైన ఆదివన్ శఠగోపయతి శిష్యుడై ఆళ్వారుల పాశురాల అంతరార్థాన్ని, వైష్ణవాగమాలను శఠగోపయతి దగ్గర అభ్యసించాడు. ఈ అన్ని కారణాల వల్ల వేంకటేశ్వర అర్చామూర్తి తర్వాత నరసింహ దేవుని అర్చామూర్తి అంటే అన్నమయ్యకు అత్యంత ప్రీతి అనిపిస్తుంది. అందువల్లనేమో నరసింహస్వామి మీద చాలా కీర్తనలు రచించాడు. వాటిలో సుదీర్ఘమైన కీర్తనలు ఉన్నాయి. తక్కువ చరణాలతో కూడిన కీర్తనలు ఉన్నాయి. కొన్ని కీర్తనల్లోనరసింహదేవుని అవతార వృత్తాంతం చోటుచేసుకుంటే మరికొన్ని కీర్తనల్లో ఆదేవుని వైభవం ఆవిష్కృతమవుతుంది. ఇంకొన్ని కీర్తనల్లో ఆయా నృసింహ క్షేత్రాల ఘనత కూడా వెల్లడి అవుతుంది. హిరణ్యకశిప వధ, ప్రహ్లాదపాలన, లక్ష్మీదేవిని తొడపై నిడుకుని గద్దెమీద కూర్చోవడం మొదలైన అంశాలతో క్లుప్తంగా, ఉదాత్తంగా ఉన్న ఈ కీర్తన నరసింహావతారానికి పరిశీలించదగివుంది.

॥కీర్తన॥ విటిగిరి దానవవీరులదె
అటిముటి దేవతలాడేరదె ॥పల్లవి॥

పరగుకంభ మదె పగిలె పగిలె నదె
హరినరసింహంబాయ నదె

గరుడధ్వజ మదె ఘన చక్రంబదె
మొరసేటి శంకపు మ్రోతలవె ॥విటి॥

వెడలె వెడలెనదె వెనుకొని హిరణ్యుఁ
దొడికిపట్టెనదె తొడమీఁద
విడువక చించిన వేయి చేతులవె
కడప మీఁదనే కదలఁడదె ॥విటి॥

అదె వామాంకంబందు లక్ష్మియదె
కదిసి శాంతమదే కరుణయదె
వుదుటున ప్రహ్లాదు నూరడించె నదె
యిదె శ్రీవేంకట మొక్కెనదె ॥విటి॥[41]

### 3.3.5 వామనావతారం:

దశావతారాల్లో ప్రప్రథమంగా మానవరూపం ధరించిన అవతారం వామనావతారం. ఈ అవతారంలో పరస్పర విరుద్ధాంశాలు రెండూ కనిపిస్తాయి. మొదటిది చాలాపొట్టి ఆకారం. రెండవది అంతంలేని పొడవు ఆకారం. ఈ రెండు ఆకారాలను ఈ అవతారంలోనే విష్ణుదేవుడు ధరించడం విశేషం. అన్నమయ్య అనేక చోట్ల వాసుదేవుని వామనరూపాన్ని సంస్మరించాడు. ఒక కీర్తనలో వామనుడు త్రివిక్రమాకారం ధరించడం, తన పాదద్వయంతో భూమ్యాకాశాలను కొలవడం ప్రస్తావించాడు. ఆ వామనుడే వేంకటేశ్వరుడని పేర్కొన్నాడు.

॥కీర్తన॥ "అరుదుగ బలిమద మడఁపఁగ నాకసమంటిన రూపము
సరుగన భూమింతయు నొక చరణంబున గొలచి
పరగిన పాదాంగుటమున బ్రహ్మాండము నగిలించిన
పరమాత్ముఁడీతఁడేపో పతి వేంకటవిభుఁడు"[42]

### 3.3.6 పరశురామావతారం :

విష్ణుదేవుని దశావతారాల్లో ఆరవ అవతారంగా పరశురామావతారం పరిగణింపబడుతూ ఉంది. విష్ణుదేవుడు వామనావతారంలో పరస్పర విరుద్ధాకారాలను ధరించినట్టే పరశురామావతారంలో పరస్పర విరుద్ధ మనస్తత్వాలతో

జీవించడం గమనార్హం. ఒకటి బ్రాహ్మం. మరొకటి క్షాత్రం. పుట్టుకతో బ్రాహ్మణుడై నప్పటికీ పరశురాముడు క్షత్రియ స్వభావంతో క్షత్రియులను తెగటార్చడం ఇక్కడ చెప్పుకోదగ్గ అంశం. పరశురాముడు దుష్టశిక్షణ- శిష్టరక్షణ చేసిన మాటమాత్రం వాస్తవమే కానీ భక్తులను ఆదుకున్నట్లు దాఖలాలు కనిపించడం లేదు. భక్తికి సంబంధించిన అంశాలు కూడా అతని జీవితంలో కనిపించవు. అందువల్ల పరశురామావతారం పట్ల భక్తులు చూపవలసినంత ఆసక్తి చూపడం లేదు. అన్నమయ్య కూడా ఇతరావతారాలతో పాటు పరశురామావతారాన్ని ప్రస్థావించాడే గానీ సమగ్ర పరశురామ వృత్తాంత గర్భితంగా సుదీర్ఘ కీర్తన రచించినట్టు తోచదు. క్షత్రియ భంజనం, మునిజన రక్షణ ప్రస్తావించే కీర్తనాంశాలు ఇక్కడ పరిశీలించ దగిఉన్నాయి.

॥కీర్తన॥ "బలు వీరులలో వెదకి చూచితే పరశురాముఁడొకఁడైనాఁడు" [43]

॥కీర్తన॥ "బలసి మునుల యాపదలు వాపుటకు
బలు నృపభంజను పరిణతలే" [44]

### 3.3.7 రామావతారం :

ఆదర్శమానవ జీవితాన్ని ఆవిష్కరించేందుకు విష్ణువు రామావతారం ధరించాడు. మానవీయ విలువల సమాహారంగా మానవత్వానికి లభించిన ఆకారంగా రాముణ్ణి చెప్పుకోవచ్చు. ఈ అవతారంలో కూడా దుష్టశిక్షణ-శిష్ట రక్షణే ప్రధానమైనప్పటికీ మానవ సంస్కారాన్ని లోకవిదితం చేసేందుకు రాముడు ఆవిర్భవించాడనిపిస్తుంది. విష్ణువును దృష్టిలో ఉంచుకొని, రాముని అతిమానుష శక్తులను దృష్టిలో వుంచుకుని దేవుడని రాముణ్ణి లోకం కొనియాడుతుంది. అయితే

॥శ్లోకం॥ "ఆత్మానం మానుషంమన్యే
రామం దశరథాత్మజం" [45]

అని రాముడే సెలవిచ్చినట్లు వాల్మీకి రామాయణ రత్నాకరము చెబుతుంది. విభిన్న మానవసంబధాల ధర్మాన్ని విశ్వవిదితం చేసేందుకు రాముడు ఆవిర్భవించాడని విశేషజ్ఞుల విశ్వాసం. అందుకే

"రామో విగ్రహవాన్ ధర్మం" అని రాముడి వ్యక్తిత్వాన్ని అభినందించి ఆరాధించారు.

ఇలాంటి రాముణ్ణి తెలుగు కవులందరూ వినుతించారు. పద్యాలతో, పాటలతో రామపాదార్చన చేశారు. కీర్తనలతో రాముని కీర్తిని గానం చేసిన వారిలో త్యాగయ్య, రామదాసు, చినతిరుమలయ్య, పెదతిరుమలయ్య, అన్నమయ్య పేర్కోదగ్గవారు. అన్నమయ్య రాముణ్ణి కీర్తిస్తూ అధిక సంఖ్యలోనే కీర్తనలు రచించాడు. వాటిలో కొన్ని రాముని జీవిత సంఘటలను అక్కడక్కడా స్పృశిస్తే, మరికొన్ని రాముని జీవితానికి దర్పణాలయ్యాయి. ఇంకొన్ని రాముని ఘనతను ఆవిష్కరించేందుకు ప్రయత్నించాయి. వీటిలో పరశురాముని భంగపాటు, శూర్పణఖ అవయవ ఛేదనం మినహా రాముని జీవితంలో చోటుచేసుకున్న దాదాపు అన్ని ముఖ్య సంఘటనలను వెల్లడి చేసే విధంగా అన్నమయ్య రచించిన కీర్తన ఇక్కడ పరిశీలించదగిఉంది. ఈ కీర్తనలో వాల్మీకి రామాయణంలోని ఏడుకాండలు చోటుచేసుకోవడం గమనార్హం.

॥కీర్తన॥ చెప్పితే నాశ్చర్యము సేసిన చేఁతలితఁడు
ముప్పిరి మనుజవేషమునఁబుట్టినీతఁడు ॥పల్లవి॥

రాముఁడుదయించె దశరథునికిఁదమ్ములతో
గామిడైన తాటకిని ఖండించెను
ఆముక యజ్ఞము గాచె హరుని విల్లు విరిచె
ప్రేమమున సీతాదేవిఁ బెండ్లియాడెను. ॥చెప్పితే॥

మడియించె ఖరునిని మారీచుని వధియించె
కెడపె వాలిని యాసుగ్రీవునిఁ బెంచె
జడధి బంధించెను సరుగ రావణుఁగొట్టె
బడినే విభీషణునిఁబట్టముగట్టెను. ॥చెప్పితే॥

సీతాదేవితో నయోధ్య సింహాసనం బెక్కె
పోతరించి కుశలవ పుత్రులఁగాంచె
శ్రీ తరుణితోఁగూడ శ్రీ వేంకటేశుఁడై నిల్చె
కౌతుకమున జగము కరుణఁగాఁచెను ॥చెప్పితే॥ [46]

### 3.3.8 కృష్ణావతారం :

దశావతారాల్లో పూర్ణావతారంగా పరిగణింపబడే అవతారం కృష్ణావతారం. తక్కిన ఏ అవతారాల్లోనూ లేని చక్రాది పంచాయుధాలను ఈ అవతారంలో ధరించడం జరిగింది. అనేక దివ్యలీలల్ని ప్రదర్శించడం దుష్టశిక్షణ-శిష్టరక్షణ, అసురులను అంతమొందించి సురవితానానికి సంతోషం కలిగించడం, అనేక శృంగార లీలలు ప్రదర్శించడం ఈ అవతారంలోని ప్రత్యేకతలు. హైందవ లోకానికి శిరోధార్యమైన భగవద్గీతను అందించడం కూడా ఈ అవతార విశిష్టతను ఇనుమడింపజేస్తుంది. విష్ణువుకు, కృష్ణుడికి భేదమే లేదన్నంతగా ఈ అవతార వృత్తాంతం రూపొందడం గమనార్హం.

ఇంతటి సమాదరణీయ కృష్ణావతారాన్ని ఆంధ్రులు ఎంతగానో అభిమానించారు. గేయగర్భిత పద్యాలలో భక్తకవి బమ్మెరపోతన కృష్ణావతారాన్ని తెలుగువారికి కళ్ళకు గట్టించాడు. అదే విధంగా పద్యగర్భిత గేయాలలో అన్నమయ్య ఆ యదువీరుని దివ్యలీలలను, శృంగార లీలలను మనోనేత్రానికి ప్రదర్శించి చూపాడు. అన్నమయ్యకు వేంకటేశ్వరుడు ఎంత ముఖ్యమో కృష్ణుడు కూడా అంతే ముఖ్యం. వేంకటేశ్వరునికి, కృష్ణునికి భేదమేలేని విధంగా ఆయన కీర్తనలు రూపుదిద్దుకున్నాయి. కృష్ణుడికి సంబంధించి వేలకొలది కీర్తనలు అన్నమయ్యలో కనిపించే అవకాశం వుంది. శ్రీకృష్ణుని దుష్టశిక్షణ, బాల్యక్రీడాదులు వస్తువుగా ఆధ్యాత్మిక పరంగానూ, గోపికలతో శ్రీకృష్ణుని క్రీడావిలాసాలు వస్తువుగా శృంగార పరంగానూ అన్నమయ్య అసంఖ్యాకంగా సంకీర్తనలు రాశాడు. శ్రీకృష్ణుని బాల్య సంఘటనలను తనలో ఇముడ్చుకున్న అన్నమయ్య కీర్తన కృష్ణావతార విశిష్టతను తెలియజేస్తూ వుంది.

॥కీర్తన॥ కనియు గానరు నీమహిమ కౌరవ కంస జరాసంధాదులు
మనుజులు దనుజులఁ జంపిరనఁగ విని మరి నీ శరణము చొరవలదా
॥పల్లవి॥

పుక్కిటనే లోకములు చూపితి పూతకి చన్నటె దాగితివి
పక్కననె బండిదన్ని విరిచితివి బాలులు సేసెటి పనులివియా

అక్కరతో తృణావర్తు నణఁచితివి ఆఁబోతుల కీటణఁచితివి
చిక్కించి యనలము చేత మింగితివి శిశువులు సేసెటిపనులివియా
॥కనియు॥

తొడిఁబడ మద్దులు భువిపైఁ గూలఁగ దొబ్బియఘాసురుఁజంపితివి
బడినె గోవర్ధనగిరి యెత్తితి పడుచులు సేసెటి పనులివియా
అదరి బ్రహ్మమాయకుఁ బ్రతిమాయలు అట్టే గడించి నిలిచితివి
పిడికిట చాణూరు సేనుగఁగొట్టితి పిన్నలు సేసెటి పనులివియా
॥కనియు॥

కాళింగుని మద మణఁచి దవ్వుగా కడగడలకు పోజోపితివి
గోలవై యజ్ఞఫలము లిచ్చితివి గోవాళ్ళు సేసెటి పనులివియా
యీలీల శ్రీవేంకటాద్రి మీఁదనే యిందరికిని పొడచూపితివి
బేలుదనంబుల నెంచిచూడ పసిబిడ్డలు సేసెటి పనులివియా
॥కనియు॥[47]

### 3.3.9 బుద్ధావతారం :

ఆధునికులు కొందరు గౌతమ బుద్ధుణ్ణి కూడా దశావతారాల్లో చేర్చడం కొన్ని చోట్ల కనిపిస్తుంది. చారిత్రక పురుషుడైన ఈ బుద్ధుడు దశావతారాల్లో చేరడు. దశావతారాల్లో చోటుసంపాదించిన వాడు పౌరాణిక బుద్ధుడు మాత్రమే. దశావతారాల్లో బుద్ధావతారమెంతో విలక్షణమైంది. త్రిపురాసురుల ధర్మబలాన్ని, వైదిక బలాన్ని, త్రిపురాంగనల పాతివ్రత్యబలాన్ని నశింపజేసి శివుడు చేయనున్న త్రిపుర సంహారానికి ముందే అన్నీ సిద్ధం చేసేందుకు విష్ణువీయవతారం ధరించాడు.

విష్ణువును కొనియాడేవారు, దశావతారాలను కీర్తించేవారు సైతం బుద్ధావతార ఉదంతాన్ని పూర్తిగా పేర్కొంటూ వినుతించలేదు. ఆ అవతారంలోని కొన్ని సంఘటనలను ప్రత్యేకించి పేర్కొని వినుతించడం కనిపిస్తుంది. అన్నమయ్య బుద్ధావతార కథను పూర్తిగా ప్రశంసాపూర్వకంగా గానం చెయ్యలేదు. కొన్ని సంఘటనలను మాత్రమే ప్రస్తావించాడు. విష్ణుదేవుని దశావతారాలను వరుసగా పేర్కొంటూ బుద్ధావతారాన్ని కూడా ప్రస్తావించాడు. అసురాంగనల మానం

కొల్లగొన్న అంశానికే ఆయన ప్రాధాన్యం ఇచ్చినట్టు కన్పిస్తుంది. అలాంటి కొన్ని ప్రస్తావనలను ఇక్కడ గమనించవచ్చు.

॥కీర్తన॥ "పొంచి యసుర కాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాఁడు" [48]

॥కీర్తన॥ "వాలి తిరుగునట్టి దైత్యవరుల మోహవతులనెల్ల
మూలమూలఁద్రోసి ముసుఁగుపాలు సేసె నీతఁడు
వేలసంఖ్యలైన సతుల వేడుకలలరఁజేసి వొంటి-
నాలిమగని రీతిఁగూడి యనుభవించె నీతఁడు" [49]

॥కీర్తన॥ "మగువల భ్రమయించే మౌన వ్రతముల వాఁడు" [50]

### 3.3.10 కల్క్యవతారం :

దశావతారాల్లో చివరి అవతారంగా పరిగణింపబడేది కల్క్యవతారం. తక్కిన అవతారాలు తొమ్మిది జరిగిన అవతారాలు కాగా రానున్న అవతారం కల్క్యవతారం. కలియుగాంతంలో ఈ అవతారం చోటు చేసుకుంటుందని విజ్ఞుల విశ్వాసం. ఈ అవతారానికి సంబంధించిన ఉదంతం భాగవత, దశావతార చరిత్రాది గ్రంథాల్లో కనిపిస్తుంది. ఈ కథ ఇంత వరకు జరగలేదు కాబట్టి దీనిపట్ల కవులు, రచయితలు చెప్పుకోదగ్గ విధంగా మొగ్గు చూపలేదు. అన్నమయ్య కూడా తాను పేర్కొనే దశావతారాల జాబితాలోనే కల్క్యవతారాన్ని కూడా పేర్కొన్నాడు. ఆ ఉదంతాన్ని నామమాత్రంగా కొనియాడాడు. కల్కివాహనం గుఱ్ఱం. కాబట్టి గుఱ్ఱాన్ని నడిపే చేయి అని స్వామి హస్తాన్ని అభివర్ణించాడు.

॥కీర్తన॥ "మించిన కాలము కడపట వెదకిన మీఁదటి కల్క్యావతారము" [51]

॥కీర్తన॥ "తురగంబుఁబరటెడి దొడ్డచేయి" [52]

విష్ణుదేవుడు దుష్టశిక్షణ - శిష్టరక్షణ కోసం, పరోపకారం కోసం అసంఖ్యాక రూపాలు ధరించినప్పటికీ వాటిలో ఇరవై ఒక్క (21) అవతారాలు ప్రసిద్ధాలు. ఆ అవతారాల్లోనూ దశావతారాలు మిక్కిలి ప్రసిద్ధాలు. అన్నమయ్య తన దశావతార సంకీర్తనల్లో కొన్ని వాటిలో బలరామావతారాన్ని ప్రస్తావించాడు. మరికొన్ని వాటిలో కృష్ణావతారాన్ని పేర్కొన్నాడు. ఒకటి రెండు కీర్తనల్లో పదకొండు

(11) అవతారాల ప్రస్తావన కూడా కనిపిస్తుంది. అవతారాల పేర్లను, ఆయా అవతారాల్లో చోటుచేసుకున్న ముఖ్యసంఘటనలను కొన్ని కీర్తనల్లో జాబితాగా ఇచ్చాడు. ఇలాంటి కీర్తనల్లో అధ్యాత్మ కీర్తనలు ఉన్నాయి. శృంగార కీర్తనలు ఉన్నాయి. సంబోధనలను బట్టి, సంఘటనలను బట్టి, తదితరాంశాలను బట్టి వాటిని వర్గీకరించుకోవచ్చు. జానపద ధోరణులు కూడా ఈ కీర్తనల్లో కనిపిస్తాయి. శృంగార పరమైన వివిధ అంశాలు కొన్ని కీర్తనల్లో చోటుచేసుకున్నాయి. పలు అవతారాలు ఒకే కీర్తనలో చోటుచేసుకోవడమే గాక వివిధ అవతారాలకు సంబంధించిన ప్రత్యేక కీర్తనలు అధిక సంఖ్యాకంగా అన్నమయ్య సాహిత్యంలో కనిపిస్తాయి. నరసింహ, రామ, కృష్ణావతారాలకు సంబంధించిన కీర్తనలు ఎక్కువగా ఉన్నాయి. వాటిలో అవతార వృత్తాంతాన్ని పూర్తిగా ఇవ్వడానికి కొన్ని ప్రయత్నించగా, పాక్షికంగా ఇవ్వడానికి మరికొన్ని ప్రయత్నించాయి. మొత్తానికి అన్నమయ్య కీర్తనా సాహిత్యంలో దశావతారాలకు సంబంధించిన కీర్తనలు ఎక్కువగా ఉన్నాయి. వైవిధ్యభరితంగా వున్నాయి. కవితాత్మకంగా ఉన్నాయి. చమత్కార పూర్వకంగా ఉన్నాయి.

# పాద సూచికలు

1) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-2, కీర్తన:374

2) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు,సంపుటం-5,కీర్తన:374

3) తాళ్ళపాక అన్నమాచార్యుడు - అధ్యాత్మ సంకీర్తనలు,సంపుటం-3, కీర్తన:447

4) వేమన - వేమన పద్యములు-కర్మపద్ధతి, పద్యం:19

5) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు,సంపుటం-1,కీర్తన:55

6) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-1,కీర్తన:109

7) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు,సంపుటం-1,కీర్తన:322

8) తాళ్ళపాక అన్నమాచార్యుడు - అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-1,కీర్తన:460

9) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-4,కీర్తన:52

10) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-1, కీర్తన:356

11) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు,సంపుటం-1, కీర్తన:334

12) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-2,కీర్తన:156

13) బమ్మెరపోతన - శ్రీమదాంధ్ర భాగవతము, సప్తమస్కంధం, పద్యం:275

14) వేదవ్యాసుడు - శ్రీ విష్ణు సహస్రనామస్తోత్రం, ఉత్తరపీఠిక, శ్లోకం:25

15) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు,సంపుటం-3,కీర్తన:370

16) తాళ్ళపాక అన్నమాచార్యుడు- అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-3, కీర్తన:186

17) తాళ్ళపాక అన్నమాచార్యుడు - అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-2,కీర్తన:503

18) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు,సంపుటం-1, కీర్తన:125

19) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-1, కీర్తన:74

20) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-5, కీర్తన:182

21) తాళ్ళపాక అన్నమాచార్యుడు - శృంగార సంకీర్తనలు, సంపుటం-5, కీర్తన:275
22) తాళ్ళపాక అన్నమాచార్యుడు - శృంగార సంకీర్తనలు, సంపుటం-6,కీర్తన:128
23) తాళ్ళపాక అన్నమాచార్యుడు- శృంగార సంకీర్తనలు,సంపుటం-24,కీర్తన:198
24) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు,సంపుటం-6, కీర్తన:90
25) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-22,కీర్తన:98
26) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-5, కీర్తన:276
27) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు,సంపుటం-11,కీర్తన: 475
28) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు,సంపుటం-20,కీర్తన:135
29) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు,సంపుటం-20, కీర్తన:210
30) తాళ్ళపాక అన్నమాచార్యుడు -శృంగార సంకీర్తనలు,సంపుటం-24,కీర్తన: 168
31) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-5, కీర్తన:282
32) లీలాశుకుడు -శ్రీ కృష్ణకర్ణామృతము, ద్వితీయాశ్వాసము, శ్లోకం:58
33) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు,సంపుటం-5, కీర్తన:295
34) తాళ్ళపాక అన్నమాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-7, కీర్తన:198
35) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-2, కీర్తన:162
36) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-1, కీర్తన:335
37) తాళ్ళపాక అన్నమాచార్యుడు -అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-2,కీర్తన:47
38) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-3, కీర్తన:370
39) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు,సంపుటం-1,కీర్తన:335
40) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-3, కీర్తన:184
41) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-2, కీర్తన:91
42) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-1, కీర్తన:80

43) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-3, కీర్తన:370

44) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-1, కీర్తన:335

45) శ్రీ వాల్మీకి మహర్షి-రామాయణ రత్నాకరము, యుద్ధకాండం, శ్లోకం:177

46) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-4, కీర్తన:477

47) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-3, కీర్తన:277

48) తాళ్ళపాక అన్నమాచార్యుడు - అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-3,కీర్తన:370

49) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-1,కీర్తన:324

50) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-4,కీర్తన:352

51) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-3, కీర్తన:370

52) తాళ్ళపాక అన్నమాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-1,కీర్తన:334

# 4. పెదతిరుమలయ్య దశావతార సంకీర్తనలు

**4.0** తాళ్ళపాక కవి కుటుంబం రెండవ తరానికి చెందినవాడు పెదతిరుమలయ్య. ఈయన తాళ్ళపాక అన్నమాచార్యునికి, అతని రెండవ భార్య అక్కలమ్మకు జన్మించిన ఏకైక కుమారుడు. అన్నమయ్య కుటుంబ వారసుడుగానే గాక ఆయన సారస్వత వారసుడుగా, వేంకటేశ్వర భక్తి వారసుడుగా కూడా పెదతిరుమలయ్య పెద్దరికం వహించాడు. తండ్రి కీర్తనారచనకే పరిమితంకాగా, పెదతిరుమలయ్య తిరుమలలోనూ, ఇతర వైష్ణవ క్షేత్రాల్లోనూ ఎన్నో కైంకర్యాలు చేసి తన భక్తి ప్రపత్తులను చాటుకున్నాడు. అన్నమయ్య సాగిస్తూ వచ్చిన సంకీర్తనా యజ్ఞాన్ని ఆయన ఆదేశం మేరకు అందిపుచ్చుకుని కొనదాకా కొనసాగించిన అనుపమ వాగ్గేయకారుడు పెదతిరుమలయ్య. అందుకే కాబోలు 'పన్నుగ పెదతిరుమలయ్య పదమున కెరుగున్' అని ప్రసిద్ధి వహించాడు. పదాలకే పరిమితం కాక ఇతర సాహిత్య ప్రక్రియల్లో కూడా రచన సాగించి ఆంధ్ర సాహిత్యానికి ఎనలేని సేవ చేశాడు. శతకం, దండకం, ద్విపద, రగడ, వచనం వంటి అనేక ప్రక్రియలలో తన నైపుణ్యాన్ని పెదతిరుమలయ్య ప్రదర్శించాడు. తండ్రిగారి కీర్తనలను, తన కీర్తనలను కూడా రాగిరేకుల మీద చెక్కించి తెలుగు జాతికి మహోపకారం చేశాడు. ఎన్నో శాసనాలు వేయించి తెలుగు చరిత్రకు పుష్టి చేకూర్చాడు.

పెదతిరుమలయ్య అన్నమయ్య కీర్తనలను తలపించే అద్భుత కీర్తనలెన్నో వెలయించాడు. తండ్రిలాగే వాటిని వేంకటేశ్వర స్వామికి అంకితం చేశాడు. వాటిలో అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు కూడా వున్నాయి. పెదతిరుమలయ్య ప్రధానంగా తెలుగు సంకీర్తనలు రచించినప్పటికీ, ఒకటి రెండు సంస్కృత సంకీర్తనలు లేకపోలేదు. ఈయన రచించిన సంకీర్తనల్లో విష్ణువుకు సంబంధించిన వివిధ విషయాలకు స్థానం లభించింది. వాటిలో విష్ణుదేవుని

దశావతార కీర్తనలు కూడా చోటుచేసుకున్నాయి. పెదతిరుమలయ్య దశావతార సంకీర్తనలను ఈ అధ్యాయం విశ్లేషిస్తుంది.

## 4.1 సంస్కృత సంకీర్తనలు :

అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు రచించడంతో పాటు సంకీర్తనా లక్షణాన్ని కూడా సంస్కృతంలోనే రచించాడు. పెదతిరుమలయ్య దానికి సంస్కృతంలోనే వాఖ్యానం వ్రాశాడు. అయితే ఎందుకోమరి సంస్కృత సంకీర్తనలను చెప్పుకోదగ్గ సంఖ్యలో రాయలేదు. ఈయన సంకీర్తనల్లో ఒకటి, రెండు మాత్రమే సంస్కృత సంకీర్తనలు కావడం గమనార్హం. అన్నమయ్య అధ్యాత్మ, శృంగార సంస్కృత సంకీర్తనల్లో దశావతార కీర్తనలు కనిపించగా పెదతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో ఒకటి మాత్రమే నరసింహావతార కీర్తన కనిపిస్తుంది.

అహోబిలంలో వెలసిన నరసింహస్వామినుద్దేశించి ఈయన ఒక చక్కని సంస్కృత సంకీర్తన రచించాడు. దీనిలో సింహశబ్ధం పదేపదే ఆవృతం కావడం పెదతిరుమలయ్య శబ్ద చమత్కృతికి, అంత్యానుప్రాస ప్రయోగాసక్తికి ఉదాహరణ అని చెప్పుకోవచ్చు.

స్వామి చేతులలో భయంకరమైన ఆయుధాలు, ముఖంలో ప్రళయాగ్ని, స్వామిభయదాకారం ఈకీర్తనలో ఇంపుగా వర్ణింపబడ్డాయి.

॥కీర్తన॥ నమామ్యహం మానవ సింహం
ప్రమదా కమహోబల నరసింహం ॥పల్లవి॥

దానవదైత్య విదారణ సింహం
నానాయుధకర నరసింహం
భూనభోంతరాపూరిత సింహం
ఆనన వహ్నిలయాంతక సింహం ॥నమా॥

ప్రళయ నృసింహం బహుముఖ సింహం
సలలిత గరుడాచల సింహం
కులిశనఖర ముఖ ఘోషిత సింహం
తిలకిత బహురవి దీపిత సింహం ॥నమా॥

శాంత నృసింహం శౌర్య నృసింహం
సంతత కరుణాజయ సింహం
కాంతం శ్రీ వేంకటగిరి సింహం
చింతితఘన సంసిద్ధి నృసింహం ॥నమో॥ [1]

## 4.2 తెలుగు సంకీర్తనలు :

పదరచనలో సిద్ధహస్తుడైన పెదతిరుమలయ్య తెలుగులో వెలయించిన సంకీర్తనలు తండ్రి సంకీర్తనలను తలపించడమే గాక ప్రత్యేకతను ప్రకాశింప జేస్తున్నాయి. వాటిలో జోలపాటలు, తాత్త్వికగేయాలు, స్తుతిగేయాలు, నీతి ప్రబోధకాలు, దశావతార కీర్తనలు ఇలా ఎన్నో కనిపిస్తాయి. పెదతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనల్లోనూ, శృంగార సంకీర్తనల్లోనూ కూడా విష్ణుదేవుని అవతార ప్రశంసకు స్థానం లభించింది.

### 4.2.1 అధ్యాత్మ సంకీర్తనలు :

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో దశావతార కీర్తనలెన్నో కనిపిస్తాయి. ఏకావతార కీర్తనలు కూడా గోచరిస్తాయి. ఈవిధంగానే పెదతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో కూడా అనేకావతార కీర్తనలు, ఏకావతార కీర్తనలు వున్నాయి.

#### 4.2.1.1 అనేకావతార సంకీర్తనలు :

పెదతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో పది అవతారాలు స్థానం వహించే కీర్తన ఒకటి మాత్రమే గోచరిస్తుంది. శృంగార సంకీర్తనల్లో దశావతారాలకు చోటిచ్చిన రెండు సంకీర్తనలు చోటుచేసుకున్నాయి. అయితే వాటిలో శృంగారపరమైన భావాలేవి కనిపించడం లేదు. అందువల్ల వాటిని కూడా పెదతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనల్లోనే చేర్చి పరిశీలించడం సముచితం. కొన్ని కీర్తనల్లో ఐదు (5), ఇంకొన్నింటిలో నాలుగు (4), మరికొన్ని కీర్తనల్లో వరుసగా మూడు (3), రెండు (2) అవతారాలు చోటుచేసుకున్నాయి.

##### 4.2.1.1.1 విష్ణునామ జపం :

ఆరాధ్య దేవతలను అర్చించేటప్పుడు అష్టోత్తర శతనామావళితో అర్చించడం ఆనవాయితీ. వాగ్గేయకారులు తమ ఆరాధ్య దేవత అష్టోత్తర

శతనామావళిని తమ కీర్తనల్లో వాడుకోవడం కనిపిస్తుంది. ఇలాంటి ప్రయోగాలు ముత్తుస్వామి దీక్షితుల కృతుల్లో వున్నట్టు సంగీతజ్ఞులు చెబుతారు. పెదతిరుమలయ్య కూడా ఇలాంటి ప్రయోగాన్నే చేసేందుకు ప్రయత్నించాడు. సంధ్య వార్చేటప్పుడు, పూజను ప్రారంభించేటప్పుడు కేశవాది నామాలను చెప్పడం పరిపాటి. ఇవి 24 నామాలు. ఇవన్నీ విష్ణుదేవుడికి సంబంధించినవే. ఈ నామాలన్నిటినీ పాటలో వచ్చేట్టు చూడడం పెదతిరుమలయ్య ప్రత్యేకత. ఈ పాటలోనే మొదట దశావతారా లను పేర్కొన్నాడు. మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, బుద్ధ, కల్కి అవతారాలు ప్రస్తావనామాత్రంగానే ఈ పాటలో చోటుచేసుకున్నాయి. దశావతారాల్లో కృష్ణావతార ప్రసక్తి దీనిలో కనిపించదు. ఒకవైపు విష్ణుదేవుని దశావతారాలను ప్రస్తావిస్తూ మరోవైపు విష్ణుదేవుని చతుర్వింశతి నామాలను పేర్కోవడం విశేషం. ఈ పాటలో శబ్దానికున్నంత ప్రాధాన్యం భావానికి వున్నట్టు తోచదు. నామోచ్చారణ, నామజపంపట్ల పెదతిరుమలయ్యకున్న శ్రద్ధ ఈగేయంలో కనిపిస్తుంది.

॥కీర్తన॥ మచ్చకూర్మ వరాహ మనుష్యసింహ వామనా
యిచ్చ రామ రామ రామ హితబుద్ధి కలికీ ॥పల్లవి॥

నన్నుఁగావు కేశవ నారాయణ మాధవ
మన్నించు గోవింద విష్ణు మధుసూదన
వన్నెల త్రివిక్రమ వామనా శ్రీధరా
సన్నుతించే హృషికేశ సారకు పద్మనాభ ॥మచ్చ॥

కంటిమి దామోదర సంకరుషణ వాసుదేవ
అంటేజాలు ప్రద్యుమ్నుఁడా అనిరుద్ధుఁడా
తొంటే పురుషోత్తమ అధోక్షజ నారసింహామా
జంటవాయకు మచ్యుత జనార్దన ॥మచ్చ॥

మొక్కేము వుపేంద్ర హరి మోహన శ్రీకృష్ణరాయ
యెక్కితి శ్రీవేంకట మిందిరానాథ
యిక్కువ నీనామములు యివియే నాజపములు
చక్కఁగా నీదాసులము సర్వేశ అనంత ॥మచ్చ॥[2]

**4.2.1.1.2 రాజు :**

అన్నమయ్య వేంకటేశ్వరుణ్ణి అనేక రూపాలతో ఆరాధించాడు. అనేక వాచకాలతో సంబోధించాడు. బోయనాయుడు, గొల్లబోయిడు వంటి కులవాచకాలతో కూడా అన్నమయ్య సంబోధనలు సాగాయి. అదేవిధంగానే పెదతిరుమలయ్య కూడా కులవాచకంతో వేంకటేశ్వరుణ్ణి వ్యవహరించాడు. రాజవాచకంతో సంబోధించి స్వామి ఆధిక్యతను ధ్వనింపజేశాడు. విష్ణువు పురుషోత్తముడు కాబట్టి పురుషోత్తమ రాజు అనడం ఇక్కడ సమంజసంగా వుంది. ఈ కీర్తనలో విష్ణుదేవుని దశావతారాలు స్ఫురించడం గమనార్హం.

'వీలుచు నీరావటించీ వేదమరాజు' అనడం 'మత్స్యావతారాన్ని'

'కూలికి గుండ్లు మోచీ' అనడం 'కూర్మావతారాన్ని'

'నేలలు దవ్వీ పొలము రాజు' అనడం 'వరాహావతారాన్ని'

'పదుచాటలాడీ నరసింగరాజు' అనడం 'నరసింహావతారాన్ని'

'చేతులు చాఁచీఁ జిక్కరాజు' అనడం 'వామనావతారాన్ని'

'రాకపోక తపసాయె' అనడం 'పరశురామావతారాన్ని'

'రాఘవరాజు' అనడం 'రామావతారాన్ని'

'పసులఁగాచీ కృష్ణరాజు' అనడం 'కృష్ణావతారాన్ని'

'మగువల కిచ్చలాడీ మాకరాజు' అనడం 'బుద్ధావతారాన్ని'

'జగమెల్లాఁతిరిగీని జక్కరాజు' అనడం 'కల్క్యవతారాన్ని' సూచిస్తున్నాయి.

కొన్ని పేర్లు లోకవ్యవహారంలో వున్నవాటినే తీసుకోవడం గమనార్హం. కొన్ని అవతార సంఘటనలను, మరికొన్ని అవతార ప్రయోజనాలను సూక్ష్మంగా ఈ కీర్తన సూచిస్తుంది.

॥కీర్తన॥ ఇన్నియు నుండఁగ దమ కేమి గడమ
వున్నవాఁడు సిరి పురుషోత్తమరాజు ॥పల్లవి॥

వీలుచు నీరావటించీ వేదమరాజు
కూలికి గుండ్లు మోచీఁగూర్మరాజు

పోలిమి నేలలు దవ్వీఁ బొలమురాజు
నాలి బడుచాట లాడీ నరసింగరాజు ॥ఇన్నియు॥

చేకొని చేతులు చాఁచీఁ జిక్కరాజు
రాకపోక దపసాయె రామరాజు
రాకట్నములే కట్టీ రాఘవరాజు
రేకలఁ బసుల ఁగాచీ కృష్ణరాజు ॥ఇన్నియు॥

మగువల కిచ్చలాడీ మాకరాజు
జగమెల్లాఁదిరిగీని జక్కరాజు
నగుఁబాటుదీర శ్రీవేంకట నగముపయి
వెగటై లోకము లేలే వెంగళరాజు ॥ఇన్నియు॥[3]

**4.2.1.1.3 సిద్ధుడు :**

సిద్ధ, సాధ్య, యక్ష, కిన్నెర, కింపురుష, గంధర్వాదులు దేవజాతులని ప్రసిద్ధి. విష్ణువు సిద్ధులలో తాను కపిలముని అని స్వయంగా చెప్పుకున్నాడు.

॥శ్లోకం॥ "..............................

గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః॥"[4]

సిద్ధులు పర్వత గుహల్లోనో, కీకారణ్యంలోనో తపస్సు చేసుకుంటూ వుంటారనీ, లోకసంచారం చేస్తూవుంటారనీ ప్రతీతి. అణిమ, లఘిమ, మహిమ మొదలైన ఎనిమిది సిద్ధులను గానీ, వాటిలో కొన్నిటిని గానీ కలిగివుండేవారిని కూడా సిద్ధులని వ్యవహరిస్తారు. తమిళదేశంలోనూ, మహారాష్ట్ర దేశంలోనూ సిద్ధులకు ప్రాధాన్యం వుంది. తిరుమల ఆలయం కూడా ఒక సిద్ధుని సమాధి అని తమిళదేశంలో ఒకప్పుడు కొంత ప్రచారం కూడా జరిగింది. వీటన్నిటినీ దృష్టిలో వుంచుకునో ఏమో పెదతిరుమలయ్య వేంకటేశ్వరుణ్ణి సిద్ధుడుగా సంభావించి సంబోధించాడు. ఈ కీర్తనలో కూడా విష్ణుదేవుని దశావతారాలు చోటుచేసుకున్నాయి. 'రససిద్ధుడా' అనడం ఆ కాలంలో అనేక మంది రసవాదులుండడాన్ని సూచిస్తుంది.

నీరధిలో విహరించడం 'మత్స్యావతారాన్ని'

పాతాళ శబ్దం 'కూర్మావతారాన్ని'

భూమి మొయ్యడం 'వరాహావతారాన్ని'

కంబ శబ్దం 'నరసింహావతారాన్ని'

మింటి పొడవు కావడం 'వామనావతారం' లోని 'త్రివిక్రమ' ఔద్ధత్యాన్ని

గెంటిన తల్లిని బ్రతికించడం 'పరశురామావతారాన్ని'

పెంటిరాకాసిఁ జంపడం 'రామావతారాన్ని'

భూతము నెత్తురు త్రాగడం 'కృష్ణావతారాన్ని'

పూళ్లు చెరచడం త్రిపుర వినాశానికి తోడ్పడిన 'బుద్ధావతారాన్ని'

ఊతిగుఱ్ఱపు శబ్ధం 'కల్క్యవతారాన్ని' సూచిస్తున్నాయి.

'ఆదిసిద్ధుడా'అని స్వామిని సంబోధించడం అతని సనాతనత్వాన్ని తెలియ జేస్తుంది.

॥కీర్తన॥ బాపుబాపు మెచ్చితిమి బాలసిద్ధుఁడా
రాపుల సింగారపు రససిద్ధుఁడా ॥పల్లవి॥

నీరధిలో విహరించు నిజసిద్ధుఁడా
తారితారి మెలఁగే పాతాళ సిద్ధుఁడా
భారపు భూమి మోచేటి బలుసిద్ధుఁడా
తోరపు కంబము మీఁది దొడ్డసిద్ధుఁడా ॥బాపు॥

మింటి పొడవైనట్టి మేటి సిద్ధుఁడా
గెంటిన తల్లి బదికించు సిద్ధుఁడా
పెంటిరాకాసిఁజంపిన పెను సిద్ధుఁడా
దంట భూతము నెత్తురు దాగితి సిద్ధుఁడా ॥బాపు॥

మచ్చి పూళ్లు చెరిచిన మాయసిద్ధుఁడా
రచ్చలోని ఊతిగుఱ్ఱపు సిద్ధుఁడా

కొచ్చన శ్రీవేంకటాద్రి గుహ సిద్ధుఁడా
అచ్చపు లోకము లేలే ఆది సిద్ధుఁడా ॥బాపు॥[5]

#### 4.2.1.1.4 వ్యాజనింద :

వేంకటేశ్వరుడు సర్వలోకాధిపుడు. సర్వజన సంరక్షకుడు. సర్వగుణ సంపన్నుడు. సర్వధర్మ సంసేవ్యుడు. అలాంటి మహాత్ముడికి దోషాలుంటాయా? ఉన్నాయని స్వామికే విన్నవించిన ఒక భక్తుని ఉవాచ పాటగా పల్లవించింది.

రేపల్లెలో గోపకాంతలతో రహస్యరాసక్రీడ సలిపిన తప్పు, వెన్నదొంగ తనం, చిన్న చేపల్ని ఆహారించిన 'మత్స్యావతార' దోషం,

'కృష్ణావతారం' లో పార్థునికి సారథ్యం వహించిన న్యూనత,

'బుద్ధావతారం'లో అసురాంగనలతో(త్రిపురకాంతలతో) అబద్ధాలాడిన తప్పు,

'రామావతారం'లో శబరి ఎంగిలి తినిన దోషం,

'వామనావతారం'లో బలిని యాచించిన పొరబాటు మొదలైన విష్ణుదేవుని అవతార కృత్యాలను దోషాలుగా భావిస్తూ వ్యాజనింద చేసిన వైనం ఈ కీర్తనలో కనిపిస్తుంది. వీటిద్వారా మత్స్య, వామన, రామ, కృష్ణ, బుద్ధ అవతారాల వృత్తాంతాల ప్రసక్తి గోచరిస్తూ వుంది. విష్ణుదేవుని సుకృత్యాలను దోషాలుగా చమత్కరించిన పెదతిరుమలయ్య నేర్పు ప్రశంసనీయం.

॥కీర్తన॥ హరి నీవు నాకు లంచమేమిచ్చేవు అన్ని మర్మములు చెప్పుదునా
దొరవంటా మొక్కి నీదాసులతోడ తుచ్చపు నీ చేఁత చెప్పుదునా ॥పల్లవి॥

అల్లనాఁడు నీవుమైలన్న చొక్కయ్య నంటుకొన్న సుద్ది చెప్పుదునా
గొల్లెతలవాడ చీఁకటి నీతప్పు కోరి చేసినది చెప్పుదునా
వెల్లవిరిగా రేపల్లెలోపలి వెన్నముచ్చిమలు చెప్పుదునా
తల్లి బిడ్డ నొక్కవానిగఁ జేసిన ధర్మపుతగవు చెప్పుదునా ॥హరి॥

మేటి మీనవై ఆఁకటికిఁ జిన్నమీలఁ దిన్నసుద్ది చెప్పుదునా
పాటించి నీసరిబావమరఁదికి బండి రొప్పినది చెప్పుదునా

గాటపు టసుర కామినుల తోడ కల్ల లాడినది చెప్పుదునా
యీటు వెట్టుకొని నీపు బోయదాని యెంగిలి దిన్నది చెప్పుదునా ॥హరి॥

దీనవృత్తిఁబోయి బలిచక్రవర్తిఁ దిరిసికొన్నది చెప్పుదునా
ఆనించి శ్రీపతిపాదాలు నీమెడ నంట గట్టుకొంట చెప్పుదునా
దానవాంతక శ్రీ వేంకటేశ్వర దైవమని నిన్నుఁ జెప్పుదునా
పానిపట్టి శరణంటేఁ గాచేట పరమేకాంతము చెప్పుదునా ॥హరి॥[6]

### 4.2.1.1.5 భగవద్విరహం :

వేంకటేశ్వర సాక్షాత్కారాన్ని పొందే అదృష్టం కలిగిన పెదతిరుమలయ్య తన భగవద్విరహాన్ని ఈ గేయంలో ఎంతో చక్కగా వివరించడం విశేషం.

ఒక భక్తుడు భగవంతునికి చేరువకావాలని పరితపించాడు. అనుగ్రహాలస్యానికి అలమటించాడు. విష్ణుదేవుని పూర్వావతారాల్లో కొన్నిటిని స్మరిస్తూ ఆయా అవతార కాలాల్లో అవతార పురుషునికి సాన్నిహిత్యంగా మసలుకున్న ఏ అంశమైన తాను అయివున్నట్లయితే భగవంతుని అనుగ్రహం తనకు లభించి వుండేదని వాపోయాడు. ఈ కీర్తనలో మత్స్య, కూర్మ, రామ, కృష్ణ అవతారాలు మాత్రమే స్మరింపబడ్డాయి. కానీ ఈ అవతారాలు వరుసక్రమంలో లేవు. ఈ గేయం ఆధునిక గేయాన్ని తలపిస్తుంది.

స్వామి అవతారాన్ని ధరించే సమయంలో తాను కూడా పుట్టివున్నట్టు భక్తుడు దృఢంగా విశ్వసించాడు. అయితే ఆసమయంలో తాను ఏమిగా వుండేవాడో అతనికే తెలియలేదు.

'కృష్ణావతార' సమయంలో కృష్ణుడు ఆవుల్ని మేపేటప్పుడు లేగదూడగా, విటుడుగా విహరించేటప్పుడు గొల్లెతగా వుండివున్నట్లయితే తప్పక ఆదరించి వుండేవాడు.

'రామావతారం' లో రాయిగావున్నా, వానరంగా వున్నా రక్షించి వుండేవాడు. 'రాయి' ప్రయోగం అహల్యశాపవిమోచనాన్ని, వానర ప్రయోగం వానర సహాయాన్ని వాక్రుచ్చినట్లైంది.

'మత్స్య, కూర్మావతారా'ల్లో సముద్రంలో ఏ జలచరమైవున్నప్పటికి కాపాడి వుండేవాడు. ఏది ఏమైనా చివరకు వేంకటేశ్వరుడు భక్తుణ్ణి అనుగ్రహించాడు. ఈ కీర్తనలో మొదట కృష్ణావతారాన్ని, తర్వాత రామావతారాన్ని, ఆపైన మత్స్య, కూర్మాలను పేర్కోవడం విశేషం.

ఈ కీర్తన "రాయినైనా కాకపోతిని రామపాదము సోకగా" అని ప్రారంభమయ్యే సినీగేయాన్ని తలపించడం గమనార్హం.

॥కీర్తన॥ అయ్యో యేమరి నేనాఁడప్పు దేమై వుంటినో
అయ్యెడ నీదాసి నైతే ఆదరింతుగా ॥పల్లవి॥

అల్లనాఁడు బాలుఁడవై ఆవులఁగాచేవేళ
చిల్లర దూడనైతే చేరి కాతువుగా
వల్లెగా విటుఁడవై రేపల్లెలో నుండే నాఁడు
గొల్లెత నయినా నన్ను కూడుకొందుగా ॥అయ్యో॥

మేలిమి రామావతారవేళ రాయిరప్పనైనా
కాలు మోపి బదికించి కాతువుగా
వాలి సుగ్రీవుల వద్ద వానరమై వుండినాను
యేలి నన్నుఁ బనిగొని యీడేర్తువుగా ॥అయ్యో॥

వారిధిలో మచ్చ కూర్మావతారములైన నాడు
నీరులో జంతువునైనా నీవు గాతువుగా
యీరీతి శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టే
మోరతోపున నిన్నాళ్ళు మోసపోతిఁగా ॥అయ్యో॥[7]

**4.2.1.1.6 గెలుపు :**

పెదతిరుమలయ్య బీక కీర్తనలో విష్ణుదేవుని నాలుగు అవతారాలను ప్రస్తావించాడు. 'కినిసి రావణుని గెలిచిన గెలుపులు' అనడంలో 'రామావతారాన్ని'

'చెనకి బాణుని గెలిచిన గెలుపు' అనడంలో 'కృష్ణావతారాన్ని'
'పొనిఁగి హేమకశిపుని గెలిచిన గెలుపు' అనడంలో 'నరసింహావతారాన్ని'
'చెలఁగి బలిని గెలిచిన గెలుపు' అనడంలో 'వామనావతారాన్ని'

ప్రస్తావించినట్టు అయ్యింది. ఇక్కడ రామ-కృష్ణ అవతారాలు ముందుగా, నరసింహ-వామనావతారాలు తర్వాత ప్రస్తావించబడడం గమనార్హం. దశావతారాలను క్రమంగా గాక యథాభిరుచిగా ప్రస్తావించినట్టు కనిపిస్తుంది.

సనక సనందనాదుల శాపవశాత్తు మొదట హిరణ్యాక్ష - హిరణ్యకశిపులు గానూ, తర్వాత రావణ - కుంభకర్ణులు గానూ, ఆమీద శిశుపాల - దంతవక్త్రులు గానూ జయ విజయులు జన్మించారు. వీరిని హతమార్చేందుకే విష్ణువు నరసింహ, రామ, కృష్ణావతారాలు ధరించాడు. బలిచక్రవర్తి కోసం వామనావతారం ధరించాడు. ఈ గేయంలో ప్రసక్తాలయిన అవతారాలు ఏ ఉద్దేశంతో ధరింపబడ్డాయో ఆయా అవతారాలకు సంబంధించిన వ్యక్తుల ప్రస్తావన దీనిలో చోటుచేసుకుంది. ఈ అవతారాల ప్రయోజనాన్ని కూడా ఈ కీర్తనలో పరోక్షంగా సూచించినట్లైంది.

॥కీర్తన॥ సురలకు నరులకు శుభమాయె
హరి నీ చేఁతలు ఆనంద మాయె ॥పల్లవి॥

కినిసి రావణుని గెలిచిన గెలుపులు
చెనకి బాణుని గెలిచిన గెలుపు
పొనిఁగి హేమకశిపుని గెలిచిన గెలుపు
వెనక ముందరికి వేదములాయె ॥సురల॥

కలన కంసునటు గెలిచిన గెలుపులు
చెలఁగి బలిని గెలిచిన గెలుపు
అలశిశుపాలుని గెలిచిన గెలుపులు
బలుపుణ్య కథా భారతమాయె ॥సురల॥

కెరలి యసురలను గెలిచిన గెలుపులు
సిరుల నందరి గెలిచిన గెలుపు
యిరవగు శ్రీ వేంకటేశ నీ మహిమలు
సరవితోఁ బురాణము లాయె ॥సురల॥[8]

### 4.2.1.1.7 వేంకటరాయ ప్రతాపం :

పెదతిరుమలయ్య విష్ణుదేవుని నాలుగు అవతారాలను కొనియాడుతూ రచించిన కీర్తనలో కృష్ణావతారం గురించి అధికంగానూ, మత్స్య, నరసింహ, రామావతారాల గురించి తక్కువగానూ తెలియజేయడం జరిగింది. 'మత్స్యావతార" ప్రధాన సంఘటన సోమక వధ, వేద సంరక్షణ.

'నరసింహావతార' ముఖ్యసంఘటన హిరణ్యకశిప వధ.

'రామావతార' సంఘటనలో పేర్కోదగ్గది వారధిబంధన. వీటిని మాత్రమే పేర్కొన్నాడు.

పెదతిరుమలయ్య గోవర్ధనోద్ధరణ, దైత్య సంహారం, మల్లులను వధించడం, కాలనేమిని జయించడం, కాళీయమర్ధనం, పౌండ్రకవధ, జరాసంధుణ్ణి ఎదుర్కోవడం వంటి పలు కృష్ణావతార సంఘటనలను పేర్కొన్నాడు. ఇది కృష్ణావతారం మీద పెదతిరుమలయ్యకు వున్న అభిమానాన్ని సూచిస్తుంది.

॥కీర్తన॥ మిన్ను నేల మోచె నదె మేటి దైవము
కన్నులెదుటనే శ్రీ వేంకటరాయఁడు ॥పల్లవి॥

యెత్తినాఁ డు గోవర్ధన మింద్రాదిసురలెదుట
వొత్తినాఁడు శంఖము దైత్యుల గెలిచి
మెత్తినాఁడు హిరణ్యుని మెదడు చందనముగా
మొత్తినాఁడు మల్లులను మొగతిరుగఁగను ॥మిన్ను॥

పట్టినాఁ డు చక్రము వుబ్బరి కాలనేమిమీఁద
మెట్టినాఁడు కాళింగుని మెడలమీఁద
పెట్టినాఁడు యేకదాడి పెనుసముద్రదాఁట
కొట్టినాఁడు పౌండ్రకుని కోలాహలముగా ॥మిన్ను॥

తుంచినాఁడు సోమకుని తోయములు చొచ్చి చొచ్చి
దంచినాఁడు జరాసంధు దండిపవుఁజుల
యెంచఁగ శ్రీ వేంకటాద్రి నిందిరయుఁదానుఁగూడి
మించినాఁడు దాసులను మెచ్చి వరములను ॥మిన్ను॥[9]

### 4.2.1.1.8 దేవీకటాక్ష ఆవశ్యకత :

ఒక కీర్తన విష్ణుదేవుని మూడు అవతారాలను ప్రస్తావిస్తూవుంది. మొదట రామావతారాన్ని, తర్వాత కృష్ణావతారాన్ని, ఆ పైన నరసింహావతారాన్ని ప్రస్తావించడం ఇక్కడ విశేషం. ఈ కీర్తన దశావతారాల్లోని అవతార క్రమానికి గాక, ఆయా అవతారాల్లో చోటుచేసుకున్న సంఘటనల వైచిత్రికి ప్రాధాన్యమిస్తూ వుంది.

'రామావతారం'లో కాకాసురుడు, రావణాసురుడు కూడా సీతమ్మవారిపట్ల అపచారం చేసిన వారే. కాకాసురుడు సీతమ్మవారి కృపవల్ల బ్రతికిబట్టగట్టాడు. రావణాసురుడికి సీతమ్మ వారి కృప లేకపోవడం వల్ల రణరంగంలో నిహతుడయ్యాడు.

'కృష్ణావతారం'లో రుక్మిణి వివాహ సందర్భంలో కృష్ణుడికి రుక్మి, శిశుపాలుడు ఇద్దరూ కీడు తలపెట్టారు. అయితే రుక్మికి రుక్మిణి చెల్లెలు కావడం వల్ల ఆమె ప్రార్థన మేరకు కృష్ణుడు అతడిని విడిచిపెట్టాడు. శిశుపాలుడికి రుక్మికి లాగా రుక్మిణి తోడ్పాటు లేదు. కాబట్టే ధర్మరాజు నిర్వహించిన రాజసూయయాగం లో కృష్ణుడి చక్రానికి శిశుపాలుడు బలికావలసి వచ్చింది.

'నరసింహావతారం'లో భార్గవ పుత్రులైన చండామార్కులు కూడా ప్రహ్లాదునిలో విష్ణుద్వేషాన్ని ప్రజ్వరిల్లజేసే ప్రయత్నంలో అపరాధులయ్యారు. విష్ణువును, విష్ణుభక్తులను ద్వేషించి హిరణ్యకశిపుడు కూడా మహాపరాధం చేశాడు. విష్ణుదేవుని భార్య లక్ష్మీదేవికి భార్గవి అనే పేరుంది. చండామార్కులు భార్గవులని వ్యవహరింపబడుతారు. నామసామ్యం వల్లనో, అమ్మవారి కటాక్షంవల్లనో భార్గవులు బ్రతికిబయటపడ్డారు. హిరణ్యకశిపుడికి లక్ష్మీదేవి అనుగ్రహం లేదు. కాబట్టి అతడు తప్పని సరిగా మరణించవలసి వచ్చింది.

ఈ మూడు అవతారాల్లోనూ ఇద్దరిద్దరు అపరాధులు ప్రస్తావనకు రావడం వారిలో ఒకరికి లక్ష్మీదేవి కటాక్షం ఉండడం కనిపిస్తుంది. దేవీకటాక్ష ఆవశ్యకతను ఈ సన్నివేశం బోధిస్తుంది. పెదతిరుమలయ్య ఈ కీర్తనలో ఇలాంటి గొప్పశిల్పాన్ని వాడి పాఠకులను లేదా శ్రోతలను అలరించాడు.

॥కీర్తన॥ శ్రీసతికరుణే దిక్కు జీవుల కెల్లా
వాసుదేవుఁడా రమణీవశమైయుండఁగను ॥పల్లవి॥

సీతవద్దనుండ రాముచేఁ గాకాసురునకు
నాతలఁబ్రాణము నిల్చె నపరాధియైనాను
యేతుల రావణాసురుఁడిటువంటి వాఁడే కాఁడా
కాతరాన నొంటిఁజిక్కి పిందతుండా లాయెను ॥శ్రీసతి॥

కదిసి రుక్మిణి యుండఁగా, గృష్ణునిచే రుక్మికి
అదన బ్రదుకు గల్గె నతిద్రోహి యైనాను
యెదుటనే శిశుపాలుఁడీరీతివాఁడే కాఁడా
తుద సభలో వదరి తునకలై పడెను ॥శ్రీసతి॥

సిరితోడ పై నుండఁగ శ్రీనరసింహుచే దైత్య
గురుపుత్రులు నిలిచిరి క్రూర కర్ములైనాను
పరగ శ్రీవేంకటేశుపగ గాఁడా హిరణ్యుఁడు
గరిమ నదరిపాటుగాఁగాఁబొలిసెను ॥శ్రీసతి॥[10]

## 4.2.1.1.9 రామావతార సంఘటనా బాహుళ్యం :

పెదతిరుమలయ్య రెండు అవతారాలు చోటుచేసుకునే కీర్తనల్ని కూడా చాలా రచించాడు. వాటిలో రామకృష్ణావతారాలే ఎక్కువగా కనిపిస్తాయి. కొన్నిటిలో రామావతారం ఎక్కువగా, కృష్ణావతారం ప్రస్తావనా మాత్రంగా గోచరిస్తే, మరికొన్నిటిలో కృష్ణావతారం ఎక్కువగా, రామావతారం ప్రస్తావనా మాత్రంగా కనిపిస్తుంది. ఈ రామావతార ప్రధాన కీర్తనలో సేతుబంధనం, శబరి భక్తి, సీతాకల్యాణం, జటాయువు తోడ్పాటు మొదలైన ఘట్టాలు ప్రస్తావించబడ్డాయి. ఇవి కూడా క్రమంగా గాక యథాభావనగా చోటుచేసుకున్నాయి. కృష్ణావతారానికి సంబంధించి గోపికా ప్రస్తావన ప్రస్తావనా మాత్రంగా కనిపిస్తుంది. ఈ రెండు అవతారాలకు సంబంధించి స్వామికి తోడ్పడిన వారి జాబితామాత్రమే ఇక్కడ ఇవ్వబడడం విశేషం. వీరిలాగా తాను సేవచేయలేక పోవడం వల్ల తనను రక్షించడం ఎలాగా అని పెదతిరుమలయ్య ఈ కీర్తనలో స్వామినే ప్రశ్నిస్తున్నాడు.

॥కీర్తన॥ రామరామ రామకృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటి బంట ననే తేజమే నాది ॥పల్లవి॥

వారధి దాఁటి మెప్పించ వాయుజుడనేఁగాను
సారెఁజవుల మెప్పించ శబరిఁగాను
బీరాన సీతనిచ్చి మెప్పించ జనకుఁడఁగాను
యేరీతి మెప్పింతు నన్ను యెట్లఁగాచేవో ॥రామ॥

ఘనమై మోచి మెప్పించ గరుడుఁడనేఁగాను
కొనఁగామసుఖ మిచ్చు గోపికఁగాను
వినుతించి మెప్పించ వేయినోళ్ల భోగిఁగాను
నినునెట్లు మెప్పింతు ననుఁగాచేదెట్లా ॥రామ॥

నవ్వుచుఁబాడి మెప్పించ నారదుఁడనేఁగాను
అవ్వలఁబ్రాణమియ్య జటాయువు గాను
యివ్వల శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి
రవ్వల నాతెరువిదె రక్షించే దెట్లో ॥రామ॥ [11]

### 4.2.1.1.10 కృష్ణావతార సంఘటనా బాహుళ్యం :

తనను భగవంతుడు ఎలా కాపాడుతాడని ఒక కీర్తనలో సంశయం వెలిబుచ్చిన పెదతిరుమలయ్య మరొక కీర్తనలో ఆ సంశయానికి సమాధానం కూడా తెలియజేయడం విశేషం. అది రామావతార ప్రధాన కీర్తన కాగా, ఇది కృష్ణావతార ప్రధాన కీర్తన. కృష్ణావతార సంఘటనలు ఎక్కువగానూ, రామావతారానికి సంబంధించిన ఒకే ఒక సంఘటన దీనిలో చోటుచేసుకున్నాయి. ద్రౌపదీ మానసంరక్షణం, గోపికావస్త్రాపహరణం, పాండవ సంరక్షణ, ధేనుపాలనం కృష్ణావతార సంఘటనలు కాగా, శబరి భక్తి మాత్రం రామావతార సంఘటన. ఈ సంకీర్తనలో చోటుచేసుకున్న అందరూ స్వామి దయకు పాత్రులయినవారే. వీరిలాగే తానుకూడా స్వామిదయకు పాత్రుడయ్యే అవకాశం వుందని పెదతిరుమలయ్య ఈ కీర్తనలో ధ్వనింపజేశాడు.

॥కీర్తన॥ భారము నీపై వేసి బ్రదికియుండుటే మేలు
నారాయణుఁడ నీవే నాకుఁ గలవనుచూ ॥పల్లవి॥

శరణన వెరపయ్యీ సామజముఁ గాచినట్టు
వరుస దావతిపడి వచ్చేవంటా
హరికృష్ణ యన వెరపయ్యీ ద్రౌపది వర
మిరవుగ నిచ్చినట్టు యిచ్చేవో యనుచు ॥భార॥

చేత మొక్క వెరపయ్యీ చీరలిచ్చి యింతులకు
బాఁతిపడ్డట్టే నన్నుఁబైకొనే వంటా
ఆతల నమ్మఁగ వెరపయ్యీఁబాండవుల వలెఁ
గాతరాన వెంట వెంటఁ గాచియుండే వనుచు ॥భార॥

ఆరగించుమన వెరపయ్యీ శబరివలె
ఆరయ నెంగలి యనకంటే వంటా
యేరీతి నన వెఱతు యిచ్చైనట్లఁగావు
కూరిమి శ్రీ వేంకటేశ గోవులఁగాచినట్లు ॥భార॥[12]

## 4.2.1.1.11 రామకృష్ణావతార సమ ప్రాధాన్యం :

విష్ణువు జగత్పాలకుడు. అతనికి అయినవారు గానీ, కాని వారు గానీ లేరు. ఎవరు అతనిని ఆశ్రయిస్తారో, సదా ధ్యానిస్తారో స్వామి వారి పట్ల అనుకూలంగా వ్యవహరిస్తాడు. ఈ భావాన్నే శ్రీ కృష్ణుడు భగవద్గీతలో ఇలా తెలియజేశాడు.

॥శ్లోకం॥ సమోఽహం సర్వభూతేషునమే ద్వేష్యోఽస్తి నప్రియః ।
యేభజన్తి తుమాం భక్త్యా మయితే తేషు చాప్యహమ్॥[13]

అయితే కొందరికి స్వామి విశేషానుగ్రహం లభించడం, మరికొందరికి లభించక పోవడం ఎంత వరకు సబబు అనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకునే పెద తిరుమలయ్య ఈ రెండు అవతారాలను ప్రస్తావించే కీర్తన రచించాడు. ఈ కీర్తనలో కొందరిని పేర్కొని వారు మాత్రమే నీకు

ఆత్మీయులా? మేము కామా? అని వేంకటేశ్వరుణ్ణే నిలదీశాడు. తమను కూడా అనుగ్రహించవలసిందిగా అర్థించాడు. ఈ కీర్తనలో పేర్కొబడినవారు రామావతరానికి, కృష్ణావతారానికి చెందినవారు కావడం విశేషం.

రామావతారానికి చెందిన విభీషణుడు, శబరి, అహల్య, ఉడుత కృష్ణావతారానికి చెందిన ఘంటాకర్ణుడు, ఉద్ధవుఁడు, అక్రూరుడు ఈ కీర్తనలో చోటుచేసుకున్నారు. రెండవతారాల కీర్తనలు కొన్నిటిలో రామావతార సంఘటనలు ఎక్కువగా, మరికొన్నిటిలో కృష్ణావతార సంఘటనలు చోటుచేసుకోగా ఈ కీర్తనలో మాత్రం రెండు అవతారాల సంఘటనలు దాదాపు సమానంగానే స్థానం వహించడం గమనించదగ్గ అంశం.

॥కీర్తన॥ నేము నీకన్యులమా నీవు మాలో లేవా
యీ మేరలనే మమ్ము యేలుకొందు గాకా ॥పల్లవి॥

ధర విభీషణుఁడు మీతల్లి కడవాఁడా
నిరతి ఘంటా కర్ణుఁడు నీ తంఁడ్రివాఁడా
యిరవై ధ్రువుఁడు మీ యిల్లాలి కడవాఁడా
శరణన్న మాటలోనే సరుగఁగాచితివి ॥నేము॥

మున్నిటి శబరి నీకు ముమ్మనుమరాలా
మిన్నక ఉద్ధవుఁడు మీ మేనమామా
పన్నిన వుడుత నీకు పాయరానిచుట్టమా
యెన్నఁగ వీరల నెల్ల నింతలో మెచ్చితివి ॥నేము॥

అహల్య నీ కూతురా అక్రూరుఁడు గొడుకా
విహరించ నీకు శ్రీ వేంకటేశుఁడా
వహిముత్తాతలా నీచే వరములు గొన్నవారు
మహి నిందులకెపో నీ మఱుఁగు చొచ్చితిని ॥నేము॥ [14]

### 4.2.1.2 ఏకావతార సంకీర్తనలు :

పెదతిరుమలయ్య విష్ణుదేవుని దశావతారాల్లో చోటుచేసుకున్న రామకృష్ణాద్యవతారాలను విడిగా కూడా కీర్తించాడు. ఒక కీర్తనలో ఒకే అవతారాన్ని

కొనియాడాడు. పెదతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో వరాహ, నరసింహ, వామన, రామ, కృష్ణ అవతారాలను విడివిడిగా కొనియాడే కీర్తనలు కనిపిస్తాయి.

**4.2.1.2.1 వరాహావతారం :**

సకల లోకాలకు స్వామియైన వేంకటేశ్వరునికి తనను ఒకడ్ని రక్షించడానికి వీలు పడదా అని పెదతిరుమలయ్య ప్రశ్నించాడు. స్వామి ఘనతలన్నిటినీ తెలియ జేస్తూ అలాంటి నీవు నన్ను ఆదుకోలేవా? అని ప్రశ్నించాడు. ఈ సందర్భంగానే వరాహావతార ప్రస్తావనకూడా వచ్చింది. వరాహమై భూభారం వహించిన స్వామికి తనభారం మోయడం పెద్దపనేమీ కాదని ధ్వనింపజేశాడు. ఈ కీర్తనలో వరాహావ తార వృత్తాంతం ప్రస్తావనా మాత్రంగానే చోటుచేసుకోవడం గమనార్హం.

॥కీర్తన॥ "..................................

సకల లోకములకు స్వామివైన నీవు
వొకని నన్నేల లేక వొల్లననేవా
మొకరివై భూమెల్ల మోచి యుండిన నీవు
అకట నాపరభారాలాఁప ననేవా

..................................
.................................."[15]

**4.2.1.2.2 నరసింహావతారం :**

అన్నమయ్య అహోబిల క్షేత్రంలో పన్నెండు (12) సంవత్సరాలు నివసించాడు. నరసింహ భక్తుడైన ఆదివన్‌శఠగోపయతికి శిష్యుడై వైష్ణవాగమాలను అభ్యసించాడు. నరసింహ భక్తిని పెంపొందించుకున్నాడు. అధిక సంఖ్యలో నరసింహకీర్తనలు రచించాడు. అన్నమయ్య అడుగుజాడల్లోనే నడచిన పెదతిరుమలయ్య తన వైష్ణవ క్షేత్రాటనలో భాగంగా అహోబిలాన్ని కూడా దర్శించాడు. క్షేత్రాధీశ్వరుడైన నరసింహుడి మీద అనేక కీర్తనలు రచించాడు. వాటిలో అహోబిల క్షేత్ర సౌందర్యం, అక్కడిస్వామి వైభవం, ఘనత, ప్రతాపం అద్భుతంగా అభివర్ణింపబడ్డాయి.

ఒక కీర్తనలో నరసింహావతార విశేషాలను పెదతిరుమలయ్య చక్కగా తెలియజేశాడు. నరసింహ ఆవిర్భావం, హిరణ్యకశిపవధ, ప్రహ్లాద రక్షణ, స్వామి అహోబిలంలో నెలకొనడం ఈ కీర్తనలో ప్రస్తావించబడ్డాయి. అన్నమయ్య లాగే పెదతిరుమలయ్య కూడా వేంకటేశ్వరునికి, నరసింహునికి అభేదాన్ని పాటించి ఆవిష్కరించాడు.

॥కీర్తన॥ చేరి మొక్కరో నరులు శ్రీమంతుఁడీతఁడు
కోరి వరములిచ్చు కొండవంటి సింహము ॥పల్లవి॥

గద్దెమీఁదఁ గూరుచుండి కనక కసిపుఁజెండీ
గద్ధరి ప్రహ్లాదునిపై కరుణనిండీ
వొద్దనె మారుగొండల వువిదయుఁదాను నుండీ
తిద్దుకొనె మీసాలు దివ్యనారసింహుఁడు ॥చేరి॥

భవనాశిదరి దొక్కి బ్రహ్మాదులలోన నిక్కి
తివిరి ప్రతాపమున దిక్కుల కెక్కి
రవళి నారదాదుల రంగుపాటలకుఁజొక్కి
చెవులాలించీ నుతులు శ్రీనారసింహుడు ॥చేరి॥

అదె కంబములోఁ బుట్టి ఆయుధాలు చేతఁబట్టి
వెదకి అహోబలాన వేడుకఁబుట్టి
కదిసి శ్రీ వేంకటాద్రి కాంతలలో గుంపుగట్టి
వెదచల్లు మహిమల వీరనారసింహుడు ॥చేరి॥[16]

**4.2.1.2.3 వామనావతారం:**

పెదతిరుమలయ్య వామనుణ్ణి గురించి ఒక కీర్తన రచించాడు. కానీ దానిలో వామనావతార సంఘటనలేవీ చోటుచేసుకోకపోవడం గమనార్హం. శృంగార పరంగానే ఈ కీర్తన సాగినట్టు తోస్తుంది. వామనుడు బ్రహ్మచారి. అతనికి వనితతోగానీ, వలపుతోగానీ ఎలాంటి సంబంధమూలేదు. వామనుణ్ణి విష్ణువు గానూ, కృష్ణుడుగానూ భావించి పెదతిరుమలయ్య ఈ కీర్తన రచించినట్టు తోస్తుంది. వామన శబ్ధం కీర్తన అంతటా పదేపదే ఆవృతం కావడం పాటకు శబ్దమాధుర్యాన్ని తెచ్చిపెట్టింది.

॥కీర్తన॥ వద్దు వద్దు సటలింక వామనా నీ
వద్దనే వున్నార మిదె వామనా ॥పల్లవి॥

వరుసలు వెదకేవు వామనా నీవు
వరుఁడ విందరికిని వామనా
వరవాత వలపించి వామనాదే
వరవలె నున్నాఁడవు వామనా ॥వద్దు॥

వనము కోగిల వైతి వామనా నీకు
వనితలు బాఁతి వామనా
వనరేరు గొల్లెతలు వామనా కా
వను వేళ చూచుకోమీ వామనా ॥వద్దు॥

వాదవారు మొక్కేరు వామనా నీకు
వాడుదేరె కెమ్మోవి వామనా
వాడికె శ్రీ వేంకటాద్రి వామనా
వాడే చెలమవు నీవు వామనా ॥వద్దు॥[17]

**4.2.1.2.4 రామావతారం**:

విష్ణుదేవుని దశావతారాల్లో రామావతారం ఏడవది. ఆదర్శ మానవ జీవితానికి సజీవ వ్యాఖ్యానంగా రామావతారం రూపొందింది. రాముడు మానవుడని కొందరంటే, అతడు దేవుడేనని ఎందరో కొనియాడారు. రాముడు ఆదినారాయణుడని మొల్ల తన రామాయణంలో పలుచోట్ల పేర్కోవడం ఇక్కడ గమనించదగ్గ అంశం.

॥సీ॥ "........................
........................
రాజమాత్రుండె మేదినీ రక్షకుండు
రామభూపాలుడాది నారాయణుండు"[18]

పెదతిరుమలయ్య రాముణ్ణి మహావిష్ణు స్వరూపుడు గానే ఆరాధించాడు. "వోవో రాకాసులాల వొద్దు సుండివైరము"[19] అని మొదలయ్యే కీర్తనలో రాముడు,

అతని పరిజనం భూలోకంలో అవతరించిన తీరు వివరంగా తెలియజేశాడు. రాముడు మానవుడని ఎవరన్నారో ఏమో?అతడు ఎప్పుడు ఎక్కడ విన్నాడో ఏమో? అతని రామభక్తి, విష్ణుభక్తి కట్టలు తెంచుకుని గంగాయమునల్లా ప్రవహించాయి. రాముడు సాగించిన ఘనకార్యాలను, సాధించిన పరమ ప్రయోజనాలను వివరంగా తెలియజేసి అవన్నీ ఆతని దైవత్వానికి చిహ్నాపతాకలేనని ధ్వనింపజేశాయి.

ఒక వ్యక్తి గొప్పతనం అతని సమీపస్థులకుగానీ, అతని కాలంలో వుండేవారికి గానీ తెలియడం అరుదు. అందుకే రామ మహిమలు ఆనాటి వారికి సరిగ్గా తెలియవేమో? అని పెదతిరుమలయ్య సంశయం వెలిబుచ్చాడు. రాముడు చేసిన పనులు మానవ మాత్రులు చేసే పనులు కావన్నాడు. జటాయువుకు మోక్షమివ్వడం, శివుడంతటివాని ధనస్సును విరిచివేయడం, రాతిని రమణిగా మార్చడం, సరయూనదిలో దిగిన అందరికీ వైకుంఠ ప్రాప్తి కలిగించడం, ఆంజనేయుడికి బ్రహ్మపదవిని ప్రసాదించడం, మనుజ భోజనులైన దనుజులను వధించడం, విష్ణు అంశతో జన్మించిన పరశురాముడి గర్వాన్ని భంగపరచడం, విభీషణుని లంకకు రాజును చెయ్యడం ఇవేవీ సామాన్యులు చేసే పనులుకావు. అయినప్పటికీ ఆనాటి వారు రాముణ్ణి సామాన్యమైన రాజని, దశరథుని కుమారుడని భావించారు. ఇది పెదతిరుమలయ్యకు విడ్డూరమనిపించింది. పర్యవసానంగా ఆమేటి పదకర్తనోట ఈ పాట పల్లవించింది.

॥కీర్తన॥ రామచంద్రా రామభద్రా రఘువీరా
నీమహిమ దెలిసేరా నేఁటివారు ॥పల్లవి॥

అరయ జటాయువున కట్టె మోక్ష మిచ్చితివి
హరునివిల్లు విరిచి అలరితివి
యిరవై రాతికిఁ బ్రాణ మిచ్చితి వింతటి నిన్ను
నరుఁడంటా నుండిరిగా నాఁటివారు ॥రామ॥

నెమ్మది సరయువులో నించితి వైకుంఠము
పమ్మి మారుతికి బ్రహ్మపట్ట మిచ్చితి
దుమ్ములుగ రాక్షసులఁదుత్తుమురు సేసితివి
నమ్మిరిగా రాజవంటా నాఁటివారు ॥రామ॥

యెందునుఁజెడని పట్ట మిచ్చితి విభీషణుని
కంది పరశురాముని నంగవించితి
యిందునే శ్రీ వేంకటేశ యెఱుఁగక దశరథ
నందనుఁడే యనిరిగా నాఁటివారు ॥రామ॥[20]

### 4.2.1.2.5 కృష్ణావతారం :

విష్ణుదేవుని దశావతారాల్లో కృష్ణావతారంలోనే విష్ణుదేవుని అంశ ఎక్కువగా విరాజిల్లుతూ వుందని విజ్ఞుల విశ్వాసం. అందుకే ఈ అవతారాన్ని పూర్ణావతారం అని కూడా భావిస్తారు. " మఱఁదియనుచు ధర్మజుఁడు భ్రమసునట"[21] అని ప్రారంభమయ్యే కీర్తనలో సామాన్యులెవ్వరూ చెయ్యలేని శ్రీకృష్ణుని చేతలను పెదతిరుమలయ్య తెలియజేశాడు. అంతటి ఘనకార్యాలు చేసినా సమకాలీనులు సామాన్యుడి గానే కృష్ణుణ్ణి పరిగణించి వ్యతిరేకించడం అతడికి విడ్డూరమనిపించింది.

మరొక కీర్తనలో కృష్ణావతారంలో చోటుచేసుకున్న కార్యాలను జాబితా రూపంగా పెదతిరుమలయ్య ఆవిష్కరించాడు. కృష్ణజనన కాలాన్ని తెలియజేశాడు. కాళీయ మర్దనం, కంసవధ, పూతనాహరణం, తృణావర్తవధ, మద్దిమాకులను కూల్చటం, శకటాసుర, చాణూర, బకాసుర, ధేనుకాసుర, కుక్కుటదైత్యులను హత మార్చడం, గోపికలను, అక్రూరుణ్ణి అనుగ్రహించడం వంటి కృష్ణావతార అంశాలను పేర్కొని ఆయవతార విశిష్టతను ఆవిష్కరించేందుకు ప్రయత్నించాడు.

॥కీర్తన॥ జనించె నిదిగో శ్రావణ బహుళాష్టమిని
ఘన చంద్రోదయ వేళ కన్నుల పండువగా ॥పల్లవి॥

కాళింగు పాలిటి వైరి కంసుని నెత్తి పిడుగు
చాలిన పూతన ప్రాణసంహార మూర్తి
గాలి తృణావర్తునికి కాలయమదండము
పేలరి మద్దులకును బిరుదు కుఠారము ॥జనించె॥

శకటాసురునిదెత్తి చాణూరుని మెదగత్తి
బకాసురునిఁజెండేటి బలుఱంపము
వికట ధేనుకాసురు వెసఁజంపే మెదతాదు
మొకరి కుక్కుటదైత్యు మోఁదేటి భూతము ॥జనించె॥

గోపికల నిధానము గోకుల కల్పవృక్షము
పాపరాని అక్రూరుని ఫలసారమూ
యేపొద్దు శ్రీవేంకటాద్రి నిరవై దాసుల కెల్ల
చేపట్టు కుంచమైనట్టి చిన్మయానందము ॥జనించె॥ [22]

### 4.2.2 శృంగార సంకీర్తనలు :

పెదతిరుమలయ్య తండ్రిలాగే అధ్యాత్మ సంకీర్తనలతో పాటు శృంగార సంకీర్తనలు రచించాడు. నాయికా నాయక ప్రణయం, దానికి సంబంధించిన వివిధాంశాలు ఈ కీర్తనల్లోనూ చోటుచేసుకున్నాయి. నాయకుడైన శ్రీ వేంకటేశ్వరుని దశావతారాలు సందర్భోచితంగా అక్కడక్కడా కనిపిస్తాయి. పది అవతారాలు చోటుచేసుకున్న కీర్తనలతో పాటు నాలుగవతారాలు, మూడవతారాలు, రెండవతారాలు చోటుచేసుకున్న కీర్తనలు కూడా వున్నాయి. ఇవి గాక ఒకే అవతారం చోటుచేసుకున్న కీర్తనలు లేకపోలేదు. వీటన్నిటిలోనూ స్వామి ఘనత, లీలలు కొనియాడబడ్డాయి.

#### 4.2.2.1 అనేకావతార సంకీర్తనలు :

పెదతిరుమలయ్య శృంగార సంకీర్తనల్లో కూడా పది అవతారాలు చోటుకల్పించిన కీర్తనలు రెండు కన్పిస్తాయి. నాల్గవతారాల కీర్తన ఒకటి, మూడవతారాల కీర్తనలు రెండు, రెండవతారాల కీర్తన ఒకటి కన్పిస్తాయి. వీటిని క్రమంగా పరిశీలించవచ్చు.

##### 4.2.2.1.1 నాయిక పరియాచకాలు :

శ్రీ వేంకటేశ్వరుడు నాయకుడు. అలమేలుమంగ నాయిక. నాయకుడు అనేక విద్యలు, అనేక మాయలు నేర్చినాడని, అతనితో వేగడం కష్టమని నాయిక ఆరోపణ.

ఇంతకు ఓపగలనా? అని నాయిక నాయకుణ్ణే ప్రశ్నించింది. మంతనాలు చాలుచాలని నిష్ఠూరంగా మాట్లాడింది. అతని విద్యలను ఏకరవుపెడుతూ స్వామి దశావతారాలను పరోక్షంగా ప్రస్తావించిది.

పుడిసెడు నీటమునగడం 'మత్స్యావతారాన్ని',
వీపు కనిపించకుండా ఓపిగ్గా నీటదాగడం 'కూర్మావతారాన్ని',
జోలిదవ్వి యెదలేని సూకరం అనడం 'వరాహావతారాన్ని',
పాలసుడై మానుపడడం 'నరసింహావతారాన్ని',
కొంకక వేలువెట్టి ఇమ్ముగొనడం 'వామనావతారాన్ని',
జంకించి సారెకు పగచాటడం 'పరశురామావతారాన్ని',
బెండ్లు ముంచి గుండ్లు తేల్చడం 'రామావతారాన్ని',
వంకలొత్తి స్త్రీని (కుబ్జ) వంచడం 'కృష్ణావతారాన్ని',
బుద్ధుల పరియాచకాల బూతులు వెలార్చడం 'బుద్ధావతారాన్ని',
ఱాతి గుఱ్ఱాలఁబరపడం 'కల్క్యవతారాన్ని' సూచిస్తున్నాయి.

నాయకుడైన స్వామి నాయికను ఉరము మీద మోచినట్టు చెప్పడం అలమేలుమంగను పరోక్షంగా ప్రస్తావించినట్టైంది. ఈ కీర్తనలో నాయికా నాయకుల (లేదా) అలమేలుమంగా వేంకటేశ్వరుల అన్యోన్యదాంపత్యాన్ని ఆవిష్కరించినట్టైంది.

॥కీర్తన॥ ఇంతకోపఁగలనా యిటు నీతోఁబొందుసేసి
మంతనాలు చాలుఁజాలు మాయలు నీ విద్య ॥పల్లవి॥

మూలఁబుడిసెడు నీట మునిఁగేది నీ విద్య
తాలిమి వీఁపు గానరా దాఁగేది నీవిద్య
జోలి దవ్వి యెదలేని సూకరాలు నీ విద్య
పాలసుఁడవై మానుపడేది నీవిద్య ॥ఇంత॥

కొంకక వేలు వెట్టిమ్ముగొనేది నీవిద్య
జంకెతో సారెకుఁబగ చాటేది నీవిద్య
తెంకిబెండ్లు ముంచి గుండ్లు దేలించేది నీవిద్య
వంకలొత్తి యాఁటదాని వంచేదే నీవిద్య ॥ఇంత॥

బుద్ధుల పరియాచకాల బూతులల్లా నీవిద్య
బద్ధుల ఱాతిగుఱ్ఱాలఁబరపేది నీవిద్య

అదివో శ్రీవేంకటేశ అన్నిటాను నన్నుఁగూడి
ముద్దుల నన్నురమున మోఁచేది నీవిద్య ॥ఇంత॥[23]

4.2.2.1.2 **పోటుబంట్ల పోడిమి :**

ఒక నాయిక నాయకుని ఘనతను గురించి, అలవిగాని అతని తీరుతెన్నుల గురించి పేర్కొంది. నాయకుని ప్రతి అవతారాన్ని తన భర్తగా భావించిన వైనం నాయిక మాటలలో వెల్లడౌతుంది. తన ఇంటిలో పదుగురూ బలవంతులు అని తెలపడం ద్వారా పది అవతారాలు మిక్కిలి సామర్థ్యం గలవే అని ధ్వనింప జేసినట్లైంది.

ఈ కీర్తనలో 'తప్పక చూచేటివారు' అనడం కళ్ళకు ప్రసిద్ధి వహించిన 'మీనావతారాన్ని'

'తలదీసుకొనేవారు' అనడం తలను చిప్పలోదాచుకునే 'కూర్మావతారాన్ని'

'తిప్పిటి మూతులవారు' అనడం 'వరాహావతారాన్ని'

'దేహము దాఁచేటివారు' అనడం స్తంభంలోనే దేహాన్ని ధరించి వెలువడిన 'నరసింహావతారాన్ని',

'చేతులు చాఁచేటివారు' అనడం బలిని యాచించబోయిన 'వామనావతారాన్ని'

'చెప్పితే నలిగేవారు' అనడం కోపాన్ని ప్రదర్శించిన 'పరశురామావతారాన్ని'

'జాతిరాజనాలవారు' అనడం చక్కగా రాజరికాన్ని నెరపిన 'రామావతారాన్ని'

'సతుల వెదకేవారు' అనడం గోపికలను వెతుక్కుంటూ వెళ్ళిన 'కృష్ణావతారాన్ని'

'సిగ్గువిడిచినవారు' అనడం సిగ్గువిడిచి త్రిపుర స్త్రీలతో క్రీడించిన 'బుద్ధావతారాన్ని'

'చెంగి సకళించేవారు' అనడం సకిలించే గుఱ్ఱం వాహనంగా గల 'కల్క్యవతారాన్ని' సూచిస్తున్నాయి.

ఈ కీర్తన నాయికా నాయక భావాన్ని ఊహించుకోదగి వుంది. కానీ పేర్కోదగిన శృంగార స్పర్శ దీనిలో గోచరించడం లేదు.

॥కీర్తన॥ పదుగురు నింటిలోన బలవంతులే
యెదురు మాటాడరాదు యేమి సేయవచ్చును. ॥పల్లవి॥

తప్పక చూచేటివారు తలదీసుకొనేవారు
యెప్పుడు నావొద్దివారు యిందరిందరే
తిప్పిటిమూతులవారు దేహము దాఁచేటివారు
చెప్పఁబోతే పసలేదు చెల్లఁబో సంసారమా ॥పదుగురు॥

చేతులు చాఁచేటివారు చెప్పితే నలిగేవారు
పోతరించి మావారు పోటుబంట్లే
జాతిరాజనాలవారు సంతుల వెదకేవారు
జితమింతా రొక్కమాయ సేయవో సంసారమా ॥పదుగురు॥

సిగ్గు విడిచినవారు చెంగి సకళించేవారు
దగ్గరి వారికి వారు తమంతవారే
అగ్గమై శ్రీవేంకటేశుఁడంతా విచారించుకొని
తగ్గుమొగ్గు లెల్లాఁబాపి తగునే సంసారమా ॥పదుగురు॥[24]

### 4.2.2.1.3 నాయకుని అలంకరణా వైభవం :

నాయిక నాయకుని అలంకార ప్రాభవాన్ని నానా విధాలుగా కొనియాడింది. నాయకుడు శృంగార రసాధిదేవత. కాబట్టి చెలులే అతనికి స్నాన అలంకరణాదులను నిర్వహించడం పరిపాటి. స్వామికి పన్నీటితో జలకాలార్చడం, కప్పురపు ధూళిని శరీరమంతా రాయడం, తట్టుపునుగు రాయడం, పొడిబట్టతో తడిఒళ్ళు తుడవడం, ఆభరణాలు ధరింపజేయడం నాయకుని సతులే నిర్వహించేవారు. నాయకుని దక్షిణ నాయకత్వం ఇక్కడ ప్రస్ఫుటమవుతుంది. ఈ నాయకుడు శ్రీవేంకటేశ్వరుడు.

అలంకరణాదులను తెలిపేటప్పుడు స్వామి అవతారాలను పెదతిరుమలయ్య ఈ కీర్తనలో ప్రస్తావించాడు. విష్ణుదేవుని దశావతారాల్లో ఎనిమిదో అవతారంగా కృష్ణావతారాన్ని గానీ, బలరామావతారాన్ని గానీ పేర్కోవడం పరిపాటి. అయితే ఈ కీర్తనలో బలరామ, కృష్ణావతారాలు' రెండూ పేర్కోబడ్డాయి. ఇది విశేషించి గమనించదగ్గ అంశం. కృష్ణ, బలరామ అవతారాలను వేరువేరుగా పరిగణిస్తే నాలుగు అవతారాలు, ఒకటిగా పరిగణిస్తే మూడు అవతారాలు ఈ కీర్తనలో చోటుచేసుకున్నట్లు అవుతుంది.

కర్పూరపు ధూళి పూసినప్పుడు శరీరము తెల్లగా కనిపిస్తుంది. అప్పుడు అతడు అంగనామణులకు 'బలరాముడు'గా కనిపిస్తాడు.

తట్టుపునుగు అలదినపుడు నలుపును పులిమినట్లు అవుతుంది. అది 'కృష్ణుణ్ణి' తోపిస్తుంది.

స్నానానంతరం నాయకుడు వివస్త్రుడై వుండగా చెలులతనికి తడిఒత్తేవారు. అప్పుడతడు నగ్నంగా నాతులతో క్రీడించిన 'బుద్ధుడు'గా గోచరిస్తాడు.

నాయకుడు పొడవుగా నిలబడి ఆభరణాలుధరిస్తున్నప్పుడు 'వామనావ తారం'లో విజృంభించిన త్రివిక్రమాకారంగా స్ఫురిస్తాడు. స్వామి ప్రతిదశ ఒక అవతారాన్ని స్ఫురింపజేయడం ఈ కీర్తనలోని ప్రత్యేకత. ఈ పాటలో శృంగారా వస్థలు గానీ, తదితర శృంగార అంశాలు గానీ కనిపించడం లేదు.

॥కీర్తన॥ ఎట్టు వలసినా వచ్చు నింతులమాట
నెట్టుకొన్న వారివారి నేరుపులింతే ॥పల్లవి॥

కప్పురపు ధూళి మేనఁగలయ నలఁదినప్పు
డప్పుడే పో బలభద్రుఁడని యందురు
కుప్పలైన తట్టుపుణుఁగునఁ దొప్పఁదోఁగీ నంటా
తప్పటి చెలులే క్రిష్ణుఁడని యందురు ॥ఎట్టు॥

నీలవర్ణుఁడీతఁడు పన్నీరు జలకమాడె
యాలో సాలగ్రామరూప మనియందురు

తాలిమి నిర్వాణాన తడిసూళ్లొత్తు వేళ
పోలిచి నీ సతులెల్లా బుద్ధుఁడందురు ॥ఎట్టు॥

మించిన సొమ్ములతోన మిన్నుముట్టినవేళ
లంచలఁద్రివిక్రముఁడని యందురు
కొంచక యలమేలుమంగ కోరి మెడఁగట్టుకొంటే
యెంచి శ్రీవేంకటపతి యితఁడందురు ॥ఎట్టు॥[25]

**4.2.2.1.4 నాయిక విచికిత్స :**

నాయిక నాయక వియోగాన్ని సహించలేకపోయింది. విరహంతో వేగి పోయింది. తన నాయకుణ్ణి వెంటబెట్టుకురమ్మని చెలికత్తెలను ప్రాథేయపడింది. నాయకుడు ఎక్కడున్నాడో అని విచారించింది.

ప్రహ్లాదుని కోసం స్తంభంలో ఉన్నాడో, ఆవులను కాచేందుకు, గోపికాస్త్రీల చీరలను అపహరించేందుకు, గోపకులతో క్రీడలు సాగించేందుకు రేపల్లెలో వున్నాడో, సీతను పెండ్లాడేందుకు వెళ్ళాడో అని పరిపరి విధాలా పరితపించింది. ఇక్కడ "నరసింహ, కృష్ణ, రామావతారాలు" ధ్వనిస్తాయి. స్వామి తనకోసం వేంకటాద్రికి వచ్చినట్టు, పునస్సమాగమం సంభవించినట్టు ప్రకటించి నాయిక తమ దాంపత్య మాధుర్యాన్ని ఆవిష్కరించింది.

॥కీర్తన॥ చేరి తాఁజెప్పినట్టెల్లా జేసేఁగాని
పేరు కుచ్చి మాయింటికిఁ బిలువకే యాతని ॥పల్లవి॥

యెవ్వరింటఁ జూచినాను యేరూపై ఉన్నాఁడో
యివ్వలఁగమలాసతియింట నున్నాఁడో
మవ్వపు పాలజలధిమామయింట నున్నవాఁడో
రవ్వగా వెదకి తేరే రమ్మని మాయింటికి ॥చేరి॥

గక్కన ప్రహ్లాదుకుఁగా కంబములో నున్నవాఁడో
పుక్కట కావులఁ గావఁబోయి వున్నాఁడో
చిక్కించుక గోపికల చీర లంటఁ బోయినాఁడో
దిక్కుల వెదకి తోడితేరే మా యింటికి ॥చే ॥

అల్లదే రేపల్లెలోన నాడఁబోయి వున్నాఁడో
యిల్లిదె సీతఁబెండ్లాడ నేగినాఁడో
వొల్లనే శ్రీవేంకటాద్రి నుండేటి దైవము నేఁడు
వుల్లసాన విచ్చేసెనే వున్నతి మా యింటికి ॥చేరి॥[26]

**4.2.2.1.5 నాయికా సౌందర్య ప్రస్తావన :**

నాయకుడు నాయికపట్ల ఉపేక్ష వహించాడు. అది ఆమె చెలికత్తెకు సహింపరానిదయ్యింది. మెలత మేలిమిని నాయకుని దృష్టికి తీసుకువచ్చింది. నాయకుడు ప్రదర్శించిన అవతార లీలలు కూడా ఆమె ముందు దిగదుడుపేనంది. ఆ నాయకుడు శ్రీవేంకటేశ్వరుడు. నాయిక అలమేలుమంగ.

ఈ కీర్తనలో విష్ణుదేవుని మూడు అవతారాలు చోటుచేసుకున్నాయి. అవి దశావతార క్రమంలో లేవు. మొదట కూర్మావతారం, తర్వాత వామనావతారం, ఆపైన మత్స్యావతారం స్థానం వహించాయి.

విష్ణువు 'కూర్మావతారం' ధరించి పొంగే పాలసముద్రాన్ని సురాసురుల చేత చిలికించి అమృతం పుట్టించాడు. ఆయన అంతకష్టపడవలసిన అవసరం లేదు. ఆస్వాదించేందుకు అతివ అధరంలోనే అమృతం వుంది.

'వామనావతారం' ధరించి ఆకాశాన్ని ఒక అడుగుగా ఇమ్మని బలిని యాచించాడు. అది వ్యర్థయాచనే. అంగన నడుములోనే ఆకాశం ఉంది. ఉత్తమ జాతి స్త్రీ నడుము కనిపించీ కనిపించకుండా వుంటుందనే కవి సమయాన్ని పెదతిరుమలయ్య ఇక్కడ ప్రస్తావించినట్లైంది.

సోమకాసురుణ్ణి పరిమార్చి వేదాలను పరిరక్షించేందుకు మహావిష్ణువు 'మత్స్యావతారం' ధరించాడు. కలికి కన్నులు గండుమీలుగా కనిపిస్తున్నప్పుడు ఆయన మళ్ళీ మత్స్యావతారం ధరించడం వృథాప్రయాసే గదా!

నాయిక చెలికత్తె నాయిక అనుభవయోగ్యమైన సౌందర్యాన్ని కొనియాడడంతో పాటు నాయకుడైన విష్ణువు ధరించిన దశావతారాల్లో మత్స్య, కూర్మ, వామనావతార వైశిష్ట్యాన్ని కూడా చమత్కారంగా ఇక్కడ ప్రస్తావించింది.

॥కీర్తన॥ ఎంచి చూడవైతిగాక యింతి నీకిన్నియుఁగాదా
మంచిదాయ యిఁకనైనా మఱవకువయ్యా ॥పల్లవి॥

పొంగేటి జలధి దచ్చి పుట్టించితి వమృతము
అంగనమోవినే కాదా అమృతము
చెంగిపోయి వైకుంఠాన శేషునిపైఁబండితివి
చెంగఁట నీచెలి యారు శేషుఁడే కాఁడా ॥ఎంచి॥

ఆకాసాన మొకడుగు అడిగితివి బలిని
ఆకసము చెలినడుమందునే కాదా
మేకొని వేదాలకుఁగా మీనవై పొడమితివి
కైకొని సతికన్నులే గండుమీలు గావా ॥ఎంచి॥

కోరి శ్రీ వేంకటమనే కొండ యెక్కితివి నీవు
కూరిమి చెలికుచాలు కొండలే కావా
చేరి సర్వజీవుల చిత్తములో నిలిచితి
తేరి యాకె నీవురానఁ దిరమాయఁ గాదా ॥ఎంచి॥[27]

### 4.2.2.1.6 నాయికా నాయక సంవాదం :

శృంగారాత్మకంగా సాగిన అన్నమయ్య సంవాద కీర్తనలను తలపించే విధంగా పెదతిరుమలయ్య కూడా అనేక సంవాద కీర్తనలు రచించాడు. అవి నాయికా నాయకులు మాట్లాడుకునే విధంగా రూపుదిద్దుకున్న యుగళగీతాలు. నాయిక అలమేలుమంగ, నాయకుడు శ్రీవేంకటేశ్వరుడు పరియాచకాలు ఆడుకునే విధంగా ఒక కీర్తన రచించబడింది. నాయకుని ప్రశ్నకు నాయిక సమాధానం చెబుతున్నట్టు ఈగేయం రూపొందింది.

నాయిక సమాధానాల్లో విష్ణుదేవుని వరాహ, కృష్ణావతారాలు ద్యోతక మవుతాయి.

నేను నవ్వగా సముచితంగా స్పందించక నీవుకూడా ఎందుకు నవ్వుతావు? అని నాయకుడు నాయికను ప్రశ్నించాడు. 'హిరణ్యాక్షుడితో నవ్వమని' ఆమె అతణ్ణి దెప్పిపొడిచింది. ఇక్కడ 'వరాహావతారం' గోచరిస్తుంది.

నేను చూసినప్పుడు నన్ను చూడవేమని నాయకుని ప్రశ్న? కొలనిలో స్నానం చేసే గొల్లెతలను చూడమని సమాధానం. నమస్కరిస్తే ఎందుకు దీవించవని ప్రశ్న? శిశుపాలుడి తిట్లే దీవెనలని వెటకారపు సమాధానం. ఈ రెండు అంశాలు 'కృష్ణావతారాన్ని' వెల్లడిస్తాయి.

శృంగారపరమైన పరియాచకాలలో కూడా స్వామి అవతారాలను పేర్కోవడం అతని పూర్వ వైభవాన్ని గుర్తుచేసినట్టే అవుతుంది.

॥కీర్తన॥ ఎందు కెందు బోలిచే విదియేటిదే
కందు వొక్క మేతకేరా కడివెఁడుగూటికి ॥పల్లవి॥

యేకిటి నే నవ్వినను యేల నవ్వేవే అల్ల
నాటి హిరణ్యాక్షుతో నవ్వరా పోయి
మాటాడిన నాతోడ మాటాడ వేమే నీ
మాటల సురతులు మరిగిరి చాలదా ॥ఎందు॥

యేపున నేఁజూచినా నీవేల చూడవే కొలనిలో
చూపట్టు గొల్లెతలనే చూడరాపోయి
తేపల నే మొక్కినా దీవించ వేమే వారినీ
తీపు శిశుపాలు తిట్లే దీవెనలు గావా ॥ఎందు॥

అలమేల్మంగవు నీ వేదుగదే వోరి నీవు
బలిమి శ్రీ వేంకటపతివి గావా
కొలఁది మిగుల నన్నుఁగూడితిగదె నాపై
కులుకుమన్నన లిట్టే కూటములు గావా ॥ఎందు॥[28]

### 4.2.2.2 ఏకావతార సంకీర్తనలు :

పెదతిరుమలయ్య శృంగార సంకీర్తనల్లో దశావతారాలలోని అవతారాలను విడివిడిగా కొనియాడడం కూడా కనిపిస్తుంది. తక్కిన అవతారాలకు ఇక్కడ స్థానం లేకపోగా రామ, కృష్ణావతారాలు మాత్రమే ఇక్కడ చోటుచేసుకున్నాయి.

#### 4.2.2.2.1 నాయిక ఆవేదన :

తాళ్ళపాక వారి శృంగార సంకీర్తనల్లో ప్రధానంగా గోపికా - కృష్ణులు, అలమేలుమంగా - వేంకటేశ్వరులు నాయికా నాయకులుగా కనిపిస్తారు. సీతారాములు నాయికా నాయకులుగా రూపొందిన కీర్తనలు దాదాపు లేవనే చెప్పాలి. ఉన్నా అవి చాలా అరుదుగానే కనిపిస్తాయి. శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు. కేవల ధర్మ విగ్రహుడు. అందువల్ల శృంగార ప్రభావం అతని మీద అంతగా కనిపించలేదేమో? పతివ్రతాతిలకంగా పావన జీవనం సాగించిన సీతాదేవి కూడా శృంగారానికి ప్రాధాన్యమిచ్చినట్టు తోచదు. అందువల్ల రాముడికి సంబంధించిన శృంగార సంకీర్తనలు విరివిగా రచింపబడలేదేమో?

తాళ్ళపాక పెదతిరుమలయ్య శ్రీరామ వియోగాన్ని సహింప లేని సీతాదేవి ఆవేదనకు అద్దంపట్టే ఒక కీర్తన రచించాడు. ఈ కీర్తనలో సీతాదేవికి రామవియోగం వల్ల కలిగిన విరహం కాక బాధ, ఆవేదన వ్యక్తమవుతున్నాయి. భర్తృవియోగ పరితప్తగా మాత్రమే సీతాదేవి ఈ కీర్తనలో కనిపిస్తుంది. సీతాదేవి లంకలో తన దగ్గరకు వచ్చిన హనుమంతుడితో తన ఆవేదన వెళ్ళబోసుకునే విధంగా ఈ కీర్తన రూపుదిద్దుకుంది.

తాను మాయలేడిని ఎందుకు కోరానో అని సీతాదేవి వాపోయింది. రాముడు వచ్చి రావణుణ్ణి ఎప్పుడు వధిస్తాడో? ఇదంతా జరిగేపనేనా? అని ఆశ్చర్యం వెలిబుచ్చింది. రాముడు ఎలాఉన్నాడో, తనను ఏవిధంగా తలుస్తాడో చెప్పమని కోరింది. తనను ఎడబాసినప్పటి నుంచి రాముడికి పొద్దెలాపోతూవుందో తెలియజేయమంది. రాముని ఎడబాటువల్ల తానెన్నో ఇబ్బందులు పడినట్టు వాపోయింది. ఇదంతా దైవమాయే అని సమర్థించుకుంది. ఊరట చెందింది. ఉంగరం పంపడం వల్ల స్వామికి తనపట్ల దయవున్నట్టు ధ్రువీకరించుకుని ఊరటచెందింది. పిదప పగతుని పరిమార్చి, తనను స్వీకరించి రాముడు అయోధ్యను పాలించినట్టు కీర్తనాంతంలో తెలియజేసింది. సీతారాముల అన్యోన్యదాంపత్యం ఈ కీర్తనలో వెల్లడౌతుంది. భగవద్వియోగం ఎంత దుస్సహమో, దైవంగానీ, అతని కృపగానీ దూరమైనప్పుడు ఎంత ఘోరాపదలు ఏర్పడతాయో ఈ కీర్తన విడమరచి తెలియజేస్తుంది.

॥కీర్తన॥ ఎక్కడి మాయామృగ మేల తెమ్మంటి నేను
అక్కడ నా వల్లనే యపరాధ మనుమీ ॥పల్లవి॥

రాముఁడెన్నఁడిందు వచ్చు రావణు నెన్నఁడు చంపు
నీ మాట హనుమంత నిజమా యిది
యేమని నన్నుఁ దలఁచు యెట్ల నున్నాఁడుతాను
ఆమాటే యింకొక్కపరి అడిగేఁజెప్పుమా ॥ఎక్కడి॥

యెటువలెఁ బొద్దు వేగు నినకులేశ్వరునకు
నీటున నన్నుఁబాసిననాట నుండి
కటకట తన్నుఁబాసి కంటి నే నిన్నియును
యిటువలె దైవమాయ యింత నన్నుఁజేసెఁగా ॥ఎక్కడి॥

వుంగరము పుత్తెంచెను వున్నదిగా కృప నాపై
కంగిన పగెల్లా నీఁగి కైకొనె నన్ను
కంగుగ శ్రీవేంకటాద్రి రఘుపతి నన్నుఁగూడె
యింగితాన నయోధ్య యేలెఁగా యిప్పుడు ॥ఎక్కడి॥[29]

**4.2.2.2.2 శ్రీకృష్ణుని ఆగడాలు :**

విష్ణుదేవుని తక్కిన అవతారాల కంటే కృష్ణావతారమే వేంకటేశ్వర తత్వానికి దగ్గరగా కొనియాడతారు. కొందరు కృష్ణుడికి, వేంకటేశ్వరుడికి అభేదం పాటిస్తారు. కృష్ణావతారంలోని యశోదే శ్రీనివాసునికి ఆశ్రయమిచ్చిన వకుళా దేవి అని కూడా భావింపబడుతూ ఉంది. గోపికాకృష్ణుల శృంగార లీలలను అలమేలుమంగా వేంకటేశ్వరులకు కూడా ఆపాదిస్తారు. ఈ నేపథ్యంలో తాళ్ళపాక వాఙ్మయంలో కృష్ణ సంకీర్తనలు, అందునా శృంగార సంకీర్తనలు అధిక సంఖ్యలో కనిపిస్తాయి. శ్రీకృష్ణుని శృంగార లీలలను తెలియజేసే అన్నమయ్య కీర్తనలు వేలసంఖ్యలో వున్నాయి. పెదతిరుమలయ్య కూడా శ్రీకృష్ణుడికి సంబంధించిన శృంగార సంకీర్తనలను ఎక్కువగానే రచించాడు. వాటిలో మచ్చుకు ఒక కీర్తనను ఇక్కడ పరిశీలించడం సముచితం.

తనను మాటిమాటికి అంటవచ్చిన కృష్ణుణ్ణి ఒక నాయిక అధిక్షేపించింది. పదేపదే తనను తాకడం కంటే బండిని తన్నడం బాగుంటుందంది. ఇక్కడ 'కృష్ణావతారం'లో చోటుచేసుకున్న శకటాసురభంజనం స్ఫురిస్తుంది. పొద్దుపోకపోతే తమతో పరియాచకాలాడడం మాని దొడ్డి దగ్గరకు వెళ్ళమంది. ఇక్కడ కృష్ణుడి గోపాలన వెల్లడౌతుంది. వెన్నతిన్న వెక్కసం కలిగినట్లయితే కొండలు పైకెత్తి క్రీడించమంది. ఇక్కడ గోవర్ధనోద్ధరణ బోధపడుతుంది.

చేతులు ఊరుకోకపోతే నఖక్షతాలతో తమకు ఇబ్బంది కలిగించకుండా గోపికల చీరలను దొంగిలించమంది. ఇక్కడ గోపికావస్త్రాపహరణాన్ని ఈ విధంగా గుర్తుచేసినట్లయ్యింది. చేయరాని పనులు చెల్లుబడి అయ్యేటట్లయితే తొలకరి యవ్వనంలో వున్న గొల్లతొయ్యలులను పట్టుకొమ్మంది. ఇక్కడ శ్రీకృష్ణుని రాసలీలలు ధ్వనిస్తాయి. తనివితీరనట్లయితే తనతో సంగమించి చెమటలు తెచ్చుకోకుండా మడుగులో ప్రవేశించమంది. కాళీయ మడుగు వృత్తాంతం ఇక్కడ తెలియవస్తుంది.

॥కీర్తన॥ మమ్ము నేల చెనకేవు మాటి మాటికి
కమ్మర నిట్టే బండి కాలఁదన్నవయ్యా ॥పల్లవి॥

పొద్దు వోకుండితే దొడ్డిపొంత కయినాఁబోవయ్యా
వొద్ద నుండి మమ్ము నొకటొకటాడక
వుద్దండాన వెన్నదిన్నవుబ్బు నీకు గలిగితే
కొద్దిమాలి నీవు పెద్దకొండ లెత్తవయ్యా ॥మమ్ము॥

చేయూరకుండ వుండితే చీరలు దొంగిలవయా
యీ యెడమాపై గోళ్ళల చిమ్మేవు
సేయరానిపనులకు చెల్లుబడి గలిగితే
పాయపు గొల్లెతలనే పట్టుకొనవయ్యా ॥మమ్ము॥

మనసు దనియ దంటే మడుగులు చొరవయ్యా
పెనఁగీనా చెమటలే ప్రియ మనక
యెనసితివి శ్రీవేంకటేశ్వరుఁడ నారతి
అనువై నీకొక్క మనసాయఁగదవయ్యా ॥మమ్ము॥[30]

అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించినట్టు ప్రతీతి. వాటిలో చాలామటుకు పోయినప్పటికీ ఉన్నవి కూడా అధిక సంఖ్యలోనే వున్నాయి. 12 వేల కీర్తనలు వుండవచ్చని విజ్ఞుల విశ్వాసం. కాబట్టి అన్నమయ్య కీర్తనల్లో దశావతార కీర్తనలు కూడా అధిక సంఖ్యలోనే కనిపిస్తాయి. పెదతిరుమలయ్య సంకీర్తనలు 1007. వీటిని తిరుమల తిరుపతి దేవస్థానం వారు రెండు సంపుటాలుగా ప్రకటించారు. పరిమిత సంఖ్యలోనే వున్న పెదతిరుమలయ్య కీర్తనల్లో దశావతార కీర్తనలు చాలా తక్కువ సంఖ్యలోనే వున్నాయి. పది అవతారాలు వున్న కీర్తనలు పదికూడా లేవు. ఏకావతార కీర్తనలు కూడా ఎక్కువ సంఖ్యలో లేకపోవడం గమనార్హం. వాటిలో ఒకటి కులవాచక ప్రయోగంతోనూ, మరొకటి సిద్ధసంబోధన ప్రయోగంతోనూ కనిపిస్తుంది. దశావతారాలకు సంబంధించిన శృంగార సంకీర్తనల్లో కూడా శృంగారం పాలు ఎక్కువగా లేదనే చెప్పాలి. ఒక్కమాటలో చెప్పాలంటే అన్నమయ్య దశావతార సంకీర్తనల కంటే పెదతిరుమలయ్య దశావతార సంకీర్తనలు రాశిలోనే గాక, వాశిలో కూడా తక్కువగానే వున్నట్టు తోస్తుంది.

# పాద సూచికలు

1) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:160

2) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:168

3) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17 కీర్తన:431

4) వేదవ్యాసుడు-శ్రీమద్భగవద్గీత, దశమోధ్యాయము (10), శ్లోకం:26

5) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17, కీర్తన:432

6) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుట-15, కీర్తన:17

7) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుట-15,కీర్తన:6

8) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:218

9) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:208

10) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన: 269

11) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:26

12) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:25

13) వేదవ్యాసుడు-శ్రీమద్భగవద్గీత, నవమాధ్యాయము (9), శ్లోకం:29

14) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు,సంపుటం-15, కీర్తన:19

15) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:1

16) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన :132

17) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం -15, కీర్తన : 244

18) మొల్ల - మొల్లరామయణం, సుందరకాండ, పద్యం-64

19) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:140

20) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:23

21) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:18

22) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-15, కీర్తన:191

23) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17, కీర్తన:273

24) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17, కీర్తన:323

25) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17, కీర్తన:486

26) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17, కీర్తన:308

27) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17, కీర్తన:469

28) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17, కీర్తన:474

29) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17, కీర్తన:322

30) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం-17, కీర్తన:84

# 5. చినతిరుమలయ్య దశావతార సంకీర్తనలు

**5.0** తాళ్ళపాక అన్నమాచార్యుని వంశంలో మూడవతరానికి చెందినవాడు తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు. ఆ వంశానికి చెందిన చివరి వాగ్గేయకారుడు కూడా ఈయనే. తాత తండ్రులలాగే సంకీర్తనలను రచించడంతో పాటు అష్టభాషాదండకాన్ని రచించి తన బహుభాషా వైదుష్యాన్ని ప్రకటించుకున్న మహామనీషి ఈయన. అన్నమయ్య రచించిన సంస్కృత సంకీర్తనాలక్షణానికి పెదతిరుమలయ్య సంస్కృతంలోనే వ్యాఖ్యానం రాయగా చినతిరుమలయ్య ఆ సంకీర్తనాలక్షణాన్ని తెలుగులో రచించి తెలుగు పదసాహిత్యలోకానికి ఎనలేని సేవ చేశాడు. శ్రీనివాసమంగాపురంలోనూ, తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలోనూ, మంగళగిరిలోనూ పలుకైంకర్యాలు చేసి తన విష్ణుభక్తిని వెల్లడించుకున్నాడు. తెలుగులో శాసనాలు వేయించి చరిత్రరచనకు దోహదం చేశాడు.

పెదతిరుమలయ్య, అతని భార్య తిరుమలమ్మకు జన్మించిన జ్యేష్ఠ కుమారుడు చినతిరుమలయ్య. ఈయనకు తాళ్ళపాక అన్నమాచార్యుడే బ్రహ్మోపదేశం చేసినట్టు ఆయన కీర్తనను బట్టి తెలుస్తుంది. పదహారవ ఏటనే సంకీర్తనా రచనకు ఉపక్రమించినట్టు కూడా ఆతని కీర్తనను ఆధారంగా చేసుకుని కీర్తిశేషులు ఉదయగిరి శ్రీనివాసాచార్యులు గారు తెలియజేశారు. చిన తిరుమలాచార్యుడు తాళ్ళపాక వాగ్గేయకారులు ముగ్గురిలోనూ చాలా తక్కువ సంఖ్యలోనే కీర్తనలు రచించాడు. వాటిని కూడా అధ్యాత్మ సంకీర్తనలని, శృంగార సంకీర్తనలని వర్గీకరించుకోవచ్చు. అధ్యాత్మ సంకీర్తనలు 60, శృంగార సంకీర్తనలు 119 ఒకే సంపుటంగా ప్రకటించి తిరుమల తిరుపతి దేవస్థానం వారు వెలువరించారు. వాటిలో దశావతార సంకీర్తనలు చాలా తక్కువసంఖ్యలోనే వున్నాయి. వాటిలో దశావతారాలు వ్యక్తమయ్యే తీరును ఈ అధ్యాయం పరిచయం చేస్తుంది.

## 5.1 సంస్కృత సంకీర్తనలు :

సంస్కృతాది అష్టభాషల్లో దండకాన్ని రచించిన చినతిరుమలయ్య మీద తండ్రి తాతల సంస్కృత కీర్తనల ప్రభావం కూడా పడివుండవచ్చు. అందువల్లనో ఏమో సంస్కృత వైదుష్యాన్ని ఆవిష్కరించే సంస్కృత కీర్తనలను కూడా ఈయన రచించాడు. మృదు మధుర శబ్దాలతో, అంత్యానుప్రాసలతో ఇవి శ్రుతి సుభగంగా అలరారుతున్నాయి. దశావతారాలను ఆవిష్కరించే సంస్కృత కీర్తనలేవీ చిన తిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనలలో కనిపించడం లేదు. ఒక కీర్తనలో మాత్రం రామావతారానికి సంబంధించిన పదప్రయోగాలు కొన్ని గోచరిస్తున్నాయి.

స్వామి మహనీయతను, ఘనతను తెలియజేసే విధంగా ఈకీర్తన అంతా సంస్కృత సంబోధనలతోనే చోటుచేసుకున్నది. వాటిలో రామావతారానికి సంబంధించిన సంబోధనలు కూడావున్నాయి.

'జానకీప్రియకారకా'! అనడం జానకీ దేవికి మిక్కిలి ప్రియాన్ని కలిగించిన రాముని సుగుణాన్ని సూచిస్తూవుంది.

'శివసాధితాఖిల తారకా'! అనడం శివుడు అనుష్ఠించడమేగాక ఇతరులకు సైతం బోధించే తారకమంత్రాన్ని, రామావతార తత్త్వాన్ని తెలియజేస్తూవుంది

'మానుషాహితమారకా'! అనడంమానవులకు కీడు తలపెట్టిన రాక్షసులను అంతంచేసిన రాముని పరోపకార గుణాన్ని ప్రస్ఫుటం చేస్తుంది.

'సంచితరఘుకుల దీపకా'! అనడం రాముడు రఘుకులం యావత్తుకూ దీపప్రాయంగా తేజరిల్లడాన్ని తెలియజేస్తుంది.

'అభంగమంజుల చాపకా'! అనడం శివధనుర్భంగం చేసిన రాముని లీలను స్ఫురింపజేస్తుంది.

ఇంతకు మించి రామావతారానికి సంబంధించిన విశేషాలేవీ ఈ కీర్తనలో కనిపించడంలేదు.

॥కీర్తన॥ శ్రీపతి పురనాయకా జయచింతితాభీష్ట దాయకా ॥పల్లవి॥

వున్నతోన్నత విగ్రహా దాసోపరిస్థానుగ్రహా
సన్నుతామర సుగ్రహా సామవదపరిగ్రహా ॥శ్రీపతి॥

జానకీ ప్రియకారకా శివసాధితాఖిల తారకా
మానుషాహిత మారకా మామకాఘ నివారకా ॥శ్రీపతి॥

శ్రీవెంకటనాథ రూపకా సంచిత రఘుకుల దీపకా
భావసంతోష ప్రాపకా అభంగమంజుల చాపకా ॥శ్రీపతి॥[1]

## 5.2 తెలుగు సంకీర్తనలు :

తేట తెలుగు మాటలతో చెవులకు ఇంపుగొలిపే విధంగా 'సంకీర్తనా లక్షణాన్ని' తెలుగులో రచించిన చినతిరుమలయ్య భక్తుల హృదయాలను వెలిగించే తెలుగు పదాలను పరిమిత సంఖ్యలోనే రాయడం గమనార్హం. ఈ వాగ్గేయకారుడు దైవకైంకర్యాల విషయంలోనూ, క్షేత్రపర్యటనలోనూ విశేష శ్రద్ధ చూపడం ఇందుకు కారణం కావచ్చు.

### 5.2.1 అధ్యాత్మ సంకీర్తనలు :

చినతిరుమలయ్య తెలుగులో రచించిన సంకీర్తనలే తక్కువ. వాటిలోనూ అధ్యాత్మ సంకీర్తనలు మరీతక్కువ. ఈయన రచించిన అధ్యాత్మ సంకీర్తనల్లో మేల్కొలుపు, మానసిక ప్రబోధం, వైరాగ్య ప్రబోధం, సమకాలీనాంశ చిత్రణ, భక్తితత్త్వం, విష్ణుస్తుతి, విష్ణుఘనత, దశావతార ప్రస్తావన, నీతిప్రబోధం మొదలైన అనేకాంశాలు కనిపిస్తాయి. చినతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో అనేకావతార ప్రస్తావనాకీర్తనలు, ఏకావతార ప్రస్తావనా కీర్తనలు చోటుచేసుకున్నాయి.

#### 5.2.1.1 అనేకావతార సంకీర్తనలు :

చినతిరుమలయ్య రచించిన అధ్యాత్మ సంకీర్తనలు 60లోనూ దశావతారా లన్నిటినీ తెలియజేసే ఒక సంకీర్తన కూడా కనిపించడం లేదు. అనేకావతారాలను తెలియజేసేవి కూడా అనేకం గోచరించవు. మూడు అవతారాలను తెలియజేసే సంకీర్తన ఒకటి కనిపిస్తుంది.

##### 5.2.1.1.1 కర్మ తిరస్కరణ :

పూర్వజన్మ కర్మను బట్టే పునర్జన్మ వస్తుందని సనాతన ధర్మావలంబకుల విశ్వాసం. ఒక వ్యక్తి సంస్కారంగానీ, గుణాలుగానీ, సుఖదుఃఖాలు గానీ,

బంధమోక్షాలు గానీ పూర్వజన్మ వాసనలచేతనే నిర్ణయింపబడతాయని పెద్దలు చెబుతారు.

ఎలాంటి కర్మ కట్టిగుడిపినా దైవ భక్తి వుంటే అదిఏమీ చేయజాలదని భక్తుల విశ్వాసం. గ్రహవార నక్షత్రాలు గానీ, కర్మలుగానీ శివోపాసకుణ్ణి ఏమీ చేయజాలవని 'తిరుజ్ఞాన్‌సంబంధర్' తెలియజేశాడు. సుబ్రహ్మణ్యస్వామి కర్మలను, బ్రహ్మరాతను పూర్తిగా తుడిచివేస్తాడని 'అరుణగిరినాథర్' అభిప్రాయం. ఈ మహనీయుల లాగే చినతిరుమలయ్య కూడా వేంకటేశ్వర భక్తులను కర్మమేమీ చేయజాలదని సుస్పష్టం చేశాడు. కర్మలు చేసిన పూర్వులను గురించి ప్రస్తావిస్తూ వారిని విష్ణుదేవుడు ఆదుకొని అలరించాడని ధ్వనింపజేశాడు. కాబట్టి స్వామిని సేవించి కాలం నుంచి, కర్మంనుంచి విముక్తులు కావలసిందిగా విజ్ఞప్తిచేశాడు. ఈ సందర్భంలోనే భక్తులపేర్లను ప్రస్తావించడం ద్వారా ఆయా అవతారాలను ధ్వనింపజేశాడు.

కుబేర సేవకుడైన ఘంటాకర్ణుడు పిశాచరూపంలో సంచరిస్తూ మానవ భక్షకుడై ఎన్నోపాపాలు చేశాడు. కృష్ణుడు తన దర్శనభాగ్యంతో అతని పాపాలన్నిటినీ అంతంచేసి దివిజపదాన్నే గాక దివిజేంద్రపదాన్ని కూడా అనుగ్రహించాడు. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ చినతిరుమలయ్య ఘంటాకర్ణుని పాపం అతన్ని ఏమి చేయగలిగింది? అని ప్రశ్నించాడు. ఇక్కడ 'కృష్ణావతారం' స్ఫురిస్తుంది.

ప్రహ్లాదుడు హిరణ్యకశిపుని కుమారుడు. విష్ణుభక్తుడు. విష్ణుభక్తిని విడనాడుమని ఎంతచెప్పినా వినకపోవడంతో హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని మీద పగబట్టాడు. అతన్ని వధించడానికి అనేక ప్రయత్నాలు చేశాడు. అయినప్పటికీ ప్రహ్లాదునికి ఆవంతహానికూడా కలుగలేదు. పైగా విష్ణువు నరసింహుడైవచ్చి హిరణ్యకశిపుణ్ణి అంతంచేసి ప్రహ్లాదునిపట్ల ఏర్పడిన పగను పరిమార్చాడు. అందువల్లనే ప్రహ్లాదుణ్ణి హిరణ్యకశిపుని పగ ఏమి చేయగల్గిందని చిన తిరుమలయ్య ప్రశ్నించాడు. ఇది 'నరసింహావతార' కథనం.

వాల్మీకి బోయవాడుగా ప్రసిద్ధి. అతడు రామనామజపంతో మహర్షి అయ్యాడు. మహిమోపేతుడై మన్ననకెక్కాడు. వాల్మీకి కులన్యూనత అతని

అభ్యుదయాన్ని, ఔన్నత్యాన్ని ఆపలేకపోయిందని చినతిరుమలయ్య స్పష్టీకరణ. అహల్య గౌతమ మహర్షి భార్య. అందాలరాశి. ఆమెను ఇంద్రుడుపేక్షించాడు. మహర్షిలేని సమయంలో ఆమెతో సంగమించి పతితను చేశాడు. అయినప్పటికీ శ్రీరామదర్శనంతో ఆమె పవిత్రగా మారిపోయింది. దుర్గుణంగా పరిగణింపబడిన ఆమెగుణం ఆమె పవిత్రురాలు కావడాన్ని ఆపలేకపోయింది కదా! అని చినతిరుమలయ్య తెలియజేశాడు. ఈ అంశాలు రెండూ రామనామఘనతను, రామావతార వైశిష్ట్యాన్ని ఆవిష్కరిస్తాయి.

ఈ కీర్తనలో మొదట కృష్ణావతారం, తర్వాత నరసింహావతారం, ఆపైన రామావతారం ప్రస్తావించబడ్డాయి. వీటిలో దశావతారక్రమం తారు మారైయ్యిందనే చెప్పాలి.

॥కీర్తన॥ వట్టి విచారములేల వగపులేల
నెట్టన శ్రీహరిఁజేర నేరవలెఁగాక ॥పల్లవి॥

కాలమేమిసేసీని కర్మమేమి సేసీని
యేలిన శ్రీరమణుఁడె యెదనుండఁగా
ఆలించిన ధ్రువునిని అజామిళునిని
కాలమేమి సేసెనయ్య కర్మమేమి సేసెను ॥వట్టి॥

పాపమేమి సేసీని పగయేమి సేసీని
కాపాడె దేవుఁడె దగ్గర నుండఁగా
యేపున ఘంటాకర్ణుని యెలమిఁబ్రహ్లాదుని
పాపమేమి సేసెనయ్య పగయేమి సేసెను ॥వట్టి॥

కులమేమి సేసీని గుణమేమి సేసీని
నలువైన శ్రీవేంకటనాథుఁడుండఁగా
అలరి వాల్మీకికి అలనాఁడహల్యకు
కులమేమి సేసెనయ్య గుణమేమిసేసెను. ॥వట్టి॥[2]

### 5.2.1.2 ఏకావతార సంకీర్తనలు :

చినతిరుమలయ్య అధ్యాత్మ సంకీర్తనల్లో అనేకావతార సంకీర్తనలలాగే ఏకావతార సంకీర్తనలు కూడా కొద్దిగా మాత్రమే కనిపిస్తాయి. విష్ణుదేవుని సుప్రసిద్ధ అవతారాలు అందరినీ అలరించి ఆకట్టుకునేవి అయినా నరసింహ, రామ, కృష్ణావతారాలు చినతిరుమలయ్య అంతరంగాన్ని కూడా ఆకర్షించి అందులో చోటు సంపాదించుకున్నాయి. పర్యవసానంగా ఆయన కీర్తనల్లో కూడా స్థానం సంపాదించగల్గాయి.

### 5.2.1.2.1 నరసింహావతారం :

అనంతపురం జిల్లాలో కదిరి పట్టణం సుప్రసిద్ధ నృసింహక్షేత్రం. అక్కడి ఒక పాముపుట్ట సమీపంలో నరసింహస్వామి వెలశాడని అక్కడి వారి విశ్వాసం. అన్నమయ్య కదిరి నృసింహుని మీద పలు కమ్మని కీర్తనలు రచించి స్వామికే గాక నృసింహ భక్తుల చెవులకు కూడా విందుచేసి వినుతికెక్కాడు. అన్నమయ్య లాగే చినతిరుమలయ్య కూడా కదిరి నృసింహుని మీద చక్కని కీర్తన రచించాడు. ఆయనలాగే కదిరి నృసింహునికి, తిరుమల వేంకటేశ్వరునికి అభేదం పాటించాడు.

భక్తుడైన ప్రహ్లాదుని బాధ బాపేందుకు నరసింహస్వామి వెలసినట్టు చినతిరుమలయ్య అభిప్రాయపడ్డాడు. రాక్షసుడైన హిరణ్యకశిపుణ్ణి తన తొడల మీద వేసుకుని అతని శరీరాన్ని చీల్చి ప్రేవులు జంధ్యాలుగా వేసుకున్నాడు. చర్మం ఒలిచి కప్పుకున్నాడు. కంఠనాళాలను చీల్చి వసంతపు నీరు చల్లినట్టు రక్తం చల్లాడు. ఇక్కడ నరసింహస్వామి ఆగ్రహం మితిమీరిపోవడం వల్ల ఏమిచేస్తున్నదీ స్పృహకు అందని విధంగా చేశాడు అని అభిప్రాయం. భగవంతుడైన శ్రీమహా విష్ణువంతటి వాడు కూడా కోపానికి లోబడినప్పుడు యుక్తాయుక్త విచక్షణ కోల్పోతాడని స్వామి చర్యలు లోకానికి విదితం చేస్తున్నాయి. ఈ అంశాన్ని తెలియజేసేందుకే వాగ్గేయకారులు నరసింహస్వామి రౌద్రరూపాన్ని యథారుచి కొనియాడారు. చినతిరుమలయ్య కూడా తనకీర్తనలో నరసింహస్వామి రౌద్రాకారాన్ని వర్ణించడం పట్ల విశేష ఆసక్తిని కనబరిచాడు.

భాగవతంలో నరసింహస్వామి హిరణ్యకశిపుని వక్షాన్ని చీల్చినట్టు వుండగా, చినతిరుమలయ్య కంఠాన్ని చీల్చినట్టు వ్రాశాడు. తక్కిన అంశాల్లో పోతన రచనకు చినతిరుమలయ్య రచనకు భేదం కనిపించడం లేదు. మొదట పోతన పద్యాన్ని, ఆ తర్వాత చినతిరుమలయ్య కీర్తనను ఇక్కడ పరిశీలించడం సమంజసం.

॥శా॥ చించున్ హృత్కమలంబు, శోణితము వర్షించున్ ధరామండలిం,
డ్రెంచుం గర్కశనాడికావళులు, భేదించున్ మహావక్షముం,
ద్రుంచున్ మాంసము సూక్ష్మఖండములుగా, దుష్టాసురున్ వ్రచ్చి ద
ర్పించుం, బ్రేవులు కంఠమాలికలు గల్పించున్ నఖోద్భాసియై.[3]

॥కీర్తన॥ తన దాసుని కొరకు ధరియించె నీరూపము
దిన దిన వేడుకఁగదిరి నారసింహుఁడు ॥పల్లవి॥

బలురక్కసు నొడిసిపట్టి తొడలపైఁబెట్టి
చెలఁగి కొనగోళ్లఁజించినాఁడు
చలపట్టి పేగుల జంధ్యాలతోడుతను
తెలివై వున్నాఁడు కదిరి నారసింహుడు ॥తన॥

ఘోరదానవు కంఠకుహర రక్తము ముంచి
సారెకు వసంతముగాఁ జల్లినాఁడు
మారుకొన్న దైత్యుని చర్మ మొలిచి మేనిమీఁద
ధీరతఁగప్పినాఁడు కదిరి నారసింహుడు ॥తన॥

అందపు లక్ష్మియుఁబ్రహ్లాదుఁడు నుతింపఁగాను
విందుగా నాగముపాల వెలసినాఁడు
అంది శ్రీవెంకటనాథుఁడై యీడా నాడాను
దిందుపడున్నాడు కదిరి నారసింహుడు ॥తన॥[4]

### 5.2.1.2.2 రామావతారం :

మానవ జీవితానికి చక్కని సజీవ వ్యాఖ్యానం రాముడు అవతరించాడు. విష్ణువు ధరించిన పది అవతారాలలోనూ ఏడవది రామావతారం. అందకేనేమో

ఏడుపును కల్గించే కష్టాలతో ఇది నిండిపోయింది. భువనరక్షకుడైన విష్ణువంతటి వాడికి కూడా కష్టాలు తప్పవని ఈ అవతారం తెలియజేసింది. రాముడు రఘుకులంలో జన్మించాడు. కాబట్టే రాఘవుడుగా ప్రసిద్ధుడయ్యాడు. రాఘవశబ్దం సంబోధన ప్రాయంగా ప్రతిపాదంలోనూ వచ్చేలా చినతిరుమలయ్య కీర్తన రచించాడు. తద్వారా దాని సౌందర్యాన్ని పెంచాడు. రామాయణంలో చోటుచేసుకున్న దాదాపు అన్ని సంఘటనలూ ఈ కీర్తనలో కనిపిస్తాయి.

దశరథ నందనుడుగా సౌమిత్రి, భరత, శత్రుఘ్నులతోపాటు పుట్టడం, తాటకవధ, కౌశికయజ్ఞ సంరక్షణ, శివధనుర్భంగం, సీతాకల్యాణం, అయోధ్యకు మరలడం, మారీచవధ, శూర్పణఖ గర్వభంగం, ఖరదూషణాది రాక్షస సంహారం, వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకం, సేతుబంధనం, లంకావైభవ వినాశనం, రావణవధ, విభీషణ పట్టాభిషేకం, శ్రీరామ పట్టాభిషేకం. ఈ రామాయణ సంఘటనలన్నీ గుదిగుచ్చినట్టు చినతిరుమలయ్య కీర్తనలో చోటుచేసుకోవడం ఎంతో అందంగా, పొందికగా వుంది. రామాయణాన్ని సంగ్రహించి ఇక్కడ ఆవిష్కరించినట్లైంది.

॥కీర్తన॥ రామ రామచంద్ర రాఘవా రాజీవలోచన రాఘవా
సౌమిత్రి భరత శత్రుఘ్నులతోడ జయమందు దశరథరాఘవా ॥పల్లవి॥

శిరసు కూఁకటుల రాఘవా చిన్నారి పొన్నారి రాఘవా
గరిమ నావయసున తాటకిఁజంపిన కౌసల్యానందన రాఘవా
అరిది యజ్ఞముగాచి రాఘవా యట్టె హరునివిల్లు విరిచినరాఘవా
సిరులతో జనకునియింట జానకిఁజెలఁగి పెండ్లాడిన రాఘవా ॥రామ॥

మలయునయోధ్యారాఘవా మాయామృగాంతక రాఘవా
చెలఁగి చుప్పనాతి గర్వమడఁచి దైత్యసేనలఁజంపిన రాఘవా
సొలసి వాలిఁజంపి రాఘవా దండి సుగ్రీవు నేలిన రాఘవా
జలధి బంధించిన రాఘవా లంకసంహరించిన రాఘవా ॥రామ॥

దేవతలు చూడ రాఘవా దేవేంద్రురథమెక్కి రాఘవా
రావణాదులనుఁజంపి విభీషణు రాజ్యమేలించిన రాఘవా

వేవేగ మరలి రాఘువా వచ్చి విజయపట్టమేలి రాఘువా
శ్రీవెంకటగిరి మీఁద నభయములు చెలఁగిమాకిచ్చిన రాఘువా ॥రామ॥[5]

### 5.2.1.2.3 కృష్ణావతారం :

విష్ణుదేవుని దశావతారాల్లో కృష్ణావతారానికి ప్రత్యేకత వుంది. విశేష ప్రాశస్త్యం వుంది. రామావతారంలో ఆచరించి చూపిన మహావిష్ణువు కృష్ణావతారంలో ఆచరణకు కావలసిన అనేక అంశాలను బోధించడం గమనార్హం. సామాన్య మానవులు చెయ్యలేని పనులనేకం చేసి ఆనాటివారి హృదయాలనే గాక నేటిమానవుల హృదయాలను కూడా కృష్ణుడు పులకింప జేశాడు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే భూలోకంలో మానవ శరీరం ధరించి మసలుకున్నట్టు తోపించాడు. రాజకీయ ఎత్తులతో చిత్తుచేసి ఆనాడు పతనావస్థలో వున్న పాలనావ్యవస్థను సంస్కరించాడు. ఈ అన్ని కారణాలవల్ల వైష్ణవులకే గాక వసుధావాసులందరికీ కృష్ణావతారం ఎంతో ప్రీతికరంగా రూపొందింది. ఈ అవతారం పట్ల శ్రీవైష్ణవానికి శ్రీకారం చుట్టిన ఆళ్వార్లు, ఆచార్యపురుషులేగాక తాళ్ళపాక వాగ్గేయకారులు, క్షేత్రయ్య విశేష ఆధరాభి మానాలను కనబరచారు. తాళ్ళపాక వంశస్థుడైన చినతిరుమలయ్య కూడా చక్కని కృష్ణ సంకీర్తన రచించాడు.

కృష్ణుడు శ్రావణమాసం, కృష్ణపక్షం, అష్టమీతిథి, రోహిణీ నక్షత్రంలో జన్మించాడు. జనన కాలంలో చతుర్బాహువులతోనూ, శంఖచక్రాలతోనూ దర్శనమిచ్చాడు. వసుదేవుడికి తక్షణ కర్తవ్యం తెలియజేశాడు. కృష్ణావతారంలో చోటుచేసుకున్న ఈ దృశ్యాలు సామాన్యమైనవి కావు. కృష్ణుడు సాక్షాత్తు విష్ణువేనన్న అంశాన్ని ఇవి బోధపరుస్తాయి. చినతిరుమలయ్య ఒక కీర్తనలో ఈ విషయాలు తెలియజేశాడు.

॥కీర్తన॥ “చిన్నవాఁడు నాలుగు చేతులతో నున్నాఁడు
కన్నప్పుడె శంఖము జక్రముఁజేత నున్నది ॥పల్లవి॥

నడురేయి రోహిణి నక్షత్రమునఁబుట్టె
వడిఁగృష్ణుఁడిదివో........................
..........................................
..........................................”[6]

శ్రీకృష్ణుని బాల్యలీలలను చినతిరుమలయ్య ఎంతో హృద్యంగా ఆవిష్కరించాడు. అవి సామాన్యమైనవి కావనీ, ఆలీలలను చూపిన వాడు పసిబిడ్డేనా! అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు. పూతనాసంహారం, శకటాసురభంజనం, గోవర్ధనోద్ధారణం, చాణూరమర్దనం, కంసవధ, గోపికా సమాగమం ఇవేవీ పసిబిడ్డలు చేసేపనులు కావని కృష్ణుడి మహామహిమను ఇక్కడ తెలియజేయడం జరిగింది. వేంకటేశ్వరుడికి, కృష్ణుడికి కూడా అభేదం చెబుతూ ఈ వేంకటరమణుడే నాటి గోపికా రమణుడని తెలియజేసినట్లైంది. ప్రతి పాదాంతంలోనూ 'పసిబిడ్డా' శబ్దం పునరావృతం కావడం ఈ కీర్తనలో విశేషం.

॥కీర్తన॥ బ్రహ్మఁగన్న వాఁడు పసిబిడ్డ
బ్రహ్మమైన వాఁడు పసిబిడ్డ ॥పల్లవి॥

వగపులేక చంపవచ్చిన బూతకి
పగ సాధించిన వాఁడు పసిబిడ్డ
పగటునఁదనమీఁదఁబారవచ్చిన బండి
పగులఁదన్నినవాఁడు పసిబిడ్డా ॥బ్రహ్మ॥

గుట్టున నావుల కొరకు వేలనె కొండ
పట్టి యెత్తినవాఁడు పసిబిడ్డా
జెట్టిపోరునఁదన్నుఁ జెనకవచ్చినవానిఁ
బట్టి చంపినవాఁడు పసిబిడ్డా ॥బ్రహ్మ॥

మిడికెటి కోపపు మేనమామఁబట్టి
పడనడిచిన వాఁడు పసిబిడ్డా
కడువేగ శ్రీవెంకటనాథుఁడై గొల్ల
పడఁతులఁ గూడినాఁడు పసిబిడ్డా ॥బ్రహ్మ॥[7]

### 5.2.2 శృంగార సంకీర్తనలు :

తాళ్ళపాక వారి వంశంలో చివరి వాగ్గేయకారుడైన చినతిరుమలయ్య తాత, తండ్రుల రచనలను తలపించే విధంగా శృంగార సంకీర్తనలు రచించాడు. అవి పరిమిత సంఖ్యలోనే వున్నాయి. వీటిలోనూ నాయిక విరహం, గోపికల శృంగార చేష్టలు వర్ణించబడ్డాయి. నాయికా నాయక ప్రణయం, దానికి సంబంధించిన వివిధాంశాలు ఈ కీర్తనలో గోచరిస్తున్నాయి. వీటిలో సందర్భోచిత దశావతార ప్రస్తావన గోచరిస్తుంది. చినతిరుమలయ్య శృంగార సంకీర్తనల్లో అనేకావతార కీర్తనలే గాక ఏకావతార కీర్తనలూ కన్పిస్తాయి.

#### 5.2.2.1 అనేకావతార సంకీర్తనలు :

చినతిరుమలయ్య శృంగార సంకీర్తనల్లో దశావతారాలను తెలియజేసే సంకీర్తన ఒకటి మాత్రమే కనిపిస్తుంది. అనేకావతారాలను విడిగా తెలియజేసే పదాలేవీ గోచరించడం లేదు.

##### 5.2.2.1.1 నాయకుని నాయికా ప్రీతి :

నాయకుడికి నాయిక అంటే చాలా ఇష్టం. అతడు ఆమె చెప్పినట్టల్లా ఏపనైనా ఆలస్యం లేకుండా చేసే స్వభావం కలవాడు. దీన్ని మరో నాయిక దెప్పిపొడుస్తున్నట్టు చినతిరుమలయ్య శృంగార సంకీర్తన రూపుదిద్దుకుంది. నాయకుడు దక్షిణుడు. కోసువాని పల్లెలో వెలసిన వేంకటనాథుడు.

నాయిక ఏంచేయమన్నా చేస్తావు అనే సందర్భంలో దశావతారాలు పరోక్షంగా ప్రస్తావనకు వచ్చాయి.

'వనిత చెప్పితేఁజాలు వారిదైనా నీఁదేవు' అనడంలో 'మత్స్యావతారం'

'గొండ మోవుమన్నా మోఁచేవు' అనడంలో 'కూర్మావతారం'

'బూమెల్లాఁదవ్వుమన్నాఁదవ్వేవు' అనడంలో 'వరాహావతారం'

'బహురూపాన నుండుమన్నా నుండేవు' అనడంలో 'నరసింహావతారం'

'ఎంతైనాఁగొంచెపడేవు' అనడంలో 'వామనావతారం'

'వగరఁజంపు మన్నాఁజంపేవు' అనడంలో 'పరశురామావతారం'

'తపములు సేయుమన్నాఁజేసేవు' అనడంలో తపస్వివేషం దాల్చిన 'రామావతారం'

'పసులనుఁగావుమన్నాఁగాసేవు' అనడంలో 'కృష్ణావతారం'

'కల్లలాడుమన్నా నాడేవు' అనడంలో 'బుద్ధావతారం'

పారాడు మన్నాఁబారాడేవు' అనడంలో అశ్వాధిరూఢుడైన 'కల్క్యవతారం' ద్యోతకమవుతాయి.

॥కీర్తన॥ ఈడేర వలచితే యేపని సేయఁగరాదు
యేడనైనా యెగ్గు సిగ్గు లెంచేరా భూమిని ॥పల్లవి॥

వనిత చెప్పితేఁజాలు వారిదైనా నీఁదేవు
అనువుగాఁ గొండ మోవుమన్నా మోఁచేవు
తనివోక బూమెల్లాఁ దవ్వుమన్నాఁదవ్వేవు
వొనర బహురూపాన నుండు మన్నా నుండేవు ॥ఈడేర॥

ఇంతి చెప్పితేఁజాలు యెంతైనాఁ గొంచెపడేవు
అంతలోఁబగరఁజంపు మన్నాఁ జంపేవు
చెంత నాపె తపములు సేయుమన్నాఁజేసేవు
కాంత దనపసులనుఁగావు మన్నాఁగాసేవు ॥ఈడేర॥

అతివ చూచి కల్లలాడు మన్నా నాడేవు
బతిమిఁబారాడు మన్నాఁ బారాడేవు
పతివైన కోసువానిపల్లె శ్రీవెంకటనాథ
గతియై కూడుండు మన్నాఁగాఁగిట నుండేవు. ॥ ఈడేర॥[8]

### 5.2.2.2 ఏకావతార సంకీర్తనలు :

చినతిరుమలయ్య శృంగార సంకీర్తనల్లోనూ విష్ణుదేవుని అవతార విశేషాలను విడివిడిగా తెలియజేసే కీర్తనలున్నాయి. నరసింహ, రామ, కృష్ణావతారాలను అవి ఆవిష్కరిస్తాయి.

### 5.2.2.2.1 నరసింహావతారం :

ఇక్కడ భక్తుడు నాయిక.ఓఁగునూతుల నరసింహుడు నాయకుడు. నాయకుడు తనపట్ల వ్యవహరించిన తీరును నాయిక ఈ కీర్తనలో తెలియ జేస్తూవుంది.

కొన్ని సమయాల్లో నాయకుడు కపటంగా వ్యవహరించడం కనిపిస్తుంది. నాయకుడు నాయికతో ప్రియంగా మాట్లాడి వలపునారుపోసేవాడు. తన మాటలే మన్మథ బాణాలుగా ప్రయోగించేవాడు. నాయిక ఎక్కడికి వెళ్ళినా ఆమె వెంట తిరుగుతూ అనురాగం ప్రదర్శించేవాడు. చూపులతోనే వాడీ, వేడీ పుట్టిస్తాడు. నఖక్షతాలతో ఆశలు పెట్టేవాడు. ఆ తర్వాత నాయికానాయక సమాగమం జరిగేది. ఇవన్నీ నాయిక తెలియజేసిన విశేషాలే. ఈ కీర్తనలో నరసింహావ తారానికి సంబంధించిన సంఘటనలు గానీ తదితరాంశాలు గానీ కనిపించవు. రౌద్రమూర్తిగా ప్రసిద్ధి వహించిన నరసింహుని శృంగార నాయకుడుగా చిత్రించడం ఇక్కడ విశేషం.

॥కీర్తన॥ నాలితనా లేఁటికోయి నారసింహుఁడా
నాలోనె నవ్వు వచ్చీ నారసింహుఁడా ॥పల్లవి॥

చేరువని ప్రియములు చెప్పి చెప్పి నామీఁద
నారువోసేవు వలపు నారసింహుఁడా
దారాసుద్దపు మాఁటలు తాఁకనాడి మదనుని
నారసాలు సేయకు నారసింహుఁడా ॥నాలి॥

వెనుకొని నా వెంట వెంటఁదిరిగి నా మీఁద
ననుపు మోపు గట్టేవు నారసింహుఁడా
కనుచూపులనె వట్టి కాఁక రేఁచి మెత్తనైన
ననలు వాఁడిసేయకు నారసింహుఁడా ॥నాలి॥

చిలుకుగోళ్ల నన్నుఁ జెనకుచు నీపై నా
నలు వెట్టి వచ్చేవు నారసింహుఁడా
కలికితనాన శ్రీవెంకటనాథ కూడితివి
నలువై వోఁగునూతుల నారసింహుఁడా ॥నాలి॥[9]

### 5.2.2.2.2 రామావతారం :

నాయకుడు గొప్పవాడా? నాయిక గొప్పదా? అనే విచికిత్సను చిన తిరుమలయ్య తన శృంగార సంకీర్తనలో ఆవిష్కరించాడు. రాముడు యుద్ధంలో రాక్షసులను గెలిస్తే, మదన యుద్ధంలో రమణి రాముణ్ణి గెలిచింది. ఈశ్వరుడు కాశిలో చనిపోయే వారికి తారక బ్రహ్మతత్త్వం బోధిస్తాడని ప్రతీతి. ఉపదేశ వస్తువుగా వున్న రాముడికే నాయిక మదన తంత్రాన్ని ఉపదేశించింది. దీన్ని బట్టి నాయకుడి కంటే నాయికే గొప్పదని తేల్చడానికి చినతిరుమలయ్య ప్రయత్నించాడు. ఏకపత్నీవ్రతుడైన శ్రీరాముణ్ణి శృంగార నాయకుడుగా చిత్రించడం ఇక్కడ గమనార్హం.

॥కీర్తన॥ నీవెక్కుడో ఆపె నీకంటె నెక్కుడో
రావయ్య తిరుపతి రఘురామచంద్ర ॥పల్లవి॥

తుమురుగ దనుజులఁ దోలి తొప్పర లాడి
అమరఁగ గెలిచితి నందుపు (వు?)
మమతతోడుత నిన్ను మదన యుద్ధమునందు
రమణి నిన్ను గెలిచి రఘురామచంద్ర ॥నీవె॥

తవిలి శివుఁడు కాశిఁదారకబ్రహ్మ మని
యివల నిన్నుపదేశ మియ్యఁగా
నవమై శ్రీవెంకటనాథ మరుతంత్రము
రవళి నీకీపె యిచ్చె రఘురామచంద్రా ॥నీవె॥[10]

### 5.2.2.2.3 కృష్ణావతారం :

నాయకుడు కోవిలకుంట్ల గోపాలకృష్ణుడు. ఆయనే శ్రీవేంకటేశ్వరుడు. దక్షిణ నాయకుడు. డెందాన్ని కొల్లగొట్టే అందగాడు. వనితలెందరో అతన్ని వలచి పొందుకై ఆరాటపడుతుంటారు. కానీ నాయకుడు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు నిశ్చలంగా ఉంటాడు. ఇది ఒక నాయికకు బాధ కలిగించింది. ఎదను కదిలించింది. వ్యథను రగిలించింది. నాయిక నాయకుడితో నిష్ఠూరంగా మాట్లాడింది. మరొక నాయికతో నాయకుడు సాగించిన నానాకలాపాలను ప్రస్తావించి దెప్పిపొడిచింది.

చనువు తగ్గకుండా మాట్లాడతావేగానీ నాకు వశమవుతావా వన్నెకాడా? అంది. ఘాటు వలపులలో మేటివైన నిన్ను ఎటువలె కొసరేదని అసమర్థతను అభివ్యక్తం చేసింది. సద్దుకు వెరచి సరసమాడుతున్నావు గానీ దీన్ని ఇలాగే కొనసాగిస్తావా? అంది. విడువని పొందులతో విఱ్ఱవీగే నీకు అపదూఱు అంటే లక్ష్యం ఉందా? అని నిలదీసింది. అంత అందగాడైన అతడు ఇచ్చినమాటను నిలబెట్టుకోవడం కోసం ఆమెతో సంగమించాడు గానీ లేకపోతే అలా చేసి వుండడంది. నాయకుడు రతుల విషయంలో వేసారడంది. నాయకుడు తనకు అందుబాటులో లేకపోయినప్పటికీ ఏదోవిధంగా అందుబాటులోకి వచ్చాడనే ఊరట ఈ చినతిరుమలయ్య కీర్తనలో కనిపిస్తుంది.

॥కీర్తన॥ చెల్లె నీవు సేసినట్టి చేఁత లెల్లాను
కొల్లలై కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా ॥పల్లవి॥

అసము దించక మాఁటలాడేవు గాక నాకు
వసమయ్యేవా యింతవన్నెకాఁడవు
కసిగాటు వలపుల గబ్బివైన నిన్ను నేల
కొసరేఁగోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా ॥చెల్లె॥

సడికి వెరచి నాతో సరసమాడేవు గాక
తొడరేవా నీ వింత దొడ్డవాఁడవు
విడువని పొందులతో విఱ్ఱవీఁగేనీకు నేల
కొడిమె కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా ॥చెల్లె॥

బాసకు వెరచి నన్నుఁ బైకొని కూడితిగాక
ఆసగద్దా నీకు నింత అందగాఁడవు
వేసారవు రతుల శ్రీవెంకటనాథ వొకరి
కోసమా కోవిలకుంట్ల గోపాలకృష్ణుఁడా ॥చెల్లె॥[11]

నాయిక గోపిక. పరకీయ. నాయకుడు కృష్ణుడు. అతడు ఆమెను చూపుల తోనే కరిగింపచూశాడు. కలికి చేతలతో వలపించి ఆమెతో సంగమించాడు. నాయికే ఈ విషయాన్ని స్వయంగా ఒక చిన్న కీర్తనలో తెలియజేసింది.

॥కీర్తన॥ ఏలరా కృష్ణుఁడా ॥పల్లవి॥

పగటూ మాఁటల నొగరూ దోఁచఁగ
మగనాలిని నన్ను నగఁజూచేవేరా ॥ఏలరా॥

కొనబూ విటుఁడ నీకనుచూపులనె నా
మనసూ గరఁగించఁబెనఁగే వేరా ॥ఏలరా॥

కలికీ చేఁతల వలపించి నను నిట్టె
కలసితి శ్రీవెంకట గిరినాథా ॥ఏలరా॥[12]

చినతిరుమలయ్య తక్కువ సంఖ్యలోనే కీర్తనలు రచించడం వల్ల ఆయన కీర్తనల్లో దశావతారాలు చోటుచేసుకున్న కీర్తనలు మరీతక్కువగానే వున్నాయి. రామావతారానికి సంబంధించిన సంస్కృత సంకీర్తన ఒకటి మాత్రమే కనిపిస్తుంది. అధ్యాత్మ సంకీర్తనల్లో దశావతారాలు చోటుచేసుకున్న కీర్తన ఒకటి కూడా లేదు. శృంగార సంకీర్తనల్లో మాత్రం ఒకటి కనిపిస్తుంది. అధ్యాత్మ సంకీర్తనల్లో నరసింహ, రామ, కృష్ణ అవతారాలను తెలియజేసే ఒక కీర్తన మాత్రమే వుంది. శృంగార సంకీర్తనల్లో ఈ విధంగా అనేకావతారాలను తెలియ జేసే కీర్తన కనిపించడం లేదు. విడివిడిగా నరసింహుణ్ణి, రాముణ్ణి, కృష్ణుణ్ణి కొనియాడే కీర్తనలు అధ్యాత్మ సంకీర్తనల్లోనూ, శృంగార సంకీర్తనల్లోనూ వున్నాయి. చినతిరుమలయ్య దశావతార కీర్తనల స్వరూపం కూడా అన్నమయ్య, పెద తిరుమలయ్య కీర్తనల్లో లాగే ఉంది. వారి కీర్తనలను చదివితే కలిగే పవిత్ర భావము చినతిరుమలయ్య కీర్తనలు చదివినప్పుడు కూడా కలుగుతూ వుందంటే అతిశయోక్తి కాదు.

# పాద సూచికలు

1) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-10, కీర్తన:51

2) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-10, కీర్తన:43

3) బమ్మెర పోతన - శ్రీమదాంధ్ర భాగవతము, సప్తమస్కంధం, పద్యం: 296

4) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-10, కీర్తన:37

5) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-10, కీర్తన:1

6) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-10, కీర్తన:32

7) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-అధ్యాత్మ సంకీర్తనలు, సంపుటం-10, కీర్తన:11

8) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం- 10, కీర్తన:75

9) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం- 10, కీర్తన:18

10) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం- 10, కీర్తన:107

11) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం- 10, కీర్తన:28

12) తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు-శృంగార సంకీర్తనలు, సంపుటం- 10, కీర్తన:59.

# మున్నుడి

ఆంధ్రసాహిత్య జగత్తులో వెలసిన అనేక కవి కుటుంబాల్లో తాళ్ళపాక కవి కుటుంబం ఎంతో పేరు, పెంపు వహించింది. తాళ్ళపాక కవి కుటుంబానికి ఆద్యుడు అన్నమయ్య. ఆయన ప్రభావం తాళ్ళపాక కుటుంబం వారి మీదనే గాక అనంతర వాగ్గేయకారుల మీద కూడా కనిపిస్తుంది. ఎంతో ప్రతిభావంతమూ ప్రభావాత్మకమూ అయిన తాళ్ళపాక వారి పదకవిత హఠాత్తుగా ఆవిర్భవించలేదు. ఒక పరిణామక్రమం యొక్క పరిపక్వతగానే పరిఢవిల్లింది.

తెలుగు పదం ఎప్పుడు ఎక్కడ ఎలా ఆవిర్భవించిందో తెలుసుకోవడానికి అవకాశం లేకపోయినప్పటికీ మొదట జానపదుల వాక్పదం నుంచే పదం పల్లవించివుంటుందని పలువురి విశ్వాసం. శాసనాల్లో రగడ, తరువోజ వంటి దేశీఛందస్సులలో తేజరిల్లిన తెలుగుపదం గీతంగా, పదంగా, పాటగా, నామావళిగా, వచనంగా, కీర్తనగా, దరువుగా, శృంగారపదంగా, కృతిగా అనేక రూపాలతో అలరారింది. కృష్ణమాచార్యుల దగ్గర నుంచి పట్నం సుబ్రమణ్యం అయ్యర్ దాకా పలువురు తెలుగు పదానికి సముచిత పదం కల్పించేందుకు ప్రయత్నం చేశారు. వారిలో కేంద్రస్థానీయులుగా, దేహళిప్రాయులుగా తాళ్ళపాకవారు గోచరిస్తారు. పూర్వుల నుంచి స్ఫూర్తిపొంది తర్వాతి వారిమీద ప్రభావం నెరపిన ధన్యజీవులు వీరు. వీరి రచనల్లో దశావతారాలను అనేక విధాలుగా ఆవిష్కరించే అపురూప రచనలు ఎన్నోవున్నాయి.

లోకోపకారం కోసం విష్ణువు అనేక అవతారాలు ధరించాడు. వాటిని దశావతారాలనీ, ఇతరావతారాలనీ వర్గీకరించుకోవచ్చు. ఇతరావతారాలు లోకోప కారానికీ, జ్ఞానప్రదానానికీ ఉద్దేశించబడినవి కాగా దశావతారాలు దుష్టశిక్షణ–శిష్టరక్షణకు రూపుదాల్చినట్టు గోచరిస్తాయి. దశావతారాల్లో మొదటి రెండు 'జలచరాలు' కాగా మూడవది 'ఉభయచరం'. రెండురూపాలు ఒకేసారి ధరించిన అవతారం 'నరసింహావతారం'. 'బుద్ధుడు' మినహా తక్కిన అవతార పురుషులందరూ మాతృగర్భం నుంచే వెలువడడం ఇక్కడ గమనార్హం. యాచన

ఎంత గొప్పవారికైనా తక్కువతనం అంటగడుతుందని వసుధకు చాటిన అవతారం 'వామనావతారం'. ధర్మస్థాపనకు అధర్మ నిరోధానికి వర్ణాశ్రమ ధర్మాన్ని అతిక్రమించినా పరవాలేదని తెలియజెప్పడం 'పరశురామావతార' పరమావధి. ఆదర్శ మానవ జీవనానికి సజీవ వ్యాఖ్యానంగా 'రామావతారం' కనిపిస్తుంది. ఆదర్శ మేధావిగా, కేవల ధర్మపక్షపాతిగా, ధర్మ సూక్ష్మవ్యాఖ్యాత జీవనుడుగా 'కృష్ణుడు' గోచరిస్తాడు. అధర్మం ద్వారా కూడా ధర్మరక్షణ చేయడానికి వెనుదీయరాదని 'బుద్ధుడు' సూచించాడు. దశావతారాల్లో తొమ్మిది భూతకాలానికి మరొకటి భవిష్యత్ కాలానికి సంబంధించినవి కావడంతో అవతారకాలం పరిచ్ఛిన్నత లేనిదిగా కనిపిస్తుంది. దశావతారాల్లో వైవిధ్యం కనిపించినప్పటికీ దుష్టశిక్షణ– శిష్టరక్షణ మౌలికైకత్వంగా మనసును ఆకట్టుకుంటుంది.

అన్నమయ్య తెలుగులోనేగాక సంస్కృతంలో కూడా దశావతార కీర్తనలు రచించాడు. అధ్యాత్మపరంగానే గాక శృంగారపరంగా కూడా ఆయన దశావతారాలను అభివర్ణించాడు. పది అవతారాలను ఒకే కీర్తనలో కొనియాడడం, విడిగా వివిధ అవతారాలను వేరువేరు కీర్తనల్లో కొనియాడడం కనిపిస్తుంది. ఈ రెండు విభాగాలకు సంబంధించిన కీర్తనలు అన్నమయ్య సాహిత్యంలో విరివిగానే గోచరిస్తాయి. దశావతారాలను పేర్కొనేటప్పుడు ఎనిమిదవ అవతారంగా కొన్నిచోట్ల బలరాముణ్ణి, మరికొన్ని చోట్ల కృష్ణుణ్ణి అన్నమయ్య పేర్కొన్నాడు. బలరాముణ్ణి, కృష్ణుణ్ణి కలిపి పదకొండు అవతారాలను పేర్కొన్న కీర్తనలు కూడా కొన్ని లేకపోలేదు. దశావతారకీర్తనల్లో అవతారాలను వాచ్యం చేసేవి కొన్నైతే, పరోక్షంగా పేర్కొనేవి మరికొన్ని. మొత్తానికి అన్నమయ్య దశావతార కీర్తనల్లో చమత్కారం, కవితాసౌందర్యం, జానపదధోరణి గోచరిస్తాయి.

పెదతిరుమలయ్య రచించినవిగా 1007 కీర్తనలు మాత్రమే ఇప్పుడు లభిస్తున్నాయి. వాటిలో దశావతార సంకీర్తనలు చాలా తక్కువ. పది అవతారాలు చోటుచేసుకున్న కీర్తనలు గానీ, ఏకావతార కీర్తనలుగానీ చాలా తక్కువ సంఖ్యలోనే వున్నాయి. అన్నమయ్య దశావతార కీర్తనల ధోరణిలోనే పెదతిరుమలయ్య దశావతార కీర్తనలూ సాగినప్పటికీ పెదతిరుమలయ్య శృంగార కీర్తనల్లో శృంగారం పాలు తక్కువగానే గోచరిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అన్నమయ్య దశావతార

కీర్తనలతో పోలిస్తే పెదతిరుమలయ్య దశావతార కీర్తనలు రాశిలోనే గాక వాశిలో కూడా తక్కువగానే కనిపిస్తాయి.

చినతిరుమలయ్య 60 అధ్యాత్మ సంకీర్తనలను, 119 శృంగార సంకీర్తనలను మాత్రమే రచించాడు. కాబట్టి దశావతార సంకీర్తనలు కూడా వీటిలో పరిమితంగానే కనిపిస్తాయి. పదిఅవతారాలను తెలియజేసే అధ్యాత్మ కీర్తన ఒకటి కూడా కనిపించలేదు. శృంగార కీర్తనల్లో మాత్రం ఒకటి గోచరిస్తూ వుంది. స్వరూప స్వభావాల్లో అన్నమయ్య, పెదతిరుమలయ్య రచనల్లాగే ఈయన కీర్తనలు కూడా కనిపిస్తాయి.

తాళ్ళపాక కవుల దశావతార కీర్తనల సంఖ్యను తులనాత్మకంగా సమీక్షిస్తే అన్నమయ్య సంకీర్తనల కంటే పెదతిరుమలయ్య సంకీర్తనలు తక్కువగానూ, చినతిరుమలయ్య సంకీర్తనలు అంతకంటే తక్కువగానూ గోచరిస్తాయి. అన్నమయ్య సంకీర్తనల్లో పాఠకులను ఆకర్షించే గుణం ఎక్కువగా ఉంది. తాళ్ళపాక కవులందరి దశావతార కీర్తనల్లోనూ భక్తి, సారస్వతదీప్తి, భక్తజనులకు కావలసిన స్ఫూర్తి సమానంగానే కనిపిస్తాయి. సంకీర్తనలను చదివినప్పుడు కలిగే అనుభూతి ఈముగ్గురి రచనల్లోనూ సమానంగానే వున్నాయి.

॥తేట॥ మూడు రూపములను దాల్చి మురియజేయు
ఏకరూపతత్వంబన ప్రాకటముగ
తాళ్ళపాక కవీంద్రుల దశవతార
కీర్తనలు రూపుగొని వారి కీర్తి నిలిపె. ॥ స్వీయం ॥

# ఆధార గ్రంథాలు

1) అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము-1) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

2) అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము-2) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

3) అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము-3) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

4) అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము-4) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

5) శృంగార సంకీర్తనలు (సంపుటము-5) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

6) శృంగార సంకీర్తనలు (సంపుటము-6) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

7) శృంగార సంకీర్తనలు (సంపుటము-7) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

8) శృంగార సంకీర్తనలు (సంపుటము-8) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్తలు - కీ॥శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
విద్వాన్ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

9) శృంగార సంకీర్తనలు (సంపుటము-9) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - విద్వాన్ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

10) శృంగార సంకీర్తనలు (సంపుటము-11) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - విద్వాన్ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

11) శృంగార సంకీర్తనలు (సంపుటము-12) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - డా॥ పి.టి. జగన్నాథరావు
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

12) శృంగార సంకీర్తనలు (సంపుటము-13) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్తలు - కీ॥శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

13) శృంగార సంకీర్తనలు (సంపుటము-14) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్తలు - కీ॥శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

14) శృంగార సంకీర్తనలు (సంపుటము-16) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్తలు - కీ॥శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ
కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

15) శృంగార సంకీర్తనలు (సంపుటము-18) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

16) శృంగార సంకీర్తనలు (సంపుటము-19) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

17) శృంగార సంకీర్తనలు (సంపుటము-20) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

18) శృంగార సంకీర్తనలు (సంపుటము-21) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

19) శృంగార సంకీర్తనలు (సంపుటము-22) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

20) శృంగార సంకీర్తనలు (సంపుటము-23) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

21) శృంగార సంకీర్తనలు (సంపుటము-24) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

22) శృంగార సంకీర్తనలు (సంపుటము-25) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి,1998

23) శృంగార సంకీర్తనలు (సంపుటము-26) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్తలు - కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
కామిశెట్టి శ్రీనివాసులు
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

24) శృంగార సంకీర్తనలు (సంపుటము-27) - తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్తలు-కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
కామిశెట్టి శ్రీనివాసులు
ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

25) శృంగార సంకీర్తనలు (సంపుటము-28) – తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త – కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ – తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1999

26) శృంగార సంకీర్తనలు (సంపుటము-29) – తాళ్ళపాక అన్నమాచార్యుడు
పరిష్కర్త – కీ॥శే॥ గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ – తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1999

27) అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము-15) – తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు
పరిష్కర్త – డా॥ పి.టి. జగన్నాథరావు
ప్రచురణ – తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

28) శృంగార సంకీర్తనలు (సంపుటము-17) – తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు
పరిష్కర్త – డా॥ పి.టి. జగన్నాథరావు
ప్రచురణ – తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

29) అధ్యాత్మ, శృంగార సంకీర్తనలు (సంపుటము-10) – తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు
పరిష్కర్త - విద్వాన్ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు
ప్రచురణ – తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి, 1998

# ఉపయుక్త గ్రంథాలు


1) అన్నమయ్య, ఆళ్వారులు- తులనాత్మక పరిశీలన (ద్వితీయ భాగము) - ఆచార్య జక్కంపూడి మునిరత్నం కల్పనా పబ్లికేషన్స్ తిరుపతి, 1996

2) ఆంధ్రవాగ్గేయకారుల - రచనలపై తాళ్ళపాక - డా॥ డబ్ల్యు. ఎం. సీతాలక్ష్మి అన్నమయ్య సాహిత్య ప్రభావము పిహెచ్.డి. డిగ్రీకోసం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించబడిన సిద్ధాంత వ్యాసం. అముద్రితం తిరుపతి, 1996

3) కాశీఖండము - శ్రీనాథుడు వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వావిళ్ళ ప్రెస్, మద్రాసు -1, 1969

4) కుమారసంభవము - నన్నెచోడుడు వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ వావిళ్ళ ప్రెస్, మద్రాసు -1, 1972

5) కృష్ణశతకము - చెన్నుభట్ల వేంకట కృష్ణశర్మ సి.వి. కృష్ణాబుక్ డిపో, 10/99, అమ్మన్ కోవిల్ వీధి, వాల్‌టాక్స్ రోడ్డు పోస్ట్ మద్రాసు -1, 1975

6) తాళ్ళపాక పెదతిరుమలాచార్యుని కృతులు - ఒక పరిశీలన - డా॥ వై. సూర్యకాంత పిహెచ్.డి డిగ్రీ కోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం, జనవరి-1982

7) తాళ్ళపాక చినతిరుమలాచార్యుని కృతులు - ఒక పరిశీలన - విద్వాన్ బూదూరు కుసుమాంబ తిరుపతి

8) త్యాగరాజు కీర్తనలు (స్వర సహితము) - త్యాగరాజు
స్వర సంకలనము
'కళాప్రవీణ'మంచాళ జగన్నాథరావు
సం॥ వాడ్రేవు పురుషోత్తం
తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ
జూలై, 1981

9) తెలుగులో పదకవిత - ఆచార్య ఎస్. గంగప్ప
ప్రథమ ముద్రణ, ఆగష్టు, 1983

10) తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
నవ్య పరిశోధక ప్రచురణలు
18-1-699, భవానీనగర్,
తిరుపతి-1
ప్రచురణ : జూన్, 1983

11) తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
రమణశ్రీ ప్రచురణ
విశాఖపట్టణము, 1991

12) తెలుగు జానపద గేయ సాహిత్యము - ఆచార్య బిరుదురాజు రామరాజు
జానపద విజ్ఞాన ప్రచురణలు
హైదరాబాదు - 1978

13) దశావతార తత్త్వవిశ్లేషణ - ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు
ప్రథమ ముద్రణ, 1994
తిరుపతి

14) పండితారాధ్య చరిత్ర - పాల్కురికి సోమనాథుడు
ప్రచురణ - తెలుగువిశ్వవిద్యాలయం
కళాభవనం, సైఫాబాదు,
హైదరాబాదు - 500004
మార్చి, 1990

15) పారిజాతాపహరణము - నంది తిమ్మన
పరిష్కర్త - నాగపూడి కుప్పుస్వామయ్య
ప్రచురణ - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
కళాభవన్, సైఫాబాదు,
హైదరాబాదు - 500004, 1978

16) పాండురంగ మహాత్మ్యం - తెనాలిరామకృష్ణుడు
పరిష్కర్తలు - రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
గౌరిపెద్ది రామసుబ్బశర్మ
ప్రచురణ-ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
కళాభవన్, సైఫాబాదు,
హైదరాబాదు -4, 1967

17) బసవ పూరాణము - పాల్కురికి సోమనాథుడు
వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్
వావిళ్ళ ప్రెస్, మద్రాసు -1, 1952

18) బాలానంద బొమ్మల దశావతారాలు - రెంటాల గోపాలకృష్ణ
నవరత్న బుక్ సెంటర్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2
ముద్రణ - సెప్టెంబర్, 1994

19) భాస్కర రామాయణం - హుళక్కి భాస్కరుడు
పరిష్కర్త - భాగవతుల మార్కండేయశర్మ
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
కళాభవన్, హైదరాబాదు - 1969

20) భీమఖండం - శ్రీనాథుడు
ఎమెస్కో బుక్స్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2

21) మొల్ల రామాయణం - మొల్ల
పరిష్కర్త - శ్రీమాన్ బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు
ఎమెస్కో క్లాసిక్స్, పునర్ముద్రణ-1997

22) రఘువంశం - మహాకవి కాళిదాసు
వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్
వావిళ్ళ ప్రెస్, మద్రాసు -1, 1954

23) రామదాసు కీర్తనలు - రామదాసు
సం॥ మంచాళ జగన్నాథరావు
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ,
ప్రచురణ - నవంబర్, 1975

24) రామాయణ రత్నాకరము - శ్రీ వాల్మీకి మహర్షి
అనువాదకులు- శ్రీవిద్యాప్రకాశానందగిరి
స్వాముల వారు, శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము పోస్టు,
శ్రీ కాళహస్తి, 1997

25) రాయలసీమ పదకవులు - డా॥కె. జనార్దనం

26) విజ్ఞాన సర్వస్వము దర్శనములు - మతములు సంపుటము - 7 - డా॥ పి. నాగరాజరావు, డి.లిట్.,
సంపాదకులు -
డా॥ కొత్తసచ్చిదానందమూర్తి
తెలుగు భాషా సమితి
హైదరాబాదు , 1962

27) వేదాలలో హిందూమతం - డా॥ వేదవ్యాస
యూనివర్సిటీ ఆఫ్ వేదిక్ సైన్సెస్
రోడ్ నెం.8, ప్లాట్ నెం.56, జూబ్లీహిల్స్
హైదరాబాదు - 500033.

28) వేమన పద్యములు - వేమన
వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్
వావిళ్ళ ప్రెస్, మద్రాసు -1, 1955

29) శ్రీమదాంధ్రమహాభారతం - నన్నయ
వ్యాఖ్యాత-డా॥ అప్పజోడు వేంకట సుబ్బయ్య
ప్రధాన సంపాదకుడు - డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం

ప్రచురణ - తిరుమల తిరుపతి దేవస్థానం
తిరుపతి - 2000

30) శ్రీరాధాగోవింద చంద్రిక - త్రిదండి శ్రీ భక్తిసుధీర్ దామోదర మహరాజ్
సంపాదకులు - నిత్యలీలా ప్రవిష్ట
శ్రీశ్రీమద్భక్తి విలాస తీర్థ గోస్వామి మహరాజ్
వారి అనుగ్రహముతో
త్రిదండి స్వామి భక్తి కమల పద్మనాభమహరాజ్

31) శ్రీరామానుజ కీర్తికౌముది - డా॥ సముద్రాల వేంకటరంగరామానుజాచార్యులు

32) శ్రీమదాంధ్రమహాభాగవతం - బమ్మెరపోతన
పరిష్కర్త - శ్రీ రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ
రాయలు అండ్ కో
ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్, కడప, 1954

33) శ్రీకృష్ణ కర్ణామృతము - లీలాశుకుడు
బాలసరస్వతీ బుక్‌డిపో
ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్
4, సుంకురామిశెట్టి వీధి,
మద్రాసు - 1, 2007

34) శ్రీవిష్ణు సహస్రనామస్తోత్రం - శ్రీ వేదవ్యాస మహర్షి
ప్రచురణ-హిందూధర్మప్రచార పరిషత్తు
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి, 2007

35) శ్రీమద్భగవద్గీత - శ్రీ వేదవ్యాస మహర్షి
ప్రకాశకులు - శుకబ్రహ్మాశ్రమము,
శ్రీ కాళహస్తి, 2001

36) శ్రీమదాంధ్రమహాభారతం - తిక్కన
వ్యాఖ్యాతలు - డా॥ జొన్నలగడ్డ మృత్యుంజయరావు
శ్రీ ముదివర్తి కొండమాచార్యులు

ప్రధాన సంపాదకుడు – డా॥ జి.వి. సుబ్రమ్మణ్యం
ప్రచురణ – తిరుమల తిరుపతి దేవస్థానం
తిరుపతి - 2004

37) సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర
ముద్రణ - ప్రజాశక్తి ప్రెస్,
విజయవాడ - 2
ప్రథమ ముద్రణ - 1989, జూలై
ద్వితీయ ముద్రణ - 1990, ఆగష్టు

38) సారంగపాణి పదములు - సారంగపాణి
పరిష్కర్త – ఆచార్య గల్లాచలపతి
ప్రథమ ముద్రణ - జూన్, 1994
తిరుపతి

39) సారంగపాణి పదములు - సారంగపాణి
సం॥ పురిపండా అప్పలస్వామి
ప్రాచీన గ్రంథావళి, సరస్వతీ పవర్ ప్రెస్,
రాజమహేంద్రవరము - 1963

40) సింహగిరివచనములు - కృష్ణమాచార్యులు
పరిష్కర్త –వై. కులశేఖరరావు
ఆంధ్ర రచయితల సంఘం
హైదరాబాదు, 1968

41) క్షేత్రయ్య పదములు - క్షేత్రయ్య
సం॥ మంచాళ జగన్నాథరావు
ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ
ప్రచురణ - నవంబర్, 1973

42) Puranic Encyclopaedia - VETTAM MANI
Motilal Banarsi Dass
Delhi, 1975



| | | |
|---|---|---|
| పేరు | : | దొమ్మరాజు యువశ్రీ |
| జననం | : | 29-08-1978 |
| జన్మస్థలం | : | ఎస్.వి.పురం, వడమాలపేట మండలం<br>చిత్తూరు జిల్లా |
| తల్లిదండ్రులు | : | శ్రీదొమ్మరాజు జయదేవరాజు<br>కీ॥శే॥ శ్రీమతి దొమ్మరాజు ధనలక్ష్మి |
| భర్త | : | శ్రీ సంగరాజు మురళీకృష్ణ రాజు |
| విద్యార్హతలు | : | ఎం.ఏ., బి.ఇడి., పిహెచ్.డి.<br>శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి |
| వృత్తి | : | తెలుగు ఉపన్యాసకురాలు |
| స్థలం | : | గాయత్రీ డిగ్రీ మరియు పి.జి. కళాశాల<br>ప్రకాశంరోడ్, తిరుపతి |
| అభిరుచి | : | సాహిత్య పఠనం |